www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 18-4-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 2 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: దశమి సా. 5.32 తదుపరి ఏకాదశి; నక్షత్రం: ఆశ్లేష ఉ. 7.57 తదుపరి మఖ; వర్జ్యం: రా. 9.27-11.15; దుర్ముహూర్తం: ఉ. 10.09-10.59, మ. 3.08-3.58; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.00; సూర్యాస్తమయం: 6.28 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కల్యాణం.. కమనీయం




బుధవారం రామతీర్థంలో వైభవంగా సీతారాముల కల్యాణం

3

సమరానికి సై

రాష్ట్రంలో నేటి నుంచే నామినేషన్ల పర్వం

అభ్యర్థుల జాబితాలతో ఇరుపక్షాలూ రెడీ

ఎన్నికల పర్వంలో కీలక ఘట్టానికి నేడు తెరలేవనుంది. మే 13వ తేదీన జరిగే పోలింగ్‌కు గురువారం నోటిఫికేషన్ జారీ కానుంది. దీంతో... నామినేషన్ల దాఖలు ప్రక్రియ మొదలవుతుంది. దీని కోసం ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు చేసింది. అటు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి... ఇటు వైసీపీ! 'నేను సైతం' అంటూ కొత్త ఉత్సాహంతో కాంగ్రెస్! పోటాపోటీకి సై అంటున్నాయి. ప్రధాన పక్షాలు ఇప్పటికే అభ్యర్థులను దాదాపుగా ప్రకటించేశాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం జోరుగా సాగుతోంది. నామినేషన్ల దాఖలుతో ఈ వేడి మరింత పెరగనుంది. నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ... ఈనెల 25. ఉపసంహరణ ప్రక్రియ 29వ తేదీతో ముగియనుంది. ఆ తర్వాత ఏ నియోజకవర్గంలో ఎవరి మధ్య పోటీ అన్నది స్పష్టంగా తేలిపోతుంది. 2019లో ఏపీలో తొలివిడతలోనే పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఈసారి... నాలుగో విడతలో జరుగుతుండటంతో అభ్యర్థులకు సుదీర్ఘ కాలం ప్రచారం తప్పడంలేదు. 14



జన కేతనం

ఐదేళ్ల కాలం గడిచిపోయింది. నేతలకు మళ్లీ 'ఎన్నికల పరీక్ష' ఎదుర్కొనే సమయం వచ్చేసింది. నేడు జనం అజెండా ఏమిటి? 'ఒక్క చాన్స్' దెబ్బకు కుదేలైన వర్గాలు ఇప్పుడు ఏం కోరుకుంటున్నాయి? ఉపాధి, వ్యాపార, వాణిజ్య అవకాశాలు కోల్పోయిన వారు ఏం ఆశిస్తున్నారు? ఏది వికాసం? ఎవరిది విధ్వంసం! ఎక్కడికో వెళుతుందనుకున్న నవ్యాంధ్ర... ఇప్పుడు ఎక్కడుంది? గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రస్థానం ప్రగతి వైపా? పతనం వైపా? ఇలా ఎన్నెన్నో ప్రశ్నలు! దీనికి సమాధానమే...

'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనాల సమాహారం 'జన కేతనం'... నేటి నుంచే!



12 ఐదేళ్లలో అనాథగా మారిన ఏపీకి దిక్కెవరు?

13 విశాఖ ఉక్కుపై ఉలకడు.. పలకడు!

ఓట్ల ఒడ్డెక్కేందుకు 10 వేల కోట్లు కావలెను!

సమగ్ర కథనాలు నేటి 'జన కేతనం'లో



సమగ్ర కథనాలు 'అబ్ కీ బార్?'లో 2

రేపే తొలి దశ

- 102 లోక్‌సభ స్థానాల్లో తీర్పు ఇవ్వనున్న ఓటర్లు
- తమిళనాడులోని మొత్తం 39 సీట్లకూ ఒకేసారి
- అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం శాసనసభలకు కూడా
- బుధవారం సాయంత్రంతో ముగిసిన ప్రచారం



మచిలీపట్నం సభలో చంద్రబాబు, పవన్, బాలశౌరి, కొల్లు అభివాదం

డ్రామాలు నమ్మరు

ఓటమి భయంతోనే గులకరాయి నాటకం.. జగన్‌పై బాబు, పవన్ ఫైర్

- ఓట్ల కోసం శవాలతో వస్తున్నాడు.. నిన్నటి వరకు బాబాయి గొడ్డలి పోటు, కోడి కత్తి.. నేడేమో గులకరాయి డ్రామా
- సర్వేలన్నీ మా కూటమికి అనుకూలం.. అందుకే జగన్ డ్రామాలు
- జనం నమ్మే రోజులు పోయాయి.. నవరత్నాల పేరిట నవమోసాలు
- మేమొస్తే రామరాజ్యం.. చేనేతలకు ఉచితంగా 200 యూనిట్లు
- మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు.. మత్స్యకారుల పొట్టకొట్టే జీవో 217 రద్దు
- శ్రీరామనవమి రోజు హామీ ఇస్తున్నా.. జగనాసుర వధ చేయండి.. బాబు పిలుపు
- నా సంగతి సరే.. నువ్వెందుకు ఎమ్మెల్యేలను మార్చావ్?.. సీఎంపై పవన్ ధ్వజం

పెడన, బందరులో ఉమ్మడిగా ప్రజాగళం

మచిలీపట్నం/పెడన, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఓట్ల కోసమే సీఎం జగన్ గులకరాయి డ్రామా ఆడుతున్నాడని టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ విమర్శించారు. ఆయన డ్రామాలను జనం నమ్మే రోజులు పోయాయన్నారు. ప్రజాగళంలో భాగంగా బుధవారం కృష్ణా జిల్లా పెడన, మచిలీపట్నంలో జరిగిన ఉమ్మడి బహిరంగ సభల్లో వారు ప్రసంగించారు. పవన్ కల్యాణ్ ప్రజా జీవితంలో కూడా హీరోగా నిరూపించుకొన్న వ్యక్తి అని చంద్రబాబు ప్రశంసించారు. బాబాయిని గొడ్డలితో హత్య చేసి డ్రామా ఆడి, కోడికత్తి డ్రామాతో రాష్ట్ర ప్రజలను, సొంత కుటుంబాన్ని మోసం చేసి.. ఇప్పుడు మళ్లీ సిగ్గులేకుండా గులకరాయి డ్రామాతో జగన్ జనాల్లోకి వస్తున్నాడని విమర్శించారు. అధికారం

మిగతా 11వ పేజీలో...



రఘు కుల తిలకుడికి

రవి తిలక వైభవం!

2

నాలుగు నిమిషాలపాటు రామ్‌లల్లా నుదుటన మెరిసిన సూర్యకిరణాలు

ఆధునిక టెక్నాలజీతో సాకారం

పీసీఆర్ చట్టంతో 'తోట'కు చిక్కులే!

1955లో ప్రవేశపెట్టిన ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ యాక్ట్

అంటరానితనం నేరానికి సంబంధించి జరిమానా, కనీస శిక్ష పడినా ఎన్నికల్లో పోటీకి అనర్హులే 14

ఈ చట్టం ప్రకారం త్రిమూర్తులు అనర్హుడయ్యే చాన్స్

వైద్య చికిత్సకు రూ. లక్ష తీసుకోవచ్చు!

2

పీఎఫ్ నిబంధనల్లో మార్పు

విత్‌డ్రా పరిమితిని రెట్టింపు చేసిన భవిష్యనిధి సంస్థ

ధనుంజయ్.. ఫటాఫట్ సెటిల్‌మెంట్!

ఎన్నికల హడావుడిలో భారీగా అవినీతి కేసులు ఎత్తివేత

"అవినీతి, అక్రమాలకు పాల్పడ్డ వారిని ఉపేక్షించం. కులం, మతం చూడకుండా ఎంతటి అధికారులయినా తప్పులు తేలితే కఠినంగా వ్యవహరిస్తాం. చాలా గట్టి మెసేజ్ వెళ్లేలా చర్యలు తీసుకోండి"

..ముఖ్యమంత్రి జగన్ 2023లో ఏసీబీ, విజిలెన్స్ విభాగాలకు ఇచ్చిన పిలుపు ఇది.

మరి ఆ మాటలు నిజమయ్యాయా?.. లేనేలేదు.

జగన్ మాటలు నిజమేనని నమ్మి ఏసీబీ, విజిలెన్స్ విభాగాలు 74మందిపై తమ వద్ద పెండింగ్‌లో ఉన్న కేసులపై విచారణ పూర్తిచేసి చర్యల కోసం ప్రభుత్వానికి నివేదించాయి. వీరిలో 16 మంది డిప్యూటీ కలెక్టర్లు, 22 మంది తహసీల్దార్లు, 18 మంది డిప్యూటీ తహసీల్దార్లు, 12 మంది మండల సర్వేయర్‌లు, మరో ఆరుగురు ఇతర అధికారులు ఉన్నారు. మరి వీరందరిపైనా జగన్ సర్కారు కొరడా ఝుళిపించిందా? అంతా ఉత్తిదే. చెప్పిన దానికి భిన్నంగా అక్రమార్కులను, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని జగన్ ఆదేశాలతో ఆయన 'ఆత్మ' ధనుంజయరెడ్డి సేఫ్‌గా బయటపడేశారు.

- రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌లో 74 మందికి క్లీన్‌చిట్, కొందరికి చిన్నశిక్షలు
- ఇవన్నీ ఏసీబీ, విజిలెన్స్ కేసులే.. చక్రం తిప్పిన సీఎంవోలోని జగన్ 'ఆత్మ'
- కోడ్‌కు వారం ముందు సీఎంవో నుంచి శాఖలకు లేఖలు
- హడావుడిగా ప్రతిపాదనలు పంపించిన రెవెన్యూ శాఖ
- ఎన్నికల కోడ్ వచ్చాక పాత తారీఖులతో ఉత్తర్వులు
- సిఫారసుల్లో పోటీలుపడ్డ వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు
- తీవ్ర కేసులున్నవారికి ప్రాసిక్యూషన్ మినహాయింపు
- కీలకంగా వ్యవహరించిన సీసీఎల్ఏలోని ఆ ముగ్గురు



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి జగన్‌కు ధనుంజయరెడ్డి కార్యదర్శి. సీఎంవోలో ఆయనే కీలకాధికారి. ప్రజాప్రతినిధులు, లేదా అధికారుల నుంచి ఏవైనా అభ్యర్థనలు వస్తే వాటి సంగతి ఏమిటో చూడాలని ముఖ్యమంత్రి.. తన కార్యదర్శికి చెబుతారు. సంబంధిత అంశంలో ఏం జరిగింది, తాజా పరిస్థితి ఏమిటో నివేదించాలని సీఎంవో కార్యదర్శి ఆయా శాఖలకు లేఖలు రాస్తుంటారు. ఇది పద్ధతి. కానీ ధనుంజయరెడ్డి రూటే వేరు. నేరుగా సంబంధిత ఫైలును సీఎంవోకు పంపించాలని లేఖలు రాస్తున్నారు. ఈ పేరిట తనకంటే సీనియర్‌లయినా ముఖ్యకార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులకు ఆదేశాలిస్తూ ఫైలు తెప్పించుకుంటున్నారు.


ధనుంజయరెడ్డి లేఖాస్త్రాల్లో మచ్చుకు కొన్ని...

1) ఎన్నికల కోడ్ రావడానికి కొద్ది రోజుల ముందు కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి...సీఎంకు లేఖరాశారు. ధర్మచంద్రారెడ్డి అనే డిప్యూటీ కలెక్టర్‌పై చర్యలు తీసుకోవద్దని, అభియోగాలు ఉపసంహరించుకోవాలనేది ఆ లేఖ సారాంశం. ఆ లేఖ ఆధారంగా రెవెన్యూశాఖ నుంచి ధర్మచంద్రారెడ్డికి సంబంధించిన ఫైలు సీఎంకు పంపించాలని

మిగతా 14వ పేజీలో...

దుబాయ్‌లో జల విలయం

- ఏడాదిన్నరలో కురవాల్సిన వాన ఒక్కరోజులోనే.. దుబాయ్‌కి వరద పోటు
- ఎయిర్‌పోర్టులోకి మోకాలి లోతు నీరు.. నీళ్లలో చిక్కుకున్న ఇళ్లు, మాల్స్
- ఒమాన్, బహ్రెయిన్‌లోనూ వానలు.. వరదలో సిరిసిల్ల వాసి భాస్కర్ మృతి



దుబాయ్‌లోని ఓ ప్రధాన రోడ్డును వరద ముంచెత్తడంతో మునిగిన వాహనాలు 2



సౌదీలో పచ్చదనం సంతరించుకున్న కొండలు, గుట్టలను కెమెరాలో బంధిస్తున్న దృశ్యం

ఎడారిలో వసంతం

- సౌదీలో పచ్చగా చిగురిస్తున్న నేలలు
- మక్కా, మదీనా నడుమ పచ్చదనం
- సత్ఫలితాలనిస్తున్న 'గ్రీన్ ఇనిషియేటివ్'

2

'బొండా' వైపు గులకరాయి గురి!

టీడీపీ నేతను ఇరికించే ప్రయత్నం

- పోలీసుల అదుపులో ఉమా అనుచరుడు
- మొత్తం ఆరుగురు నిందితుల విచారణ
- సీపీ ఆఫీస్ ముందు బాధిత కుటుంబాల నిరసన
- అనంతరం ఏసీపీ కార్యాలయం ఎదుట ఆందోళన
- తమ బిడ్డలను చూపించాలని వేడుకోలు
- బాధితుల తరఫున రంగంలోకి కోడికత్తి లాయర్
- హెబియస్ కార్పస్ పిటిషన్ వేస్తానన్న సలీం



విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళనలో దుర్గారావు తల్లి, కుమార్తెలు

విజయవాడ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్‌పై పడిన 'గులకరాయి'.. టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వైపునకు మళ్లుతోందా? ఆయనను కేసులో ఇరికించేందుకు అధికార పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారా? దానికి అనుగుణంగానే పోలీసుల దర్యాప్తు సాగుతోందా? అంటే.. జరుగుతున్న పరిణామాలు ఔననే అంటున్నాయి. సీఎం జగన్‌పై జరిగిన గులకరాయి దాడి ఘటనకు సంబంధించి పోలీసుల అదుపులో

మిగతా 14వ పేజీలో...

చంద్రబాబు, లోకేశ్‌లపై చెరో 23 కేసులు

11



ఎగ్జిట్, ఓపీనియన్ పోల్స్‌పై నిషేధం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఎగ్జిట్, ఓపీనియన్ పోల్స్‌పై కేంద్ర ఎన్నికల సంఘం నిషేధం విధించింది. లోక్‌సభ ఎన్నికలతోపాటు ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పలు రాష్ట్రాల్లో జరుగుతున్న ఉప ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్, ఓపీనియన్ పోల్స్, మరేవిధంగానైనా పోల్స్ నిర్వహించడం గానీ, వాటి ఫలితాలను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలు, రేడియోల ద్వారా వెల్లడించవద్దని ఈసీ పేర్కొంది. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి జూన్ 1వ తేదీ సాయంత్రం 6.30 గంటల వరకూ ఎగ్జిట్ పోల్స్ ప్రసారంపై నిషేధం కొనసాగుతుందని తెలిపింది.

ఆశ.. నమ్మకం.. గ్యారెంటీలు

» 2014 నుంచి 2024 వరకూ వీటితోనే ప్రజల వద్దకు

» అస్సాం, త్రిపుర రాష్ట్రాల ఎన్నికలసభల్లో మోదీ


అయోధ్యలో శ్రీరాముడికి సూర్య తిలకం దృశ్యాన్ని వీక్షిస్తున్న ప్రధాని మోదీ

నల్‌బరి, అగర్తలా, ఏప్రిల్ 17: తనకు ప్రజలకు మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రధాని మోదీ వివరిస్తూ.. 2014లో ఒక ఆశతో ప్రజల వద్దకు వెళ్లానని, 2019లో నమ్మకంతో వెళ్లానని, ఇప్పుడు 2024లో గ్యారెంటీలతో వస్తున్నానని చెప్పారు. బుధవారం అస్సాంలోని నల్‌బరిలో, త్రిపుర రాజధాని అగర్తలాలో జరిగిన ఎన్నికల సభల్లో మోదీ ప్రసంగించారు. కాంగ్రెస్ పాలనకు తమ పాలనకు మధ్య తేడాలని వివరిస్తూ.. కాంగ్రెస్ హయాంలో ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్రవాదం పెరిగిపోయిందని, కానీ, తాము శాంతియుత పరిస్థితులను నెలకొల్పామన్నారు. దోచుకొని దాచుకోవటానికే కాంగ్రెస్ ఈ ప్రాంతాన్ని కావాలని దశాబ్దాలపాటు నిర్లక్ష్యం చేసిందని, కానీ, తన పాలనలో అభివృద్ధి ఫలాలు కనిపిస్తున్నాయని చెప్పారు. అస్సాంలో ఇటీవల సెమీకండక్టర్ పరిశ్రమకు తాను శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, 15 వేల మందికిపైగా యువతకు ఉద్యోగాలు కల్పించే ఈ పరిశ్రమతో అస్సాం సెమీకండక్టర్ హబ్‌గా మారుతుందని తెలిపారు. 500 ఏళ్ల తర్వాత అయోధ్యలో రామ మందిరం సాకారమైందని, ఇన్నాళ్లూ టెంటు కింద ఉన్న రాముడు ఇప్పుడు దివ్యమైన మందిరంలో ఉన్నాడని మోదీ పేర్కొన్నారు. నిరుపేదలకు మరో ఐదేళ్లపాటు ఉచిత రేషన్ కొనసాగిస్తామని మోదీ పునరుద్ఘాటించారు. 70 ఏళ్లకు పైబడిన వారికి ఆయుష్మాన్ భారత్ కింద రూ.5 లక్షల విలువైన ఉచిత వైద్యచికిత్సలను అందిస్తామన్నారు. 'మీ కుటుంబాల మీద ఆర్థిక భారం పడకుండా మీ కొడుకు మోదీ ఈ వైద్యఖర్చుల భారం మోస్తాడు' అని తెలిపారు. కాగా, అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ తర్వాత జరుగుతున్న తొలి శ్రీరామ నవమి తరతరాల భారతీయుల ప్రస్థానంలో ఒక మైలురాయి అని శ్రీరామనవమి సందర్భంగా మోదీ పేర్కొన్నారు. నల్‌బరి సభ అనంతరం మోదీ.. అయోధ్యలో రాముడిపై సూర్య తిలకం పడిన ఘట్టం ప్రత్యక్షప్రసారాన్ని ట్యాబ్‌లెట్‌లో వీక్షించారు. ఆ ఫొటోలను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కాగా, మోదీ బుధవారం ఎన్‌డీఏ అభ్యర్థులను ఆశ్చర్యంలో ముంచెత్తారు. తొలిదశ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు పేరుపేరున వ్యక్తిగత లేఖలు రాశారు. 'ప్రియమైన సహచర కార్యకర్త..' అంటూ వారిని సంబోధించారు.

ఎన్డీయేకు 150 సీట్లైనా రావు

» పార్టీ ఆదేశిస్తే అమేథీ నుంచి పోటీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే 150 సీట్లు మించి గెలవలేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో తొలి విడత ప్రచారం ముగుస్తున్న నేపథ్యంలో బుధవారం సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) నేత అఖిలేష్ యాదవ్‌తో కలిసి ఆయన ఘజియాబాద్‌లో విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. యూపీలో తమ మధ్య బలమైన ఐక్యత ఉన్నదని వారిరువురూ సంకేతాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. 15-20 రోజుల క్రితం బీజేపీకి 180 సీట్లు వస్తాయని అంచనా వేశామని, కానీ ప్రస్తుతం ఎన్డీయేకే 150 సీట్లు దాటవని అన్ని రాష్ట్రాల నుంచి అందుతున్న నివేదికల ఆధారంగా తేలిందని తెలిపారు. బీజేపీ పట్ల ప్రజావ్యతిరేకత చాప కింద నీరులాగా విస్తరిస్తోందని, రోజురోజుకూ ఇండియా కూటమి బలపడుతోందని ఆయన అన్నారు. యూపీలోని అమేథీ నుంచి కానీ రాయబరేలీ నుంచి కానీ మీరు పోటీ చేస్తారా అని విలేకరులు అడుగగా.. ఇది బీజేపీ ప్రశ్న అని రాహుల్ చమత్కరించారు. తానెక్కడి నుంచి పోటీ చేయాలన్నది పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ నిర్ణయిస్తుందని ఆయన చెప్పారు. పార్టీ ఏ ఆదేశాలు ఇస్తే వాటిని పాటిస్తానని తెలిపారు. దేశంలో పేదరికం ఒక్క రోజులో మటుమాయం అవుతుందని తాము అనడం లేదని చెప్పారు.

యూపీలో బీజేపీని చిత్తు చేస్తాం

కాంగ్రెస్- ఎస్పీ పొత్తు అత్యంత శక్తివంతమైనదని ఎస్పీ నేత అఖిలేష్ యాదవ్ అన్నారు. యూపీలో బీజేపీని తమ ఇండియా కూటమి చిత్తు చేస్తుందని ఆయన చెప్పారు. ఘజియాబాద్ నుంచి ఘాజీపూర్ వరకు బీజేపీని తుడిచిపెడుతుందని పేర్కొన్నారు. మైనారిటీ, దళిత, వెనుకబడిన వర్గాలే ఎన్డీయేని ఓడిస్తాయని అఖిలేష్ అన్నారు. కాగా, యూపీలోని 80 లోక్‌సభ స్థానాల్లో ఎస్పీ 62, కాంగ్రెస్ 17 చోట్ల పోటీ చేస్తుండగా, టీఎంసీకి కూడా ఎస్పీ ఓ సీటును కేటాయించింది. ఈ స్థానాలకు ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకు ఏడు దశల్లో ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే.

రేపే తొలిదశ

102 లోక్‌సభ స్థానాలకు ఓటర్ల తీర్పు

అరుణాచల్, సిక్కిం అసెంబ్లీలకు కూడా

సర్వం సిద్ధం చేసిన ఎన్నికల సంఘం

21 రాష్ట్రాల్లో పోలింగ్.. బరిలో 8మంది కేంద్రమంత్రులు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: సార్వత్రిక ఎన్నికల తొలి ఘట్టం శుక్రవారం ప్రారంభం కానుంది. మొత్తం ఏడు దశల్లో నిర్వహిస్తున్న ఎన్నికల్లో తొలిదశకు కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం శ్రీకారం చుట్టనుంది. మొత్తం 102 లోక్‌సభ స్థానాల్లో అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు ఈవీఎంలలో నిక్షిప్తం చేయనున్నారు. తొలి దశలో తమిళనాడులోని మొత్తం 39 స్థానాలు సహా 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని లోక్‌సభ సీట్లకు పోలింగ్ జరగనుంది. అదేవిధంగా అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కూడా తొలిదశలోనే జరగనుంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని అసెంబ్లీ 60 స్థానాలు, సిక్కింలోని 32 స్థానాలకు ఓటర్లు తీర్పు ఇవ్వనున్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. బుధవారం సాయంత్రమే ఆయా నియోజకవర్గాల్లో ప్రచారం ముగిసింది.

బరిలో ఉద్దండులు

తొలిదశ ఎన్నికల్లో రాజకీయ ఉద్దండులు పోటీపడుతున్నారు. వీరిలో ఎనిమిది మంది కేంద్ర మంత్రులు, ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు, ఒక మాజీ గవర్నర్ ఉన్నారు. బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి గడ్కరీ వరుసగా మూడోసారి నాగపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. రెండుసార్లు గెలిచిన ఆయన మూడోసారి విజయం కోసం ప్రయత్నిస్తున్నారు. 2014లో ఆయన ఏడు సార్లు ఎంపీగా గెలిచిన విలాస్ ముత్తెంవార్‌ను 2.84 లక్షల ఓట్ల మెజారిటీతో ఓడించారు. 2019లో 2.16 లక్షల మెజారిటీతో మహారాష్ట్ర కాంగ్రెస్ పార్టీ చీఫ్ నానా పటోల్‌పై విజయం దక్కించుకున్నారు.

- కేంద్ర మంత్రుల్లో కిరెన్ రిజిజు అరుణాచల్ ప్రదేశ్ వెస్ట్ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. రిజిజు ప్రధాన ప్రత్యర్థి అరుణాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ పీసీసీ చీఫ్ నబం తుకి. శర్బానంద్ సోనోవాల్ అసోంలోని డిబ్రుగఢ్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ప్రస్తుతం ఈయన రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. యూపీలోని ముజఫర్‌నగర్ నుంచి సంజీవ్ బలియాన్ పోటీ చేస్తున్నారు. సమాజ్ వాదీ పార్టీ నుంచి హరేంద్రమాలిక్, బీఎస్పీ నుంచి దారా సింగ్ ప్రజాపతి బరిలో ఉన్నారు. ఉధంపూర్ నుంచి వరుసగా మూడోసారి పోటీ చేస్తున్న జితేంద్రసింగ్ హ్యాట్రిక్ కోసం తపిస్తున్నారు. భూపేంద్ర యాదవ్ రాజస్థాన్‌లోని అల్వార్ నుంచి పోటీలో ఉన్నారు. సిట్టింగ్ ఎంపీ బాలక్‌నాథ్‌ను పక్కన పెట్టిమరీ బీజేపీ ఈయనకు అవకాశం ఇచ్చింది. రాజస్థాన్‌లోని బికనీర్ నుంచి అర్జున్‌రామ్ మేఘ్వాల్ బరిలో ఉన్నారు. ఈయనపై కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి గోవింద్‌రామ్ మేఘ్వాల్ పోటీచేస్తున్నారు.
- తమిళనాడులోని నీలగిరి నియోజకవర్గం హాట్ టాపిక్‌గా మారింది. ఇక్కడ నుంచి కేంద్ర మంత్రి, బీజేపీ నేత ఎల్.మురుగన్, డీఎంకే నేత, సిట్టింగ్ ఎంపీ ఏ. రాజా పోటీ చేస్తున్నారు.
- తమిళనాడులోని శివగంగ నియోజకవర్గం మరింత ఆసక్తిగా మారింది. ఇక్కడ నుంచి కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కుమారుడు, సిట్టింగ్ ఎంపీ కార్తి కాంగ్రెస్ తరఫున బరిలో ఉన్నారు.
- తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కూడా తొలిదశలోనే అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. చెన్నై దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. 2019లో తూత్తుకుడి నుంచి పోటీ చేసిన తమిళిసై డీఎంకే అభ్యర్థి కనిమొళి చేతిలో పరాజయం పాలయ్యారు.
- మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్ కుమారుడు నకుల్ నాథ్ చింద్వారా నుంచి పోటీ చేస్తున్నారు. ఇక్కడ కమల్‌నాథ్ కుటుంబానికి 1980 నుంచి ఎదురన్నదే లేకపోవడం గమనార్హం.
- త్రిపురలో హైఓల్టేజ్ సీటుగా పేరున్న పశ్చిమ త్రిపుర నుంచి మాజీ సీఎం బిప్లబ్ దేబ్, కాంగ్రెస్ రాష్ట్ర చీఫ్ ఆశిష్‌కుమార్ తలపడుతున్నారు.
- రాజస్థాన్‌లోని చురు నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా రెండు సార్లు ఒలింపిక్ పసిడి పతాన్ని కైవసం చేసుకున్న జావెలిన్ త్రో క్రీడాకారుడు దేవేంద్ర ఝఝారియా పోటీ చేస్తున్నారు.
- లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా రాజస్థాన్‌లోని కోట నియోజకవర్గం నుంచి బరిలో ఉన్నారు.
- తొలి దశలో బీజేపీ 77 స్థానాల్లో పోటీ చేస్తుండగా ఎన్డీయే పక్షాలు 23 చోట్ల బరిలో ఉన్నాయి.
- ఇండియా కూటమిలో కాంగ్రెస్ 57 స్థానాల్లో, మిత్రపక్షాలు 42 చోట్ల పోటీలో ఉన్నాయి.
- తొలి దశలో అరుణాచల్ ప్రదేశ్‌లోని 2, ఉత్తరాఖండ్ 5, అసోం 5, బిహార్ 4, ఛత్తీస్‌గఢ్ 1, మధ్యప్రదేశ్ 6, మహారాష్ట్ర 5, మేఘాలయ 2, మణిపూర్ 2, మిజోరాం 1, నాగాలాండ్ 1, రాజస్థాన్ 12, సిక్కిం 1, తమిళనాడు 39, త్రిపుర 1, యూపీ 8, పశ్చిమ బెంగాల్ 3, అండమాన్, జమ్ముకశ్మీర్, లక్షద్వీప్, పుదుచ్చేరిలలో ఒక్కొక్కస్థానానికి ఎన్నికలు జరగనున్నాయి.

102 స్థానాల్లో మైకులు బంద్!

తొలిదశ పోలింగ్‌కు సంబంధించిన ఎన్నికల ప్రచారం బుధవారం సాయంత్రంతో ముగిసింది. షెడ్యూల్ కన్నా ముందు నుంచే ఆయా రాష్ట్రాల్లో ప్రచార హోరును పెంచిన రాజకీయ పార్టీలు తొలి దశ ఎన్నికల ప్రచారం చివరి రోజు వరకు అదే జోరును కొనసాగించాయి. ప్రధాని మోదీ బుధవారం అసోంలో సుడిగాలి పర్యటన చేశారు. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి సంబంధించి బీజేపీ రూపొందించిన 'వికసిత విజన్'ను(హామీలు) ఆయన ఆవిష్కరించారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని శుభాకాంక్షలు చెప్పిన ఆయన.. అయోధ్యలో 500 ఏళ్ల తర్వాత బాలరాముని విగ్రహాన్ని ప్రతిష్ఠించామని తెలిపారు. "బాలరాముని నుదుటన సూర్యతిలకం.. వికసిత త్రిపుర, వికసిత భారత్‌కు సంకేతం" అని వ్యాఖ్యానించారు.

తమిళనాడులో 39 స్థానాలకూ ఒక్క దశలోనే



చెన్నై, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని 39 లోక్‌సభ స్థానాలకు ఒకే దశలో శుక్రవారం పోలింగ్ జరగనుంది. గత 30 ఏళ్లకు పైగా తమిళనాట ఎన్నికలొచ్చినప్పుడల్లా కొన్ని సమస్యలపై ప్రధానంగా ప్రచారం సాగేది. శ్రీలంక ఆధీనంలో వున్న కచ్చతీవు, శ్రీలంక నావికాదళం తమిళ జాలరులపై జరుపుతున్న దాష్టీకానికి అడ్డుకట్ట వేయడం, మాజీ ప్రధాని రాజీవ్ హంతకుల విడుదల, శ్రీలంకలో తమిళులపై సాగుతున్న అరాచకాలను ఆపడం, కర్నాటక, కేరళ రాష్ట్రాలతో నెలకొన్న నదీ జలాల పంపిణీ వ్యవహారాలు ప్రధానంగా ప్రచారాస్త్రాలుగా ఉండేవి. ఈ సారి ప్రచారంలో ఈ అంశాల ప్రస్తావనే లేకుండాపోయింది. తమిళనాట తొలిసారిగా మతపరమైన ప్రచారం ప్రధానంగా ముందుకు వచ్చింది. తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలతో ప్రారంభమైన ఈ తరహా క్యాంపెయిన్.. ఎన్నికల ప్రచారం ముగిసేవరకు కొనసాగింది. బీజేపీ ఆరోపణలపై స్పందించడానికైనా డీఎంకే కూడా అభివృద్ధి ప్రచారానికి బదులుగా మతపరమైన ప్రచారం నిర్వహించాల్సి వచ్చింది. నిజానికి ప్రధాని మోదీ స్వయంగా ఈసారి కచ్చతీవు అంశాన్ని లేవనెత్తారు. కచ్చతీవును శ్రీలంకకు అప్పగించిన పాపం కాంగ్రెస్‌దే అని, అప్పుడు రాష్ట్రంలో డీఎంకే అధికారంలో ఉందని ఇండియా కూటమిని ఇరుకున పెట్టడంతో పాటు సమస్యను జాతీయం చేసే ప్రయత్నం చేశారు. కానీ, దీనికి అంతగా స్పందన రాకపోవడంతో ఆ అంశం ప్రచారంలో పక్కకి తొలగిపోయింది. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో దోషులుగా తేలి, మరణశిక్ష నుంచి యావజ్జీవ కారాగార శిక్షకు మారి, మూడు దశాబ్దాల పాటు జైలుశిక్ష అనుభవించిన నళిని బృందం వ్యవహారం కూడా ఈ ఎన్నికల ప్రచారంలో కనిపించలేదు. నళిని బృందం మొత్తం జైళ్ల నుంచి విడుదలవడం, ఇందులో ముగ్గురు తమ స్వదేశమైన శ్రీలంకకు వెళ్లడంతో ఈ సారి ఎన్నికల్లో ఈ ప్రస్తావనే లేకుండా పోయింది. ప్రతి ఎన్నికల్లోనూ నళిని బృందం విడుదలపై అన్ని పార్టీలు గట్టిగా గళమెత్తేవి. వారి విడుదల కోసం తామెంతగా శ్రమించిందీ, ఏమేం చర్యలు తీసుకున్నదీ విపులంగా ఓటర్లకు వివరించేవి. తమిళనాడుకు ముల్లైపెరియార్ డ్యాం వ్యవహారంలో కేరళతో, కావేరీ నదీ జలాల పంపిణీ వ్యవహారంలో కర్నాటక ప్రభుత్వంతో దీర్ఘకాలిక వివాదముంది. ఎన్నికల్లోనూ ఈ సమస్యలను పరిష్కరించని కేంద్ర ప్రభుత్వంపై, ఆ ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న ప్రధాన పార్టీపైనా తమిళపార్టీలు విరుచుకుపడేవి. అయితే ఈ సారి ఎన్నికల్లో ఆ ప్రస్తావన కించిత్తు కూడా కనిపించకపోవడం గమనార్హం.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఏలూరు	44.0	25.0
కర్నూలు	43.5	29.7
తిరుపతి	41.5	25.2

మోదీ వేవ్ లేదు.. కష్టపడాల్సిందే!

» వైరల్‌గా మారిన బీజేపీ అభ్యర్థి నవనీత్ రాణా వ్యాఖ్యలు

ముంబై, ఏప్రిల్ 17: 'మోదీ వేవ్ ఉందనే భ్రమల్లో ఉండకండి.. ఓట్ల కోసం కష్టపడాల్సిందే'నంటూ బీజేపీ అమరావతి అభ్యర్థి నవనీత్ రాణా ఇటీవల చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నవనీత్ వ్యాఖ్యలు బీజేపీలో అలజడి రేపగా.. ఆమె చెప్పింది నిజమేనంటూ ప్రతిపక్ష ఎన్సీపీ (ఎస్పీ), శివసేన (యూబీటీ) నేతలు స్వాగతిస్తున్నారు. సోమవారం అమరావతిలో జరిగిన బీజేపీ ర్యాలీలో నవనీత్ మాట్లాడుతూ.. 'గ్రామ పంచాయతీ ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికల్లోనూ పోరాడాలి. మోదీ వేవ్ ఉందనే భ్రమలో ఉండకండి..' అని ఆమె వ్యాఖ్యానించారు. గత ఎన్నికల్లో మోదీ వేవ్ ఉన్నప్పటికీ స్వతంత్ర అభ్యర్థిగా తాను గెలిచినట్లు గుర్తు చేశారు. 2019లో అప్పటి ఎన్సీపీ మద్దతుతో గెలిచిన నవనీత్.. ఈసారి బీజేపీ నుంచి బరిలో ఉన్నారు. దీనిపై శివసేన(యూబీటీ) అధికార ప్రతినిధి సంజయ్‌రౌత్ స్పందిస్తూ.. 'బీజేపీ అభ్యర్థులు కూడా నిజాలు మాట్లాడుతున్నారు' అని వ్యాఖ్యానించారు.

పేదలకు 10 గ్యాస్ సిలిండర్లు

» 10 హామీలతో టీఎంసీ మ్యానిఫెస్టో

కోల్‌కతా, ఏప్రిల్ 17 : పశ్చిమ బెంగాల్ సీఎం మమత నాయకత్వంలోని టీఎంసీ పార్టీ లోక్‌సభ ఎన్నికలకు తమ మ్యానిఫెస్టోను బుధవారం ప్రకటించింది. సీఏఏ, ఎన్‌ఆర్‌సీ రద్దు, పెట్రోల్ ,డీజిల్ ధరల నియంత్రణ సహా పది హామీలతో కూడిన మ్యానిఫెస్టోను కోల్‌కతాలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో విడుదల చేసింది. ఇండియా కూటమి కేంద్రంలో అధికారం చేపట్టిన తర్వాత ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రిస్తామని హామీ ఇచ్చింది. అలాగే, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఏడాదికి పది గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని, నిరుపేదలకు ఉచితంగా ఇళ్లు, రేషన్ కార్డుదారులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ కార్యక్రమాలు చేపడతామని పేర్కొంది.

రఘు కుల తిలకుడికి రవి తిలక వైభవం

» ఆధునిక టెక్నాలజీతో నాలుగు నిమిషాలపాటు రామ్‌లల్లా నుదుటన మెరిసిన సూర్యకిరణాలు

» ఐఐఏ బెంగళూరు, సీబీఆర్‌ఐ పరిశోధకుల డిజైన్



అయోధ్య, ఏప్రిల్ 17: అయోధ్యాపురిలో కొలువైన రామ్‌లల్లా నుదుటన.. సూర్యుడు తన కిరణాలతో తిలకం దిద్దాడు. శ్రీరామనవమినాడు అభిజిత్‌లగ్నంవేళ.. సరిగ్గా విట్టమధ్యాహ్నం 12గంటల సమయానికి 5.8 సెంటీమీటర్ల నిడివిగల సూర్య కిరణం చిన్నారి రాముడి లలాట ఫలకంపై కస్తూరి తిలకమైంది!! బాల రామయ్య ఫాలభాగంపై దాదాపు 4 నిమిషాలపాటు పాలనురగలా మెరిసింది. ఈ సూర్య తిలక ఘట్టం వెనుక ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రజ్ఞుల కృషి ఉన్నాయి. ఏటా ఒక ప్రత్యేకమైన రోజున సూర్యకిరణాలు నేరుగా గర్భగుడిలోని మూలవిరాట్టును తాకేలా నిర్మించిన ఆలయాలు మనదేశంలో చాలానే ఉన్నాయి. ఏపీలోని అరసవిల్లి క్షేత్రంలో ఏటా రెండుసార్లు.. ఉత్తరాయణ, దక్షిణాయన సమయాల్లో సూర్యకిరణాలు ఆ ఆలయంలో కొలువైన సూర్యనారాయణమూర్తి విగ్రహంపై పడతాయి. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో మహాలక్ష్మి ఆలయంలోనూ ఏటా రెండుసార్లు అమ్మవారిపై సంధ్యాకిరణాలు ప్రసరిస్తాయి. దీన్ని 'కిరణోత్సవ్'గా వ్యవహరిస్తారు. ఈ నేపథ్యంలో అయోధ్యలోనూ శ్రీరామనవమినాడు రాముడి నుదుటిపై సూర్యకిరణాలు పడేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని మందిర నిర్మాణాన్ని తలపెట్టినప్పుడే నిర్ణయించారు. ఇందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయాన్ని తీసుకోవాలని భావించారు. ఇందుకోసం విద్యుత్తు వాడకూడదని కూడా నిశ్చయించి మూడేళ్ల క్రితం ఆ బాధ్యతను బెంగళూరులోని 'ద ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ)'కు అప్పగించారు. ఐఐఏ నేతృత్వంలోని బృందం సూర్యుడి గమనం ఆధారంగా 4 అద్దాలు, 4 కటకాల సాయంతో బాలరాముడికి సూర్యతిలకం దిద్దేలా 'సూర్యతిలక్ మెకానిజమ్' పేరిట ఒక ఆప్టికల్ సిస్టమ్‌ను డిజైన్ చేసింది. ఆ డిజైన్ మేరకు.. బెంగళూరుకే చెందిన ఆప్టికా అనే సంస్థ ఒక పరికరాన్ని రూపొందించింది. సెంటర్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ అనుబంధ విభాగమైన సెంట్రల్ బిల్డింగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (రూర్కీ-ఉత్తరాఖండ్)కు చెందిన బృందం దాన్ని ఆలయంలో అమర్చింది. అయితే, ప్రస్తుతానికి ఆలయ నిర్మాణం పూర్తికానందున ఈ సిస్టమ్‌లో కొన్ని మార్పులు చేసి 4అద్దాలు, 2కటకాలను వినియోగిస్తున్నట్టు కేంద్ర శాస్త్ర, సాంకేతిక విభాగం కార్యదర్శి అభయ్ కరాండికర్ తెలిపారు. ఆలయ నిర్మాణం పూర్తయ్యాక 4 అద్దాలు, 4కటకాలను శాశ్వత స్థానాల్లో అమర్చుతామన్నారు.

19 ఏళ్లకొకసారి..

ఇంగ్లిష్ క్యాలెండర్ ప్రకారం ప్రతి 19ఏళ్లకొకసారి శ్రీరామ నవమి తేదీ దాదాపుగా ఒకటే అవుతోందని (ఉదాహరణకు 2000లో శ్రీరామనవమి ఏప్రిల్ 12న, 2019లో ఏప్రిల్ 13న; 2001, 2020ల్లో ఏప్రిల్ 2న; 2002, 2021 సంవత్సరాల్లో ఏప్రిల్ 21న.. ఇలా కొన్నిసార్లు ఈ తేడా ఎక్కువ రోజులున్నా.. మెజారిటీ సందర్భాల్లో దగ్గరి తేదీలే వస్తున్నాయి. ఆ లెక్కల ఆధారంగా ఆప్టిక్ సిస్టమ్‌ను డిజైన్ చేశామని అభయ్ కరాండికర్ తెలిపారు. ఈ ఆప్టో-మెకానిజమ్‌లో భాగంగా ఆలయ మూడో అంతస్తులో ఉండే అద్దంపై పడే సూర్య కిరణాలు..ఇత్తడి పైపులు, కటకాల గుండా ప్రసరించి, అద్దాల ద్వారా ప్రతిఫలించి రామ్‌లల్లా నుదుటన పడతాయి. కాగా, ఎల్లోరా గుహల్లోని 10వ గుహలో ధర్మచక్రముద్రలో ఉన్న బుద్ధుడి ముఖం మీదకు కాంతి ప్రసరించేలా 7వ శతాబ్దంలో ఏర్పాటు చేశారు. తర్వాత, చాలా ఆలయాల్లో ఈ తరహాలో గుడి గోపురాలను నిర్మించారు.

వైద్య చికిత్సకు రూ.లక్ష తీసుకోవచ్చు!

» పీఎఫ్ నిబంధనల్లో కీలక మార్పు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) ఖాతాలో ఉన్న సొమ్మును విత్‌డ్రా చేసుకునే విషయంలో సంస్థ కీలక మార్పు చేసింది. వైద్య ఖర్చుల కోసం చేసుకునే ఆటో క్లెయిమ్ పరిమితిని రెట్టింపు చేసింది. ఈ విషయాన్ని ఈపీఎఫ్‌వో ఓ సర్క్యులర్‌లో వెల్లడించింది. పేరా 68జె కింద ఆటో క్లెయిమ్ సెటిల్‌మెంట్ పరిమితిని రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచుతున్నట్లు తెలిపింది. చందాదారులు తమ వ్యక్తిగత లేదా కుటుంబసభ్యుల వైద్య ఖర్చుల నిమిత్తం ఈ పేరా కింద పీఎఫ్ ఖాతాలోని డబ్బును తీసుకొనే వెసులుబాటు ఉంది. నెల అంతకంటే ఎక్కువ రోజులు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నా.. శస్త్రచికిత్సలు చేయించుకున్నా ఈ మొత్తాన్ని ఉపసంహరించుకోవచ్చు. టీబీ, క్షయ, పక్షవాతం, క్యాన్సర్, హృద్రోగ చికిత్సల కోసమూ క్లెయిమ్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనూ క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉంది. ఎలాంటి మెడికల్ సర్టిఫికెట్లు లేకుండానే సెల్ఫ్ డిక్లరేషన్ సమర్పించి దీన్ని పొందొచ్చు.

పీవీ, మన్మోహన్‌లపై కేంద్రం ప్రశంసల జల్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: మాజీ ప్రధానులు పి.వి.నరసింహారావు, మన్మోహన్ సింగ్‌లపై బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం బుధవారం సుప్రీంకోర్టులో ప్రశంసల జల్లు కురిపించింది. ఆర్థిక సంస్కరణలు చేపట్టడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొంది. పరిశ్రమల అభివృద్ధి, నియంత్రణ చట్టం (ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్-ఐడీఆర్‌ఏ)-1951పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆధ్వర్యంలోని తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపిన సందర్భంగా వారి సేవలను గుర్తు చేసింది. 1991లో విదేశీ మారక ద్రవ్య నిల్వల సంక్షోభం తలెత్తినప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థ రూపాంతరం చెందేలా ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రయివేటీకరణ అన్న మూడు సూత్రాలను ఆధారం చేసుకొని పీవీ, మన్మోహన్ సంస్కరణలు చేపట్టారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ విషయాలను గుర్తు చేశారు.

దుబాయ్‌ను ముంచెత్తిన వరద



దుబాయ్, ఏప్రిల్ 17: ఎడారి దేశం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) కుంభవృష్టితో తడిసి ముద్దైంది. ఏడాదిన్నరలో కురవాల్సిన వాన మంగళవారం ఒక్కరోజే పడింది. యూఏఈ చరిత్రలోనే కనీవినీ ఎరగని స్థాయిలో కురిసిన వానతో దుబాయ్ ఎయిర్‌పోర్టులో రన్‌వేపైకి మోకాలి లోతు వరద నీరు వచ్చి చేరింది. విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఎయిర్‌పోర్టులో విమాన సర్వీసులను అరగంట పాటు పూర్తిగా నిలిపివేశారు. దుబాయ్ నగరంలోని ప్రఖ్యాత దుబాయ్ మాల్, మాల్ ఆఫ్ ఎమిరేట్స్‌తో పాటు వేలాది ఇండ్లు, షాపింగ్ మాల్స్‌లోకి వరదనీరు చొచ్చుకువచ్చింది. సోమవారం రాత్రి భారీ గాలులు, ఉరుములతో ప్రారంభమైన వర్షం మంగళవారం సాయంత్రం వరకు కురిసింది. దుబాయ్‌లో సాధారణ వార్షిక వర్షపాతం 94.7మిల్లీమీటర్లు కాగా.. మంగళవారం ఒక్కరోజే 142 మిల్లీమీటర్ల వాన కురిసింది. దుబాయ్‌కు 130 కిలోమీటర్ల దూరంలో యూఏఈ-ఒమాన్ సరిహద్దులో ఉన్న అల్ అయిన్ నగరంలో ఏకంగా 254మిల్లీమీటర్ల వర్షం పడింది. యూఏఈతో పాటు పొరుగున ఉన్న ఒమాన్, బహ్రెయిన్, సౌదీ అరేబియా, ఖతార్ దేశాల్లో కూడా మంగళవారం భారీ వర్షాలు కురిశాయి. వర్షాల కారణంగా ఒమాన్‌లో 18 మంది చనిపోయారు. యూఏఈలో మంగళవారం కుంభవృష్టికి 'క్లౌడ్ సీడింగ్' కారణమని భావిస్తున్నారు. నీటి అవసరాల కోసం యూఏఈలో క్లౌడ్ సీడింగ్ పద్ధతిని ఎప్పటి నుంచో అమలు చేస్తున్నారు. అయితే, తాము ఇటీవల క్లౌడ్ సీడింగ్ నిర్వహించలేదని ఆ దేశ వాతావరణ సంస్థ తెలిపింది. యూఏఈలో వర్షాలు చాలా అరుదు. కానీ, రెండుమూడేళ్లుగా ఇక్కడ కూడా అడపాదడపా భారీ వర్షాలు పడటం సాధారణమైంది. వాతావరణ మార్పులే ఇందుకు కారణమని భావిస్తున్నారు.


సిరిసిల్ల జిల్లాకు చెందిన వ్యక్తి మృతి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దుబాయ్ వరదల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలానికి చెందిన భాస్కర్ అనే ప్రవాస భారతీయుడు చనిపోయినట్లు సమాచారం. భాస్కర్ కారులో చనిపోయి కనిపించాడని, అయితే కారు వరదల్లో కొట్టుకుపోయి ఊపిరాడక చనిపోయాడా.. లేక భయంతో గుండెపోటుతో చనిపోయాడా.. అన్నది ఇంకా తెలియలేదని తెలంగాణ కాంగ్రెస్ ఎన్నారై విభాగం అధ్యక్షుడు ఎస్వీ రెడ్డి చెప్పారు. ఇదిలా ఉండగా, దుబాయ్‌లో అనేక భవనాల్లోని సెల్లార్లు నీటితో నిండిపోవడంతో కార్లను బయటకు తీయలేని పరిస్థితి ఉందని కర్నూలుకు చెందిన సామాజిక కార్యకర్త షేక్ అబ్దుల్లా అన్నారు.

ఎడారిలో వసంతం

» సౌదీలో పచ్చగా చిగురిస్తున్న నేలలు



ఎర్రటి ఎండలతో చిరచిరలాడే ఎడారి నేల.. భారీ వానలకు తడిసి పచ్చగా చిగురించింది! ముళ్లతో నిండి ఉండే రక్షిన మొక్కల్ని తిని బతికే ఒంటెలు.. పచ్చటి ఆకుల మృష్టాన్నభోజనం చేస్తున్నాయి! కొత్తగా పుట్టుకొచ్చిన మొక్కలతో.. అక్కడి జీవ వైవిధ్యం కూడా పెరుగుతోంది. ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే మక్కా, మదీనా నగరాల నడుమ చిగురిస్తున్న ఈ పచ్చదనం ఆ దేశానికి వెళ్లే పర్యాటకులకు విస్మయం కలిగిస్తోంది. నాసా ఉపగ్రహాల్లోని కెమెరాలు సైతం ఈ అద్భుతాన్ని గుర్తించి, చిత్రీకరిస్తున్నాయి. అయితే.. ఎడారిలో ఇంత పచ్చదనం ఎలా వస్తోందన్నది అందరి సందేహం. సౌదీ అరేబియాలో ఇటీవల కురిసిన ఇబ్బడి ముబ్బడి వర్షాల ఫలితమే అనుకోని వసంతం అని కొందరు అంటున్నారు. కానీ.. దీనికి ప్రధాన కారణం ఆ దేశం చేపట్టిన 'గ్రీన్ ఇనిషియేటివ్' కార్యక్రమం. దేశవ్యాప్తంగా 1000 కోట్ల మొక్కలు నాటడం.. నాలుగు కోట్ల హెక్టార్ల భూభాగాన్ని పచ్చగా మార్చడమే లక్ష్యంగా చేపట్టిన కార్యక్రమమిది. ఇందులో భాగంగా ఆ ప్రోగ్రామ్ కారణంగా ఒక్క మక్కా ప్రాంతంలోనే 2023 ఆగస్టు నుంచి డిసెంబరు నడుమ పచ్చదనం 3,529.4 చదరపు కిలోమీటర్ల నుంచి 26,256 చదరపు కిలోమీటర్లకు (600%) పెరిగింది. ఈ కార్యక్రమంతో పచ్చదనంతో వర్షపాతం కూడా పెరుగుతూ వస్తోంది. -సెంట్రల్ డెస్క్



సీతారాములకు హారతి ఇస్తున్న దృశ్యం

కల్యాణం.. కమనీయం

రామతీర్థంలో వైభవంగా సీతారాముల కల్యాణం

నెల్లిమర్ల, ఏప్రిల్ 17: విజయనగరం జిల్లా నెల్లిమర్లలో రామతీర్థం రామస్వామి వారి దేవస్థానంలో శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని సీతారాముల కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా ఉత్సవ ప్రత్యేక అధికారి, సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి పట్టువస్త్రాలు, ముత్యాలను సమర్పించారు. వీరితో పాటు మంత్రి బొత్స సత్యనారాయణ, ఝాన్సీలక్ష్మి దంపతులు, ఎమ్మెల్యే అప్పలనాయుడు, రాష్ట్ర సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామికి పట్టువస్త్రాలు అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజు సీతారాములను దర్శించుకుని, అర్చకుల ఆశీర్వాదం అందుకున్నారు.



హనుమంత వాహనంపై శ్రీరామచంద్రమూర్తి

శ్రీవారి ఆలయంలో ఘనంగా శ్రీరామనవమి ఆస్థానం

తిరుమల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం రాత్రి శ్రీరామనవమి ఆస్థానం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయంలోని బంగారువాకిలి వద్ద ఆస్థానాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి తోమాలసేవ, అర్చన సేవలను నిర్వహించారు. తర్వాత ఆలయంలోని రంగనాయక మండపంలో సీతారామలక్ష్మణ సమేత హనుమంత స్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజన సేవను కన్నులపండువగా నిర్వహించారు. శ్రీరాముడు తన భక్తుడైన హనుమంతుడిపై కొలువుదీరి మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

ఒంటిమిట్టలో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం



ఒంటిమిట్ట కోదండరాముడు (ఇన్‌సెట్)ధ్వజారోహణ దృశ్యం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 17: ఆంధ్ర అయోధ్యగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం మిథున లగ్నంలో పాంచరాత్ర ఆగమ శాస్త్రబద్ధంగా గరుడ పటాన్ని ప్రతిష్ఠించి ధ్వజారోహణం నిర్వహించారు. సకల దేవతలను, నవగ్రహాలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు.

పుంగనూరులో టీడీపీ కార్యకర్త కిడ్నాప్

- చితకబాది.. చేతుల్లో డ్రగ్స్ ప్యాకెట్లు పెట్టి వీడియో చిత్రీకరణ
- మహిళా సంఘాలతో వైసీపీ సమావేశాన్ని ఫొటోలు తీశాడని ఆగ్రహం



వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం

పుంగనూరు, ఏప్రిల్ 17: టీడీపీ కార్యకర్తను మంత్రి పెద్దిరెడ్డి ప్రధాన అనుచరులు కిడ్నాప్ చేసి, చితకబాదిన ఘటన చిత్తూరు జిల్లా పుంగనూరులో బుధవారం ఉద్రిక్తతకు దారితీసింది. బాధితుడి కథనం మేరకు.. మెప్మా మహిళా మార్ట్ వద్ద మహిళా సంఘాలతో వైసీపీ నాయకులు సమావేశమవుతున్నట్లు తెలిసి.. మరో కార్యకర్త నాగరాజుతో కలిసి పుంగనూరు కొత్తఇండ్లుకు చెందిన టీడీపీ కార్యకర్త వై.హేమాద్రి అక్కడికి వెళ్లాడు. మహిళా సంఘాలతో వైసీపీ నేతలు మాట్లాడుతుండగా వీరు ఫొటోలు తీశారు. దీనిని గమనించిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర జానపద కళల అకాడమీ చైర్మన్ కొండవీటి నాగభూషణం, ఆయన అనుచరులు హేమాద్రిని పట్టుకోగా, నాగరాజు పారిపోయాడు. హేమాద్రి చేతిలో డ్రగ్స్ ప్యాకెట్లు పెట్టి, టీడీపీ నేతల ఆదేశాల మేరకే విక్రయిస్తున్నట్లు చెప్పమని వీడియో తీశారు. ఈక్రమంలో నాగరాజు ఇచ్చిన సమాచారంతో టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నాయి. తమ ఇంటి వద్దకు ఎందుకు వచ్చారంటూ నాగభూషణం, అతడి అనుచరులు టీడీపీ శ్రేణులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు పార్టీల వారి మధ్య తోపులాట జరగడంతో పోలీసులు ఇరువర్గాల వారిని పంపేశారు. ఈ క్రమంలోనే టీడీపీ నేత సుహేల్ వాహనంపై వైసీపీ శ్రేణులు దాడికి దిగగా, పోలీసులు అడ్డుకున్నారు. ఈ తోపులాటలో వైసీపీ కార్యకర్త అమ్ముకుట్టి తనను బ్లేడ్‌తో గాయపరిచినట్లు టీడీపీ నాయకుడు నౌషాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైసీపీ నేతల ఇళ్లలో సర్కారు మద్యం

- దాడులు చేసి భారీగా పట్టుకున్న సెబ్.. ప్రకాశంలో వెలుగులోకి బాగోతం



వైసీపీ నేతల ఇళ్లలో అక్రమంగా దాచిన మద్యం కేసులను లారీలకు ఎక్కిస్తున్న ఎస్‌ఈబీ పోలీసులు

ముండ్లమూరు, ఏప్రిల్ 17: ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలంలో బుధవారం భారీ ఎత్తున మద్యం నిల్వలను ఒంగోలు ఎస్‌ఈబీ అధికారులు పట్టుకొన్నారు. ముందస్తు సమాచారం మేరకు.. పెదఉల్లగల్లు పంచాయతీ పరిధిలోని లక్ష్మీనగర్, ముండ్లమూరు, నాయుడుపాలెం గ్రామాల్లో ముమ్మరంగా సోదాలు నిర్వహించారు. లక్ష్మీనగర్‌కు చెందిన వైసీపీ నాయకుడు బీరంరెడ్డి మాలకొండారెడ్డి ఇంట్లో 39 కేసులు, అతని తండ్రి లక్ష్మీరెడ్డి ఇంట్లో 189 మద్యం కేసులను స్వాధీనం చేసుకున్నారు. మొదట ముండ్లమూరులోని ప్రభుత్వ దుకాణం వద్ద 20 కేసులు కారులో వేసుకొని తరలించేందుకు సిద్ధంగా ఉండగా ఎస్‌ఈబీ అధికారులు దాడిచేశారు. డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో లక్ష్మీనగర్‌లో తనిఖీలు చేయగా భారీఎత్తున మద్యం పట్టుబడింది. పట్టుకున్న మద్యం కేసులు ఉల్లగల్లు, ముండ్లమూరు ప్రభుత్వ దుకాణాల నుంచి తరలించినట్టు సమాచారం. వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి నామినేషన్ కార్యక్రమం గురువారం ఉండగా, బుధవారం రాత్రి నుంచే ఆయా గ్రామాలకు తరలించేందుకు మద్యం నిల్వ ఉంచినట్టు సమాచారం.

'అనంత'లో బంగారం, నగదు స్వాధీనం

విడపనకల్లు/నార్పల, ఏప్రిల్ 17: అనంతపురం జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు.. పలు ప్రాంతాలలో బంగారు, వెండి ఆభరణాలను, నగదును స్వాధీనం చేసుకున్నారు. విడపనకల్లు మండలంలోని కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టు వద్ద మంగళవారం రాత్రి ఒంటి గంట సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, విడపనకల్లు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఓ వాహనంలో 11 కిలోల వెండి, 20 తులాల బంగారం, రూ.4.5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే, బుధవారం కర్ణాటకలోని సిరుగుప్ప నుంచి శ్రీకాళహస్తికి చెందిన ఇద్దరు వ్యక్తులు తీసుకువెళుతున్న రూ.2.67 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఉరవకొండ మండలం నింబగల్లుకు చెందిన మరోవ్యక్తి నుంచి రూ.2 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నార్పల క్రాస్ వద్ద ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.2,84,800 స్వాధీనం చేసుకున్నారు.

ట్రాక్టర్లు లీజుకు తీసుకుని.. అమ్మేశారు!

- 57 ట్రాక్టర్ల స్వాధీనం.. ముగ్గురు నిందితుల అరెస్టు

తాడిమర్రి, ఏప్రిల్ 17: రైతుల నుంచి ట్రాక్టర్లను లీజుకు తీసుకుని, అమ్మేసిన ఘరానా ముఠాను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. రూ.4.50కోట్ల విలువైన 57 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను తాడిమర్రి పోలీసు స్టేషన్‌లో ఎస్పీ మాధవరెడ్డి బుధవారం వెల్లడించారు. జిల్లాలోని నల్లచెరువు మండలం బొమ్మిరెడ్డిపల్లికి చెందిన రవికుమార్, కడప జిల్లా పులివెందుల పట్టణవాసి బయారెడ్డి, అదే జిల్లా సింహాద్రిపురం మండలం లోమడ గ్రామానికి చెందిన కాకర్ల హాజీపీరాను అరెస్టు చేశారు. మరో ఎనిమిది మంది పరారీలో ఉన్నారు. వీరంతా ముఠాగా ఏర్పడి కడప జిల్లా ప్రొద్దుటూరులోని ఇటుకల ఫ్యాక్టరీలో పని నిమిత్తం ట్రాక్టర్లు కావాలంటూ శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో రైతులను సంప్రదించారు. ప్రతినెలా రూ.25 వేల లీజు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. మూడు నెలలపాటు లీజు సక్రమంగా చెల్లించారు. తీసుకున్న ట్రాక్టర్లను ఉమ్మడి కడప, కర్నూలు జిల్లాల్లో గుట్టుచప్పుడు కాకుండా అమ్మేశారు. కొనుగోలుదారులకు అగ్రిమెంట్ రాసిచ్చి, తరువాత రిజిస్ట్రేషన్ చేసిస్తామని నమ్మబలికారు. ఫిబ్రవరి నుంచి వారు కనబడకుండా పోయారు. ఫోన్లు స్విచ్ఛాఫ్ రావడంతో ట్రాక్టర్లను లీజుకిచ్చిన రైతుల్లో కొందరు తాడిమర్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరికొన్నిచోట్ల ఇలాంటి ఫిర్యాదులే రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు బృందంగా ఏర్పడి.. రవికుమార్, బయారెడ్డి, కాకర్ల హాజీపీరాను అరెస్టు చేశారు. వారు తెలిపిన సమాచారం మేరకు కడప, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో విక్రయించిన 57 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు.

నేడు సుప్రీంలో ఓటుకు నోటు కేసు విచారణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసుపై సుప్రీంకోర్టులో గురువారం విచారణ జరుగనుంది. ఈ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు పాత్రపై దర్యాప్తు జరిపించాలని కోరుతూ వైసీపీ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఈ ఏడాది జనవరి 10న జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపి.. విచారణను ఏప్రిల్‌కు వాయిదా వేసింది.

రాజధాని నమూనా గ్యాలరీ ధ్వంసం



ధ్వంసం చేసిన అమరావతి నమూనా గ్యాలరీ



అమరావతి నమూనా గ్యాలరీలో ఉన్న బోర్డును పగులగొట్టిన దుండగులు

- పవిత్రమైన 'నీరు, మట్టి' వద్ద అసాంఘిక కార్యకలాపాలు
- ఆ ప్రాంతానికి వెళ్లే రోడ్లు ఇసుక మాఫియాతో ఛిద్రం
- గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని పర్యటనతో వెలుగులోకి..

తుళ్లూరు, ఏప్రిల్ 17: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే ఇప్పటికే రాజధాని అమరావతి ఒక వెలుగు వెలిగేది!. కానీ, వైసీపీ ప్రభుత్వం వచ్చాక మూడు రాజధానుల పేరిట అమరావతిని సర్వనాశనం చేసిన సంగతి తెలిసిందే! ఇప్పుడక్కడ కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టిన భారీ నిర్మాణాలన్నీ నిరుపయోగంగా మారగా.. ఎటు చూసినా తుప్పలు డొంకలే దర్శనమిస్తున్నాయి.. దీంతో ఆ ప్రాంతంలో ఎవరూ వెళ్లలేని పరిస్థితి ఏర్పడంది. ఈ క్రమంలో ఉద్దండ్రాయునిపాలెంలో రాజధాని శంకుస్థాపన ప్రదేశంలోని అమరావతి నగర నమూనా గ్యాలరీని సైతం ఆనవాళ్లు లేకుండా దుండగులు ధ్వంసం చేశారు. ఆ ప్రాంగణంలోనే మద్యం తాగి సీసాలు పడేశారు. అమరావతి అని పేరు ఉన్న బోర్డును కూడా పగలగొట్టారు. ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన ప్రదేశంలో ఈ దృశ్యాలు చోటు చోటుచేసుకోవటం గమనార్హం. రాజధాని గ్రామాల్లో గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం రైతులతో కలిసి పర్యటించగా ఈ వ్యవహారం వెలుగుచూసింది. మోదీ చేసిన శంకుస్థాపన ప్రదేశాన్ని టీడీపీ ప్రభుత్వంలో ఆహ్లాదకరంగా రూపొందించారు. అమరావతి నిర్మాణంలో రాష్ట్రంలోని అన్ని గ్రామాల భాగస్వామ్యం ఉండాలని 16 వేల గ్రామాల్లోని మసీదులు, చర్చిలు, ఆలయాల ప్రదేశాల నుంచి నీరు, మట్టి స్వీకరించి రాజధాని శంకుస్థాపన ప్రదేశంలో నిక్షిప్తం చేశారు. అంతేకాక ప్రధాని మోదీ వస్తూ పార్లమెంట్‌లో మట్టి, నీరు తెచ్చి శంకుస్థాపన ప్రదేశంలో ఉంచారు. పలు జిల్లాలు, రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో సందర్శకులు ఈ ప్రదేశాన్ని చూసేందుకు తరలివచ్చేవారు. బృహత్తరమైన ప్రణాళికతో రైతులు ఇచ్చిన భూములలో 217 చదరపు కిలోమీటర్ల మేర అమరావతి మహా నగరం, హెల్త్, ఎడ్యుకేషన్, ఐటీ సిటీ అంటూ నవ నగరాలు, అందులో ఏర్పడబోయే 32 పెద్ద పెద్ద రోడ్లు అమరావతి మాస్టర్ ప్లాన్ ప్రకారం రూపుదిద్దుకునే దృశ్యమాలికను(నమూనా) అక్కడ ఉంచారు. అక్కడ 24 గంటలూ ఉండే సెక్యూరిటీని వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎత్తేశారు. ఆ ప్రదేశానికి వచ్చే రోడ్లను ధ్వంసం చేశారు. ఆ ప్రదేశం మొత్తం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. రాజధాని శంకుస్థాపన సమయంలో ప్రధానమంత్రి మోదీ రాక సందర్భంగా నిర్మించిన హెలిప్యాడ్లు ప్రస్తుతం వైసీపీ అక్రమార్కులకు ఇసుక డంపింగ్ యార్డులుగా మారాయి. ఉద్దండ్రాయునిపాలెం ఇసుక రీచ్‌కు అనుమతులు లేకపోయినా యథేచ్ఛగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు ఆ చుట్టుపక్కలకు వెళ్లే సాహసం కూడా చేయటం లేదంటే మాఫియా ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని స్థానికులు చెబుతున్నారు. కాగా, ఈ దఫా టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని, తద్వారా రాజధాని అమరావతి మళ్లీ పునరుజ్జీవం పొందుతుందని రైతులు వ్యాఖ్యానించారు.



గ్యాలరీలో మద్యం సీసాను టీడీపీ ఎంపీ అభ్యర్థి చంద్రశేఖర్‌కు చూపుతున్న రాజధాని రైతులు



రాజధాని శంకుస్థాపన ప్రాంతంలో నిల్వ చేసిన అక్రమ ఇసుక

నిప్పుల కొలిమిలా రాష్ట్రం

- నంద్యాల జిల్లా పెద్దదేవళాపురంలో 44.9 డిగ్రీల ఉష్ణోగ్రత
- దేశంలో అత్యధికం.. పలు ప్రాంతాల్లో 44 దాటేసింది
- వడగాడ్పులతో జనం ఇబ్బందులు

అమరావతి, విశాఖపట్నం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారింది. బుధవారం పలుచోట్ల వడగాడ్పులు వీచాయి. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. దేశంలోనే అత్యధికంగా నంద్యాల జిల్లా పెద్దదేవళాపురంలో 44.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యింది. మన్యం జిల్లా మక్కువ, కడప జిల్లా సింహాద్రిపురం, అనకాపల్లి జిల్లా రావికమతం, విజయనగరం జిల్లా రామభద్రాపురం, తుమ్మికపల్లి, ప్రకాశం జిల్లా దొనకొండ, తిరుపతి జిల్లా మంగనెల్లూరుల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలు దాటిపోయింది. 125 మండలాల్లో ఓ మోస్తరుగా, 67 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచాయి. గురువారం 76 మండలాల్లో తీవ్ర వడగాడ్పులకు అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ హెచ్చరించారు. కాగా, తెలంగాణ నుంచి రాయలసీమ, తమిళనాడు మీదుగా గల్ఫ్ ఆఫ్ మనార్ వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. దీని ప్రభావంతో అక్కడక్కడా వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా జల్లులు కురుస్తాయని, పలుచోట్ల వడగాడ్పులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

గంజాయితో పట్టుబడిన మహిళా వలంటీర్

పార్వతీపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయాల్లో పార్వతీపురానికి చెందిన ఓ మహిళా వలంటీర్ కీలక పాత్ర పోషించడం కలకలం రేపింది. ప్రస్తుతం ఆమెను పోలీసులు పట్టుకున్నారు. పార్వతీపురం పోలీసులు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ వీధిలోని మహిళ ఇంట్లో 8కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీనిపై విచారణ చేపట్టగా.. సదరు మహిళ వలంటీర్‌గా పని చేస్తున్నట్లు నిర్ధారించారు. ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి చిన్నచిన్న పొట్లాల రూపంలో ఆమె విక్రయిస్తున్నట్లు గుర్తించి, కేసు నమోదు చేశారు. దీనిపై సచివాలయ అధికారి అనంత్‌ను వివరణ కోరగా.. గంజాయి నిల్వలతో పోలీసులకు పట్టుబడిన మహిళ వార్డు వలంటీరుగా పనిచేస్తున్నారని బుధవారం ఆయన విలేకరులకు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమెపై తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

గంగవరం... గరంగరం!

వారం రోజులుగా నిర్వాసిత కార్మికుల ఆందోళన.. పోర్టు వద్ద కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు



గంగవరం పోర్టు గేటు ఎదుట నిర్వాసిత కార్మికులతో కలసి బైఠాయించిన స్టీల్‌ప్లాంటు కార్మిక సంఘాల నేతలు

విశాఖపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అదానీ గంగవరం పోర్టులో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. నిర్వాసిత కార్మికులు రెండు గేట్లకు తాళాలు వేసి, వారం రోజులుగా ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్, జిల్లా కలెక్టర్ మల్లికార్జున సమక్షంలో 8నెలల క్రితం చర్చలు జరిగాయని, తమ డిమాండ్లను యాజమాన్యం అంగీకరించిందని, కానీ ఇంతవరకూ వాటిని నెరవేర్చకపోవడం వల్లే ఆందోళన చేస్తున్నామని కార్మికులు చెబుతున్నారు. నాడు మధ్యవర్తులుగా ఉన్న మంత్రి, కలెక్టర్.. ఇప్పుడు స్పందించడం లేదని, యాజమాన్యం మొండివైఖరి ప్రదర్శిస్తోందని ఆరోపిస్తున్నారు. పదిహేనేళ్ల నుంచి పనిచేస్తున్నా రూ.30వేల జీతం రావడం లేదని, బేసిక్ పే రూ.4 వేలు కూడా లేదని వాపోతున్నారు. విశాఖపట్నం పోర్టులో అదే పనిచేస్తున్న వారికి రూ.17వేల బేసిక్ పే ఇస్తున్నారని, తమకు ఎందుకివ్వరని వారు ప్రశ్నిస్తున్నారు. తమ జీవనోపాధిని పోగొట్టుకొని పోర్టు కోసం భూములు ఇచ్చామని, యాజమాన్యానికి భారీ లాభాలు వస్తున్నా వేతనాలు ఎందుకు పెంచరని ప్రశ్నిస్తున్నారు.

లోపల వంద మందికి పైగా కార్మికులు

వారం రోజుల క్రితం యాజమాన్య వైఖరిని నిరసిస్తూ నిర్వాసిత కార్మికులు ఆకస్మికంగా పోర్టు గేట్లకు తాళాలు వేశారు. ఆ సమయంలో పోర్టు లోపల 100 మందికి పైగా కార్మికులు, 20మంది పోర్టు అధికారులు ఉన్నారు. గేట్ల ముందే బైఠాయించి ఆందోళన చేస్తుండటంతో పోర్టులో కార్యకలాపాలు స్తంభించిపోయాయి. ఇలా ఆందోళన పెరుగుతుండటంతో విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ బుధవారం రాత్రి అక్కడి పరిస్థితిని సమీక్షించారు. మరిన్ని బలగాను మోహరించారు.

80% మూత!

- స్టీల్‌ప్లాంటులో ఒక్కో విభాగం షట్‌డౌన్
- పోర్టు కార్మికుల సమ్మెతో.. 'ఉక్కు'కు ఆగిన బొగ్గు
- చోద్యం చూస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు బొగ్గు సరఫరా నిలిచిపోవడంతో.. ప్లాంటులోని ఒక్కో విభాగాన్ని షట్‌డౌన్ చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్లాంటు మూసివేత తప్ప మరో మార్గం లేదని కార్మిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పక్కనే ఉన్న అదానీ గంగవరం పోర్టులో కార్మికుల ఆందోళన వల్ల ప్లాంటుకు ముడి పదార్థాల సరఫరా ఆగిపోయిన సంగతి తెలిసిందే. బొగ్గు లేకపోవడం వల్ల స్టీల్‌ప్లాంటులో అత్యంత కీలకమైన కోక్ ఓవెన్ బ్యాటరీలు మూడింటిని ఆపేశారు. ఇంకో రెండింటిని నామమాత్రంగా నడుపుతున్నారు. అవి కూడా కొన్ని గంటలే నడుస్తాయని అంటున్నారు. సింటర్ ప్లాంటు, స్టీల్ మెల్టింగ్ షాపు, బ్లాస్ట్ ఫర్నేసులు, వైర్ రాడ్ మిల్స్..ఇలా అన్నింటినీ 80 శాతం షట్‌డౌన్ చేశారు. తక్షణమే బొగ్గు సరఫరాను పునరుద్ధరించకపోతే భారీనష్టం వాటిల్లుతుందని యాజమాన్యం ఆందోళన చెందుతోంది. కాగా.. గంగవరం పోర్టులోని నౌకల్లో ఉన్న బొగ్గు తెచ్చుకునేందుకు స్టీల్ ప్లాంటు యాజమాన్యం ఒక ప్రణాళిక రూపొందించింది. ఇందుకు మూడు షిఫ్టుల్లో పనిచేసేలా 15 మంది కార్మికులను సిద్ధం చేసింది. మంగళవారం సాయంత్రం ఓ ఐదుగురిని పోర్టు వెనుక గేటు నుంచి లోపలకు పంపించింది. వారు నౌకల దగ్గరకు వెళ్లే ప్రయత్నం చేయగా, పోర్టు కార్మికులు అడ్డుకుని, వెనక్కి పంపేశారు. మంగళవారం రాత్రి మరో బృందాన్ని పంపగా.. వారిని కూడా వెనక్కి పంపేశారు. మంగళవారం అర్ధరాత్రి దాటాక పోర్టు యాజమాన్యం ప్రతినిధులే ఫోన్ చేసి, బొగ్గు తీసుకువెళ్లడానికి రావాలని కోరారు. దాంతో మరో బృందం పోర్టులోకి వెళ్లగా.. పోర్టు ఉన్నతాధికారి ఒకరు వారికి అడ్డం పడ్డారు. దీంతో ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. విశాఖ స్టీల్‌ప్లాంటులో ఇంత సంక్షోభం నెలకొన్నా.. అటు కేంద్రం గానీ, ఇటు రాష్ట్రం గానీ స్పందించడం లేదు. సమస్య పరిష్కరించే దిశగా ఎటువంటి చర్యలు, చర్చలు చేపట్టలేదు. వారు, వారు గొడవలు పడితే.. స్టీల్‌ప్లాంటు మూత పడుతుందని, తమకూ అదే కావాలన్నట్టుగా రెండు ప్రభుత్వాలూ చోద్యం చూస్తున్నాయి.

వీశాట్ ఫలితాలు విడుదల

- ఏప్రిల్ 24 నుంచి 30 వరకు కౌన్సిలింగ్
- విజ్ఞాన్స్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్



విశాట్ ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ నాగభూషణ్ తదితరులు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 17: విజ్ఞాన్స్ యూనివర్సిటీలో బీటెక్, బీఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చర్ ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన వీశాట్ 2024 ఫేజ్-1 (విజ్ఞాన్ స్కొలాస్టిక్ యాప్టిట్యూడ్ టెస్ట్) ఫలితాలను వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ బుధవారం విడుదల చేశారు. గుంటూరు సమీపంలోని వడ్లమూడి విజ్ఞాన్ వర్సిటీలో ఆయన వివరాలు వెల్లడించారు. వీశాట్ 2024 ర్యాంకులతో పాటు జేఈఈ మెయిన్స్ ఫలితాలు, ఎంసెట్ ర్యాంకులు, ఇంటర్మీడియట్ మార్కులను కూడా పరిగణనలోనికి తీసుకుంటామన్నారు. వీశాట్‌లో 1 నుంచి 50 లోపు ర్యాంకులు సాధించిన వారికి 50 శాతం స్కాలర్‌షిప్, 51 నుంచి 200 లోపు ర్యాంకులు సాధించిన వారికి 25 శాతం, 201 నుంచి 2000లోపు ర్యాంకులు సాధించిన వారికి 10శాతం స్కాలర్‌షిప్‌ను నాలుగు సంవత్సరాలు అందజేస్తామన్నారు. ఇంటర్‌లో 970కి పైగా మార్కు లు సాధించిన విద్యార్థులకు 50 శాతం స్కాలర్‌షిప్, 950 నుంచి 969 మార్కులు సాధించిన విద్యార్థులకు 25 శాతం, 920 నుంచి 949 మార్కులు సాధించిన విద్యార్థులకు 10 శాతం స్కాలర్‌షిప్ అందజేస్తామన్నారు. జేఈఈ మెయిన్స్‌లో 95కి పైగా పర్సంటైల్ సాధించిన విద్యార్థులకు 75 శాతం స్కాలర్‌షిప్, 89 నుంచి 94.9 పర్సంటైల్ సాధించిన విద్యార్థులకు 50 శాతం, 80 నుంచి 88.9 పర్సంటైల్ సాధించిన విద్యార్థులకు 25 శాతం, 70 నుంచి 79.9 పర్సంటైల్ సాధించిన విద్యార్థులకు 10 శాతం స్కాలర్‌షిప్ అందజేస్తామన్నారు. ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలో బీటెక్, బీఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చర్ సైన్స్ ప్రవేశాల కౌన్సిలింగ్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. వీశాట్ ఫేజ్-2ను మే 1 నుంచి 15 వరకు నిర్వహిస్తామని వెల్లడించారు.

తొలి పది ర్యాంకులు వీరికే:

వీశాట్‌లో 1వ ర్యాంకు మద్దినేని బాలమూర్తి (అన్నమయ్య జిల్లా), 2 దవ్వలూరి లోకేష్ రాజ్ (ప్రకాశం), 3. ఒ.శివ మణికంఠ (తూర్పు గోదావరి), 4.పర్వతనేని కార్తికేయ చౌదరి (తూర్పు గోదావరి), 5.పి.బాల శివ సత్యనారాయణ (కాకినాడ), 6. గోరంట్ల అచ్యుత కుమార్ (పల్నాడు), 7.వై.మణి ధీరజ్ (ఎన్టీఆర్), 8. జి.హిమనీష్ నందన్ రెడ్డి (నంద్యాల), 9. కె.సత్యసాయి దుర్గ సాత్విక్ (పశ్చిమ గోదావరి), 10వ ర్యాంకు ఐ.వినయ్ కుమార్ రెడ్డి (అనంతపురం జిల్లా) సాధించినట్లు విజ్ఞాన్స్ యూనివర్సిటీ డీన్ అడ్మిషన్స్ డాక్టర్ కేవీ క్రిష్ణకిశోర్ తెలిపారు.

దుష్ట పాలన అంతమై.. ధర్మ పాలన రావాలి

- జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆకాంక్ష
- పార్టీ అభ్యర్థులకు బీ-ఫాంలు అందజేత



అభ్యర్థులకు బీ-ఫాంలు అందజేస్తున్న పవన్

అమరావతి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దుష్ట పాలన అంతమై.. ధర్మ పాలన రావాలన్నదే తన ఆకాంక్ష అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఎంతో పవిత్రమైన శ్రీరామనవమి రోజున వచ్చే ఎన్నికల్లో కూటమి తరఫున పోటీ చేయనున్న జనసేన పార్టీ అభ్యర్థులకు బీ-ఫాంలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. మంళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో 20 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు, ఇద్దరు ఎంపీ అభ్యర్థులకు బుధవారం మధ్యాహ్నం ఆయన చేతుల మీద బీ-ఫాంలు అందజేశారు. పాలకొండ అభ్యర్థికి మాత్రం పెండింగ్‌లో పెట్టారు. ఈ సందర్భంగా తమ అభ్యర్థులతో "ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడతాం" అని పవన్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్రానికి మళ్లీ రామరాజ్యం తీసుకొచ్చేలా పాలన అందిస్తామన్నారు. "2024 సార్వత్రిక ఎన్నికలు చాలా కీలకమైనవి. ఎన్నో ఒత్తిళ్లు ఎదురైనా ఎదుర్కొని కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం. రాష్ట్రంలో దుష్ట పాలన అంతమై ధర్మ పాలన రావాలన్నదే నా ఆకాంక్ష. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదనే దృఢ సంకల్పంతో ఏర్పడిన కూటమికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు పట్టం కడతారని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం" అన్నారు. కాగా, పాలకొండ అభ్యర్థిగా జయకృష్ణను ప్రకటించగా..బుధవారం బీ-ఫాంలు అందించే సమయంలో ఆయన కనిపించలేదు. ఆయన ఇంకా విజయవాడ చేరుకోలేదు కాబట్టి మిగిలిన అభ్యర్థులందరికీ బీ-ఫాం అందిస్తున్నామని పవన్ చెప్పారు. అయితే ఈ అభ్యర్థి మార్పు కోసం పార్టీలో చర్చ జరుగుతోందని తెలుస్తోంది. మరోవైపు పాలకొండ నాయకులు మాత్రం గురువారం ఉదయం జయకృష్ణకు బీ-ఫాం ఇస్తారని చెబుతున్నారు.

మాడుగుల టీడీపీ సీటు బండారుకే

- తక్షణం ప్రచారం మొదలుపెట్టాలని చంద్రబాబు ఆదేశం

విశాఖపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా మాడుగుల అసెంబ్లీ సీటును పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి కేటాయించాలని తెలుగుదేశం నాయకత్వం నిర్ణయించింది. పార్టీ అధినేత చంద్రబాబు బుధవారం ఆయనకు ఫోన్ చేశారు. సత్వరమే ఎన్నికల ప్రచారం ప్రారంభించాలని ఆదేశించారు. వాస్తవానికి ఆయన నియోజకవర్గం పెందుర్తి. పొత్తులో భాగంగా అది జనసేనకు వెళ్లింది. ఆ పార్టీ తరఫున పంచకర్ల రమేశ్‌బాబు పోటీచేస్తున్నారు. దీనిపై బండారు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వార్తలు వచ్చాయి. అనకాపల్లి లోక్‌సభ పరిధిలోని మాడుగుల స్థానానికి తొలుత పైలా ప్రసాదరావును టీడీపీ అభ్యర్థిగా ప్రకటించారు. అయితే బండారుకు ఇవ్వాలని కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ టీడీపీ అధిష్ఠానాన్ని కోరడంతో ఆయనకే ఖరారు చేశారు. ప్రసాదరావుతో కూడా చంద్రబాబు మాట్లాడారు. కాగా, బండారుకు మాడుగుల కేటాయించిన నేపథ్యంలో పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా పార్టీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీని నియమించాలని అధిష్ఠానం నిర్ణయించింది. ఈ మేరకు బాబ్జీకి ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి దామచర్ల సత్య ఫోన్ చేశారు. అయితే తన కుమారుడు గండి వంశీకి పెందుర్తి బాధ్యతలు అప్పగించాలని ఆయన కోరారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చల్లని కబురు!

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ఎక్కువ వర్షాన్ని తెస్తాయని భారత వాతావరణశాఖ చల్లనిమాట చెప్పింది. ప్రకటన వెలువడిననాటికీ, వాటి ఆగమనానికి మధ్య దాదాపు రెండునెలల ఎడం ఉన్నప్పటికీ, మండుటెండల్లో మలమలామాడిపోతున్న జనానికి ఈ వార్త వినగానే వానజల్లుల్లో తడిసినంత ఆనందం కలిగింది. రుతుపవనాల ఆగమనానికి సంబంధించిన తొలి అంచనాల్లోనే అధికవర్షపాతం గురించి ఐఎండీ మాట్లాడటం దశాబ్దకాలంలో ఇదే మొదటిసారి. ఎల్‌నినో పరిస్థితులు బలహీనపడుతున్నాయని, నైరుతి ప్రారంభం నాటికి దాని ప్రభావం మరింత క్షీణిస్తుందని ఐఎండీ అంచనా. ఆగస్టు సెప్టెంబర్ మధ్యలో లానినా ప్రభావంతో ఎక్కువ మోతాదులో వర్షాలు కురుస్తాయని అంటూ, మొత్తంగా ఈ రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే, అధికవర్షపాతానికే అత్యధిక అవకాశం ఉన్నట్టు వాతావరణశాఖ చెబుతోంది.

ఎల్‌నినో కొనసాగుతుందనీ, వర్షాభావం తప్పదని అనుమానపడుతున్న దశలో ఐఎండీ ఈ శుభవార్త వినిపించింది. ఇది తొలి అంచనా కనుక కచ్చితంగా కొన్ని మినహాయింపులు ఇవ్వకతప్పదు. అయినప్పటికీ సాధారణ వర్షపాతం ఉండవచ్చు తప్ప, వర్షాభావం భయాలైతే అక్కరలేదు. వాతావరణ పరిస్థితులను అంచనాకట్టే విషయంలో మనం గతంలో కంటే ఎంతో మెరుగుదలసాధించినప్పటికీ, కచ్చితత్వానికి ఇంకా కాస్తంతదూరంగానే మిగిలిపోయాం. ఇక, ఇప్పుడు ఐఎండీ తన అంచనాలో మొత్తం సీజన్‌లో వర్షపాతం సాధారణం కంటే అధికంగా ఉంటుందని అంటూనే, ఆరంభం మాత్రం కాస్తంత బలహీనంగా ఉంటుందని హెచ్చరిస్తోంది. గత ఏడాదిలాగా ఎల్‌నినో ఈ మారు కూడా నైరుతి పవనాలను బలహీనం చేయవచ్చునన్న అనుమానాలు ఉన్నప్పటికీ, లానినో విషయంలో మాత్రం ఐఎండీ నమ్మకంగా ఉంది. పసిఫిక్ మహాసముద్రం ఉపరితలం వేడి చల్లారి ఆగస్టులో రుతుపవనాలు బలం పుంజుకొని ఎక్కువమోతాదులో వర్షాలు తెచ్చిపెడతాయని అది అంచనాకడుతోంది. మొత్తం వ్యవసాయంలో అరవైశాతం బోరుబావుల ఆధారంగానే సాగుతున్నందున, ఏయేటికాయేడు నేరుగా వర్షాలమీద ఆధారపడే అవసరం ప్రస్తుతం వ్యవసాయరంగానికి లేకపోవచ్చు. వర్షాలు కాస్తంత అటూఇటూ అయితే వ్యవసాయ ఉత్పత్తి దారుణంగా పడిపోయి, ఆహారధాన్యాలకు వెతుక్కొనే పరిస్థితి ప్రస్తుతం లేదు. వర్షాభావం తీవ్రంగా ఉన్నప్పుడు మాత్రమే ఉత్పత్తి తగ్గి, సరఫరాలూ ధరలమీద ఆ ప్రభావం ఉంటున్నది. వర్షపాతంలో ఆటుపోట్లనుంచి వ్యవసాయరంగాన్ని బోర్లు రక్షిస్తున్నప్పటికీ, వాటి వినియోగానికి వీలుకల్పిస్తున్న భూగర్భజలాల భర్తీకి అతిముఖ్యమైనవి ఈ రుతుపవనాలే. నైరుతిపవనాలతోనే ఏటా డెబ్బయ్ ఐదుశాతం భూగర్భ జలాలు రీచార్జి అవుతాయని ఓ అంచనా. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం వల్ల కూడా భూగర్భజలాలు అత్యధికంగా అడుగంటిపోయాయని అంటున్న నేపథ్యంలో, ఈ మారు మరిన్ని వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ అంచనాలు ఎంతో ఉపశమనాన్ని ఇస్తున్నాయి.

ఈ దేశంలో ఎక్కువ ఉపాధినిస్తున్నది ఇప్పటికీ వ్యవసాయరంగమే. ఈ వర్షాలతో ఇరిగేషన్ సౌకర్యం లేని మిగతా సగం వ్యవసాయభూమి తడుస్తుంది, మొత్తంగా ఉత్పత్తి పెరుగుతుంది. ఇప్పటికే పెరిగినధరలకు తాళలేకపోతున్న సామాన్యుడికి కాస్తంత ఉపశమనం దక్కడంతో పాటు, ప్రజలకు ఆహారభద్రత కూడా ఏర్పడుతుంది. దేశవ్యవసాయ రంగానికి ముఖ్యమైన ఎనభైకి పైగా ప్రాజెక్టులు నీటితో నిండి కళకళలాడేది ఈ సీజన్‌లోనే. ఒక్క వ్యవసాయరంగమే కాక, దాని అనుబంధరంగాల మనుగడనూ ఈ వర్షాలు ప్రభావితం చేస్తాయి. ఎల్‌నినో ఏర్పడి, అది ముగిసిన అనంతరం లానినా ప్రభావంతో వర్షాలు పడినప్పుడు అవి సాధారణం కంటే హెచ్చుగా ఉండటం ఇప్పటివరకూ పది సందర్భాల్లో జరిగిందట. అందువల్ల, ఈ మారు వాతావరణశాఖ అంచనాలు నిజం కావచ్చును కూడా. వచ్చేనెలలో ఐఎండీ మరింత కచ్చితమైన అంచనాలతో ఎలాగూ ముందుకురాబోతున్నది. రాబోయే వర్షాలు అన్ని ప్రాంతాలకూ విస్తరించి, సుదీర్ఘకాలం పుడమి నిత్యం జల్లులతో తడవాలనీ, నీరంతా నేలలోకి ఇంకి భూగర్భజలమట్టం పెరగాలనీ కోరుకుందాం. ఎంత వర్షం కురిసినా అది కుంభవృష్టిగా నింగినీనేలనూ ఏకం చేసి, ప్రజల జీవితాలను అతలాకుతలం చేసిపోతే ఏ ప్రయోజనమూ ఉండదు. భయంకరమైన ఎండలనూ, నీటికష్టాలను చవిచూస్తున్న ప్రజలకు ఈ నైరుతిపవనాలు ఉపశమనాన్ని చేకూర్చి, ఒడ్డునపడేస్తాయని ఆశిద్దాం.

తక్కువ చోరుడినే ప్రేమించాలి, తప్పేదేముంది?





■ కె. శ్రీనివాస్

సందర్భం

ఆలోచనాపరుడైన ఒక మిత్రుడు ఇట్లా ప్రశ్నించాడు. "ఎంత కాలం ఇట్లా జనాన్ని మభ్యపెడతారు? వాళ్ల కంటె వీళ్లు నయం అని, ఇద్దరిలో ఒకళ్లు ఎక్కువ చెడ్డవాళ్లు అని ఎంత కాలం రాస్తూ ఉంటారు? అందరూ దొంగలే అని చెప్పే సమయం వచ్చిందని అనిపించడం లేదా?" ఇంత నిర్మోహమాటంగా నిలదీస్తే నీళ్లు నమలకుండా ఉండడం కష్టమే. "ఈ నాయకులను చూడండి, ఇంతకాలం అధికారం అనుభవించి, ఇప్పుడు ఓడిపోగానే క్షణం కూడా ఆగకుండా గోడదూకేస్తున్నారు. ఎవళ్లకీ నీతి లేదు, నియమం లేదు. సిద్ధాంతం అసలే లేదు. క్రమశిక్షణ గురించి, సంస్కృతి గురించి గప్పాలు కొట్టే పార్టీలోకైనా, రాజ్యాంగాన్ని రక్షిస్తామని, ప్రజాస్వామ్యాన్ని ఉద్ధరిస్తామని చెప్పే మరో పార్టీలోకైనా నిస్సిగ్గుగా దూకేస్తున్నారు, ఆ పార్టీలు కూడా అంతే బరితెగింపుగా చేర్చుకుంటున్నాయి.. ఏ రాయితో కొట్టుకున్నా పళ్లూడిపోతాయని తెలియడం లేదా? ఒకడిని దించి మరొకడిని ఎక్కిస్తే ఉద్ధరింపు ఏమీ జరగదని తెలిసివచ్చింది కదా?" మిత్రుడి ఆగ్రహావేదన సుదీర్ఘంగా కొనసాగింది.

చాదస్తమేమీ కాదు. ఆలోచించవలసిన విషయమే. దుష్పరిపాలనలో ప్రజలు ఎప్పుడూ తక్షణ ఉపశమనాన్ని కోరుకోవడం, అతి కొద్దికాలంలోనే ఊరట వెనక్కి తగ్గి తిరిగి ఆశాభంగాలూ కొత్త ఆవేదనలూ మొదలు కావడం ఇటీవలి చరిత్రలో చూస్తూనే ఉన్నాం. ప్రత్యామ్నాయాలు పరిమితంగా ఉండడం వల్ల పాత ప్రతినాయకులనే కొత్త కథానాయకులుగా ఎంపిక చేసుకోవలసిన పరిస్థితి. ఎన్నికల ప్రజాస్వామ్యంలోని ఈ డొల్లతనం ఓటర్లకు నిజంగా తెలియదా? అందరూ అందరే అని, ఎవరూ సమూలంగా సమాజాన్ని మార్చివేయరని తెలియదా? తెలిసినా, ఎక్కువ మంచిని కాక, తక్కువ చెడును ఎంచుకోవలసిన దుస్థితిలోకి పడిపోయారా? రాజకీయాలను వ్యాఖ్యానించేవారు కానీ, మంచి చెడ్డలను చర్చించేవారు కానీ, అంతకు మించి ఏమి చెప్పగలరు?

విశాల ప్రజానీకం మాత్రమే కాదు, వారి తరఫున, వారి శ్రేయస్సు కోసం ఆలోచిస్తున్నామనుకునేవారు సైతం, తక్షణ ప్రమాదాలను పరిగణనలోకి తీసుకోవలసి వస్తుంది. ఏదో ముంచుకు వస్తుంది, ఆ గండాన్ని తప్పించుకోవడానికి అనేక పరిమితులను అధిగమించి, ఒక ఆపద్ధర్మ ఆచరణకు దిగవలసి వస్తుంది. నిన్నటి దాకా ఒకరి పొడ మరొకరికి పడనివారు కూడా బలమైన మూడోశక్తిని ఎదిరించడానికి చేతులు కలుపుతారు. వెదుక్కుని రూపొందించిన ఒకే నినాదాన్ని వల్లె వేస్తారు. ఇటువంటివి అనేకమార్లు జరిగే క్రమంలో, వివిధ పార్టీల మిత్రులు, ప్రత్యర్థులు మారిపోతూ ఉంటారు. ప్రతిసారీ ఏదో ఒక ధర్మయుద్ధం జరుగుతోందన్న భ్రమ కలుగుతుంటుంది. నిజంగా ఆ పోరాటాలలో ప్రజలకు పనికివచ్చే విలువ లేవైనా ఉంటాయా? కేవలం, బలహీన ప్రజాస్వామ్యం మీద బలమైన ఆశ కలిగించే విన్యాసాలు మాత్రమేనా?

సుప్రీంకోర్టుతో సహా న్యాయవ్యవస్థ అంతా ఒక తెలియని ఒత్తిడిలో ఉన్నదని తెలుస్తూనే ఉన్నది. విచారణ కూడా ఆరంభం కాని కేసుల్లో ఆరేడేళ్ల నుంచి సుదీర్ఘ నిర్బంధంలో ఉన్న మేధావులు ఉన్నారు. ప్రబీర్ పురుకాయస్థ అనే ప్రముఖ పాత్రికేయుడు, ప్రజాస్వామ్యవాది పోయిన ఏడాది అక్టోబర్ నుంచి నిర్బంధంలోనే ఉన్నారు. దర్యాప్తు సంస్థల దాడులకు, అధికారపార్టీ ఎలక్టోరల్ బాండ్లకు అవినాభావ సంబంధం ఉన్నట్టుగా పచ్చిగా తెలిసిపోతూ ఉన్నా, భారతీయ సమాజం నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నది. దేశం కోసం ధర్మం కోసం ఏమైనా మాట్లాడవచ్చునని భావించే అధినాయకుడు, ప్రజాస్వామ్యం మనదేశంలోనే పుట్టిందని, రాజ్యాంగంలోనే సనాతన ధర్మం ఉన్నదని ఉద్ఘాటిస్తున్నారు. జాతీయ మీడియా పరవశించిపోయి, నాయకుడి ప్రతిమాటకీ పవిత్రార్థాలను ప్రతిపాదిస్తోంది. చర్చలు, ప్రజాస్వామ్య ప్రక్రియలు అన్నీ వృథా అని, కశ్మీర్ మీద సాహస, కఠిన చర్య తీసుకుని నిర్బంధశాంతిని సాధించారు. పెట్టుబడులకు కొత్త స్వర్గం తెరచుకున్నదని కార్పొరేట్ లోకం సంబరపడింది. ఛత్తీస్‌గఢ్‌లో చర్చలకు రమ్మని ఒకవైపు ఆహ్వానిస్తూనే, మూడు నెలల్లో వందమందిని నిర్మూలించి, ఆదివాసుల నుంచి అడవికి విముక్తి సాధించే ప్రయత్నం చేస్తున్నారు. మధ్యభారతంలోని దండకారణ్యంలో గనివనరులకు ఇక రెక్కలు రావచ్చు. బలశాలి ప్రభుత్వంలోనే ఇవన్నీ సాధ్యమని బాహాటంగానే చెప్పుకుంటున్నారు. మరింత బలం ఇమ్మని, అసలు చిత్రం చూపిస్తామని ఆశపెడుతున్నారు.

ఇవన్నీ సరే, మరి ఈ బాహుబలి పార్టీ మీద పోరాడే కూటమికి, శక్తి లేకపోవచ్చు కానీ, సంకల్పం అయినా ఉన్నదా? కోరలూ కొమ్ములూ తానే తొడిగితే, బీజేపీ హయాంలో విషాన్ని కూడా నింపుకున్న ఊపాను రద్దు చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో కాకపోయినా చెవిలో అయినా చెప్పగలదా? న్యాయవ్యవస్థ వెన్నెముకను సరిచేయగలదా? జైళ్లలో దట్టించి పెట్టిన అసమ్మతికి స్వేచ్ఛ ఇవ్వగలదా? దేశం నాడీవ్యవస్థ అంతటా వ్యాపించిన అసహన, విద్వేష, విభజన కాలుష్యాన్ని ప్రక్షాళన చేయగలదా? కాంగ్రెస్ పార్టీ కానీ, అది భాగంగా ఉన్న ఇండియా కూటమి కానీ, అటువంటి మాటలు మాట్లాడగలిగే శక్తి కూడా లేని నీరసస్థితిలో ఉన్నాయి. వారికి జవసత్వాలు వస్తే వాళ్లు ఎట్లా వ్యవహరించగలరో మనకు తెలుసు. బలహీన పక్షమని సానుభూతి చూపవచ్చును కానీ, బాధితులై ఉండీ ప్రతిఘటించలేని భీరుత్వాన్ని మాత్రం ఎట్లా అర్థం చేసుకోగలం? ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పెద్దగా ఎటువంటి మార్పూ అనుభవంలోకి రాని ప్రజాశ్రేణులే ఇప్పుడు దేశంలో, ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగడుతున్నాయి. భ్రమతో కాక, అవసరంతో అవగాహనతో కలసి నడుస్తున్నాయి.

అన్నమైతేనేమిరా, మరి, సున్నమైతేనేమిరా అని పాడుకునే బైరాగి కూడా, తినడానికి ఏదో ఒకదాన్ని ఎంచుకోవలసిందే. పరమ తాత్విక ప్రశ్నలకు కూడా ఒక్కోసారి పచ్చి భౌతికమయిన సమాధానాలే ఉంటాయి. అన్ని రాజకీయ పక్షాలూ ఒకేతాను ముక్కలే అని, అందరు రాజకీయవాదుల డిఎన్ఎ ఒక్కటే అని స్థూల సత్యాలుగా భావించడం ఓకే. కానీ, ఒక్కో ముక్కను ఒక్కోసారి అధికారానికి తీసుకువచ్చే చిన్న అవకాశం ఓటర్లకు ఉన్నది. ఓటరు అభీష్టాన్ని హైజాక్ చేసే అనేకమార్గాల వల్ల, ఉన్న చిన్నపాటి ఎంపిక అవకాశం కూడా గాలికిపోతోంది. అయినప్పటికీ, ఎన్నికల వేళ, ప్రజల తరఫున ఒక ఎజెండాను ప్రచారంలో పెట్టి, దానికీ ఓటింగ్‌కూ సాధ్యమైనంతగా ముడి వేయడానికి వీలయిన చోట్ల ప్రజాస్వామిక శక్తులు పనిచేస్తూ వస్తున్నాయి.

ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు మాత్రమే కాదు. సమస్త ప్రజాజీవనరంగాలలోను అమలుజరగవలసిన విలువ ప్రజాస్వామ్యం. సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, ప్రజాస్వామ్యం సమానత్వ భావనకు, సమానావకాశాలకు ఒక ప్రాతిపదిక. ప్రజలు తమ వ్యవహారాలను నిర్వహించడానికి కావలసిన అధికారరాజకీయ శ్రేణిని ఎంచుకుంటారు. ప్రజల పేరు మీద అధికారానికి వచ్చినవారు, అధికారయంత్రాంగం, ఇతర పాలనా వ్యవస్థల ద్వారా గౌరవప్రదమైన సామూహిక సంక్షేమాన్ని, అభివృద్ధిని సాధించాలి, నిర్వహించాలి. కానీ, ప్రభుత్వాలు ఏమిచేస్తున్నాయి? ప్రజలందరి సమష్టి సంపద అయిన వనరులను స్వార్థ వ్యక్తులకు, సంస్థలకు మళ్లిస్తున్నాయి. ప్రతిప్రభుత్వ కార్యక్రమంలోనూ ప్రజల సొమ్ము అపహరణకు వీలు కల్పిస్తున్నాయి. సామాజిక, ఆర్థిక అంతరాలను కాపాడడానికి అణచివేతను ప్రయోగిస్తున్నాయి. ఈ అసమాన, అన్యాయ సామాజిక, రాజకీయ వ్యవస్థ నుంచి ఆవిర్భవించి, దాని నియమాలకు లోబడి పనిచేసే రాజకీయపక్షాలు, విప్లవాత్మకంగా వ్యవహరిస్తాయని ఆశించలేము. ఎన్నికల సమయంలో మాత్రమే తమ అభీష్టాన్ని తెలిపి, ఆ తరువాత ప్రభుత్వాల నుంచి ఆశించడం మాత్రమే చేస్తే, ప్రజలు సాధించేది స్వల్పమే. ప్రజాస్వామ్యాన్ని సకలరంగాలలో అమలుజరిపేందుకు ప్రజలు ప్రయత్నిస్తేనే దాత, గ్రహీత సంబంధం తొలగిపోయి, భాగస్వామ్య భావన ఏర్పడుతుంది.

వర్తమానాన్ని మాత్రమే మదింపు వేస్తే, భారత ప్రజాస్వామ్యం అత్యంత నాసిరకమైన, అమానవీయమైన స్థితిలో ఉన్నది, అయితే, ఇది అంతకు మునుపున్న స్థితి కంటె మెరుగైనదే. గత ఏడున్నర దశాబ్దాలలో భారత ప్రజాస్వామ్యం నాణ్యత క్రమంగా పెరుగుతూ వస్తోంది. బహుశా, ప్రజాచైతన్యం, ప్రజాస్వామిక ఆచరణలు పెరిగినందువల్లనే, ప్రస్తుత ప్రభుత్వాలు హెచ్చు అణచివేతను, క్రూరమైన పాలనావిధానాలను అమలుచేయవలసి వస్తున్నది. ప్రధాన రాజకీయపక్షాలు చెప్పే మాటలు, ఆశయాలు, లక్ష్యాలు మాత్రమే కాక, వివిధ ప్రజా సమూహాలు, శ్రేణులు, సొంతంగా రూపొందించి ప్రకటించే రాజకీయ వాదనలు సమాజంలో బలం పుంజుకుంటున్నాయి. ఎన్నికల ద్వారా కాకుండా, సాటి ప్రజల మద్దతుతో, ప్రభుత్వాలతో సంప్రదింపులతో, పోరాటాలతో తమ ప్రయోజనాలను సాధించుకోవడానికి వివిధ ప్రజాసమాజాలు ప్రయత్నిస్తున్నాయి. అదే క్రమంలో, ఎన్నికల ప్రక్రియలో కూడా తమ ప్రమేయాన్ని పెంచుకోవడానికి ప్రజాస్వామిక శక్తులు మునుపటి కంటె అధికంగా చొరవ చూపుతున్నాయి. ఆ రంగాన్ని వృత్తి రాజకీయనాయకులకు, డబ్బుకు సామాజిక పలుకుబడికి లొంగిపోయే ఓటర్లకు వదిలిపెట్టకూడదని అనుకుంటున్నాయి. ఇదంతా ప్రజాస్వామ్యం మీద అనవసరపు భ్రమలు పెంచుతుందా లేక ఆచరణాత్మకమైన విశ్వాసాన్ని పెంచుతుందా అన్నది చర్చనీయాంశమే.

ఎన్నికల పద్ధతిని పూర్తిగా వ్యతిరేకించి, ఇతరమార్గాల ద్వారానే ప్రజల సాధికారతను సాధిస్తామని నమ్మేవారిని ఖండించనక్కరలేదు. వ్యవస్థను మౌలికంగా మార్చేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను సృజనాత్మకంగా అన్వేషించే ప్రయత్నం కూడా నిరంతరం సాగవలసిందే. ఓటింగ్‌ను నిరాకరించడం అన్నది ఒక విధానప్రకటన. స్వతంత్ర భారతంలో అనేక సందర్భాలలో ఓట్ల బహిష్కరణ ఒక నిరసన రూపంగా వ్యక్తమైంది. కానీ, పూర్తి వ్యవస్థ మీద నిరసనతో జరిగిన సైద్ధాంతిక బహిష్కరణ అతి బలహీనంగా మాత్రమే ఉన్నది. పైగా, భారత ప్రజలు ఓటింగ్‌లో పాల్గొనడం రానురాను పెరుగుతోంది. వివిధ నిర్బంధ ప్రలోభాల ఆధారంగా కాక, స్వీయ ఇచ్ఛతో రహస్య ఓటింగ్‌ను వినియోగించుకోవాలనుకునే వారు కూడా పెరుగుతున్నారు. మెరుగైన జీవితాల కోసం ప్రజల ప్రయత్నాలు ఎన్నికల రాజకీయాలతోను, ఉద్యమ రాజకీయాలతోను కూడా కలసి నడుస్తాయి. ఒక్కోసారి ఆ రెండు రకాల రాజకీయాలు కలసి ఉండవచ్చు, మరోసారి అవి ఎదురెదురుగా తలపడవచ్చు. అధికారంలో ఉన్న వారి దౌర్జన్యం నుంచి తప్పించుకోవడంలో ప్రజలకు, ప్రతిపక్షాలకు ఉమ్మడి ప్రయోజనాలుంటాయి. వాటిని సాధించుకునే సందర్భంలో ఉభయపక్షాల మధ్య వైరుధ్యాలు తాత్కాలికంగా విశ్రాంతి తీసుకుంటాయి. ప్రజాస్వామ్య స్థలాలు విస్తరిస్తాయి. ప్రజలే లబ్ధి పొందేలా ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగాలి.

ఆపద పెద్దదైనప్పుడు, అందరూ దొంగలే అనే అద్భుత సత్యాన్ని అర్జెంటుగా ప్రకటించవలసిన అవసరం ఏముంది?

> భారత ప్రజలు ఓటింగ్‌లో పాల్గొనడం రానురాను పెరుగుతోంది. వివిధ నిర్బంధ ప్రలోభాల ఆధారంగా కాక, స్వీయ ఇచ్ఛతో రహస్య ఓటింగ్‌ను వినియోగించుకోవాలనుకునే వారు కూడా పెరుగుతున్నారు. మెరుగైన జీవితాల కోసం ప్రజల ప్రయత్నాలు ఎన్నికల రాజకీయాలతోను, ఉద్యమ రాజకీయాలతోను కూడా కలసి నడుస్తాయి. ఒక్కోసారి ఆ రెండు రకాల రాజకీయాలు కలసి ఉండవచ్చు, మరోసారి అవి ఎదురెదురుగా తలపడవచ్చు. అధికారంలో ఉన్న వారి దౌర్జన్యం నుంచి తప్పించుకోవడంలో ప్రజలకు, ప్రతిపక్షాలకు ఉమ్మడి ప్రయోజనాలుంటాయి. వాటిని సాధించుకునే సందర్భంలో ఉభయపక్షాల మధ్య వైరుధ్యాలు తాత్కాలికంగా విశ్రాంతి తీసుకుంటాయి. ప్రజాస్వామ్య స్థలాలు విస్తరిస్తాయి. ప్రజలే లబ్ధి పొందేలా ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగాలి.

> ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పెద్దగా ఎటువంటి మార్పూ అనుభవంలోకి రాని ప్రజాశ్రేణులే ఇప్పుడు దేశంలో, ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగడుతున్నాయి. భ్రమతో కాక, అవసరంతో అవగాహనతో కలసి నడుస్తున్నాయి.

ఎన్నికల ప్రలోభాలపై జన చైతన్యయాత్ర

డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి ఏప్రిల్ 14న నెల్లూరు జిల్లా తానంచర్ల గ్రామంలో మొదలయిన జనచైతన్య యాత్ర ప్రకాశం, గుంటూరు, బాపట్ల, కృష్ణ, ఎన్టీఆర్ జిల్లా, ఏలూరు, రాజమండ్రి, తూర్పు గోదావరి, అనకాపల్లి, విశాఖ, విజయనగరం జిల్లాల నుంచి సాగుతూ చివరకు మే 5న శ్రీకాకుళం జిల్లా బొడ్డపాడు గ్రామంలో కారల్ మార్క్స్ జయంతి రోజున ముగుస్తుంది. 21 రోజులపాటు కండలేరు ముంపు గ్రామాలు, దళితుల హత్యాకాండ జరిగిన కారంచేడు, చుండూరులతో పాటు పోలవరం నిర్వాసితుల గ్రామాల సందర్శన, విశాఖ స్టీల్ కార్మికులకు సంఘీభావంతో పాటు, అమరుల స్థూపాలు, మహనీయుల విగ్రహాలను సందర్శించి వారి త్యాగాలను గుర్తు చేసుకుంటుంది. లోక్‌సభకు, నవ్యాంధ్రకు ఏకకాలంలో ఎన్నికలు జరుగుతున్న సమయంలో, రాష్ట్ర పునర్విభజన సందర్భంగా హామీ పడ్డ ప్రత్యేక హోదాతో పాటు నిజమైన ప్రజా ఎజెండాను లేవనెత్తుతూ, సాగే ఈ యాత్రలో భావసారూప్యత కలిగిన శక్తులు, వ్యక్తులు పాల్గొనాలి.

సాక్షాత్తు ప్రధానమంత్రి ప్రారంభించిన రాజధాని అమరావతి నిర్మాణం గందరగోళంలో పడ్డా కేంద్రం నోరు విప్పలేదు. పోలవరంలో ముంపునకు గురైన లక్షలాది ఆదివాసులకు సరైన పరిహారం అందక కన్నీళ్లు తప్ప, నీళ్లు వచ్చిన దాఖలాలు లేవు. పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కుగా నిలిచిపోకుండా కార్పొరేట్ల చౌకబేరానికి బలిపీఠం మీద ఉంచబడింది. రాయలసీమ జిల్లా కర్నూలులో హైకోర్టు కల నెరవేరలేదు. వెనుకబడ్డ ప్రాంతాలు ఉత్తరాంధ్ర–రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజీ అందనే లేదు. కృష్ణపట్నం ఓడరేవు చౌకగా అమ్ముడయ్యింది. తీర ప్రాంతమంతా కాలుష్య కారక ఫార్మా కంపెనీలు, ఇతరత్రా పరిశ్రమలతో మత్స్యకారులు, తీర ప్రాంత ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. వీటికి తోడు అణువిద్యుత్ ప్రాజెక్టులు ఆంధ్ర ప్రజల నెత్తిన పెనుభూతంగా వేలాడుతున్నాయి. బ్రిటిష్ కాలం నాటి చుక్కల భూముల సమస్యలకు పూర్తి పరిష్కారం లభించనేలేదు. తితిలీ, మిచౌలీ తుఫానులు కబళిస్తున్నా, ఉప్పు మేటలతో పంటలు నష్టపోతున్నా పరిహారం పొందే పరిస్థితి లేదు. ప్రత్యామ్నాయ రక్షణ ఏర్పాట్లు లేవు. కొల్లేరు ప్రాంత ఆక్రమణకు అడ్డుకట్ట లేదు. అభివృద్ధి వికేంద్రీకరణకు అర్థమే మారిపోతుంది. సంక్షేమం–అభివృద్ధి రెండు కళ్ళుగా వెలగాల్సిన స్థానంలో, ప్రజలను అడుక్కునే వాళ్లుగా దిగజారుస్తున్నారు. వ్యవస్థీకృతమైన అవినీతి ఫలితంగా పేదలు మరింత పేదలుగా దిగజారుతుంటే, కొద్ది శాతం దోపిడీదారుల చేతుల్లో దేశ సంపద కేంద్రీకృతమయ్యింది. ఈ పరిస్థితుల్లో పాలక పక్షాలు–ప్రతిపక్షాలు కేంద్రానికి మోకరిల్లుతుంటే ఎవరు, ఏ విధానాలపై ప్రజలను ఓట్లడుగుతున్నారో ప్రజలకు అంతుబట్టడం లేదు.

"ఆర్థిక ప్రజాస్వామ్యం–రాజకీయ ప్రజాస్వామ్యం–సామాజిక ప్రజాస్వామ్యం" అంటూ పిలుపునిచ్చిన డాక్టర్ బాబాసాహెబ్ కలలన్నీ గత 73 సంవత్సరాలుగా వంచించబడుతూనే ఉన్నాయి. ఆయన కోరినట్టు భూములు అన్నీ రాజ్యం ఆధీనంలోనికి రాలేదు. కులం ప్రాతిపదికన విద్యాలయాలు, గ్రామాల్లో ఓట్లు చీలుతున్నాయి. అందుకే కారల్ మార్క్స్ బోధించినట్టు దున్నేవారికి భూమి చెంది, సంపదపై సమిష్టి అధికారం నెరపగల శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతం తప్ప ప్రజలకు మరొక పరిష్కార మార్గం కనిపించడం లేదు. అలాగే డబ్బులకు, మందు సీసాలకు లోబడి ప్రజలు ఓటును అమ్ముకోకూడదు. నూతన ప్రజాస్వామిక విప్లవ సాధనలో భాగమై భూస్వామ్య–సామ్రాజ్యవాద దోపిడీకి తావులేని సమతా రాజ్యాన్ని స్థాపించుకుందాం.

– ఆంధ్రప్రదేశ్ రైతు–కూలీ సంఘం,
అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య,
ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి),
అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, PDSU (విజృంభణ)

ప్రశ్నార్థకమవుతున్న ప్రాచీన వారసత్వ నిర్మాణాల పరిరక్షణ

రాజులు, రాజ్యాలు పోయినా వారు నిర్మించిన అద్భుత కట్టడాలు ఆనాటి మహోన్నత సంస్కృతిని మన వారసత్వంగా సగర్వంగా చెప్పుకునేలా చేశాయి. ఆ ప్రాచీన వైభవాన్ని కాపాడుకోవడం ఇప్పుడు ప్రపంచ మానవాళి బాధ్యత. ఈ బృహత్తరమైన అంశాన్ని గమనించి యునెస్కో 1983లో ప్రతి ఏటా ఏప్రిల్ 18ని ప్రపంచ వారసత్వ దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించింది. ప్రపంచ వారసత్వ ప్రదేశాల ప్రాముఖ్యత, చారిత్రక నిర్మాణాలను సంరక్షించడంతో పాటు ప్రజలలో వీటి గురించి అవగాహన, అనురక్తి కలిగించాలనే ఉద్దేశ్యంతో ప్రతి ఏటా వారసత్వ దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. యునెస్కో ఇంతవరకు మన దేశంలో 42 ప్రదేశాలను ప్రపంచ వారసత్వ స్థలాలుగా గుర్తించింది. ఇందులో 34 ప్రదేశాలు సాంస్కృతిక వారసత్వ ప్రదేశాలుగా, ఏడు సహజసిద్ధమైన అద్భుత ప్రదేశాలుగా, ఒకటి మిశ్రమ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందాయి. సాంస్కృతిక వారసత్వ ప్రదేశంగా తెలుగు రాష్ట్రాల నుంచి ఒక్క రామప్ప దేవాలయం మాత్రమే ఉంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మానవజాతి తమ వారసత్వ సంపదగా పరిరక్షించాల్సిన ప్రదేశాలు, సరైన గుర్తింపునకు నోచుకోని వారసత్వ కట్టడాలు వాటి ఆలనా పాలనా కొరకు ఇంకా ఎదురుచూస్తున్నాయి, అనేకం చారిత్రక శిథిలాలుగా కాలగర్భంలో కలిసిపోతున్నాయి. చారిత్రక సంపద ఇంకా మన తెలుగు రాష్ట్రాలలో మిగిలివున్నా, అంతర్జాతీయ గుర్తింపు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి యునెస్కో పరిశీలనకు పంపడానికి ఆసక్తి చూపే ప్రభుత్వాలు కరువయ్యాయి. పారిస్, వెనిస్, రోమ్ వంటి నగరాలకు ఏ మాత్రం తీసిపోని దీటైన సాంస్కృతీ స్రవంతి నగరాలు మన దేశంలో చాలా ఉన్నాయని, ప్రాచీన మధ్య యుగాలలో మన దేశానికి రాయబారులుగా, వర్తకులుగా వచ్చిన అనేకమంది విదేశీ చరిత్రకారులు వారి రచనలలో పేర్కొన్నా, ఈనాటికీ కొన్ని చారిత్రక నగరాలు సరైన గుర్తింపునకు నోచుకోక, ఆక్రమణలకు బలైపోతూ కాలగర్భంలో కలసిపోతున్నాయి. అయితే వీటి సంరక్షణ బాధ్యతలు తీసుకొనే ప్రజలే సమాజానికి, దేశానికి, ప్రపంచానికి సాంస్కృతిక సంపత్తిని అందించిన వారుగా చరిత్రలో నిలిచిపోతారు. మహోన్నతమైన మన తెలుగు రాష్ట్రాల సాంస్కృతిక, వాస్తు, శిల్పకళా సంపదను భావితరాలకు అందించడం మన అందరి కర్తవ్యం.

– గోవిందు సురేంద్ర

(నేడు 'ప్రపంచ వారసత్వ దినోత్సవం')

వన్యప్రాణి సిబ్బందిని ఎన్నికలకు వాడొద్దు!

తెలుగు రాష్ట్రాలు ఈ సంవత్సరం తీవ్ర వర్షాభావ స్థితిని ఎదుర్కొంటున్నాయి. సాగునీటితో పాటు తాగునీటికి కూడా తీవ్ర కొరత ఏర్పడింది. ఇక పశుపోషకులు పశువుల దాహార్తిని ఎలా తీర్చాలో తెలియక మార్చి నెల నుంచే సతమతమవుతున్నారు. అడవులలో తాగునీరు లభ్యం కాక అనేక వన్యప్రాణులు పంట పొలాలు, జనావాసాలలోకి ప్రవేశించి బీభత్సాన్ని కలిగిస్తున్నాయి. విచక్షణా రహితంగా సాగునీరు, హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల వల్ల అడవులలోని సహజ జలవనరులు చాలాచోట్ల ఎండిపోతున్నాయి. గత ప్రభుత్వాలు ఇలాంటి దుర్భిక్ష పరిస్థితి నుంచి కాపాడడానికి రిజర్వుడు అడవులలో నిర్మించిన తాగునీటి గుంటలు, ట్యాంకులు, వాయువుతో నడిచే భూగర్భ జలాలను తోడే విండ్‌మిల్స్ ఏర్పాట్లు ఇప్పుడు చాలావరకు సరియైన నిర్వహణ లేక శిథిలావస్థకు చేరినట్లు తెలుస్తోంది. ఇదే నిజమైతే అంతకంటే బాధ్యతా రాహిత్యం వేరొకటి ఉండదు.

వెంటనే ప్రభుత్వాలు స్పందించి యుద్ధ ప్రాతిపదికన మన అడవులలోని చెక్‌డ్యామ్‌లను, చెరువులను, గుంటలను, వాటర్ ట్యాంకులను, భూగర్భ జలాలను తోడే విండ్‌మిల్స్‌ను పూర్తిగా పునరుద్ధరించి, ప్రతి వన్యప్రాణికీ తాగునీరు అందేలా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలి. వన్యమృగాలకు తాగునీటిని క్రమం తప్పకుండా ట్యాంకర్లతో అడవులలో ఏర్పాటుచేసిన కుండీలలో నింపే విధంగా కట్టుదిట్టమైన పర్యవేక్షణ కింద చర్యలు తీసుకోవాలి.

అయితే గత పది సంవత్సరాలుగా మన అటవీశాఖలో పదవీ విరమణలు తప్ప నియామకాలు లేనందువల్ల క్షేత్రస్థాయి విధులు నిర్వహించే సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఈ స్థితిలో అడవుల్లో విధుల్ని నిర్వహించే సిబ్బందిని ఎన్నికల విధుల నుంచి పూర్తిగా మినహాయించాలి. అప్పుడే వన్యమృగాల సంరక్షణకు ఆటంకాలు ఉండవు. ఈ విషయమై ఎన్నికల కమిషన్, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి.

పౌరుల తాగునీటి సరఫరాలోనే ఎన్నో అక్రమాల కథనాలు వింటున్న ఈ రోజుల్లో మారుమూల అడవుల్లోని మూగజీవాలకు కనీస తాగునీటి సరఫరా పట్ల ప్రభుత్వ వ్యవస్థ చిత్తశుద్ధి అనుమానాస్పదంగా ఉండడం బాధాకరం. కాబట్టి జంతు ప్రేమికులు, పర్యావరణ–జీవకారుణ్య సంస్థలు, జీవవైవిధ్యం పట్ల స్పృహ కలిగిన పౌర సమాజం స్వచ్ఛంద సంఘాలుగా ఏర్పడి వన్యప్రాణుల దాహార్తిని తీర్చే కృషిలో పాలుపంచుకోవాలి.

– ఎం.వి.జి అహోబలరావు

కార్పొరేట్, సైనిక్ భారత్‌లు కలిసి ఆదివాసీలపై యుద్ధం!

నాలుగు దశాబ్దాలుగా ఎంతో హింసను అనుభవించిన దండకారణ్యంలో గత మూడు నెలలుగా తీవ్ర యుద్ధమే నడుస్తున్నది. ఇది దండయాత్రను, దురాక్రమణ యుద్ధాన్ని, అంతర్యుద్ధాన్ని తలపిస్తున్నది. ఏప్రిల్ 16న మాడ్ ప్రాంతంలో జరిగిన దాడిలో 29 మంది చనిపోయారు. వీరిలో విప్లవకారులు ఎందరో, సాధారణ ఆదివాసులు ఎందరో ఇప్పటికీ తెలియదు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ అనే సరికొత్త యుద్ధంలో భాగంగా ఈ మారణకాండ జరిగింది. ఢిల్లీలోని ప్రభుత్వం అబూజ్‌మాడ్‌ను చేజిక్కించుకోడానికి తన సర్వసైన్యాలను దండకారణ్యానికి తరలించింది. మొన్నటి దాకా ఎవ్వరికీ తెలియని మారుమూల అటవీ స్థావరం కోసం జరుగుతున్నట్లు కనిపించే ఈ పోరాటం ఎవరికైనా జానపద గాథలా అనిపించవచ్చు.

వాస్తవానికి ద్రవ్యపెట్టుబడి యుగంలో, ఆధునిక రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంలో జరుగుతున్న సంఘర్షణ ఇది. అక్కడున్న సహజ వనరులను కార్పొరేట్లకు అప్పగించడానికి జరుగుతున్న యుద్ధం ఇది. సారాంశంలో ఈ పోరాటం దేశ రాజకీయార్థికాల కేంద్రస్థానానికి సంబంధించినది. దేశమంతా పెద్ద ఎత్తున సాగుతున్న కార్పొరేటీకరణకు దండకారణ్యంలో తీవ్ర ప్రతిఘటన ఎదురయ్యాక పాలకులు ఆ ప్రాంతాన్ని అతిపెద్ద మిలటరీ జోన్‌గా మార్చేశారు. ఇది ఇప్పటికిప్పుడు మొదలైంది కాదు. కనీసం ముప్పై ఏళ్ల చరిత్ర ఉన్నది. కార్పొరేటీకరణకు ఆటంకంగా ఉన్న ఆదివాసీ ఉద్యమాన్ని ప్రభుత్వం మారుమూల సమస్యగా భావించడం లేదు. అదే కేంద్ర సమస్య అనుకుంటోంది.

అబూజ్‌మాడ్ ఘటన తర్వాత కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అమితానందంగా స్పందించాడు. మావోయిస్టు ఉద్యమం అభివృద్ధికి అతిపెద్ద శత్రువనీ, దాన్నుంచి దేశాన్ని విముక్తి చేస్తామని అన్నాడు. దేశంలో కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రజా ఉద్యమాల్లో మావోయిస్టు ఉద్యమాన్ని అతి పెద్ద ప్రమాదంగా భావించడంలో స్పష్టమైన రాజకీయార్థిక వైఖరి ఉంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ నినాదం ఒకటే. 'మావోయిస్టు ఉద్యమం నుంచి దేశాన్ని విముక్తి చేస్తాం.. కార్పొరేట్లకు అప్పగిస్తాం'. దీని కోసం తెచ్చిన ఆపరేషన్ కగార్ 2017లో మొదలైన ఆపరేషన్ సమాధాన్–ప్రహార్‌లో భాగమే అయినా గుణాత్మకంగా భిన్నమైనది.

ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు ముఖ్యమైన ప్రకటనలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వెలువడ్డాయి. ఒకటి: మావోయిస్టు ఉద్యమాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటన; రెండు: మావోయిస్టులతో చర్చలకు సిద్ధమని రాష్ట్ర హోం మంత్రి విజయ్‌శర్మ ప్రకటన. మొదటిది నిర్మూలన కాబట్టి సిఆర్‌పిఎఫ్, బిఎస్ఎఫ్, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ తదితర బలగాల్లోని వేలాది మందిని అదనంగా దండకారణ్యంలోకి తరలించారు. రెండోది చర్చలు కాబట్టి అటవీ ప్రాంతంలో రోడ్ల నిర్మాణానికి, గనుల తవ్వకానికి ఆటంకం కల్పించకూడదనే కండీషన్ పెట్టారు. సజావుగా గనులు తవ్వుకోడానికి కార్పొరేట్లకు అనుకూల వాతావరణం ఉండాలని, అప్పుడే చర్చలు జరుగుతాయని చెప్పారు. దీనికి మావోయిస్టులు సిద్ధమైనా కాకపోయినా అలాంటి అనుకూల వాతావరణాన్ని నెలకొల్పాల్సిన తక్షణ బాధ్యత తనకు ఉన్నదని ప్రభుత్వం భావించింది. ఈ స్వల్ప కాలంలోనే ఒక్క మాడ్ ప్రాంతంలోనే ఆరు బేస్ కేంపులు ఏర్పాటు చేసింది.

సైనిక ఉద్రిక్తత ఉన్న చోట ఇరు పక్షాల మధ్య చర్చలకు ఎవరు ప్రతిపాదించినా అది రాజకీయాల ప్రాధాన్యతను పెంచాలి. కానీ ఛత్తీస్‌గఢ్ ఢిల్లీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం చర్చలకు వింత ప్రతిపాదన పెట్టింది. కార్పొరేట్ల తరఫున ప్రభుత్వం ముందుకు వచ్చి, వాళ్ల పనులకు ఏ ఇబ్బందీ కలగకుండా చేయడమే లక్ష్యంగా చర్చలను ప్రతిపాదించింది. రాజకీయార్థిక పరిభాషలో ఇది కార్పొరేటీకరణ. దాన్ని సాధించేందుకు ఒక పక్క చర్చల ప్రతిపాదన, ఇంకో పక్క సైనికీకరణ అనే విధానాన్ని తీసుకొచ్చింది.

గత ఏడాది డిసెంబర్ మొదటి వారం నుంచి బీజేపీ ప్రభుత్వం వేగంగా ఈ సన్నాహాన్నాంతా చేసింది. జనవరి ఒకటో తేదీ మంగ్లీ అనే పసిపాప హత్యతో కగార్ మొదలయ్యాక విరామం లేకుండా ఏదో ఒక ఘటన జరుగుతూనే ఉంది. దాడులు, హత్యలు నిత్యకృత్యమయ్యాయి. ఏప్రిల్ 2న బీజాపూర్ జిల్లా కోర్చోలి వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో 13 మంది మావోయిస్టులు చనిపోయారని వార్త వచ్చింది. వాళ్లంతా మావోయిస్టులైనా కాకపోయినా ఆదివాసులే. అప్పటి నుంచి 75 మందిని ఎన్‌కౌంటర్ పేరిట ఆదివాసులను, విప్లవకారులను కాల్చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో జరిగిన వైమానిక దాడులకు కొనసాగింపుగా ఐదోసారి జనవరి 13న ఏరియల్ బాంబింగ్ కూడా చేశారు.



నిజానికి 2022 అక్టోబర్ 27, 28 తేదీల్లో హర్యానాలోని సూరజ్‌కుండ్‌లో ఒక చింతనా శిబిరం జరిగింది. దీనికి వివిధ రాష్ట్రాల హోం మంత్రులు, హోం సెక్రటరీలు, పోలీసు, సైనిక అధికారులు హాజరయ్యారు. వీళ్లంతా 'నూతన భారతదేశం' అనే ఒక స్వప్నం గురించి చర్చించారు. అది 2047 నాటికి సాకారం కావాలని అన్నారు. సుమారుగా ఆ కాలంలోనే ఆర్ఎస్ఎస్ అధికార పత్రికలు దీన్నే హిందు రాష్ట్ర సాకారం చేసే లక్ష్యంగా ప్రకటించుకున్నాయి. న్యూ ఇండియాకైనా, హిందూ రాష్ట్ర స్థాపనకైనా మావోయిస్టు ఉద్యమం అడ్డంగా ఉన్నది. ఈ సంగతి సూరజ్‌కుండ్ చింతనా శిబిరమే కాదు. అంతక ముందే సంఘ్ పరివార్ కూడా తేల్చుకున్నది. వామపక్ష విప్లవోద్యమం ఉన్నంత వరకు కార్పొరేట్ హిందుత్వ పునాది మీద 'నూతన భారత్'కు అవకాశం లేదు. కార్పొరేట్ హిందూ రాష్ట్ర స్థాపన అనేది సంఘ్ పరివార్‌కు భావజాల సాంస్కృతిక వ్యూహమే కాదు. బీజేపీ ప్రభుత్వానికి రాజకీయార్థిక, సైనిక, పాలనా వ్యూహం కూడా. మధ్య భారతదేశంలో గత మూడేళ్లుగా కనీసం పద్నాలుగు అతి పెద్ద ప్రజా పోరాటాలు నడుస్తున్నాయి. గతంలో ఢిల్లీలో జరిగిన రైతాంగ ఉద్యమ కాలంలోనే మొదలైన సిలింగేర్ నిరాయుధ పోరాటం ఇప్పటికీ కొనసాగుతున్నది. అడవులను, చెట్లను, నీటిని, నేలను, ఆకాశాన్ని కాపాడుకోడానికి పర్యావరణ, సాంస్కృతిక, నైసర్గిక కోణాలతో ఈ రాజకీయార్థిక పోరాటాలు జరుగుతున్నాయి. లక్షలాది మంది ఏండ్ల తరబడి వంతెనలు, రోడ్లు, గనుల తవ్వకం, పర్యాటకం, హిందుత్వ ప్రచారం, రైతాంగ వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక చట్టాల వంటి అనేక సమస్యలపై పోరాడుతున్నారు. వీటిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భరించలేకపోతున్నాయి. ఇప్పటి దాకా ఉన్న సమాధాన్ ఆపరేషన్ చాలక దానికి పదును పెడుతూ కగార్‌ను తీసుకొచ్చాయి.

గత పదేళ్లుగా దేశ ప్రజలందరూ అనుభవిస్తున్న ఉక్కుబోత వెనుక, అభద్రత వెనుక, రాజ్యాంగ సంస్థల విధ్వంసం వెనుక ఈ వ్యూహం ఉన్నది. ఇక ఇది గతంలో దేశమంతా అనుభవించిన ఎమర్జెన్సీలాంటిదే కాదు. పీవీ నరసింహారావు ఆరంభించిన నూతన ఆర్థిక విధానాల వంటిదీ కాదు. రెండు నక్సలైట్ పార్టీలు కలిసి సిపిఐ మావోయిస్టుగా ఏర్పడగానే అప్పటి కాంగ్రెస్ ప్రధాని అన్నట్లు 'దేశ అంతరంగిక శత్రువు' మీది పోరాటం మాత్రమే కాదు. 2009 నుంచి 2017 దాకా నడిచిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ కూడా కాదు. ఇది సంఘ్ పరివార్ సాధించాలనుకుంటున్న కార్పొరేట్ హిందూ రాష్ట్ర స్థాపన కోసం తాజాగా మొదలైన అపరేషన్ కగార్.

■ పాణి

> ఛత్తీస్‌గఢ్–ఢిల్లీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం కార్పొరేట్ల తరఫున ముందుకు వచ్చి, వాళ్ల పనులకు ఏ ఇబ్బందీ కలగకుండా చేయడమే లక్ష్యంగా చర్చలను ప్రతిపాదించింది. రాజకీయార్థిక పరిభాషలో ఇది కార్పొరేటీకరణ. దాన్ని సాధించేందుకు ఒక పక్క చర్చల ప్రతిపాదన, ఇంకో పక్క సైనికీకరణ అనే విధానాన్ని తీసుకొచ్చింది.



బందరు చల్లరాస్తా సెంటర్‌లో జనవాహిని



జనసంద్రం

పెడన బస్టాండ్ సెంటరులో జరిగిన బహిరంగ సభకు వచ్చిన అశేష అభిమానులకు అభివాదం చేస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ (ఇన్‌సెట్‌లో) అధినేతలకు ఓ అభిమాని హారతి

పోటెత్తిన పెడన.. బ్రహ్మరథం పట్టిన బందరు

పెడన పోటెత్తింది.. మచిలీపట్నం మహాసంద్రమైంది.. టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు రెండు నియోజకవర్గాల ప్రజలు బ్రహ్మరథం పలికారు. అడుగడుగునా హారతులు పట్టారు. జయజయధ్వానాలతో అభిమాన స్వాగతం పలికారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు పెడనలో మొదలైన ప్రజాగళం యాత్ర బందరు చేరుకుని, బహిరంగ సభ ముగిసే సరికి అర్ధరాత్రి అయ్యింది. అటు.. పెడన బస్టాండ్ సెంటరులో జరిగిన బహిరంగ సభకు జనం జేజేలు పలకగా, చేనేత, కలంకారీ కార్మికులకు ఇచ్చిన వరాలకు చప్పట్లతో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఇటు.. చంద్రబాబు, పవన్ రాక మునుపే మచిలీపట్నంలోని రహదారులు కిక్కిరిసిపోయాయి. జనసంద్రాన్ని దాటుకుని వెళ్లే పరిస్థితి లేకపోవడంతో కోనేరు సెంటరులో జరగాల్సిన బహిరంగ సభను చల్లరాస్తా సెంటరులోనే నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

టీడీపీ, జనసేన అధినేతలకు ఘనస్వాగతం

- పెడనలో కిక్కిరిసిన ప్రధాన రహదారులు
- చేనేత, కలంకారీ రంగాలకు చంద్రబాబు వరాలు
- మహాసంద్రంగా మారిన మచిలీపట్నం
- చంద్రబాబు, పవన్ రాకమునుపే కిటకిట
- జన తాకిడికి మారిన బహిరంగ సభా వేదిక
- కోనేరు సెంటర్ కాకుండా చల్లరాస్తా సెంటరులోనే..
- పోర్టు అభివృద్ధి, ఉద్యోగ కల్పనకు చంద్రబాబు హామీ

మచిలీపట్నం/పెడన, ఆంధ్రజ్యోతి : మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ బుధవారం నిర్వహించిన ప్రజాగళం యాత్ర జనసంద్రమైంది. పెడన సెంటర్‌లో జరిగిన బహిరంగ సభకు కృత్తివెన్ను, బంటుమిల్లి, గూడూరు, పెడన పురపాలక సంఘం నుంచి పెద్దఎత్తున మహిళలు, జనసేన నాయకులు అభిమానులు తరలివచ్చారు. బుధవారం సాయంత్రం 4.15 గంటలకు చంద్రబాబు హెలీప్యాడ్ వద్ద దిగారు. అక్కడ పెడన నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్, మచిలీపట్నం పార్లమెంట్ కూటమి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, మాజీ ఉపసభాపతి బూరగడ్డ వేదవ్యాస్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు, బొడ్డు వేణుగోపాలరావు తదితరులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి అధినేతలు రోడ్ షోగా పెడన బస్టాండ్ సెంటరుకు చేరుకున్నారు. పెడనలోని వివిధ మండలాల నుంచి మహిళలు పసిపిల్లలను ఎత్తుకుని వచ్చారు. అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను చంద్రబాబు, పవన్ వివరించారు.

మండుటెండలోనూ..

మండుటెండను సైతం లెక్కచేయకుండా బుధవారం సాయంత్రం 4 గంటలకే పెడనలోని వివిధ మండలాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో ప్రధాన రహదారితో పాటు అంతర్గత రహదారులు జనంతో కిక్కిరిసిపోయాయి. మచిలీపట్నం నగరంతో పాటు మండలంలోని 34 పంచాయతీల నుంచి టీడీపీ, జనసేన అభిమానులు కోనేరు సెంటరుకు తరలివచ్చారు. కోనేరు సెంటరుకు రాత్రి 8 గంటల వరకు జనం తరలివస్తూనే ఉన్నారు. ప్రజాగళం కార్యక్రమానికి వచ్చినవారు ఇబ్బంది

- మిగతా 6లో



అభిమాన నేతలను చూసేందుకు ఆనందంగా..

చూసిన కనులదే భాగ్యము





బీసెంట్‌రోడ్డులోని రామాలయంలో బుధవారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. కనుల పండువగా జరిగిన ఈ వివాహ వేడుకను చూసేందుకు వేలాదిమంది భక్తులు విచ్చేశారు. కల్యాణ మహోత్సవాన్ని కనులారా వీక్షించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

టార్గెట్ ఎవరు..?

వడ్డెర కాలనీవాసులా.. టీడీపీ నాయకులా..!

వారంతా రోజువారీ కూలీలు.. కూలి పనికి వెళ్తే గానీ పూట గడవని పరిస్థితి. తాముంటున్న కాలనీకి సమీపంలో ముఖ్యమంత్రి జగన్ వస్తున్నారని తెలిసి ఆసక్తిగా చూడటానికి వెళ్లారు. వారిలో మైనర్ బాలురు కూడా ఉన్నారు. జనంతో పాటే వారూ జగన్‌ను చూసి ఇళ్లకు చేరుకున్నారు. అదే వారి పాలిట శాపమైంది. గుర్తుతెలియని వ్యక్తులు ముఖ్యమంత్రి జగన్‌పై రాయి విసిరారు. ఇప్పుడు ఆ నింద టీడీపీ నాయకులు, వడ్డెర కాలనీ వాసులే టార్గెట్‌గా కదులుతోంది. విచారణ పేరుతో నిన్నటికి నిన్న ఐదుగురు మైనర్లను తీసుకెళ్లిన పోలీసులు.. నేడు వేముల దుర్గారావు అనే టీడీపీ వడ్డెర సంఘం నాయకుడిని అదుపులోకి తీసుకోవడంతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. తమవారు ఎలా ఉన్నారోనని కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ వద్ద పడిగాపులు పడుతూనే ఉన్నారు.

- సీఎంపై రాయి దాడి ఘటనలో తెరవెనుక కుట్రలు
- ఇప్పటికే పోలీసుల అదుపులో ఐదుగురు మైనర్లు
- తాజాగా టీడీపీ వడ్డెర సంఘం నాయకుడు కూడా..
- టీడీపీ వారిని ఇరికించేలా ప్రభుత్వ పెద్దల మంతనాలు
- పోలీసులపై పెరిగిన ఒత్తిడి



బోరున విలపిస్తున్న దుర్గారావు భార్య, పిల్లలు

విజయవాడ, ఆంధ్రజ్యోతి/అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 17 : అనేక అనుమానాల మధ్య మలుపులు తిరుగుతున్న సీఎంపై రాయి దాడి ఘటనపై అధికార పార్టీ నేతలు ఆపసోపాలు పడుతున్నారు. టీడీపీ వారు చేసిన పనేనని తేల్చడానికి పోలీసులపై ఒత్తిడి తెస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ఈ దిశగా ఒత్తిడి చేస్తున్నారని తెలుస్తోంది. సీఎం జగన్‌పై అజిత్‌సింగ్‌నగర్‌లోని వివేకానంద స్కూల్ వద్ద ఈనెల 13వ తేదీన రాయితో దాడి జరిగిన విషయం తెలిసిందే. బుధవారానికి ఈ ఘటన జరిగి నాలుగు రోజులైంది. అనేక మలుపులు తిరిగిన ఈ కేసు దర్యాప్తులో టీడీపీని టార్గెట్ చేస్తున్నట్టుగా తెలుస్తోంది. ఆ తర్వాత వడ్డెర కాలనీ టార్గెట్‌గా పావులు కదులుతున్నాయి. రెండు రోజుల క్రితం రాత్రికి రాత్రే పోలీసులు అజిత్‌సింగ్‌నగర్‌లోని వడ్డెర కాలనీపై పడ్డారు. విచారణ పేరుతో ఐదుగురు మైనర్ బాలురును తీసుకెళ్లారు. ఇంతవరకు వారు ఇళ్లకు చేరలేదు. ఈలోపే క్యాంటీన్‌లో టీ తాగడానికి వెళ్తున్న టీడీపీ వడ్డెర సంఘం నాయకుడు వేముల దుర్గారావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో కాలనీలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. నిత్యం కూలి పనులు చేసుకుని బతికే తమపై అంత పెద్ద నింద పడటంతో

- మిగతా 6లో

మోయలేని నిందను మోపారు

బోరున విలపించిన దుర్గారావు భార్య

'నా భర్తపై మోయలేని నిందను మోపారు. నా భర్తకు ఏ పాపం తెలియదు..' అంటూ వేముల దుర్గారావు భార్య శాంతి బోరున విలపించింది. 'ముఖ్యమంత్రిపై దాడి జరిగిందంటూ నా భర్తను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కనీసం మాట్లాడటానికి కూడా అవకాశం ఇవ్వలేదు. నా భర్తను ఏం చేశారో, ఎలా ఉన్నాడో తెలియడం లేదు. స్థానిక అజిత్‌సింగ్‌నగర్ పోలీసు స్టేషన్ వద్దకు వెళ్లి నా భర్తను చూపించాలని వేడుకున్నా. అక్కడ లేదని పోలీసులు చెబుతున్నారు. ఇంతకీ నా భర్త ఏమయ్యాడో..? ఏం చేశారో..? తెలియక అయోమయంలో ఉన్నాం. పిల్లలను ఓదార్చలేకపోతున్నా. దయచేసి నా భర్తను చూపించండి.' అంటూ శాంతి తన పిల్లలతో విలపించిన తీరు కాలనీవాసులను కలచివేసింది.

నేటి నుంచి నామినేషన్లు

ఎన్నికల నోటిఫికేషన్‌కు సర్వం సిద్ధం


(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమరంలో కీలక ఘట్టానికి అంకురార్పణ జరగనుంది. నోటిఫికేషన్ వెలువరించడంతో పాటు నామినేషన్ల దాఖలు ప్రక్రియను గురువారం నుంచి ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం సమాయత్తమైంది. గురువారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్ల దాఖలుకు గడువు ఉంది. 26న నామినేషన్ల పరిశీలన తర్వాత 29 వరకు ఉపసంహరణకు గడువు ఉంటుంది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లోని రెండు పార్లమెంట్, 14 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. 2019 ఎన్నికల్లో 2 పార్లమెంట్, 16 అసెంబ్లీ స్థానాలకు 232 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఈసారి ఆ సంఖ్య తగ్గే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ వేర్వేరుగా పోటీ చేశాయి. ఈసారి టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడి బరిలో ఉండగా, వైసీపీ, కాంగ్రెస్ అన్ని స్థానాలకు తమ అభ్యర్థులను బరిలో దింపుతున్నాయి. ప్రధాన పోటీ కూటమి, వైసీపీ నడుమే ఉంది.



ధర్మపథం వేదికపై సీతారాముల కల్యాణోత్సవం

కమనీయం.. రాములోరి కల్యాణం

» దుర్గగుడిలో రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు



వన్‌టౌన్, ఏప్రిల్ 17 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. చైత్రమాస వసంత నవరాత్రుల సందర్భంగా తొమ్మిదోరోజు పుష్పార్చన ఒక వైపు, చైత్ర శుద్ధ నవమినాడు సీతారాముల లీలా కల్యాణోత్సవం మరోకవైపు ఆధ్యాత్మిక సిరులు పండించాయి. బుధవారం లలితా సహస్రనామ స్తోత్రాన్ని పారాయణ చేస్తూ కనకదుర్గమ్మకు కనకాంబరాలు, గులాబీలను భక్తి ప్రపత్తులతో సమర్పించారు. అమ్మవారికి మంత్రపుష్ప హారతులు సమర్పించారు. ఈవో రామారావు, స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, ముఖ్య అర్చకుడు శ్రీనివాస శాస్త్రి, ఏఈవో రమేశ్, భక్తులు పూలబుట్టలను తీసుకువచ్చారు.

సీతారాముల లీలా కల్యాణోత్సవం..

చైత్ర శుద్ధ నవమినాడు శ్రీరాముడు జన్మించిన కారణంగా అనాదిగా ఆయన జన్మదినం నాడు సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో దుర్గగుడిలో బుధవారం ధర్మపథం వేదికపై సీతారాముల లీలా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అంతకుముందు సీతా రాముడు, లక్ష్మణుడు, అంజనేయస్వామివార్ల ఉత్సవమూర్తులను ఈవో స్థానాచార్యుడు తదితరులు ఊరేగింపుగా తీసుకువచ్చారు. మంగళవాయిద్యాలు వేద మంత్రాలు, భక్తుల రామ నామస్మరణ మధ్య లీలా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

దుర్గగుడిలో ఈనెల 19 నుంచి 27వ తేదీ వరకు చైత్రమాస బ్రహ్మోత్సవ కల్యాణోత్సవాలను ఆగమోక్తకంగా నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలలో గంగ, పార్వతి, మల్లేశ్వరుల ఉత్సవమూర్తులను రోజుకొకవాహనంపై ఊరేగించనున్నారు.

బీసీలు, దళితులే బలిపశువులు!

» కేశినేని చిన్ని, పట్టాభిరామ్‌ల ధ్వజం



మాట్లాడుతున్న కేశినేని చిన్ని, పట్టాభి


విద్యాధరపురం, ఏప్రిల్ 17 : జగన్ డ్రామాలకు బీసీలు, దళిత యువకులు బలవుతున్నారని విజయవాడ పార్లమెంట్ ఉమ్మడి టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) విమర్శించారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ 'గులకరాయి డ్రామా'లో వడ్డెర యువకులను బలిపశువులు చేయాలనుకుంటున్న వైసీపీ నేతలకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారన్నారు. జగన్ రోడ్డు షోలో జెండా పట్టుకుని నిలబడితే రూ.300 ఇస్తామంటే వెళ్లిన పదిమంది వడ్డెర యువకులను పోలీసులు తీసుకువెళ్లారని, వారి ఆచూకీ తెలియక తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారన్నారు. 2019 ఎన్నికల్లో దళితుడు కోడికత్తి శ్రీనును బలిచేస్తే ఇప్పుడు వడ్డెర సామాజిక వర్గానికి చెందిన వారిని బలిచేయడానికి సిద్ధపడ్డారని విమర్శించారు. గులకరాయి ఘటనలో టీడీపీ నేతలనూ ఇరికించాలని చూస్తున్నారని, కొంతమంది పోలీసులు జగన్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, ఈ విషయంలో డీజీపీ నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అవసరముందన్నారు. వైసీపీ నాయకుల తీరును ఎన్నికల కమిషన్, గవర్నర్‌ల దృష్టికి తీసుకువెళతామన్నారు. టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ, సానుభూతి ఓట్లు దండుకునేందుకు జగన్ కుట్ర పన్ని ఈ రకమైన డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. జగన్ డ్రామాలపై చంద్రబాబు ప్రభుత్వం సీబీఐ దర్యాప్తు చేయిస్తుందన్నారు. బొండా ఉమామహేశ్వరరావును కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు డూండి రాకేశ్, టీఎన్‌టీయుసీ అధ్యక్షుడు గొట్టిముక్కల రఘురామరాజులు మాట్లాడారు.

జగన్ మాట తప్పి మడమ తిప్పారు : వసంత



రెడ్డిగూడెం, ఏప్రిల్ 17 : మాట తప్పం, మడం తిప్పమని చెప్పిన సీఎం జగన్మోహన్ రెడ్డి అమరావతి విషయంలో మాట తప్పారని మైలవరం కూటమి టీడీపీ అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. రంగాపురంలో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీలో అమరావతి ఇక్కడే ఉంటుందని జగన్ నమ్మబలికి.. మూడు రాజధానుల పేరుతో ఈప్రాంతానికి అన్యాయం చేశారు తప్ప పక్క ప్రాంతాల మీద ప్రేమతో కాదన్నారు. ఈ మోసం ఐదేళ్ల పాలన తర్వాత ప్రజలకు తేటతెల్లమైందన్నారు. ఒక్క అవకాశం అని అధికారంలోకి వచ్చిన జగన్ అమరావతితో పాటు చింతలపూడిని నాశనం చేశారన్నారు. చింతలపూడి పూర్తయితే చెరువుల్లో నీరు ఉండేదని, చెరువులు రిజర్వాయర్లుగా మారేవన్నారు. ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా చింతలపూడిని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈనెల 22న ఉదయం 8.30కి ఐతవరంలో బయలుదేరి మధ్యాహ్నం 12.30 గంటలకు మైలవరంలో నామినేషన్ వేస్తానని.. ప్రతి ఒక్కరూ హాజరై ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కె.విజయబాబు, ముప్పిడి నాగేశ్వర రెడ్డి, కుప్పిరెడ్డి అశోక్ రెడ్డి, జనసేన నేతలు చేపలమడుగు కాంతారావు, చేబ్రోలు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో 160 సీట్లు ఖాయం : నెట్టెం



జగ్గయ్యపేట, ఏప్రిల్ 17 : చంద్రబాబునాయుడు సమర్థనాయకత్వం, సుపరిపాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ప్రజలు విశ్వసిస్తున్నారని, టీడీపీ కూటమితోనే ప్రజాసంక్షేమం, రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో 160 స్థానాల్లో విజయం సాధిస్తుందని విజయవాడ పార్లమెంట్ టీడీపీ కూటమి అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, జగ్గయ్యపేట టీడీపీ కూటమి అభ్యర్థి శ్రీరాం తాతయ్యలు అన్నారు. బుధవారం టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి అధికారంలోకి వస్తే పేదల ఆదాయం రెట్టింపు చేసి తీరతామని, పేదలకు సంక్షేమపథకాలు అమలు చేస్తామని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర తెలుగునాడు అంగన్వాడీ, డ్వాక్రా సాధికార సమితి అధ్యక్షురాలు ఆచంట సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యమైనా న్యాయమే గెలుస్తుంది : సౌమ్య



నందిగామ, ఏప్రిల్ 17 : న్యాయం గెలవడం ఆలస్యం కావచ్చు కానీ గెలిచి తీరుతుందని, దళితులకు శిరోముండనం చేసిన కేసులో వైసీపీ నేత తోట త్రిమూర్తులకు శిక్ష పడటం అందుకు నిదర్శనమని కూటమి అభ్యర్థిని తంగిరాల సౌమ్య అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, 1996లో నమోదైన కేసులో న్యాయస్థానం ఆయనకు శిక్ష విధించిందన్నారు. బాధితులకు ఆలస్యంగానైనా న్యాయం జరిగిందన్నారు. అరాచక శక్తులకు వైసీపీ ఆశ్రయం ఇవ్వడం హేయమన్నారు. వైసీపీ పాలనలో ఇటీవల దళితులపై అనేక దాడులు జరిగాయన్నారు.

యువతకు ఉపాధి కల్పన ధ్యేయం : వెనిగండ్ల



గుడివాడ రూరల్, ఏప్రిల్ 17 : యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా.. చదువుకుని నిరుద్యోగులు కాకుండా సంపాదపరులుగా చేయటమే తమ ధ్యేయమని టీడీపీ కూటమి అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం వచ్చాక గుడివాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని ఆయన అన్నారు. బుధవారం సెరిగోల్వేపల్లి గ్రామంలో 'బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమంలో రాము మాట్లాడుతూ, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, రహదారుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధికి కలిసి పనిచేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఎమ్మెల్యేగా కొడాలి నాని గుడివాడ నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధి అందించలేదని విమర్శించారు.

ఓటేస్తేనే దగ్గరకు రండి.. : మోపిదేవి వెంకటరమణ

అవనిగడ్డ, ఏప్రిల్ 17 : రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేస్తేనే తన దగ్గరకు రావాలని అగ్నికుల క్షత్రియుల ఆత్మీయ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది. అవనిగడ్డ నియోజకవర్గ స్థాయి అగ్నికుల క్షత్రియుల ఆత్మీయ సమావేశాన్ని మంగళవారం రాత్రి వైసీపీ నేతలు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా మోపిదేవి వెంకట రమణారావు పాల్గొని మాట్లాడుతూ, మత్స్యకారులకు ఆయిల్ ఖర్చు, వేట నిషేధిత సమయంలో భృతి పెంచిన వైసీపీ ప్రభుత్వాన్ని మరోమారు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ సారి ఎన్నికల్లో వైసీపీని గెలిపించేందుకు అగ్నికుల క్షత్రియులు సహకరించాలని, లేని పక్షంలో తనవద్దకు రావాల్సిన అవసరం లేదన్నారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు, అగ్నికుల క్షత్రియ ప్రముఖులు పాల్గొన్నారు.



పెడనలో నేతలను చూసేందుకు బారులుతీరిన జనం..





ఉవ్వెత్తు జెండాలతో అభిమాని వినూత్న ప్రచారం

బాబు, పవన్‌లను తిట్టమన్నారు..

» వైసీపీ అధిష్ఠానం తీరు నచ్చకే బయటకు వచ్చేశా

» ఎంపీగా నిధులిచ్చినా అభివృద్ధి చేయలేకపోయా : బాలశౌరి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 17 : 'నేను ఎంపీగా ఉన్న సమయంలో ఇటీవల పవన్‌కళ్యాణ్, చంద్రబాబును బాగా తిట్టాలని వైసీపీ అధిష్ఠానం ఆదేశించింది. నాకు తిట్టడం రాదు.. అధిష్ఠానం తీరు నచ్చకే పార్టీ నుంచి బయటకు వచ్చా.. ఎప్పుడూ రాజకీయ నాయకులను తిట్టడమే పనిగా పెట్టుకున్న పేర్నినానికి ప్రజలు బుద్ధిచెప్పే రోజులు వచ్చాయి..' అని జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి అన్నారు. ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి కోనేరుసెంటర్‌లో బహిరంగ సభలో బాలశౌరి మాట్లాడారు. పోర్టుకు నిధులు తానే తీసుకువచ్చానని పేర్ని నాని చెబుతుంటే ఆశ్చర్యంగా ఉందన్నారు. మచిలీపట్నంలోని సాల్ట్ ఫ్యాక్టరీకి చెందిన మూడు వేల ఎకరాలకు ఇండస్ట్రీయల్ హబ్‌గా రూపొందించాలని ఈ సందర్భంగా చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లను బాలశౌరి కోరారు. మచిలీపట్నం-రేపల్లె రైలుమార్గం నిర్మిస్తామని, ముస్లింల కోరికమేరకు షాదీఖానా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

నీతుల నానికి తగిన బుద్ధి చెబుతాం : చంద్రబాబు

మాజీ మంత్రి కొల్లు రవీంద్రను అక్రమంగా హత్య కేసులో ఎమ్మెల్యే పేర్ని నాని ఇరికించాడని, అధికారంలోకి రాగానే వారిని వదిలే ప్రసక్తి లేదని చంద్రబాబు నాయుడు అన్నారు. నీతుల నాని ఇష్టారాజ్యంగా మచిలీపట్నంలో టీడీపీ కార్యకర్తలను వేధించాడన్నారు. రంగనాయక స్వామి దేవాలయం ఆస్తులను, దేవుడిని మింగేందుకు వైసీపీ నాయకులు చూస్తున్నారన్నారు. గంజాయి ప్రభుత్వం కావాలో అభివృద్ధి చేసే ప్రభుత్వం కావాలో బందరు ప్రజలు తెలుసుకోవాలన్నారు. సీఎం జగన్‌రెడ్డి ఎలా సైకోలా వ్యవహరిస్తున్నారో ఎమ్మెల్యే పేర్ని నాని, ఆయన కుమారుడు పేర్ని కిట్టు టీడీపీ కార్యకర్తలను వేధిస్తున్నారన్నారు.



పెడన, మచిలీపట్నంలలో ప్రజాగళం కార్యక్రమం

జగన్ ప్రభుత్వంలో

ఎదురు మాట్లాడితే జైలుకే..

పెడన, పెడన రూరల్, బంటుమిల్లి, కృత్తివెన్ను, ఏప్రిల్ 17 : జగన్ ప్రభుత్వంలో ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్వీర్యమైందని, వ్యతిరేకంగా మాట్లాడితే జైలులో వేయటమే ఆయనకు తెలుసని ఎన్డీఏ కూటమి మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి అన్నారు. బుధవారం పెడన బస్టాండ్ సెంటర్‌లో జరిగిన ప్రజాగళం యాత్రలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ఎంపీగా ఉన్నా ప్రజలకు సేవ చేయలేకపోయానన్నారు. తీరప్రాంత మంచినీటి సమస్యకు జలజీవన్ మిషన్ నుంచి రూ.330 కోట్ల నిధులు తెస్తే రాష్ట్ర ప్రభుత్వ వాటా ఇవ్వకపోవడంతో ఆ నిధులు వెనక్కి వెళ్లాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికి కుళాయి వేసి, స్వచ్ఛమైన నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. చేనేత, కలంకారీ, ఆక్వా, వ్యవసాయ రైతుల్ని ఆదుకుంటామన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే జైలుకు పంపే నైజం జగన్‌దేనని అన్నారు. సొంత నిధులతో కౌలు రైతులను ఆదుకున్న గొప్ప వ్యక్తి పవన్ కళ్యాణ్ అని, అతని ఆశయాలు నచ్చి, జనసేనలోకి వచ్చానని తెలిపారు.

అరాచక పాలనతో ప్రజలు విసిగిపోయారు : కాగిత

రాష్ట్రంలో ఐదేళ్ల పాటు జగన్ అరాచకపాలనతో ప్రజలు విసిగిపోయారని ఎన్డీఏ కూటమి పెడన అసెంబ్లీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పెడనలో చేనేత రంగాన్ని ప్రోత్సహించింది చంద్రబాబు నాయుడు మాత్రమేనని, చేనేతల ఆకలి చావులకు జగన్ కారణమయ్యారన్నారు. నాలుగు మండలాల్లో ఇసుక దోపిడీ చేసి, చెరువుల తవ్వకాల్లో రైతులను దోచుకొని నాయకులు జేబులు నింపుకున్నారన్నారు. తనను నమ్మి చంద్రబాబు సీటు కేటాయించారని, పవన్, బీజేపీ ఆశీస్సులతో ఎన్నికల్లో ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాగిత కోరారు.

జనసంద్రం

(5వ పేజీ తరువాయి)

పడకుండా తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు.

వరాల జల్లు

పెడనలో కలంకారీ, చేనేత పరిశ్రమ ప్రసిద్ధి చెందిందని, రెండు రంగాలనూ ఆదుకుంటామని చంద్రబాబు, పవన్ కల్యాణ్ హామీల వర్షం కురిపించారు. శ్రీరామనవమి రోజు ఇక్కడ ప్రజాగళం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, విజయం ఎన్డీఏ కూటమిదేనన్నారు. బందరు పోర్టు నిర్మాణాన్ని పూర్తి చేయటంతో పాటు మచిలీపట్నం-విజయవాడ రహదారిని మరింత అభివృద్ధి చేస్తామని, లక్షలాది మందికి స్థానికంగా ఉద్యోగాలు వచ్చేలా చూస్తామని, ఇందుకోసం ఎన్డీఏ కూటమి సహకారం తీసుకుంటామన్నారు. పెడన నియోజకవర్గంలో ఆక్వా కల్చర్ అధికంగా ఉందని, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రూపాయిన్నరకే విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. చేనేత కుటుంబాలకు 200 యూనిట్ల వరకూ, మగ్గానికి 500 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తామని, చేనేత, కలంకారీ రంగాలకు జీఎస్టీ రద్దు చేస్తామని, నూలు మీద పన్ను తగ్గిస్తామని అభయమిచ్చారు. కలంకారీ పరిశ్రమకు రన్నింగ్ వాటర్ కోసం ఐదు లేక పది ఎకరాల భూమిని కేటాయించి నీటి సౌకర్యాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు.

మచిలీపట్నంలో ఘన స్వాగతం

పెడనలో సభ నుంచి బుధవారం రాత్రి 7.30 గంటలకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ పయనమన్నారు. మచిలీపట్నంలోని హుస్సేన్‌పాలెం, మాచవరం మెట్టు, బైపాస్ రోడ్డు మీదుగా మూడు స్థంభాల సెంటరుకు వచ్చేసరికి పెద్దఎత్తున మహిళలు ఘన స్వాగతం పలికారు. మూడు స్థంభాల సెంటర్ వద్దకు వచ్చేసరికి జనం కిక్కిరిసిపోయారు. దీంతో కోనేరు సెంటర్ వరకూ వెళ్లే దారిలేక చల్లరాస్తా సెంటరులోనే బహిరంగ సభ నిర్వహించారు. మచిలీపట్నంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు స్వాగతం పలికే కార్యక్రమాన్ని టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు, జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ, పలువురు టీడీపీ నాయకులు పర్యవేక్షించారు.

కొనకళ్ల, బూరగడ్డకు సముచిత స్థానం

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో భాగంగా మచిలీపట్నం మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావుకు ఎంపీ సీటు కేటాయించలేకపోయానని, బూరగడ్డ వేదవ్యాస్‌కు పెడన సీటు ఇవ్వలేకపోయామని, జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణకు సీటు కేటాయించలేకపోయామని, వీరితో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజాబాబుకు కూటమి అధికారంలోకి వచ్చాక సముచిత స్థానం కల్పిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. ఐదేళ్ల పాటు వైసీపీలో ఎంపీగా పనిచేసి, ఆ పార్టీ నేతల వైఖరితో విసిగిపోయిన ఎంపీ బాలశౌరి జనసేన పార్టీ తరఫున మచిలీపట్నం ఎంపీగా పోటీ చేసేందుకు ముందుకువచ్చారని తెలిపారు. పెడన నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్రను గెలిపించాలని కోరారు.

జోగి బంగాళాఖాతంలో పడటం ఖాయం

పెడన నియోజకవర్గ ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న జోగి రమేశ్‌ను మైలవరం ప్రజలు తన్నారని, ఆ తర్వాత పెడన వచ్చి పడ్డాడని, పెడన ప్రజలు తన్నాక మైలవరం వెళ్లి ఓడిపోయారని, ఇప్పుడు పెడన ప్రజలు తన్నగానే పెనమలూరు వెళ్లాడని, ఈసారి పెనమలూరు ప్రజలు తంతే బంగాళాఖాతంలో పడిపోతాడని టీడీపీ అధినేత చంద్రబాబు వ్యంగ్యంగా మాట్లాడారు. జోగి రమేశ్ నోరు అదుపులో పెట్టుకోవాలని, పవర్ స్టార్ పవన్ కల్యాణ్, సీబీఎన్ కలిసి పనిచేస్తున్నారని గుర్తుంచుకోవాలన్నారు. పెడన నియోజకవర్గంలో జరిగినన్ని అక్రమాలు, అవినీతి సినిమాల్లో కూడా చూపించ రని పేర్కొన్నారు.



క్యాండిడేట్ బుక్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్, జేసీ

నేటినుంచి నామినేషన్లు

» అభ్యర్థుల క్యాండిడేట్ బుక్ విడుదల » ఆర్వో కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

» ఎన్టీఆర్ జిల్లా, కృష్ణా జిల్లా కలెక్టర్లు ఢిల్లీరావు, బాలాజీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/మచిలీపట్నం)

అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణకు జిల్లా వ్యాప్తంగా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఏర్పాట్లు చేసినట్టు ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీరావు, కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ తెలిపారు. నామినేషన్ల అనంతర ఏర్పాట్లపై జేసీ సంపత్‌కుమార్‌తో కలిసి సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఢిల్లీరావు మాట్లాడారు. గురువారం ఉదయం 11 గంటలలోగా నామినేషన్లకు సంబంధించి ఫారం-1 పబ్లిక్ నోటీసు ఇవ్వడం జరుగుతుందని, దీనిని జిల్లా కార్యాలయాల్లో పబ్లిష్ చేయనున్నట్టు తెలిపారు. విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గానికి కలెక్టర్ కార్యాలయంలో స్వీకరించనున్నట్టు తెలిపారు. తిరువూరు నియోజకవర్గానికి ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తహసిల్దార్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తారని, సెంట్రల్ నియోజకవర్గానికి మున్సిపల్ కమిషనర్ నామినేషన్లు స్వీకరిస్తారని, తూర్పు నియోజకవర్గానికి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో, మైలవరం నియోజకవర్గానికి తహసిల్దార్ కార్యాలయంలో జేసీ నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. నందిగామకు ఆర్డీవో కార్యాలయంలో, జగ్గయ్యపేటకు పౌరసరఫరాల డీఎం తహసిల్దార్ కార్యాలయంలో స్వీకరిస్తారని కలెక్టర్ వివరించారు.

ఈనెల 26వ తేదీన నామినేషన్ల పరిశీలన, 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణకు వీలుంటుందని, అనంతరం గుర్తుల కేటాయింపు జరుగుతుందని, పోటీలో నిలిచిన అభ్యర్థులను ఫారం-7ఎ ద్వారా ప్రకటించనున్నట్టు వివరించారు.

అభ్యర్థులు బ్యాంక్ అక్కౌంట్ సమర్పించాలి


ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థి ఎన్నికల వ్యయ పరిశీలన కోసం ప్రత్యేక బ్యాంక్ అకౌంట్ వివరాలు సమర్పించాల్సి వుంటుంది. అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి, ఎన్నికల ఖర్చు అతని ఖాతాలో లెక్కించడం జరుగుతుంది.

ఈవీఎంల అనుసంధానం

మే 1న ఈవీఎంలను పోలింగ్ స్టేషన్‌లకు అనుసంధానం చేసి, మే 2, 3, 4 తేదీల్లో ఈవీఎం కమిషనింగ్ చేపట్టనున్నట్టు తెలిపారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఈనెల 13, 14న తొలి విడత శిక్షణ ఇచ్చామన్నారు. 600 వరకు మైక్రో అబ్జర్వర్లకు ఈనెల 28న శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. మే 7, 9 తేదీల్లో హోం ఓటింగ్‌కు చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు.

కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు పూర్తి

నోవా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, నిమ్రా కాలేజ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ భవనాల్లో స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాలకు ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ వివరించారు. గతంలో చోటు చేసుకొన్న ఘటనల ఆధారంగా క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను గుర్తించామని, అక్కడ వెబ్‌క్యాస్టింగ్ వంటి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు.



కృష్ణాజిల్లాలో..

ఎన్నికలు స్వేచ్ఛగా సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డి.కె.బాలాజీ అన్నారు. బుధవారం కలెక్టర్ జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, డీఆర్వో కె.చంద్రశేఖరరావులతో కలిసి మీడియా సెంటర్లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. సాధారణ ఎన్నికలు 2024కు సంబంధించి ఈనెల 18వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్టు తెలిపారు. ఈనెల 18వ తేదీ నుంచీ 25వతేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరించటం జరుగుతుందన్నారు. మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గానికి కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వారి ఛాంబర్, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారి బందరు ఆర్డీవో కార్యాలయంలో, పెడన తహసీల్ధార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వారి ఛాంబర్, అవనిగడ్డ తహసీల్ధార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వారి ఛాంబర్, పామర్రు తహసీల్ధార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వారి ఛాంబర్, పెనమలూరు తహసీల్ధార్ వారి కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వారి ఛాంబర్, గన్నవరం తహసీల్ధార్ వారి కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వారి ఛాంబర్, గుడివాడ ఆర్డీవో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వారి ఛాంబర్‌లలో నామినేషన్లు దాఖల చేయవచ్చు అన్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ, జిల్లాలో శాంతిభద్రతలు పరిరక్షించి, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా డీఎస్పీ స్థాయిలో, మచిలీపట్నం పార్లమెంటుకు ఏఎస్పీ స్థాయిలో పోలీసు అధికారులను నియమించినట్లు చెప్పారు. జిల్లాలో మూడు కంపెనీల కేంద్ర భద్రతా బలగాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో అదనపు భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

టార్గెట్ ఎవరు..?

(5వ పేజీ తరువాయి)

ఇటు దుర్గారావు కుటుంబం, అటు మైనర్ బాలుర కుటుంబాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఇంత పెద్ద నింద కేసుల రూపంలో తమపై పడటం, పోలీసులు అదుపులోకి తీసుకున్నవారి ఆచూకీ చెప్పకపోవడంతో కాలనీవాసులు కంగారు పడుతున్నారు.

టార్గెట్ రివర్స్

సెంట్రల్ నియోజకవర్గంలో నాలుగైదు వడ్డెర కాలనీలున్నాయి. ఈ సామాజికవర్గం ఓటర్లు మొత్తం 10వేల మంది. డాబాకొట్లు సెంటర్‌కు సమీపాన ఉన్న ఈ కాలనీలో రెండు పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఒక్కో దాని పరిధిలో సుమారు 1,000 ఓటర్లు ఉన్నారు. మొత్తం ఈ కాలనీలో 2వేల ఓటర్లు ఉన్నారు. ఈ సామాజికవర్గంలో 70 శాతం వైసీపీ వైపు ఉన్నవారే. 30 శాతం మాత్రమే టీడీపీ వైపు ఉన్నారు. ఇప్పటి వరకు వైసీపీ వైపు చూసిన వడ్డెరలు ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలతో షాకయ్యారు. ఉపాధి చిన్నదైనా, పెద్దదైనా చెమట చిందించుకుని కుటుంబాలను పోషించుకుంటున్న తమపై 'రాయి' టార్గెట్ ఏమిటని మదనపడుతున్నారు. టీడీపీని టార్గెట్ చేసుకుని కదుపుతున్న పావులు ఇప్పుడు వైసీపీకి రివర్స్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. జరుగుతున్న పరిణామాలపై వడ్డెర సామాజికవర్గ పెద్దలు చర్చించుకుంటున్నారు. జెండా పట్టుకుని నిలబడితే రూ.200 ఇస్తామని చెప్పి తీసుకెళ్లిన నేతలు తిరిగి తమ బిడ్డలను కేసులో ఇరికించడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఘటన జరిగిన నాటి నుంచి వైసీపీ నేతలు మౌనం వహించడం ప్రస్తుతం వస్తున్న అనుమానాలకు బలం చేకూర్చుతోంది. ఒకరి తర్వాత ఒకరిని విచారణ పేరుతో పోలీసులు తీసుకెళ్లడంతో ఆ ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఇంకెంతమందిని పోలీసులు తీసుకెళ్తారోనని మిగిలిన యువకులు బిక్కుబిక్కుమంటున్నారు. ఎన్నికలకు ముందు ఏదో ఒక అస్త్రాన్ని బయటకు తీస్తున్న వైసీపీ ఈసారి ఎన్నికల్లో రాయిని ప్రయోగించిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వాస్తవానికి రాయి ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు బుధవారం సాయంత్రం వెల్లడిస్తారని లీకులు వచ్చాయి.

ఏసీబీ వలలో సివిల్ సప్లయిస్ డీటీ

» లంచం తీసుకుంటూ పట్టుబడిన శ్రీనివాస్



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 17 : రూ.10 వేలు లంచం తీసుకుంటూ మచిలీపట్నం సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ చెన్నూరు శ్రీనివాస్ బుధవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. రైస్‌మిల్లులో బియ్యం నిల్వలు అధికంగా ఉంటున్నాయని, నెలనెలా మామూళ్లు ఇవ్వాలని అవనిగడ్డ రైస్‌మిల్లు యజమాని కామిరెడ్డి వినయకుమార్‌ను సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దీంతో మిల్లు యజమాని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మచిలీపట్నం బైపాస్‌రోడ్డులోని పెట్రోలు బంకులో రైసుమిల్లు యజమాని రూ.10వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ ఏఎస్పీ స్నేహిత ఆధ్వర్యంలో అధికారులు రైడ్ చేసి చెన్నూరు శ్రీనివాస్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.



ప్రమాదంలో మృతిచెందిన బోలెం శివకుమారి

రోడ్డు ప్రమాదంలో గృహిణి దుర్మరణం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 17 : మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిపై గూడూరు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. గూడూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తోట్లవల్లూరు మండలం గరికపర్రు గ్రామానికి చెందిన బోలెం నాగమల్లేశ్వరరావు, అతడి భార్య బోలెం శివకుమారి (54) మచిలీపట్నంలో ఆసుపత్రికి వెళ్లి తిరిగి గరికపర్రు వస్తున్నారు. మార్గమధ్యలో గూడూరులో నర్సరీలో పూలమొక్కలు కొనేందుకు యూటర్న్ తీసుకోగా విజయవాడ నుంచి మచిలీపట్నం వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో శివకుమారి అక్కడికక్కడే మృతిచెందగా, నాగమల్లేశ్వరరావు కాలు విరిగింది. వారిని మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి 108పై తరలించారు. గూడూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై లైంగికదాడి.. యువకుడిపై పోక్సో కేసు

కంకిపాడు : బాలికపై లైంగికదాడికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్సై డి.సందీప్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంకిపాడు గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన వంగా ప్రవీణ్ లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ప్రవీణ్‌పై పోక్సో చట్టం కిందకేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు పోలీసులు చెప్పారు.



‘బెజవాడ’ బ్రదర్స్ బాహాబాహీ

- 10 సార్లు ఎన్నికలు జరిగితే 5 సార్లు టీడీపీ విజయం
- ఈ స్థానంలో మెరిసి మాయం అవుతున్న వైసీపీ అభ్యర్థులు





వారిద్దరూ అన్నదమ్ములు.. గత ఎన్నికల వరకూ ఇద్దరూ కలిసి పనిచేశారు. ఒక్కమాటగా ఉండేవారు. అన్న ప్రజా ప్రతినిధిగా బాహ్య ప్రపంచంలో వెలుగొందుతుంటే తమ్ముడు వెలిగే ఆ ఒత్తికి నూనె పోస్తుండేవాడు. రాను రాను అన్న ప్రవర్తనలో మార్పు, అధికార పార్టీతో అంటకాగి ఆశ్రయం కల్పించిన పార్టీకి, అండగా ఉన్న తమ్ముడికి వెన్నుపోటు పొడిచి ప్రత్యర్థి పార్టీలో చేరిపోయాడు. దీంతో ఆశ్రయం కల్పించిన ఆ పార్టీ కొత్త నేతను తయారు చేసి ఎన్నికల బరిలో దించింది. ఆ పార్టీ తెలుగు దేశం పార్టీ కాగా, ఆ అభ్యర్థి కేశినేని చిన్ని. ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి కేశినేని నాని. ఈ అన్నదమ్ములిద్దరూ ఇప్పుడు విజయవాడ పార్లమెంట్ స్థానానికి ప్రత్యర్థులుగా పోటీ పడుతూ స్టేట్ వైడ్ ఫేమస్ అయిపోయారు.

● విజయవాడ పార్లమెంటు ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట ● టీడీపీ ఆవిర్భావం తర్వాత మారిన సీను

(విజయవాడ - ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర రాజకీయాలకు విజయవాడ గుండెకాయ వంటిది. హాట్‌బెడ్ ఆఫ్ పాలిటిక్స్‌గా గుర్తింపు వుంది. అలాంటి విజయవాడ పార్లమెంటు సీటు తమ ఖాతాలో ఉండాలని ప్రధాన రాజకీయపార్టీలు తపిస్తుంటాయి. గతంలో ఈ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ బలంగా ఉండేది. టీడీపీ ఆవిర్భావం తర్వాత పరిస్థితి మారింది. దాదాపు 10 సార్లు పార్లమెంటు స్థానానికి ఎన్నికలు జరిగితే అందులో 5 సార్లు టీడీపీ గెలుపొందింది. వైసీపీ ఆవిర్భావం తర్వాత రెండు సార్లు ఎన్నికలు జరగ్గా ఒక్కసారి కూడా గెలవలేకపోయింది. పైగా వైసీపీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులెవ్వరూ జనజీవితంలో లేకుండా మాయమైపోయారు. 2014లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త కోనేరు రాజేంద్ర ప్రసాద్ ఎన్నికల అనంతరం క్రియాశీలక రాజకీయాలకు దూరమయ్యారు. 2019లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన పొట్లూరి వరప్రసాద్ (పీవీపీ) సైతం ఓటమి తర్వాత క్రియాశీలక రాజకీయాలకు స్వస్తి చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత విజయవాడ టీడీపీకి కంచుకోటలా మారింది. 2014లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కేశినేని నాని 74వేల పైచిలుకు ఓట్ల మెజారిటీ గెలుపొందారు. 2019లోనూ ఆయనే బరిలో ఉన్నారు. రాష్ట్రమంతా వైసీపీ గాలి వీస్తున్నా విజయవాడలో మాత్రం టీడీపీ జెండా ఎగిరింది. ఈసారి కేశినేని నాని వైసీపీ తరఫున పోటీలో ఉండగా ఆయన సోదరుడు కేశినేని చిన్ని టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. గత రెండు ఎన్నికల ఆనవాయితీని కొనసాగిస్తూ టీడీపీ జెండా ఎగరడం ఖాయంగా కనిపిస్తోంది. గత రెండు ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల మాదిరే కేశినేని నాని కూడా ఎన్నికల అనంతరం కనుమరుగవడం ఖాయమని టీడీపీ నేతలు విశ్లేషిస్తున్నారు.

అన్నదమ్ముల సవాల్



విజయవాడ పార్లమెంటు స్థానం నుంచి ఈసారి అన్నదమ్ములు కేశినేని నాని, కేశినేని చిన్ని ప్రధాన ప్రత్యర్థులుగా బరిలో ఉన్నారు. నాని వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తుంటే చిన్ని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ఒకప్పుడు బెజవాడ టీడీపీలో తిరుగులేని నేతగా ఉన్న నాని తన నోటి దురుసు కారణంగా అందరికీ దూరమై ఒంటరిగా మిగిలారు. ప్రస్తుతం వైసీపీలో ఉన్నా అదే ధోరణి కొనసాగుతోంది. నాని తత్వానికి వైసీపీలో ఇమడలేకపోతున్నారన్న ప్రచారమూ ఉంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఆయన ఆ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకతతో ఈసారి నాని గెలుపు కష్టమేనని సొంత పార్టీ వారే విశ్లేషిస్తున్నారు. ఇక కేశినేని చిన్ని తొలిసారి ఎన్నికల బరిలో ఉన్నా పోల్ మేనేజ్‌మెంట్‌లో అనుభవం ఉంది. సోదరుడు నాని ఎన్నికల వ్యవహారాలన్నీ తంలో చిన్నియే తెరవెనుక ఉండి నడిపేవారు. ఇది ఆయనకు కలిసి వచ్చే అంశం. సహజంగా విజయవాడ పార్లమెంటు స్థానంలో టీడీపీకి మొగ్గు ఉంటుంది. అలాంటి స్థానం నుంచి ఎలాంటి వివాదాలు లేని వ్యక్తిగా చిన్ని బరిలో ఉండటంతో ఆయన గెలుపు నల్లేరు మీద నడకనే చెబుతున్నారు. ఏదేమైనా అన్నదమ్ములిద్దరూ ప్రత్యర్థులుగా బరిలో ఉన్న నియోజకవర్గంగా రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

బెజవాడ టీడీపీ వైపే..

నవ్యాంధ్ర రాజధానిగా అమరావతిని ప్రకటించినప్పటి నుంచి విజయవాడ రూపురేఖలు మారిపోయాయి. 40 ఏళ్లుగా జరగనంత అభివృద్ధి 2014-2019 మధ్య జరిగింది. పాతబస్తీ ప్రజల తీరని కల అయిన కనకదుర్గ ఫ్లై ఓవర్ కార్యరూపం దాల్చింది. బెంజ్‌సర్కిల్ ఫ్లై ఓవర్ పూర్తయింది. మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించారు. పట్టిసీమతో కృష్ణాడెల్టా రైతులకు సకాలంలో నీరందేలా చేసిన ఘనత టీడీపీదే. కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని 13లక్షల ఎకరాల ఆయకట్టుకు పట్టిసీమ జీవనాధారంగా మారింది. ఇబ్రహీంపట్నం వద్ద కీకారణ్యంలా ఉండే ఫెర్రి ప్రాంతంలో కృష్ణా, గోదావరి జలాలు సంగమించే ప్రదేశాన్ని పవిత్రసంగమంగా ప్రభుత్వం తీర్చి దిద్దింది. వైకుంఠపురం-దాములూరు మధ్య కృష్ణానదిపై రూ.2200 కోట్లతో వంతెన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ వంతెన రాజధాని, పశ్చిమ కృష్ణా మధ్య దూరాన్ని బాగా తగ్గించి వేస్తుంది. పులిచింతల రిజర్వాయర్‌ను పూర్తి చేసి నీటిని నిల్వ చేస్తున్నారు. గన్నవరం విమానాశ్రయాన్ని అంతర్జాతీయస్థాయి ఎయిర్‌పోర్టుగా అభివృద్ధి చేసిన ఘనత టీడీపీదే. ఈ పరిణామాలన్నీ బెజవాడ పార్లమెంటు స్థానాన్ని టీడీపీకి కంచుకోటగా మార్చేశాయి. నియోజకవర్గం మొత్తంగా చూస్తే ఎస్సీ ఓటర్లు ఎక్కువ. ఏడు నియోజకవర్గాల్లో సుమారు 3 లక్షల మంది ఎస్సీ ఓటర్లు ఉన్నారు. తర్వాత బలహీన వర్గాలకు చెందిన 2.50 లక్షల మంది ఓటర్లున్నారు. యాదవ, గౌడ, నగరాల ఓటర్లు ఎక్కువ. కమ్మ సామాజిక వర్గం కూడా ప్రభావశీలంగా ఉంది. ఆ వర్గం ఓటర్లు సుమారు 2 లక్షల మంది వరకు ఉంటారు.


బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్

రాజకీయ చైతన్యానికి అడ్డా.. అవనిగడ్డ!

అవనిగడ్డ: కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గం వైవిధ్యమైన నియోజకవర్గంగా జిల్లాలో పేరొందింది. 1955లో ఏర్పాటైన ఈ నియోజకవర్గం నుంచి ఎంతో మంది రాజకీయ ఉద్దండులు ప్రాతినిధ్యం వహించి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. మాగాణులు, మెట్ట పంటలు, ఆక్వా కల్చర్, తీరం వెంబడి నివసించే మత్స్యకారుల విభిన్న జీవన శైలి కలగలిసిన ఈ ప్రాంతం రాజకీయ చైతన్యానికి పెట్టింది పేరు. జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన భూపోరాటాలకు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు, చారిత్రక ప్రదేశాలకు, పర్యాటకులను ఆకట్టుకొనే అందాలకు నెలవు.

ఇక్కడి నుంచి ఎన్నికైన అభ్యర్థులు వీరే.

1952లో ద్విసభ నియోజకవర్గంగా ఏర్పడిన అవనిగడ్డ నియోజకవర్గం నుంచి తొలిసారిగా సీపీఐ నుంచి సీహెచ్ రామలింగయ్య, కాంగ్రెస్ నుంచి వై. శివరామ ప్రసాద్ ఎన్నిక కాగా, 1955లో కాంగ్రెస్ నుంచి ఎం.రాజేశ్వరరావు ఎన్నికయ్యారు. అనంతరం దివి ప్రాంతాన్ని ఓ నియోజకవర్గంగా ఏర్పాటు చేయగా 1962, 1967లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చల్లపల్లి జమీందార్ వారసుడు యార్లగడ్డ శివరామ ప్రసాద్ కమ్యూనిస్టు నేత సనకా బుచ్చికోటయ్యపై విజయం సాధించారు. 1972లో జరిగిన ఎన్నికల్లో దివంగత మాజీమంత్రి మండలి వెంకట కృష్ణారావు దివి ప్రాంత ప్రముఖుడు మండల వెంకట స్వామి నామినేషన్ వేయగా ఆఖరి నిమిషంలో వెంకటస్వామి పోటీ నుంచి తప్పుకోవటంతో ఆ ఎన్నిక ఏకగ్రీవమమైంది. కృష్ణాజిల్లాలో అదే తొలి ఏకగ్రీవ ఎన్నిక. 1978, 1983లో జరిగిన ఎన్నికల్లోనూ కృష్ణారావు కాంగ్రెస్ పార్టీ తరఫున వరుస విజయాలు సాధించి మంత్రిగా పనిచేశారు. 1985లో, 1989లో జరిగిన ఎన్నికల్లో దివంగత మాజీ మంత్రి సింహాద్రి సత్యన్నారాయణరావు తెలుగుదేశం పార్టీ తరుఫున బరిలోకి దిగి మండలి వెంకట కృష్ణారావుపై 2సార్లు విజయం సాధించారు. 1994లో కృష్ణారావు వారసుడిగా పోటీ చేసిన బుద్ధప్రసాద్‌పై కూడా విజయం సాధించి హ్యాట్రిక్ విజయాలు సాధించిన వారి జాబితాలో స్థానం సంపాదించుకున్నారు. తరువాత బుద్ధప్రసాద్ 1999లో, 2004లో కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసి టీడీపీ నేత బూరగడ్డ రమేష్ నాయడిపై వరుసగా 2సార్లు విజయం సాధించారు. 2009 లో జరిగిన ఎన్నికల్లో అంబటి బ్రాహ్మణయ్య తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం సాధించినప్పటికీ 2013లోనే ఆయన మరణించటంతో ఆయన కుమారుడు అంబటి శ్రీహరి ప్రసాద్ ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.



రాష్ట్ర విభజనానంతరం బుద్ధప్రసాద్ తెలుగుదేశం పార్టీలో చేరి 2014లో జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబుపై విజయం సాధించి నవ్యాంధ్రప్రదేశ్ శాసనసభ తొలి ఉపసభాపతిగా పనిచేశారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబు మండలి బుద్ధప్రసాద్‌పై విజయం సాధించారు.

భౌగోళిక స్వరూపం

ఆరు మండలాలతో ఏర్పాటైన అవనిగడ్డ నియోజకవర్గంలో ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి మండలాలను ఎస్టేట్ మండలాలుగానూ, అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాలను దివి మండలాలుగా నూ పిలుస్తుంటారు. ఎస్టేట్ మండలాలు వరి మాగాణి, మెట్ట పంటలకు ప్రసిద్ధి. నిన్నమొన్నటి వరకు లక్ష్మీపురం షుగర్ ఫ్యాక్టరీ ఈ ప్రాంతంలోని ఏకైక వ్యవసాయాధారిత పరిశ్రమ. తరవాత మూతపడటంతో ఇక్కడి రైతులు వరి, మెట్టపంటల వైపు మళ్లారు. దివి మండలాలైన అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల్లో అవనిగడ్డ మండలంలోని లంక గ్రామాల్లో కొద్దిగా మెట్టపంటల సాగుజరుగుతుండగా, నాగాయలంక, కోడూరు మండలాలు వరి, ఆక్వా కల్చర్‌పై ఆధారపడి జీవిస్తున్నాయి. డెల్టాకు చివరి ప్రాంతమైన అవనిగడ్డలోని ఆరు మండలాలను తాకుతూ కృష్ణానది ప్రవహిస్తూ ఉంటుంది. ఎగువన బ్యారేజ్‌లు పెరగటంతో ప్రకాశం బ్యారేజ్ నుంచి నీటి విడుదల తగ్గటంతో రైతులకు ఇబ్బందులు పెరిగాయి.

ఎన్నికల సిబ్బందికి చుక్కలే..

నియోజకవర్గంలోని నాగాయలంక మండలం ఎదురుమొండి దీవుల్లోని ఎదురుమొండి, నాచుగుంట, ఈలచెట్లదిబ్బ గ్రామాలు నది మధ్యలో ద్వీపంగా ఉండటంతో అక్కడ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఎదురుమొండి, నాచుగుంట గ్రామాలకు ప్రస్తుతం పంటు సౌకర్యం ఉండటంతో వాహనాలపై వెళ్లే అవకాశం ఏర్పడినప్పటికీ ఈలచెట్లదిబ్బలో విధులు నిర్వహించే వారు మాత్రం తప్పనిసరిగా నాటు పడవలపైనే ప్రయాణం సాగించాల్సిన దుస్థితి నేటికీ కొనసాగుతోంది.

మండలాల వారీగా ఓటర్లు

అవనిగడ్డ నియోజకవర్గంలో ఆరు మండలాలకుగాను 211932 మంది ఓటర్లుండగా 104391 మంది పురుష ఓటర్లు, 107523 మంది మహిళా ఓటర్లు, 18 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లున్నారు. ఘంటసాల మండలంలో 33347 మంది, చల్లపల్లి మండలంలో 42752 మంది, మోపిదేవి మండలంలో 28730 మంది, అవనిగడ్డ మండలంలో 31754 మంది, కోడూరు మండలంలో 36213 మంది, నాగాయలంక మండలంలో 39136 మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్ల సంఖ్య 3132 మంది అధికంగా ఉండటం విశేషం.

నేతల కర్మాగారం

- ఒకే గ్రామం నుంచి ఎన్నికల బరిలో ముగ్గురు

‘బందలాయి చెరువు’

అవనిగడ్డ: నియోజకవర్గంలోని ఓ చిన్న గ్రామం బందలాయి చెరువు. పేరుకి చిన్నదే అయినా రాజకీయ చైతన్యానికి కొదవలేదు. అవనిగడ్డ శివారు గ్రామంగా ఉన్న ఈ గ్రామం నుంచి దివంగత మాజీమంత్రి సింహాద్రి సత్యన్నారాయణరావు వరుసగా 3 సార్లు అవనిగడ్డ ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రిగా పనిచేశారు. అలాంటి గ్రామం నుంచి వచ్చే ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులు బరిలో ఉండటం, అదీ ఒకే ఇంటి పేరు వారవటం విశేషం. ఎమ్మెల్యేగా ఉన్న రమేష్ బాబు మరోమారు ఎన్నికల బరిలోకి దిగుతుండగా, మాజీ మంత్రి దివంగత సింహాద్రి సత్యన్నారాయణ తనయుడు, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ రావు మచిలీపట్నం పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఇక హైదరాబాద్‌లో నివాసముంటున్న ట్రాన్స్‌జెండర్ తమన్నా సింహాద్రి వచ్చే ఎన్నికల్లో తాను పిఠాపురం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పవన్ కల్యాణ్‌పై పోటీ చేయనున్నట్లు ప్రకటించి వార్తల్లో నిలిచారు. వీరేకాక ఇదే గ్రామంలో పుట్టి బాల్యంలో ఇక్కడే గడిపిన మంత్రి అంబటి రాంబాబు సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి, ఆయన సోదరుడు అంబటి మురళి పొన్నూరు వైసీపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. వారి తల్లి స్వగ్రామం బందలాయి చెరువు కావటంతో వారు ఇక్కడే పుట్టడం, బాల్యం గడపటంతో ఈ గ్రామం నుంచి వచ్చే ఎన్నికల్లో మొత్తం ఐదుగురు అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచినట్టయింది. వీరిలో సింహాద్రి రమేష్ బాబు, డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, తమన్నా సింహాద్రి పూర్తిగా ఇక్కడివారే. కాగా మిగిలిన ఇద్దరూ తమ బాల్యాన్ని ఇక్కడ గడిపిన వారవటంతో ఈ చిన్న శివారు గ్రామం తమ నేతల కర్మాగారమని స్థానికులు సరదాగా పక్క గ్రామాల వారితో చతురులాడుతూ ఉంటారు. వీరిలో నలుగురు వైసీపీ నుంచే పోటీ చేస్తుండగా తమన్నా సింహాద్రి మాత్రం ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. ఈ గ్రామం నుంచి వచ్చిన పర్చూరి అశోక్ బాబు ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేసి అనంతరం టీడీపీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికై ప్రస్తుతం శాసన మండలి సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఇదండీ పట్టుమని 200 గడపలు కూడా లేని బందలాయి చెరువు గ్రామ రాజకీయ ప్రాశస్త్యం.


సింహాద్రి రమేశ్‌బాబు


సింహాద్రి చంద్రశేఖర్


తమన్నా సింహాద్రి


అంబటి రాంబాబు


అంబటి మురళీకృష్ణ


పర్చూరి అశోక్‌బాబు

ఓట్లలో సగం.. సీట్లలో నామమాత్రం

- కేటాయింపులో మహిళకు మొండిచెయ్యి
- ఒక్కో సీటు కేటాయించిన టీడీపీ, కాంగ్రెస్
- పూర్తిగా విస్మరించిన వైసీపీ


తంగిరాల సౌమ్య


లాం తాంతియా కుమారి

కంచికచర్ల: ఓట్లలో సగానికి మించే మహిళా ఓటర్లు ఉన్నారు. వారి ఓట్ల కోసం రాజకీయ పార్టీలన్నీ సాగిలపడతాయి. వారి సంక్షేమమే తమ ధ్యేయమంటూ ఊదరగొడతారు. సీట్లు కేటాయింపులో మాత్రం మొండిచెయ్యి చూపిస్తున్నారు. మహిళలకు రాజకీయంగా 50శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామంటూ పదే పదే గొప్పలు చెప్పుకునే రాజకీయ పార్టీలు, వారిని చట్టసభలకు పంపించేందుకు వెనుకంజ వేస్తున్నాయి. ప్రాధాన్యత క్రమంలో మహిళలకు తగిన సంఖ్యలో సీట్లు ఇవ్వటం లేదు. కనీసం 10 శాతం రిజర్వేషన్ కూడా అమలు చేయని దుస్థితి. గత ఏడాది సెప్టెంబరు 20న లోక్‌సభ మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించింది. ఈ బిల్లు ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లోని మొత్తం సీట్ల సంఖ్యలో మూడోవంతు మహిళలకు రిజర్వ్ చేయాల్సి ఉంటుంది. ఈ బిల్లు తాజా జనగణన, డీలిమిటేషన్ తర్వాత అమల్లోకి రానుంది. సాధారణ ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి కృష్ణా జిల్లాలో మొత్తం రెండు లోక్‌సభ స్థానాలు, 16 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. అధికార వైసీపీ ఉమ్మడి జిల్లాలో ఒక్క సీటును కూడా మహిళలకు కేటాయించలేదు. పూర్తిగా విస్మరించింది. ఎన్డీఏ కూటమిలోని తెలుగుదేశం పార్టీ, ఇండియా కూటమిలోని కాంగ్రెస్ పార్టీ మాత్రం మహిళలకు ఒక్కో సీటును కేటాయించాయి. ఎన్టీఆర్ జిల్లాలో నందిగామ సీటుకు తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను ఖరారు చేసింది. 2014 ఉప ఎన్నికల్లో విజయం సాధించిన సౌమ్య, 2019 ఎన్నికల్లో ఓడిపోయింది. ఇంజనీరింగ్ పట్టభద్రురాలైన ఆమెకు టీడీపీ మూడోసారి సీటు ఇవ్వటం గమనార్హం. తిరువూరు సీటుకు కాంగ్రెస్ పార్టీ లాం తాంతియా కుమారిని ఎంపిక చేసింది.

పసుపుకే పట్టం!

తెలుగుదేశం పార్టీకి ఉమ్మడి కృష్ణా జిల్లా పెట్టని కోట. 1982లో పార్టీ ఆవిర్భావం తర్వాత జరిగిన ఎన్నికల్లో ఎక్కువ సార్లు జిల్లావాసులు టీడీపీకే పట్టం కట్టారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ సొంత జిల్లా కావడంతో సహజంగానే ఈ జిల్లావాసులు టీడీపీ పట్ల కాస్త ప్రేమతో ఉంటారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత 9 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే 6 సార్లు టీడీపీ జెండా ఎగురవేసిన ఘనత జిల్లావాసులది. పార్లమెంటు ఎన్నికల్లోనూ అదే ప్రేమ.

● తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత ఉమ్మడి కృష్ణాజిల్లాలో 9 సార్లు ఎన్నికలు

- 6 ఎన్నికల్లో టీడీపీ జెండా రెపరెపలు
- ఐదేళ్ల వైసీపీ పాలనతో విసుగెత్తిన కృష్ణా తీరం
- అభివృద్ధి మరచి బూతులు.. విద్వేషరాజకీయాలతో కాలక్షేపం

విజయవాడ - ఆంధ్రజ్యోతి:

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 2పార్లమెంటు, 16 అసెంబ్లీ స్థానాలుండగా జిల్లాల పునర్విభజన తరువాత కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో చెరి పార్లమెంటు, చెరు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. మిగతా రెండు ఏలూరు జిల్లాలో కలిసిపోయాయి. గత ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఎవరికి వారే పోటీ చేయగా ఈసారి మాత్రం కూటమిగా పోటీ చేస్తున్నారు. ఈసారి కృష్ణా తీరం ఎవరివైపు మొగ్గుచూపబోతోందన్నది రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించే అంశం.

ఎన్టీఆర్ జిల్లాలో ఇదీ పరిస్థితి..

విజయవాడ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో పశ్చిమ నుంచి బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి, వైసీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ ప్రధాన అభ్యర్థులు. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా వెలంపల్లి శ్రీనివాసరావు పోటీ చేసి గెలుపొందారు. ఆయన అవినీతి, అక్రమాలతో ఈసారి ఆసిఫ్ గెలుపు కష్టమేనన్నది స్థానికుల మాట. పశ్చిమ ఆనవాయితీ ప్రకారం ఈసారి వేరే పార్టీ జెండా ఎగరాల్సిందే. ఇక తూర్పు నుంచి టీడీపీ అభ్యర్థిగా గద్దె రామ్మోహన్, వైసీపీ అభ్యర్థిగా దేవినేని అవినాశ్ బరిలో ఉన్నారు. వైసీపీ పంచన చేరిన అవినాశ్, ఆయన అనుచరగణం విధ్వంసాలను గుర్తుపెట్టుకుంటే తూర్పు ఓటర్లు కచ్చితంగా గద్దె వైపు మొగ్గుచూపుతారన్నది విశ్లేషకుల మాట. ఇక సెంట్రల్ నుంచి టీడీపీ అభ్యర్థిగా బొండా ఉమ, వైసీపీ అభ్యర్థిగా వెలంపల్లి శ్రీనివాసరావు పోటీలో ఉన్నారు. ఇక్కడ వెలంపల్లికి సిటింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహాయ నిరాకరణ, సొంత పార్టీ కార్పొరేటర్ల ధిక్కారం, పశ్చిమ అవినీతి, తాజాగా గులకరాయి డ్రామా రివర్స్ ఇవన్నీ ఆయనపై ప్రభావం చూపేవే. మైలవరం నుంచి టీడీపీ అభ్యర్థిగా వసంత కృష్ణ ప్రసాద్, వైసీపీ అభ్యర్థిగా సర్నాల తిరుపతి రావు పోటీలో ఉన్నారు. తిరుపతిరావుది ఎమ్మెల్యే స్థాయి కాదని వార్డు సభ్యుడిగా గెలవలేని వ్యక్తిని కృష్ణప్రసాద్ జెడ్పీటీసీగా గెలిపించారని, అలాంటి వ్యక్తిని ఎమ్మెల్యేగా అంగీకరించలేకపోతున్నామని వైసీపీ నేతలే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఇక తిరువూరులో టీడీపీ అభ్యర్థిగా కొలికపూడి శ్రీనివాసరావు, వైసీపీ అభ్యర్థిగా నల్లగట్ల స్వామిదాసు పోటీలో ఉన్నారు. నల్లగట్ల గతంలో ఎమ్మెల్యేగా చేసిన సమయంలో ఆయన చేసిన అవినీతిని తలచుకుంటేనే ఓటర్లు తిరస్కారభావంతో చూస్తారు. జగ్గయ్యపేట నుంచి టీడీపీ అభ్యర్థిగా శ్రీరాం తాతయ్య, వైసీపీ అభ్యర్థిగా సామినేని ఉదయభాను పోటీలో ఉన్నారు. ఇక్కడా సామినేనికి అవినీతి శాపంగా మారబోతోంది. నందిగామ నుంచి టీడీపీ అభ్యర్థిగా తంగిరాల సౌమ్య, వైసీపీ అభ్యర్థిగా మొండితోక జగన్మోహన రావు పోటీచేస్తున్నారు. మొండితోక బ్రదర్స్ అక్రమాలు ఈ ఎన్నికల్లో ముంచబోతున్నాయన్నది స్థానికుల మాట. మొత్తం మీద ఎన్టీఆర్ జిల్లాలోని ఏ నియోజకవర్గంలోనూ వైసీపీ అభ్యర్థులకు సానుకూలత కనిపించని పరిస్థితి.



కృష్ణాజిల్లాలో..

జిల్లాలో మచిలీపట్నం పార్లమెంటుతోపాటు 7 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఎంపీ స్థానానికి 10సార్లు ఎన్నికలు జరిగితే 5 సార్లు టీడీపీ, 4 సార్లు కాంగ్రెస్, ఒకసారి వైసీపీ గెలుపొందాయి. ఈసారి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరఫున జనసేన అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరి పోటీ చేస్తుంటే వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ పోటీలో ఉన్నారు. సిటింగ్ ఎంపీగా ఉన్న బాలశౌరి చేసిన అభివృద్ధి, ఆయనపై పెద్దగా అవినీతి ఆరోపణలు లేకపోవడం కలిసివచ్చే అంశాలు. ఇక ఏడు అసెంబ్లీ స్థానాల్లో అవనిగడ్డ జనసేనకు కేటాయించారు. కూటమి అభ్యర్థిగా మండలి బుద్ధ ప్రసాద్ పోటీ చేస్తున్నారు. సౌమ్యుడిగా పేరున్న బుద్ధ ప్రసాద్‌కు ఎలాంటి అవినీతి మరక లేకపోవడం కలిసి వచ్చే అంశం. వైసీపీ నుంచి పోటీ చేస్తున్న సింహాద్రి రమేశ్‌పై అవినీతి ఆరోపణలతోపాటు అవనిగడ్డను రౌడీరాజ్యానికి అడ్డాగా మార్చారన్న పేరుంది. మచిలీపట్నం నుంచి టీడీపీ అభ్యర్థిగా కొల్లు రవీంద్ర, వైసీపీ అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే పేర్ని నాని తనయుడు పేర్ని కిట్టు బరిలో ఉన్నారు. ఈ ఐదేళ్లలో తండ్రీకొడుకులు చేసిన అక్రమాలు, అవినీతి మైనస్‌గా మారనున్నాయి. పెడన నుంచి టీడీపీ అభ్యర్థిగా కాగిత కృష్ణ ప్రసాద్, వైసీపీ అభ్యర్థిగా ఉప్పాల రాము పోటీలో ఉన్నారు. ఉప్పాల రాము సతీమణి ప్రస్తుతం జెడ్పీ చైర్మన్‌గా ఉన్నా నడిపించేదంతా రామునే అని ఆరోపణలున్నాయి. పామర్రు నుంచి టీడీపీ అభ్యర్థిగా వర్లకుమార్ రాజా, వైసీపీ అభ్యర్థిగా కైలే అనీల్ కుమార్ పోటీలో ఉన్నారు. కైలే అనీల్‌పై పెద్దగా వ్యతిరేకత లేకున్నా ఇసుక, గ్రావెల్ దోపిడీలో ఆయన అనుచరుల పాత్రపై ఆరోపణలున్నాయి. ఇక కృష్ణాజిల్లాలో హాట్ సీట్స్‌గా పేరొందిన గన్నవరం, గుడివాడ, పెనమలూరుపై రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. గన్నవరం నుంచి టీడీపీ అభ్యర్థిగా యార్లగడ్డ వెంకట్రావు, వైసీపీ అభ్యర్థిగా వల్లభనేని వంశీ పోటీ చేస్తున్నారు. వంశీ, ఆయన అనుచరుల దోపిడీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. గుడివాడ నుంచి టీడీపీ అభ్యర్థిగా వెనిగండ్ల రాము, వైసీపీ అభ్యర్థిగా కొడాలి నాని పోటీ చేస్తున్నారు. ఇక్కడా గన్నవరం సీనే రిపీట్ కానుంది. నాని బూతుల నానీగా, ఆయన అనుచరులు గడ్డం గ్యాంగ్‌గా పేరొందారు. వీరి ఆగడాలు నాని గెలుపును ప్రభావితం చేయనున్నాయి. పెనమలూరు నుంచి టీడీపీ అభ్యర్థిగా బోడె ప్రసాద్, వైసీపీ అభ్యర్థిగా జోగి రమేశ్ పోటీ చేస్తున్నారు. ప్రస్తుతం పెడన నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న జోగిని అక్కడ గెలవలేడన్న కారణంతో పెనమలూరు మార్చారు. అంటే పెడనలో ఏ స్థాయిలో దోచేశారన్నది అర్థమవుతుంది. ఇన్ని భుజకీర్తులతో గట్టెక్కడం కత్తి మీద సామని జోగి అనుచరులే అంటున్నారు. కృష్ణా జిల్లాలోనూ వైసీపీకి వన్‌సైడ్‌గా విజయాన్ని కట్టబెట్టే నియోజకవర్గాలేవీ లేవంటే అతిశయోక్తి కాదు.



విజయవాడ

● తూర్పు ● సెంట్రల్ ● పశ్చిమ

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 17 : విద్యుత్ లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతుల కారణంగా అజిత్‌సింగ్‌నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యూ ఆర్ఆర్ పేట రోడ్డు, జీవీఎస్. అపార్ట్‌మెంట్స్ రోడ్డు, కళ్యాణ్ గౌరీ అపార్ట్‌మెంట్స్ ఎదురు రోడ్డు, చలసాని అపార్ట్‌మెంట్స్ రోడ్డు, జిమ్ రోడ్డు, మంజునాథ అపార్ట్‌మెంట్స్ రోడ్డు, సన్ సిటీ కాలనీ, జయమ్మ ఐ ఆసుపత్రి రోడ్డు, స్మైల్ హాస్పిటల్ రోడ్డు, నూజివీడు రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.15


శ్రీషిర్డి నాగసాయిబాబా మందిరంలో


టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో


గురునానక్ కాలనీలో...


వెటర్నరీ కాలనీలో


ఎన్టీఆర్ కాలనీలో


దేవినగర్‌లో

కనుల పండువగా సీతారాముల కల్యాణం

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం నగరంలోని రామమందిరాల్లో శ్రీరాముడిని పూజించేందుకు భక్తులు పోటెత్తారు. ఉదయం శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

గవర్నర్‌పేట, ఏప్రిల్ 17: లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డి నాగసాయిబాబా-నాగమానసాదేవి మందిరంలో లక్షలాది పూలతో రామదర్బార్ పటాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు శ్రీసీతారాములకు పసుపు వస్త్రాలు సమర్పించారు. శ్రీరాముడికి పంచామృతం, కుంకుమపూవు, పాలు, గంగాజలంతో అభిషేకం, భక్తిశ్రద్ధలతో కల్యాణం నిర్వహించారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో వడపప్పు, పానకం నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు. బీసెంట్ రోడ్డు రామాలయం వద్ద, ఏలూరు రోడ్డులోని రామమందిరం, బకింగ్ హాం పోస్టాఫీసు సెంటర్‌లోని శ్రీ కోదండ రామాలయం, కొత్తవంతెన సెంటర్‌లోని ఆంజనేయ స్వామి టెంపుల్ వద్ద శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం జరిగాయి.

సెంట్రల్ టీడీపీ కార్యాలయంలో ...

అజిత్‌సింగ్‌నగర్ : టీడీపీ సెంట్రల్ నియోజకవర్గం కార్యాలయంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. పండుగను పురస్కరించుకుని పూజా కార్యక్రమాలు, శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని పండితులు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో వేద పండితులు రామాయణ విశిష్టతను తెలియజేశారు. బొండా ఉమా సతీమణి బొండా సుజాత, బొండా సిద్ధార్థ, బొండా రవి తేజ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

3, 4 డివిజన్లలో ...

భారతీనగర్: ఎన్టీఆర్ కాలనీలోని శ్రీ కోదండ రామాంజనేయ, శ్రీ విజయ కార్యసిద్ధి గణపతి ఆలయంలో ఎన్టీఆర్, వెటర్నరీ, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ కోదండ రామచంద్రస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం 10 గంటలకు తేతలి శ్రీనివాస్ దంపతులు, తేతలి సీతారాం దంపతులు, గొరిజాల వెంకటేశ్వరరావు దంపతుల చేతుల మీదుగా శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది.

● వెటర్నరీ కాలనీ మెయిన్ రోడ్డులో వెటర్నరీకాలనీ సీతారాములు కల్యాణ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది.

● గురునానక్ కాలనీలోని శ్రీకోదండరామాలయంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో స్వామికి ప్రత్యేక పూజలు, అనంతరం శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

● కరెన్సీనగర్‌కాలనీలోని శ్రీ దాసాంజనేయస్వామి దేవాలయంలో శ్రీరామ భక్తసేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది.

2000 మందికి అన్నదానం

శ్రీ రామచంద్ర నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీలోని ధ్యాన మందిరంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. మధ్యాహ్నం సుమారు 2000 మందికి అన్నదానం చేశారు. ఈవేడుకల్లో భాగంగా శుక్రవారం సీతారాముల పట్టాభిషేకం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

తలంబ్రాలు సమర్పించిన హజరత్తయ్య గుప్తా

పాతరాజరాజేశ్వరీ పేట: పూర్ణానందంపేట, ఏలూరు లాకుల వద్ద ఉన్న శ్రీదాసాంజనేయ సీతారామ ఆలయంలో బుధవారం శ్రీసీతారామ కల్యాణం కన్నులవిందుగా జరిగింది. ఆలయ ట్రస్టీ కన్వీనర్, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త వేముల హజరత్తయ్య గుప్తా కల్యాణంలో పాల్గొని తలంబ్రాలు సమర్పించారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా లోక కల్యాణార్థం కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు. భక్తులకు వడపప్పు, పులిహోర, పానకం ప్రసాదాలు అందజేసినట్లు తెలిపారు. మద్దాళి చంద్ర శివప్రసాద్, మద్దాళి రమేష్, మద్దాళి సురేష్ దంపతులు, గోపి కృష్ణమాచార్యులు, షణ్ముఖ స్వామి తదితరులు పాల్గొన్నారు.

3,500 మందికి అన్నసంతర్పణ

రాజరాజేశ్వరిపేటలోని పురుగుల వీరాంజనేయ స్వామి దేవస్థానంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలను ఆలయ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు ధనేకుల వెంకట హరికృష్ణ ఘనంగా నిర్వహించారు. కంసాలిపేట, పాతరాజరాజేశ్వరి పేట, కొత్త రాజరాజేశ్వరి పేట నుంచి వచ్చిన దాదాపు 3,500 మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ధనేకులు హరికృష్ణ, ఎం. మోహన్‌రావు, రాజ రమేష్ బాబు, అర్చకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● పాతరాజరాజేశ్వరిపేటలోని శ్రీవరసిద్ధి వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టిన అనంతరం ధనేకుల హరికృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు వడపప్పు, పులిహోర, పానకం అందజేశారు. డి. సింగయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సత్యనారాయణపురం: దేవినగర్, ముత్యాలంపాడు, సత్యనారాయణపురం తదితర ప్రాంతాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు కనుల పండువగా జరిగాయి. ముత్యాలంపాడు కోదండరామాలయంలో బుధవారం సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం భక్తులకు విసనకర్రలు పంపిణీ చేశారు. దేవినగర్ మూడవలైన్‌లోని శ్రీకోదండరామాలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్పొరేటర్ జానారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు.భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు పానకం పంపిణీ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షకార్యదర్శులు కాటూరు .వీర్రాజు, గంగిశెట్టి. సాంబశివరావులు పర్యవేక్షించారు.


తలంబ్రాలు సమర్పిస్తున్న హజరత్తయ్య గుప్తా


అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకుడు వెంకట హరికృష్ణ


మొగల్రాజపురం రెవెన్యూ కాలనీ రఘురామ స్ట్రీట్‌లో విగ్రహాల ఊరేగింపు

పశ్చిమలో రామరాజ్యం రావాలి : సుజనాచౌదరి

విద్యాధరపురం: పశ్చిమ నియోజకవర్గంలో కొనసాగుతున్న అరాచక పాలన పోయి రామరాజ్యం రావాలని కూటమి బలపరచిన బీజేపీ పశ్చిమ అభ్యర్థి వై సుజనా చౌదరి అన్నారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని భవానీపురంలోని బీజేపీ కార్యాల యంలో బుధవారం సీతా లక్ష్మణ హనుమత్సమేత శ్రీరామ చంద్రమూర్తికి సుజనా చౌదరి దంపతులు పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వ్యాపార వాణిజ్యకేంద్రంగా ఉన్న పశ్చిమ ఆర్థికంగా ఎదుగుదల కావాల్సి ఉందన్నారు. ఇందుకు కేంద్రంలో మోదీ , రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో డబుల్ ఇంజిన్ సర్కారు ద్వారా సహకారం అందిస్తామని తెలిపారు, ఇంద్రకీలాద్రిని కూడా ఆధ్యాత్మిక కేంద్రంగా మారేెందుకు కృషి చేస్తామన్నారు. మైనార్టీలకు హజ్ హౌస్ నిర్మాణం, క్రైస్తవుల చర్చిలకు మరమ్మతులు తదితరాలు తన కార్యాచరణలో ఉన్నాయన్నారు. నాయకులు అడ్డూరి శ్రీరామ్, పైలా సోమినాయుడు, జనసేన నాయకురాలు రజని, అమరావతి బహుజన సేవా సమితి నాయకులు బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామచంద్రుని పాలన ఆదర్శనీయం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్


శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న గద్దె రామ్మోహన్

పటమట, ఏప్రిల్ 17 : శ్రీరాముడు ప్రజాభీష్టం కోసం ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి ప్రజల కోసం మంచి పరిపాలన చేశారని, శ్రీరామచంద్రుని పాలన కడు ఆదర్శనీయమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. శ్రీరామనవమి సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, యువ నాయకులు గద్దె రాజేష్, క్రాంతికుమార్‌లు విడివిడిగా నియోజకవర్గంలోని పలుచోట్ల జరిగిన సీతారామకల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ శ్రీరామనవమి ఉత్సవాల్లో అన్ని అన్నివర్గాలు, అన్ని మతాల వారు ఉత్సాహంగా పాల్గొనడం భిన్నత్వంలో ఏకత్వాన్ని సూచిస్తుందన్నారు. ప్రజలు అందించిన అధికారాన్ని దుర్వినియోగం చేయరాదని, సమాజంలో సామాజిక చైతన్యం పెరగాలన్నదే సీతారాములు కల్యాణ చరిత్ర అని రామ్మోహన్ అన్నారు.

వైభవంగా ఎలక్ట్రిసిటీ కాలనీలో.. పటమట ఎలక్ట్రిసిటీ కాలనీ ఎనిమిదో లైన్ నల్లూరు చక్రధరావు రోడ్డులో పంచముఖ ఆంజనేయస్వామి గుడి వద్ద కాలనీవాసులు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, వైసీపీ తూర్పు ఇన్‌ఛార్జి దేవినేని అవినాష్‌లు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులను స్వీకరించారు. కమిటీ సభ్యులు నల్లూరు కాశీ, గర్నేని చలపతిరావు, గద్దె తిలక్, పి. మధుసూదనరావు, నల్లూరు అఖిల్‌లు పాల్గొన్నారు.


వాసవీనగర్ శ్రీరామనవమి వేడుకల్లో గద్దె అనురాధ


ఎలక్ట్రిసిటీ కాలనీలో ..


కొత్తపేట నగరాల సీతారామస్వామి ఆలయంలో కల్యాణోత్సవం

కొత్తపేట నగరాల సీతారాముల ఆలయంలో
ఘనంగా సీతారాముల కల్యాణం

వన్‌టౌన్, ఏప్రిల్ 17: కొత్తపేట నగరాల సీతారాముల ఆలయంలో బుధవారం సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నగరాల సీతారామ స్వామి , మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థాన కమిటీ అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, గౌరవ అధ్యక్షుడు బెవర సూర్యనారాయణ, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, కమిటీ మాజీ అధ్యక్షుడు పోతిన బేసికంతేశుడు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. దుక్క మురళీధర్, వెంకటి దంపతులు పీటలపై కూర్చుని స్వామివారికి తలంబ్రాలు సమర్పించారు. సీతమ్మకు మంగళ సూత్రధారణ చేశారు. భక్తులకు పానకం, వడపప్పు ప్రసాదాలను పంచారు. గురువారం రథోత్సవం, 20న ఉదయం అన్నవితరణ నిర్వహించనున్నారు.

శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణం


పూజలు చేస్తున్న సుజనా చౌదరి, పద్మజ దంపతులు

చిట్టినగర్, ఏప్రిల్ 17: శ్రీరామనవమి పురస్కరించుకొని బుధవారం పలు ప్రాంతాల్లో సీతారామ కల్యాణోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి.● దీనదయాళ్‌నగర్ శ్రీరామ నామ సీతారామ శివసాయి మందిరంలో జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవం పశ్చిమ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి సతీమణి పద్మజ దంపతులు స్వామివారి కల్యాణంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త హేరంభకుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, బలివాడ శివకుమార్ పట్నాయక్, భక్తులు పాల్గొన్నారు. ● పాలఫ్యాక్టరీ నాగమ్మ సత్రం వీరాంజనేయ ధ్యానమందిరంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.

● గొల్లపాలెంగట్టు కస్తూరి బాయి ఆశ్రమం ప్రాంతంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు నిర్వాహకులు పానకం, వడపప్పు, విసనకర్రలు, కర్బూజ పండ్లు పంపిణీ చేశారు. ● టేనర్‌పేట అడ్డరోడ్డులో రామాలయంలో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. భక్తులకు ఆలయ నిర్వాహకులు పానకం, వడపప్పు పంపిణీ చేశారు.

భవానీపురం: 43వ డివిజన్ ఊర్మిళాసుబ్బారావు నగర్‌లో సీతారామసేవా సమితి ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్లెబోయిన కొండ, మార్తాల సుబ్బారెడ్డి, శివశంకర హరిప్రసాద్, వేల్పుల శ్రీనివాస్, నారాయణ రెడ్డి, తిరుపతయ్యలు పాల్గొన్నారు. చెరువు సెంటర్‌లోని సీతాలక్ష్మణ సమేత కోదండ రామాలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు లింగమల్లు జనార్ధన రావు ఆధ్వర్యంలో సీతారా ముల కల్యాణ వైభవం సాగింది. భక్తులకు పానకం, ఇతర తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


ఊర్మిళానగర్‌లో పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న దాతలు

సాయిబాబాకు చందనోత్సవం

హెచ్‌బీ కాలనీలోని సంకల్ప సిద్ధి షిర్డీసాయిబాబా ఆలయంలో సాయిబాబాకు చందనోత్సవ ఊరేగింపు బుధవారం సాయంత్రం పురవీధుల్లో అశేష భక్త జనసందోహం నడుమ జరిగింది. ఆలయంలో సువాసినీల కోలాట నృత్యాలు అలరించాయి. సాయిబాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వర రావు, ఉపాధ్యక్షుడు మోటమర్రి సుబ్బారావు, చందలూరు రాజశేఖర్, పీవీఎల్. ప్రసాద్, విజయకుమార్, రజనీకాంత్, కృష్ణ, వైసుబ్బారావులు, సాయి సేవకులు పాల్గొన్నారు.

జగన్మోహనరెడ్డి రాక్షస పాలనకు చరమగీతం పాడాలి

వన్‌టౌన్, ఏప్రిల్ 17: జగన్మోహనరెడ్డి రాక్షస పాలనకు చరమగీతం పాడాలని టీడీపీలో చేరిన వైసీపీ నాయకుడు ఆచంటి ఉమామహేశ్వరరావు అన్నారు. టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బుద్దా వెంకన్న, సీనియర్ నాయకులు చెన్నుపాటి శ్రీను, కొనకళ్ల బుల్లయ్యల ఆధ్వర్యంలో పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వెంపటి జయకిరణ్, చింతలపూడి సత్యనారాయణ, కానూరు అర్జున్, పైడి శ్రీను, పూతరెడ్డి వెంకట్రావు,సిరిగుడి చందు, మత కొండ, డి రామారావు తదితరులుటీడీపీలో చేరిన వారిలో ఉన్నారు.

పలువురు టీడీపీలో చేరిక

● పశ్చిమలోని 47వ డివిజన్‌కు చెందిన పలువురు వైసీపీ శ్రేణులు బుధవారం బుద్దా వెంకన్న కార్యాలయంలో టీడీపీలో చేరారు. ఉత్తరాంధ్ర టీడీపీ ఇన్‌చార్జి,మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్‌మీరా, సీనియర్ నాయకుడు చెన్నుపాటి శ్రీనివాస్ తదితరులు పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పొట్నూరి సుబ్రహ్మణ్యం, ఎర్రమల మధు, కామేష్, శేషుకుమార్, అజయ్‌కుమార్, రాజ్‌కుమార్, కార్తీక్, వెంకటేష్, జనార్థన్, రాజేష్, నరసింహ, బాలు, రాజేష్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, విజయ్, హరివర్ధన్, విజయకుమార్ పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు











'ఒకవేళ నటి కాకపోయి ఉంటే ఏమయ్యేవారు' అని అడిగితే... 'ఊహ తెలిసినప్పటి నుంచి అది తప్ప నా మనసులో వేరే ఆలోచనే రాలేదు' అంటుంది **షనయా కపూర్**. ఇంకా ఒక్క చిత్రంలోనూ కనిపించని ఈ అమ్మాయి పేరు ఇప్పటికే పరిశ్రమలో బాగా వినిపిస్తోంది. బాలీవుడ్ నటుడు సంజయ్‌కపూర్ తనయ కావడం అందుకు మొదటి కారణమైతే... రెండోది... సామాజిక మాధ్యమాల్లో లేటెస్ట్ ట్రెండ్స్‌ను పరిచయం చేస్తూ... సరికొత్త లుక్స్‌తో అలరించడం. ఫ్యాషన్ ఐకాన్‌గా లక్షల మంది అభిమానులను సంపాదించుకున్న షనయా... ఓ భారీ బడ్జెట్ చిత్రంతో వెండితెరకు నయా మెరుపులు అద్దడానికి సిద్ధమవుతోంది.

ష'నయా' అవతార్

షనయా కపూర్ సినీ నేపథ్యం చాంతాడంత ఉంటుంది. ఆమె తండ్రి సంజయ్ కపూర్ ఒకప్పటి బాలీవుడ్ హీరో, నిర్మాత. తల్లి మహీప్ సంధూ నటి. ఇక అనిల్ కపూర్, బోనీ కపూర్, అర్జున్, సోనమ్, జాన్వీ, ఖుషీ, రియా... షనయా కుటుంబంలో దాదాపు అందరూ పరిశ్రమలో భాగమైనవాళ్లే. అందుకే తన మనసులో కూడా సినిమా



తప్ప మరో ఆలోచన రాలేదంటుంది షనయా.

"నేను నటిని అవుతా'నని మా అమ్మానాన్నకు చెప్పని రోజంటూ లేదు. చిన్నప్పటి నుంచీ నటన మినహా మరొక వృత్తిని నేను ఊహించుకోలేదు. అంత మక్కువ నాకు. ఇంట్లో డిన్నర్ టేబుల్ దగ్గర సినిమా ముచ్చట్లు వింటూ పెరిగాను. నా జీవితమంతా సినీ వ్యక్తుల చుట్టూనే తిరుగుతోంది. ఈ వాతావరణమే నాపై బలమైన ప్రభావం చూపింది. నటన తరువాత నాకు బాగా ఇష్టమైంది నాట్యం. నన్ను నేను తెలుసుకోవడానికి, నాలోని భావాలను వ్యక్తం చేయడానికి నాట్యం ఒక అద్భుతమైన సాధనం" అంటున్న షనయా... మంచి డ్యాన్సర్ కూడా.

'షూటింగ్‌లు లేని రోజుల్లో పొద్దున్నే లేచి నాట్య తరగతులకు వెళతాను. డ్యాన్స్ చేస్తుంటే నాలో ఆత్మవిశ్వాసం రెట్టింపు అయినట్టు అనిపిస్తుంది. కొన్ని కారణాల వల్ల రెండేళ్ల కిందట ఆపేసిన కథక్ అభ్యాసం మళ్లీ మొదలుపెట్టాను. 'పాకీజా, ఉమ్రావ్ జాన్' తదితర చిత్రాల్లోని పాటలు పెట్టుకొని డ్యాన్స్ చేస్తుంటాను. బెల్లీ డ్యాన్స్‌ను ఒక కళా రూపంగా అధ్యయనం చేస్తున్నా. వీటివల్ల భిన్న సంస్కృతుల గురించి తెలుసుకొనే అవకాశం నాకు కలుగుతుంది. అలాగే కత్రినా డ్యాన్స్ నాకు ఎంతో ఇష్టం. ప్రస్తుతం ఆమె పాటలన్నిటినీ చూసే పనిలో ఉన్నా' అంటుంది షనయా.

అసిస్టెంట్ డైరెక్టర్‌గా...

ముంబయి 'ఎకోల్ మాండియల్ వరల్డ్ స్కూల్'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆమె... డిగ్రీ అనంతరం నటనలో మెలకువలు నేర్చుకోవడానికి తరచూ వర్క్‌షాప్‌లకు వెళ్లేది. నెట్‌ఫ్లిక్స్‌లో 'ది రియల్ లైవ్స్ ఆఫ్ బాలీవుడ్ వైవ్స్' ద్వారా తొలిసారి తెరపై కనిపించింది. 2019లో శ్రీదేవి కూతురు, తన కజిన్ జాన్వీ కపూర్ నటించిన 'గుంజన్ సక్సేనా' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా తన సినీ ప్రయాణం ప్రారంభించింది షనయా. అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేయడంవల్ల చిత్ర నిర్మాణంలోని లోతుపాతులు తెలుసుకోగలిగానని, నటిగా కెరీర్ ప్రారంభించడానికి అది ఒక పునాది రాయిలా ఉపయోగడిందని అంటుంది ఈ ముద్దుగుమ్మ.

ఆ ఒత్తిడి లేదు...

కపూర్ లాంటి ప్రముఖ సినీ కుటుంబం నుంచి ఎవరైనా పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారంటే... వారిపై విపరీతమైన ఒత్తిడి ఉంటుంది. 'అది వాస్తవమే అయినా... నేను భిన్నమైన వ్యక్తిని. ఎందుకంటే నా చుట్టూ ఉన్నవారంతా ఎప్పుడూ సినిమాల గురించే మాట్లాడుతుంటారు. మా ఇంట్లో నిర్మాతలు, దర్శకులు, నటులున్నారు. స్టైలిస్టులు కూడా ఉన్నారు. మా ఇంట్లోవాళ్ల జీవితాలే పరిశ్రమతో ముడిపడి సాగుతున్నాయి. కానీ ఏ రోజూ నా కెరీర్‌ను ఎవరూ శాసించలేదు. నాకు నచ్చిన మార్గంలో నడిచే స్వేచ్ఛ నాకు ఇచ్చారు. అలాంటప్పుడు కొత్తగా నాపై ఒత్తిడి ఏముంటుంది? కాకపోతే వారి స్థాయిలో నన్ను ఊహించుకొని... అంచనాలు పెంచుకొంటారు. అరంగేట్రంలోనే అమాంతం ఆ అంచనాలను అందుకోవడం నాకే కాదు... ఎవరికీ సాధ్యం కాదు కదా' అంటూ చెప్పుకొచ్చింది షనయా.

బడా ప్రాజెక్టులు...

ప్రస్తుతం మళయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ భారీ బడ్జెట్ చిత్రం 'వృషభ'లో నటిస్తోంది షనయా కపూర్. మోహన్‌లాల్‌తో కలిసి పని చేయడం తనకు లభించిన ఒక అద్భుత అవకాశం అంటోంది. "వృషభ' సెట్‌లో మొదటిసారి అడుగుపెట్టినప్పుడు ఎంతో ఉత్సుకతకు లోనయ్యాను. అది కూడా నా తొలి షాట్ మోహన్‌లాల్ సర్‌తో. కెమెరా నా ముఖం మీదకు వచ్చి ఆగినప్పుడు... నాలో ఏవో తెలియని అనుభూతులు. ఇది కలా... నిజమా..! నన్ను నేను నమ్మలేకపోయాను. ఆ క్షణం ఒక్కటే అనుకున్నా... నాలోని భావోద్వేగాలన్నిటినీ కెమెరా ముందు పలికించడానికి నాకు లభించిన చక్కని అవకాశం ఇదని. ఇలాంటి అవకాశం కోటిలో ఒక్కరికే లభిస్తుంది. దాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరుకున్నా. సెట్‌లో మోహన్‌లాల్ సర్ ప్రతి కదలికనూ నిశితంగా గమనించాను. ఆయనలోని ప్రకాశం, ఉత్సాహం, అంకిత భావం నాలో స్ఫూర్తి రగిలించాయి" అంటున్న ఈ అందాల రాశి... బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ కరణ్ జోహార్ ప్రాజెక్టులోనూ నటిస్తోంది.

'నా పనితనం చెప్పాలి'...

కపూర్‌ల కుటుంబం నుంచి వచ్చినా... పరిశ్రమలో నిలదొక్కుకోవాలంటే గొప్ప ప్రతిభ ఉండాలంటోంది షనయా కపూర్. 'నా గురించి... నా వ్యక్తిత్వం గురించి, నా సామర్థ్యం గురించి నేను కాదు... నేను చేసే పని చెప్పాలి. ఇష్టపడి కష్టపడతాను. దాన్ని ఒక పనిలా చూడను' అని చెబుతున్న షనయా... స్టార్ హీరో రణ్‌వీర్‌సింగ్‌కు వీరాభిమాని. అతడి పక్కన నటించే అవకాశం వస్తే ఎగిరి గంతేస్తానంటోంది.

అలాగే బాలీవుడ్ బాద్‌షా షారూక్ ఖాన్ కూతురు సుహానా ఖాన్, నటుడు చంకీ పాండే తనయ అనన్యా పాండేతో కూడా కలిసి తెర పంచుకోవాలని కోరుకొంటోంది. వీరిద్దరూ షనయాకు మంచి స్నేహితులు.



రాత్రుళ్లు రచ్చ...

సాధారణంగా ఉదయం లేచి వ్యాయామాలూ అవీ చేయడం తారలకు అలవాటు. కానీ వారికి భిన్నం షనయా. 'ఇంట్లోని అందరి గదుల్లో లైట్లు ఆఫ్ చేసే సమయంలో నాదైన ప్రపంచం మేల్కొంటుంది. చిరుతిండ్లు తింటూ... ఏదో ఒక సినిమా చూస్తుంటాను. చూసిన సినిమాలే లెక్కలేనన్నిసార్లు చూస్తుంటాను... ముఖ్యంగా కొన్ని సన్నివేశాలు. ఎక్కువగా హిందీ, ఇంగ్లీష్ చిత్రాలు చూస్తా. అప్పుడప్పుడూ కొరియన్ కూడా' అంటున్న షనయా కపూర్‌కు బాగా నచ్చిన చిత్రం 'దేవ్‌దాస్'.



ప్రభుత్వ కొలువు సాధించాలని ఎంతోమంది కలలు కంటారు. కానీ ఈమె... అందుకు భిన్నం. అమ్మానాన్న లేని చిన్నారులకు మాతృ ప్రేమ పంచడం కోసం గ్రూప్-1 ఉద్యోగాన్ని సైతం వదిలేశారు. అభాగ్యుల సేవకు పూర్తిగా అంకితమయ్యారు. అంతేకాదు... సేంద్రియ వ్యవసాయం, వ్యర్థాల నిర్వహణ లాంటి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకూ నాంది పలికారు. నిస్వార్థంతో సమాజం కోసం పాటుపడుతున్న పార్వతీపురం 'జట్టు ఆశ్రమం' నిర్వాహకురాలు **వెనిగండ్ల పద్మజ** 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి.

ఉద్యోగం విడిచిపెట్టి... ఆదర్శంతో 'జట్టు' కట్టి..!

"పార్వతీపురంలోని జట్టు ఆశ్రమాన్ని ఇదే ప్రాంతంలో పని చేసే ప్రభుత్వ ఉపాధ్యాయుడు పారినాయుడు గారు పాతికేళ్ల కిందట ప్రారంభించారు. గిరిజన, ఆదివాసీ అనాథ పిల్లల కోసం ఆయన దీన్ని నెలకొల్పినా, తరువాత కాలంలో ఏ దిక్కూ లేని మైదాన ప్రాంత చిన్నారులను కూడా అక్కున చేర్చుకున్నాం. ఈ ఆశ్రమంతో నా పరిచయం చాలా ప్రత్యేకమైంది. వ్యవసాయ రీత్యా కర్ణాటకలో స్థిరపడిన కుటుంబం మాది. అయితే నేను ప్రకాశం జిల్లా ఒమ్మెవరంలోని మా అమ్మమ్మగారింట పెరిగాను. లియో టాల్‌స్టాయ్, మాగ్జిమ్ గోర్కీ, చెహోవ్ తదితర రష్యన్ రచయితల తెలుగు అనువాదాలను పాఠశాల రోజుల నుంచి బాగా చదివేదాన్ని. బహుశా అందుకేనేమో... నేను పుస్తకాల్లో చదివినట్టుగా ఈ సమాజం లేదని నాలో అంతర్మథనం మొదలైంది. పేదరికం, ఆకలి బాధలు, అవి తెచ్చిపెట్టే కష్టాలను ఇతరుల జీవితాల్లో చూస్తున్నప్పుడు నేనేమీ చేయలేకపోతున్నానన్న బెంగ నన్ను బాగా వేధించేది. అప్పుడే అనుకున్నాను... పెళ్లి, పిల్లలు, ఉద్యోగం లాంటి లక్ష్యాలు కాకుండా నా జీవితాన్ని సమాజంతో మమేకం చేసుకొని బతకాలని! ఆలోగా ఈ వ్యవస్థను కొంత అర్థం చేసుకోవడం అవసరమనుకున్నాను.

కొలువు కాదనుకొని...

పోటీ పరీక్షలు రాసి మొదట కర్ణాటక స్టేట్ గ్రూప్-1కు ఎంపికయ్యాను. తెలుగు మీద ఇష్టంతో అక్కడ చేరకుండా ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్-1 రాస్తే ఇక్కడ ఎంపీడీవోగా ఉద్యోగం వచ్చింది. తర్వాత జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిగానూ నియమించారు. కానీ అవేవీ నాకు సంతృప్తినివ్వలేదు. కాలేజీ రోజుల నుంచి నాకు గిరిజన ప్రాంతాల్లో పని చేయాలని ఉండేది.

వాస్తవానికి గిరిజన సంక్షేమ శాఖలో ఉద్యోగం వస్తుందనుకున్నాను. కానీ అది జరగలేదు. అయితే పార్వతీపురంలోని నా స్నేహితురాలి ద్వారా ఈ ప్రాంతానికి అప్పుడప్పుడూ వస్తుండేదాన్ని. ఇక్కడి పరిస్థితుల మీదా కొంత అవగాహన ఉంది. తర్వాత నా ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా ఐఏఎస్ అధికారులు కరికాలవలవన్, సెర్ప్ సీఈఓ విజయ్‌కుమార్ ద్వారా 'జట్టు ఆశ్రమం' గురించి తెలిసింది. అలా 2004లో ఈ ఆశ్రమానికి మొట్టమొదటిసారి వచ్చాను. ఆ వాతావరణం నన్ను కట్టిపడేసింది. అప్పుడే అనుకున్నాను... నా జీవితమంతా ఇక్కడే గడపాలని.

ఆశ్రమం కోసం...

ప్రభుత్వ ఉద్యోగంలో రాజకీయ ఒత్తిళ్లు ఎదురవ్వడం సాధారణమే. కానీ అలాంటివాటికి భయపడేంత బలహీనురాలిని కాదు. నా జీవితం పట్ల నాకు ఒక స్పష్టత ఉంది. నాకంటూ ఒక లక్ష్యాన్ని ముందే నిర్దేశించుకున్నాను కనుక... 2007లో ఉద్యోగానికి రాజీనామా చేసి, జట్టు ఆశ్రమ సేవకు పూర్తిగా అంకితమయ్యాను. 'ఉద్యోగం చేస్తూనే సమాజానికి సేవ చేయచ్చు కదా' అని మొదట మా అమ్మ లలిత నాకు నచ్చచెప్పడానికి ఎంతో ప్రయత్నించింది. మా నాన్న భీమేశ్వరరావు మాత్రం మౌనంగా ఉన్నారు. అయితే ఉద్యోగ హోదా లకన్నా ఆశ్రమంలోని పిల్లలకు తల్లిగా ఉండటమే నాకిష్టమని ఇంట్లో చెప్పాను. దాంతో వారెవరూ కాదనలేకపోయారు. ఆ నాటి నుంచి నా పిల్లలతో



కలిసుంటున్నాను.

పెళ్లిళ్లు... పురుళ్లు...

ఈ పదిహేనేళ్లలో 150మందికి పైగా పిల్లలు ఆశ్రయం పొందారు. వారిలో కొందరు వివిధ ఉద్యోగ, వ్యాపార వృత్తుల్లో స్థిరపడ్డారు. కొందరికి పెళ్లిళ్లు మేమే దగ్గరుండి చేశాం. తర్వాత పురుళ్ల లాంటి బాధ్యతలనూ నిర్వర్తిస్తున్నాం. ఆ పిల్లలకు జట్టు ఆశ్రమమే పుట్టిల్లు. నా పిల్లలు ఒక్కొక్కరు పీహెచ్‌డీ, పీజీ, లా, ఇంజనీరింగ్ లతో పాటు డాన్స్, యోగా తదితర కోర్సుల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. వారందరి చదువుకు అవసరమైన ఖర్చుతోపాటు వివాహ బాధ్యతలను పూర్తిగా ఆశ్రమమే చూసుకొంటోంది.

పిల్లలే నిర్వాహకులు...

జట్టు ఆశ్రమానికి నేను కాదు, మా పిల్లలే నిర్వాహకులు. ధాన్యం, పప్పు దినుసులు, కూరగాయలు... ఇలా ఆశ్రమానికి అవసరమైన ఆహారమంతా మేమంతా కలిసి పండిస్తాం. అదీ సేంద్రియ పద్ధతిలో. ఈ స్ఫూర్తితో పార్వతీపురం పరిసర పల్లెల్లోని చాలామంది రైతులు సేంద్రీయ వ్యవసాయం చేస్తుండటం మంచి పరిణామం. మా ఆశ్రమంలోని పిల్లలంతా నన్ను 'అమ్మ' అని పిలుస్తారు. నా కడుపున పుట్టకపోయినా వారంతా నాకు బిడ్డలు. ఆ పిల్లలు తప్ప నాకూ మరెవరూ లేరు.

మొదటగా మా పిల్లల్లో తమకు ఎవరూ లేరన్న భావనను పోగొట్టేందుకు సమష్టి జీవన విధానాన్ని అలవరిచేందుకు ప్రయత్నిస్తున్నాం. అంటే ప్రతి పనీ ఒక జట్టుగా చేయడమన్నమాట. తద్వారా 'అమ్మానాన్న ప్రేమను మనం పొందలేకపోవచ్చు కానీ, ఇతరులకు పంచవచ్చు' అన్న స్పృహను వారిలో కల్పించగలిగాం. ఆశ్రమం అనగానే కట్టుకోడానికి దుస్తులు ఇచ్చి, మూడు పూటలా తిండి పెట్టడంతో సరిపుచ్చడం కాదు కదా. వారి సమగ్రాభివృద్ధికి తోడ్పడేలా చదువుతో పాటు కూచిపూడి, భరతనాట్యం, కర్ణాటక సంగీతం, కర్ర సాము, కత్తి సాము లాంటి కళలతో పాటు హాకీ, బాస్కెట్‌బాల్ తదితర క్రీడల్లోనూ తర్ఫీదు ఇప్పిస్తున్నాం. అందుకే మా పిల్లలు కూడా చాలా వాస్తవికంగా ఉంటారు. సాటి మనుషుల పట్ల ప్రేమతో, సమాజం పట్ల గౌరవంతో మసులుకుంటారు.

> **ప్లాస్టిక్ వ్యర్థాలతో ఇల్లు...**
>
> పార్వతీపురం పరిసర ప్రాంతాల్లో వేస్ట్ మేనేజ్‌మెంట్ ఒక ప్రహసనంగా మారింది. ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చేయడం చూసి, దానివల్ల తలెత్తే నష్టాలను గుర్తించాం. ప్రయోగాత్మకంగా మొదట ఎనిమిది గ్రామాల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం ప్రారంభించాం. 'పునర్వ వేస్ట్ మేనేజ్‌మెంట్' పేరుతో ఒక యూనిట్‌ను నిర్మించాం. దాని కేంద్రంగా తడి చెత్తతో గ్యాస్, సేంద్రియ ఎరువు, టాయిలెట్ క్లీనర్ లాంటివి తయారు చేయడం మొదలుపెట్టాం. తరువాత తడి చెత్త తెచ్చి ఇచ్చినవారికి వాటికి బదులుగా సేంద్రియ ఎరువులు, విత్తనాలను ఇవ్వడం ద్వారా వాటి విలువను తెలియజేయగలిగాం. ఎలక్ట్రానిక్స్‌తో పాటు కుక్కర్ హ్యాండిల్స్ లాంటి పొడి వ్యర్థాలతో కుండీలు, ఇటుకలు లాంటివి తయారు చేయగలిగాం. ఇంటి నిర్మాణానికి పనికొచ్చే ఫ్లోర్ ఫిల్లింగ్ మెటీరియల్‌ను రూపొందించాం. అలా ఒక ఇల్లు కూడా నిర్మించాం. ఇంకా రకరకాల ప్రయోగాలు చేస్తున్నాం. తడి, పొడి చెత్త నుంచి పలు ఉత్పత్తులను తయారుచేయడం ద్వారా కాలుష్యాన్ని కొంత వరకు తగ్గించవచ్చు. వనరులను పొదుపుగా వాడుకోవచ్చు. త్వరలోనే పూర్తి స్థాయిలో వ్యర్థాల నిర్వహణ చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

అమ్మ పచ్చళ్లు...

కొన్నాళ్ల కిందట 'అమ్మ పచ్చళ్లు' తయారీ కేంద్రాన్ని ప్రారంభించాం. ఆశ్రమ అమ్మాయిలు గౌతమి, అమల దీన్ని నిర్వహిస్తున్నారు. మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నారు. పచ్చళ్లు అంటే మార్కెట్లో దొరికే వస్తువులతో తయారు చేసి, అవి నిల్వ ఉండటం కోసం రసాయనాలు కలిపి, వాటిని డబ్బాల్లో పెట్టి అమ్మడం కాదు. పూర్తిగా సేంద్రియ పద్ధతిలో మేము పండించిన వాటితోనే రకరకాల కారప్పొడులు, మామిడి, అల్లం, ఉసిరి, టమోటా, పండుమిర్చి పచ్చళ్లు, వడియాలు లాంటి వన్నీ తయారు చేస్తాం. వాటిల్లో రంగులు కానీ రసాయనాలు కానీ అస్సలు కలపం. ప్లాస్టిక్ ప్యాకింగ్‌కు మేము వ్యతిరేకం కనుక సీసాల్లోనే అమ్ముతాం. ఒక్క పార్వతీపురంలోనే కాదు అమ్మ పచ్చళ్ల కోసం విశాఖపట్టణం, విజయనగరం, గజపతినగరం చుట్టుపక్క ప్రాంతాల నుంచి కూడా వచ్చి కొనుక్కెళుతుంటారు. చాలామంది విదేశాల్లోని పిల్లలకు పంపిస్తుంటారు. తిన్నవారంతా అమ్మ పచ్చళ్లు, పొడులు రుచి చాలా బావుంటుందని చెబుతుంటారు.

రజనీరాజా కళాక్షేత్రం...

పిల్లల మనోవికాసానికి కళలు తోడ్పడతాయి. గ్రామీణ విద్యార్థులకు అవి నేర్పించేందుకు ఎవరు ముందుకు వస్తారా అని ఎదురుచూస్తున్నాం. అదే సమయంలో నాట్యాచార్యులు నాగకన్యక, శ్రీనివాస్ దంపతులు ఒకరోజు మా ఆశ్రమానికి వచ్చారు. వారికి ఇక్కడి వాతావరణం బాగా నచ్చింది. దాంతో ఆశ్రమంలోని పిల్లలతో పాటు పార్వతీపురం చుట్టుపక్కల గ్రామాల చిన్నారులకు నృత్యంలో ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు అంగీకరించారు. అలా ఆ దంపతులు పదేళ్లుగా 'రజనీ రాజా' కళాక్షేత్రం ద్వారా విద్యార్థులకు భరతనాట్యం, కూచిపూడి లో శిక్షణ ఇస్తున్నారు. గాయని పద్మప్రియ కర్ణాటక సంగీతం ఉచితంగా నేర్పిస్తున్నారు. ఇప్పటివరకు మా కళాక్షేత్రంలో 1,200 మందికిపైగా విద్యార్థులు శిక్షణ పొందారు. గ్రామీణ ప్రాంతాల నుంచి గృహిణులు సైతం చాలామంది సంగీత వాద్యాలు నేర్చుకోడానికి వస్తుంటారు. ఇక్కడ శిక్షణ పొందినవారిలో చాలామంది బయట ప్రాంతాల్లోనూ ప్రదర్శనలిస్తున్నారు. తొలినాళ్లలో నేర్చుకున్నవారిలో కొందరు ఇక్కడే గురువులుగా కొనసాగుతున్నారు.

ప్రకృతికి దగ్గరగా...

జట్టు ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నా... సేంద్రియ వ్యవసాయం చేస్తున్నా... వ్యర్థాల నిర్వహణను చేపట్టినా... ఇదంతా సమష్టి కృషి. ఇందులో పార్వతీపురం చుట్టుపక్కల గ్రామస్తుల సహకారం వెలకట్టలేనిది. వారివల్లే ఆశ్రమం సజావుగా ముందుకు సాగుతోంది. ఆశ్రమం ద్వారా పదిమందికి తోడ్పడుతూ హాయిగా ప్రకృతికి దగ్గరగా సాధారణ జీవితం గడపాలన్నది నా కోరిక. అంతకుమించిన లక్ష్యాలు ఏమీ లేవు."

• సాంత్వన్

ఈ పండ్లలో విటమిన్-సి పుష్కలం

శరీరానికి సి- విటమిన్ ఎంతో అవసరం. కణాల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా తెల్లరక్తకణాల సంఖ్యను పెంచి.. వ్యాధినిరోధక శక్తిని పెంపొందించే గుణం సి-విటమిన్‌కు ఉంది. ఇంతకీ ఏయే పండ్లలో సి- విటమిన్ ఎక్కువ దొరుకుతుందో తెల్సుకుందాం.

- వంద గ్రాముల నారింజలో 53 మిల్లీ గ్రాముల సి-విటమిన్ ఉంటుంది. గుప్పెడు నల్ల ద్రాక్ష తింటే 181 మి.గ్రా సి-విటమిన్ లభ్యమవుతుంది. అంటే నారింజ పండ్లకంటే మూడు రెట్లు ఎక్కువ.
- కివి పండ్లలో మినరల్స్, ఫైబర్ కంటెంట్ ఎక్కువ. వంద గ్రాముల కివి పండ్లలో 93 మి.గ్రా. విటమిన్- సి దొరుకుతుంది. స్ట్రాబెర్రీస్‌లో అధికంగా ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. కనీసం వంద గ్రాముల స్ట్రాబెర్రీలను తింటే 58 గ్రాముల సి-విటమిన్ శరీరానికి అందుతుంది.
- బరువు తగ్గటానికి, జీర్ణక్రియ ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడే బొప్పాయి పండ్లను ఐదారు ముక్కలు తింటే చాలు.. అందులో 60 మి.గ్రా. విటమిన్-సి దొరుకుతుంది.
- వంద గ్రాముల పైనాపిల్ తింటే 47 మి.గ్రా. సి- విటమిన్ ఉంటుంది. చిన్న జామకాయ తింటే 228 గ్రాముల అత్యధిక విటమిన్-సి అందుతుంది.



కౌన్సెలింగ్

కాలేయానికి కొవ్వు ప్రమాదమా?

డాక్టర్! నాకు రెండవ దశ ఫ్యాటీ లివర్ సమస్య ఉంది. మద్యం అలవాటు లేకపోయినా నాకు ఈ సమస్య ఎందుకొచ్చింది? దీన్నుంచి పూర్తిగా కోలుకోవాలంటే ఏం చేయాలి?

- ఓ సోదరుడు, హైదరాబాద్.

ఫ్యాటీ లివర్ గురించి సర్వత్రా రెండు అపోహలున్నాయి. మద్యం తాగే వాళ్లకే ఫ్యాటీ లివర్ పరిమితం అనేది ఒక అపోహ అయితే, ఇది కాలేయాన్ని దెబ్బ తీసేంత ప్రమాదకరమైనది కాదనేది రెండవ అపోహ. కానీ ఫ్యాటీ లివర్ గురించిన వాస్తవాలు పూర్తి భిన్నం. 60 శాతానికి మించిన కాలేయ సమస్యల కారణాలకు మద్యంతో సంబంధం ఉండదు. ఏ కారణంతో కాలేయం దెబ్బతిన్నా, తొలి దశలోనే సమస్యను కనిపెట్టగలిగితే, కాలేయాన్ని పూర్తిగా కోలుకునేలా చేయవచ్చు. అలా కాకుండా కాలేయం తిరిగి సరిదిద్దలేనంతగా దెబ్బతింటే, అంతిమంగా కాలేయ మార్పిడినే ఆశ్రయించవలసి వస్తుంది.



ఏప్రిల్ 19 వరల్డ్ లివర్ డే

కాలేయానికి కొవ్వు ఎందుకు?

మద్యంతో పాటు, హెపటైటిస్ సి, హెపటైటిస్ బి, జన్యు సమస్యలు, కొవ్వు, దీర్ఘకాలంగా అదుపుతప్పిన మధుమేహం, ఒబేసిటీ.. ఇలా కాలేయం దెబ్బ తినడానికి ఎన్నో కారణాలుంటాయి. తాజాగా కొవ్వు మూలంగా సిర్రోసిస్, కేన్సర్‌లకు దారి తీసి, అంతిమంగా మార్పిడి వరకూ వెళ్తున్న సందర్భాలు ఎక్కువవుతున్నాయి. సాధారణంగా కాలేయం మీద కొద్ది పరిమాణంలో కొవ్వు ఉంటుంది. ఈ కొవ్వు పరిమాణం పెరిగేకొద్దీ, కాలేయ కణాలు ఒత్తుకుపోయి, పాడైపోతాయి. ఈ పరిస్థితి లివర్ ఫైబ్రోసిస్‌కూ, సిర్రోసిస్‌కూ దారి తీస్తుంది.

ఫైబ్రో స్కాన్

సాధారణ స్కాన్‌లో కాలేయం పైనున్న కొవ్వు తప్ప, అడుగున ఉన్న స్కార్స్ కనిపించవు. కాబట్టి అల్ట్రాసౌండ్ స్కాన్‌లో ఫ్యాటీ లివర్ ఉందని తేలితే, తప్పనిసరిగా ఫైబ్రో స్కాన్ కూడా చేయించుకోవాలి. ఈ స్కాన్ ద్వారా ఫైబ్రోసిస్ నాలుగు దశలు, సిర్రోసిస్ మొదటి దశతో పాటు, కాలేయంలో ఉన్న కొవ్వు పరిమాణాన్ని కూడా కనిపెట్టవచ్చు. అలాగే కాలేయం గట్టితనాన్ని కూడా అంచనా వేయవచ్చు. ఇలా ఫైబ్రో స్కాన్‌తో ముందుగానే సమస్యను కనిపెట్టగలిగితే ఫైబ్రోసిస్‌తో పాటు, మొదటి దశ సిర్రోసిస్‌ను కూడా రివర్స్ చేసుకోవచ్చు. క్రమం తప్పకుండా ఆల్కహాల్ తీసుకునేవాళ్లు, హెపటైటిస్ సి, బి ఇన్‌ఫెక్షన్స్ ఉన్నవాళ్లు, ఫ్యాటీ లివర్ నిర్ధారణ అయిన వాళ్లు, ఏడాదికోసారి ఫైబ్రో స్కాన్ చేయించుకుంటూ ఉండాలి. అలాగే స్థూలకాయులు, ఐదేళ్లుగా మధుమేహం అదుపు తప్పిన వాళ్లు కూడా ఏడాదికోసారి ఫైబ్రో స్కాన్ చేయించుకోవాలి. స్కాన్‌లో సమస్య తీవ్రతను కనిపెట్టినప్పుడు, మూల కారణాలను కనిపెట్టి, వాటిని సరిదిద్దడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలితో సమస్యను పూర్తిగా నయం చేసుకోవచ్చు. ఫ్యాటీ లివర్ రాకుండా ఉండడం కోసం సమతులాహారం తీసుకోవాలి.

అదనపు నూనెలు, పిండిపదార్థాలు తగ్గించుకోవాలి. అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. 45 నిమిషాల నడక, సైక్లింగ్, ఈత క్రమం తప్పకుండా కొనసాగించాలి.

డాక్టర్ కె.ఎస్. సోమశేఖర రావు,
సీనియర్ కన్సల్టెంట్, గ్యాస్ట్రోఎంటిరాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్, యశోద హాస్పిటల్స్, హైదరాబాద్.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/iFJsNzEలో చదవండి.

పిల్లలను తీర్చిదిద్దాలంటే ఆ పనిని పేరెంట్స్ మాత్రమే చేయగలరు. పేరెంట్స్ చెప్పిన మాటలకు ఎమోషనల్‌గా కనెక్టవుతారు. పిల్లల మైండ్‌సెట్ మార్చాలంటే ఉదయాన్నే మాట్లాడాలి ఇలా..



ఉదయాన్నే ఉత్సాహం...

- పిల్లలు నిద్రలేచిన వెంటనే వారికి 'గుడ్ మార్నింగ్' చెప్పాలి. నవ్వుతో, హగ్‌తో పిల్లలను దగ్గరకు తీసుకుంటే వారిలో పాజిటివ్‌నెస్ పెరుగుతుంది.
- చైల్డ్‌తో ఎక్కువ మాటలు కలపడం, ఆడుకోవటం చేయాలి. ఉదయాన పిల్లలతో తక్కువ సమయం గడిపినా అది క్వాలిటీ టైమ్ అవుతుంది. దీనివల్ల పిల్లల్లో కాన్ఫిడెన్స్ పెరుగుతుంది.
- స్కూల్‌లో చదివే పిల్లలతో అయితే మీ ఆలోచనలను, కలల్ని షేర్ చేయండి. వారితో కమ్యూనికేట్ అవటం వల్ల తెలీకుండా చురుగ్గా ఉంటారు.
- వారి స్నేహితుల గురించి అడగటం.. వారి సమాధానాలను, ఆలోచనలు వినటం చేయాలి. దీనివల్ల గ్రేట్‌గా ఫీలవుతారు. ప్రతి రోజూ కాకున్నా కనీసం వారానికి ఓసారి అయినా పిల్లలతో ఉదయం పూట గడిపితే చాలు.. చక్కని ఫలితం ఉంటుంది.

బిజినెస్

అమర రాజా ఇన్‌ఫ్రా నుంచి ప్రీమియర్ ఎనర్జీస్‌కు ఆర్డర్

హైదరాబాద్: అమరరాజా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి 140 మెగావాట్ల సోలార్ పీవీ మాడ్యూల్స్ సరఫరా కోసం ఆర్డర్ అందుకున్నట్లు ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ (పీఈఎల్) అనుబంధ సంస్థ ప్రీమియర్ ఎనర్జీస్ ఫొటోవోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్ వెల్లడించింది. బంగ్లాదేశ్‌లోని ఈపీసీ ప్రాజెక్ట్ కోసం అమర రాజా ఇన్‌ఫ్రా నుంచి ఈ ఆర్డర్‌ను దక్కించుకున్నట్లు కంపెనీ తెలిపింది. 2025 ఏప్రిల్ నాటికి ఈ సోలార్ పీవీ మాడ్యూల్స్ సరఫరా పూర్తవుతుందని అంచనా వేస్తున్నట్లు ప్రీమియర్ ఎనర్జీస్ ఫొటోవోల్టాయిక్ పేర్కొంది. కంపెనీ సోలార్ పీవీ మాడ్యూల్స్ నాణ్యత. పనితీరుకు లభించిన గుర్తింపు ఇదని పీఈఎల్ ఎండీ చిరంజీవ్ సలూజా తెలిపారు.

హెచ్‌సీజీ నుంచి ఇన్విగా హెల్త్‌కేర్ పీఈ ఫండ్

హైదరాబాద్: హెల్త్‌కేర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (హెచ్‌సీజీ) వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ బీఎస్ అజయ్ కుమార్.. బెంగళూరు కేంద్రంగా ఇన్విగా హెల్త్‌కేర్ ఫండ్ (ఐహెచ్‌ఎఫ్) పేరుతో ప్రైవేట్ ఈక్విటీ ఫండ్‌ను ప్రారంభించారు. భారతీయ హెల్త్‌కేర్ రంగంలోని అంత్రప్రెన్యూర్స్‌కు దన్నుగా నిలిచేందుకు ఈ ఫండ్‌ను ఏర్పాటు చేసినట్లు సంస్థ సహ వ్యవస్థాపకుడు అజయ్ గార్గ్ తెలిపారు. తొలుత 2కోట్ల డాలర్లతో ఈ పీఈ ఫండ్‌ను ప్రారంభించారు. కాగా ఐహెచ్‌ఎఫ్ తన తొలి పెట్టుబడిని బెంగళూరు కేంద్రంగా బయోటెక్ స్టార్టప్.. మైన్‌వ్యాక్స్‌లో పెట్టింది. వైరల్ డిసీజెస్, సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా, కొవిడ్ 19 వంటి వ్యాధులను కట్టడి చేసే వ్యాక్సిన్లను ఈసంస్థ అభివృద్ధి చేస్తోంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,150 ▲	67,970 ▲	90,000 ▼
ముంబై	73,302 ▲	67,145 ▲	83,213 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

18వ తేదీ

హైదరాబాద్	410	విజయవాడ	415
చిత్తూరు	483	విశాఖపట్నం	430
గోదావరి	415	వరంగల్	412
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	128	గోదావరి	131
వరంగల్	128	విజయవాడ	131
కరీంనగర్	128	గుంటూరు	131
మహబూబ్‌నగర్	128	ఒంగోలు	131
కర్నూలు	128	చిత్తూరు	134
విశాఖపట్నం	118		

సీనియర్ సిటిజన్స్ బ్యాంక్ డిపాజిట్లు రూ.34 లక్షల కోట్లు

ఐదేళ్లలో 150 శాతం పెరుగుదల.. ఎస్‌బీఐ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: కంపెనీలు తమ రుణ పత్రాలపై అధిక వడ్డీ రేట్లు ఆఫర్ చేస్తున్నా, సీనియర్ సిటిజన్లు మాత్రం బ్యాంక్ డిపాజిట్లపైనే ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో గత ఏడాది (2023) చివరి నాటికి బ్యాంకుల్లో వీరి డిపాజిట్లు రూ.34.36 లక్షల కోట్లకు చేరాయి. ఐదేళ్ల క్రితంతో పోలిస్తే ఇది 150 శాతం ఎక్కువని ఎస్‌బీఐ రీసెర్చ్ ఒక నివేదికలో తెలిపింది. ఇదే సమయంలో బ్యాంకుల్లో డిపాజిట్లు ఉన్న సీనియర్ సిటిజన్ల సంఖ్య 81 శాతం పెరిగి 4.1 కోట్ల నుంచి 7.4 కోట్లకు చేరింది. దీంతో మొత్తం టర్మ్ డిపాజిట్లలో వీరి డిపాజిట్ల వాటా 15 శాతం నుంచి 30 శాతానికి చేరింది.

రూ.2.7 లక్షల కోట్ల వడ్డీ

గత ఐదేళ్లలో సీనియర్ సిటిజన్ల సగటు డిపాజిట్ల మొత్తం రూ.3,34,243 నుంచి రూ.4,63,3472కు చేరింది. ప్రస్తుతం బ్యాంకులు ఈ సీనియర్ సిటిజన్ల డిపాజిట్లపై సగటున 7.5 శాతం వడ్డీ చెల్లిస్తున్నాయి. ఈ లెక్కన రూ.34.36 లక్షల కోట్ల సీనియర్ సిటిజన్ల డిపాజిట్లు, సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్ఎస్)పై రూ.2.7 లక్షల కోట్లు వడ్డీగా లభిస్తోంది.

బ్యాంకు డిపాజిట్లపైనే ఆసక్తి

సీనియర్ సిటిజన్స్ డిపాజిట్లపై ప్రస్తుతం బ్యాంకులు సగటున 7.5% వడ్డీ చెల్లిస్తున్నాయి. అదే సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్ఎస్)లో పెట్టుబడి పెడితే సగటున 8.2 శాతం వడ్డీ వస్తోంది. అయినా బ్యాంకు టర్మ్ డిపాజిట్లపైనే సీనియర్ సిటిజన్లు ఆసక్తి చూపిస్తున్నారు. 2023 డిసెంబరు నాటికి బ్యాంకుల్లో సీనియర్ సిటిజన్ల డిపాజిట్లు రూ.34.36 లక్షల కోట్లు ఉంటే, ఎస్‌సీఎస్ఎస్ పథకంలో ఉన్న డిపాజిట్ల మొత్తం రూ.1.62 లక్షల కోట్లు మాత్రమే. దీనిపై వారికి వచ్చిన వడ్డీవ రూ.13,000 కోట్లు.

రూ.27,000 కోట్ల పన్ను ఆదాయం

సీనియర్ సిటిజన్స్ డిపాజిట్ పథకాలు ప్రభుత్వానికి పెద్ద మొత్తంలోనే పన్ను ఆదాయం సమకూర్చిపెడుతున్నాయి. ఈ డిపాజిట్లపై వచ్చే వడ్డీపై ప్రభుత్వం సగటున 10 శాతం పన్ను విధిస్తోంది. ఈ లెక్కన సీనియర్ సిటిజన్స్ డిపాజిట్ స్కీమ్, ఎస్‌సీఎస్ఎస్‌పై ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరానికి పన్నుల రూపంలో రూ.27,000 కోట్లు వసూలు చేయనుంది.

టర్మ్ డిపాజిట్లపై మక్కువ ఎందుకంటే..

- ఇతర డిపాజిట్లతో పోలిస్తే అర శాతం నుంచి ముప్పావు శాతం అధిక వడ్డీ
- రూ.5 లక్షల వరకు డిపాజిట్లకు బీమా భద్రత
- కంపెనీల రుణ పత్రాలతో పోలిస్తే అధిక భద్రత
- సీనియర్ సిటిజన్ల కోసం బ్యాంకులు అందిస్తున్న ప్రత్యేక డిపాజిట్ పథకాలు
- ఇతర పెట్టుబడి సాధనాల్లో మదుపు చేస్తే అసలుకు కూడా భద్రత ఉండదనే భయం

స్మాల్ క్యాప్ ఫండ్స్‌పై రిటైల్ మదుపరుల ఆసక్తి

రూ. 2.43 లక్షల కోట్లకు చేరిన పెట్టుబడులు

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) ఆఫర్ చేసే స్మాల్ క్యాప్ ఫండ్స్ రిటైల్ మదుపరులను అమితంగా ఆకర్షిస్తున్నాయి. మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో వీరు ఈ పథకాల్లో రూ.40,188 కోట్లు మదుపు చేశారు. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది రూ.18,085 కోట్లు ఎక్కువ. ఈ పెట్టుబడుల వరదతో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకాల నిర్వహణలోని ఆస్తుల (ఏయూఎం) విలువ రూ.2.43 లక్షల కోట్లకు చేరింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 83 శాతం ఎక్కువ. ఇదే సమయంలో రిటైల్ మదుపరుల సంఖ్యా 1.09 కోట్ల నుంచి 1.90 కోట్లకు చేరింది. స్మాల్ క్యాప్ ఫండ్స్‌పై రిటైల్ మదుపరుల ఆసక్తికి ఈ కింది అంశాలు దోహదం చేశాయి.

- పెరుగుతున్న భారత ఆర్థిక వ్యవస్థ
- లిస్టింగ్ కాని అనేక చిన్న కంపెనీలు ఐపీఓలకు రావడం
- లార్జ్, మిడ్ క్యాప్ ఫండ్స్ కంటే అధిక లాభాలు
- జోరు మీద ఉన్న స్టాక్ మార్కెట్
- దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలు
- ఆకర్షణీయమైన కంపెనీల ఆర్థిక ఫలితాలు
- స్వల్ప వ్యవధిలోనే పెట్టుబడులను వెనక్కి తీసుకునే అవకాశం

ఇరాన్ చర్యలతో ముప్పే: జానెట్ ఎల్లెన్

వాషింగ్టన్: ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడులపై అమెరికా ఆర్థిక మంత్రి జానెట్ ఎల్లెన్ ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఈ ఉద్రిక్తతల ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనా ఉంటుందన్నారు. ఇరాన్ దుందుడుకు చర్యలను అడ్డుకునేందుకు ఆ దేశంపై మరిన్ని ఆర్థిక ఆంక్షలు తప్పవని హెచ్చరించారు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల సమావేశాలు ఈవారం ప్రారంభం కాబోతున్నాయి. ఈ నేపథ్యంలో ఎల్లెన్ ఈ హెచ్చరిక చేయడం విశేషం. ఆర్థిక ఆంక్షల్లో భాగంగా ఇరాన్ చమురు ఎగుమతులపై అమెరికా మళ్లీ ఆంక్షలు విధించబోతున్నట్టు సమాచారం. అదే జరిగితే ఇరాన్ నుంచి భారత చమురు దిగుమతులకు ఫుల్‌స్టాప్ పడే అవకాశం ఉంది. దీనికి తోడు చమురు ధరా చుక్కలంటే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



అనంత్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు పావులూరి సుబ్బారావుకు ఆర్యభట్ట అవార్డు

హైదరాబాద్: అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఏటీఎల్) వ్యవస్థాపకుడు, సీఈఓ, చైర్మన్ పావులూరి సుబ్బారావును ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) 'ఆర్యభట్ట అవార్డ్'తో సత్కరించింది. భారత ఆస్ట్రోనాటిక్స్ రంగంలో సుబ్బారావు చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ఏఎస్ఐ ప్రెసిడెంట్, ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్, మాజీ ఇస్రో చైర్మన్ కిరణ్ కుమార్ చేతుల మీదుగా పావులూరి సుబ్బారావు ఈ అవార్డును అందుకున్నారు. తొలుత ఇస్రోలో శాస్త్రవేత్తగా పనిచేసిన సుబ్బారావు 1992లో అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేశారు. భారత రక్షణ రంగం, ఇస్రో కోసం దేశీయంగా పలు ఏవియానిక్స్ ఉత్పత్తులను డిజైన్ చేయటంతో పాటు అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఏటీఎల్.. హైదరాబాద్, బెంగళూరు, తిరువనంతపురంలలో మూడు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను నిర్వహిస్తోంది.

అంబుజాలో అదానీ వాటా పెంపు

మరో రూ.8,339 కోట్ల పెట్టుబడితో 70.3 శాతానికి పెరిగిన వాటా

న్యూఢిల్లీ: అంబుజా సిమెంట్స్‌లో మరో రూ.8,339 కోట్ల పెట్టుబడి ద్వారా గౌతమ్ అదానీ కుటుంబం కంపెనీలో వాటాను 70.3 శాతానికి పెంచుకుంది. గతంలోనూ అదానీ కుటుంబం 2022 అక్టోబరు 18న రూ.5,000 కోట్లు, 2024 మార్చి 28న రూ.6,661 కోట్లు పెట్టుబడిగా పెట్టింది. తాజా ఇన్వెస్ట్‌మెంట్‌తో కలిపి మొత్తం రూ.20,000 కోట్ల నిధులు సమకూర్చిందని అంబుజా సిమెంట్స్ వెల్లడించింది. తాజా ఇన్వెస్ట్‌మెంట్ ద్వారా అంబుజాలో అదానీ ఫ్యామిలీ వాటా మరో 3.6 శాతం పెరిగింది. మొత్తం రూ.20,000 కోట్ల పెట్టుబడి ద్వారా 63.2 శాతం నుంచి 70.3 శాతానికి చేరుకుంది. కంపెనీ సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 2028 నాటికి రెట్టింపు స్థాయి 14 కోట్ల టన్నులకు పెంచుకునేందుకు దోహదపడనున్నాయి. గత డిసెంబరు 31 నాటికి సంస్థ ఉత్పత్తి సామర్థ్యం 7.61 కోట్ల టన్నులుగా ఉంది. స్విట్జర్లాండ్‌కు చెందిన సిమెంట్ దిగ్గజం హోల్సిమ్ నుంచి అంబుజా సిమెంట్స్, ఏసీసీలో మెజారిటీ వాటాను 1,050 కోట్ల డాలర్లకు కొనుగోలు చేయడం ద్వారా 2022లో అదానీ గ్రూప్ సిమెంట్ తయారీ రంగంలోకి ప్రవేశించింది.

తగ్గిన చమురు దిగుమతి బిల్లు

ఆదుకున్న రష్యా డిస్కౌంట్ చమురు

న్యూఢిల్లీ: రష్యా డిస్కౌంట్స్ పుణ్యమాని 2023-24 ఆర్థిక సంవత్సరంలో మన దేశ చమురు దిగుమతి బిల్లు 15.9 శాతం తగ్గింది. 2022-23 ఆర్థిక సంవత్సరం 15,750 కోట్ల డాలర్లు ఉన్న ఈ బిల్లు ఈ ఏడాది మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో 13,240 కోట్ల డాలర్లకు (సుమారు రూ.11.06 లక్షల కోట్లు) తగ్గింది. దిగుమతి చేసుకున్న చమురు పరిమాణం మాత్రం 23.25 కోట్ల టన్నుల వద్దే ఉంది. ఇదే సమయంలో చమురు కోసం దిగుమతులపై ఆధారపడడం మాత్రం 87.4 శాతం నుంచి 87.7 శాతానికి పెరిగింది. దేశీయ చమురు ఉత్పత్తి ఎదుగూ బొదుగు లేకుండా 2.94 కోట్ల టన్నుల వద్దే ఉండడం ఇందుకు ప్రధాన కారణం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మన దేశం ముడి చమురుతో పాటు ఎల్‌పీజీ వంటి 4.81 కోట్ల టన్నుల పెట్రో ఉత్పత్తుల దిగుమతి కోసం 2,340 కోట్ల డాలర్లు ఖర్చు చేసింది. ఇదే సమయంలో 4,740 కోట్ల డాలర్ల విలువైన 6.22 కోట్ల టన్ను పెట్రో ఉత్పత్తులను ఎగుమతి చేసింది.



సామ్‌సంగ్ ఏఐ టీవీలు

ప్రారంభ ధర రూ.1.39 లక్షలు

న్యూఢిల్లీ: దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సామ్‌సంగ్ బుధవారం భారత మార్కెట్లోకి కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత అల్ట్రా ప్రీమియం టీవీలను ప్రవేశపెట్టింది. నియో క్యూఎల్ఈడీ మోడల్‌లో 4కే, 8కే సిరీస్‌లతో పాటు ప్రపంచంలో మొట్టమొదటి గ్లేర్ ఫ్రీ ఓఎల్ఈడీ టీవీలను అందుబాటులోకి తెచ్చింది. 55, 65, 75, 85, 98 అంగుళాల సైజులో లభించే నియో క్యూఎల్ఈడీ 4కే టీవీల ధర రూ.1,39,900 ప్రారంభం కానుందని కంపెనీ తెలిపింది. కాగా, క్యూఎన్900డీ, క్యూఎన్800డీ మోడళ్లు.. 65, 75, 85 అంగుళాల సైజుల్లో లభించనున్న నియో క్యూఎల్ఈడీ 8కే టీవీల ధర రూ.3,19,990 నుంచి ప్రారంభమవుతుంది. రెండు మోడళ్లలో (ఎస్95డీ, ఎస్90డీ).. 55, 65, 77, 83 అంగుళాల సైజుల్లో లభించనున్న ఓఎల్ఈడీ టీవీల ప్రారంభ రేటు రూ.1,64,990గా ఉంది. ఈ ఏడాది భారత మార్కెట్లో టీవీ విక్రయాల వ్యాపారాన్ని రూ.10,000 కోట్ల మైలురాయిని దాటించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సామ్‌సంగ్ ఇండియా విజువల్ డిస్‌ప్లే బిజినెస్ విభాగ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మోహన్‌దీప్ సింగ్ తెలిపారు.

స్పోర్ట్స్



సాధారణ ఆర్చర్లతో పోటీపడి రజతం కొల్లగొట్టింది

» ఖేలో ఇండియాలో మెరిసిన పారా అథ్లెట్ శీతల్

న్యూఢిల్లీ: ఆసియా పారా క్రీడల స్వర్ణ పతక విజేత, 17 ఏళ్ల శీతల్ దేవి మరోసారి అదిరిపోయే ప్రదర్శన చేసింది. ఖేలో ఇండియా జాతీయ ర్యాంకింగ్ ఆర్చరీ టోర్నమెంట్‌లో రజతంతో మెరిసింది. అయితే, ఈ పోటీల్లో ఆమె సాధారణ ఆర్చర్ల విభాగంలో పోటీపడి పతకం నెగ్గడం విశేషం. మంగళవారం ఢిల్లీలో జరిగిన జూనియర్ కాంపౌండ్ వ్యక్తిగత కేటగిరీ ఫైనల్లో శీతల్ 138-140 స్కోరుతో ఏక్తా చేతిలో ఓడి, రజతంతో సరిపెట్టుకుంది. ఏక్తాకు రూ.50 వేలు, శీతల్‌కు రూ.40 వేలు నగదు బహుమతి లభించింది.

ఫ్యాన్ క్రేజ్.. ఫ్రాంచైజీలకు 'క్యాష్'!

న్యూఢిల్లీ: ఫ్రాంచైజీ క్రికెట్ వినోదానికి కేరాఫ్..ధనాధన్ బ్యాటింగ్, మెరుపు ఫీల్డింగ్.. పిచ్ అనుకూలిస్తే వికెట్ల పండుగ చేసుకొనే పేసర్లు, స్పిన్నర్లు..మొత్తం మూడు గంటల్లో ముగిసే ఫ్రాంచైజీ క్రికెట్‌పై ఫ్యాన్స్‌కు ఎక్కడలేని క్రేజ్..అందుకే అభిమానుల ఈ పిచ్చిని ఫ్రాంచైజీలు బాగా 'క్యాష్' చేసుకుంటున్నాయి. 'డైనమిక్ రేట్స్' పేరిట ఫ్యాన్స్ జేబును గుల్ల చేస్తున్నాయి ! సొంత మైదానంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్‌కు బెస్ట్ సీట్ చివరి నిమిషంలో కావాలంటే..టిక్కెట్ రేటు ఎంతో తెలుసా... రూ. 52,938 ! టిక్కెట్ ధరల నిర్ణయాధికారం ఫ్రాంచైజీలకు బోర్డు వదిలేయడమే ఈ అధిక ధరలకు కారణం ! టిక్కెట్ల కోసం ఎగబడుతున్న ఫ్యాన్స్..కూడా ధరల విషయంలో ఫిర్యాదు చేయడం లేదట.

వరుస ఓటములు..అయినా తగ్గని క్రేజ్: బెంగళూరు జట్టు దారుణ వైఫల్యాలు చవిచూస్తున్నా..ఆ టీమ్ ఫ్యాన్ క్రేజ్ ఏమాత్రం తగ్గడంలేదు. ఈ క్రేజ్‌ను ఆర్సీబీ ఫ్రాంచైజీ బాగా 'సొమ్ము' చేసుకుంటోంది. బెంగళూరు జట్టు సొంతమైదానంలో ఆడే మ్యాచ్‌కు అతి తక్కువ శ్రేణి టిక్కెట్ రేటు ఎంతో తెలుసా..రూ.2300 ! ఈసారి ఐపీఎల్‌లో బెంగళూరులో ఇదే అతి తక్కువ టిక్కెట్ ధర ఇదే కావడం గమనార్హం. ఈ డైనమిక్ ధరలనుంచి తక్కువ రేటు కలిగిన టిక్కెట్లను మినహాయించారు. కానీ ఎక్కువ రేటు కలిగిన టిక్కెట్ల విషయంలో డైనమిక్ విధానం అనుసరిస్తుండడంతో మ్యాచ్ డే దగ్గరపడుతున్నకొద్దీ వాటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. హోమ్ గ్రౌండ్‌లో బెంగళూరు తొలి మ్యాచ్‌కు టెర్రాస్ టిక్కెట్ రేటును రూ. 4,840 నుంచి రూ. 6,292కి పెంచేశారు. ఇక కార్పొరేట్ స్టాండ్ టిక్కెట్ ధర అయితే రూ. 42,350 నుంచి 52,938కి చేరింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	7	6	1	0	12	0.677
కోల్‌కతా	6	4	2	0	8	1.399
చెన్నై	6	4	2	0	8	0.726
హైదరాబాద్	6	4	2	0	8	0.502
లఖ్‌నవూ	6	3	3	0	6	0.038
ఢిల్లీ	7	3	4	0	6	-0.074
గుజరాత్	7	3	4	0	6	-1.303
పంజాబ్	6	2	4	0	4	-0.218
ముంబై	6	2	4	0	4	-0.234
బెంగళూరు	7	1	6	0	2	-1.185

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్



'47 కోట్లు' బెంచ్‌కే..

బెంగళూరులో సోమవారం సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీ 25 పరుగుల తేడాతో ఓడింది. ఈ పోరుకు ఆసీస్ ద్వయం మ్యాక్స్‌వెల్, గ్రీన్, అల్జరీ జోసెఫ్, సిరాజ్ వంటి స్టార్ క్రికెటర్లను ఆర్సీబీ బెంచ్‌మీదే కూర్చోబెట్టింది. మ్యాచ్ చేజార్చుకున్న బెంగళూరుపై సీఎస్‌కే బ్యాటర్ అభినవ్ ముకుంద్ సెటైర్ వేశాడు. 17.5+11.5+11+7= రూ. 47 కోట్లు బెంచ్‌కే..అని ఎద్దేవా చేశాడు.



శ్రేయాస్‌కు 12 లక్షల జరిమానా

కోల్‌కతా: రాజస్థాన్ రాయల్స్‌తో మంగళవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ స్లో ఓవర్ రేట్ నమోదు చేసినందుకు ఆ జట్టు కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌కు జరిమానా పడింది. స్లో ఓవర్ రేట్ విషయంలో నైట్‌రైడర్స్‌కు ఇది తొలి తప్పిదం కావడంతో శ్రేయాస్‌కు రూ. 12 లక్షల జరిమానాతో సరిపెట్టారు. ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ జట్టు ఆఖరి బంతికి గెలుపొందిన సంగతి తెలిసిందే.

గుజరాత్ ఢమాల్

దుమ్మురేపిన ఢిల్లీ బౌలర్లు
89 పరుగులకే టైటాన్స్ అవుట్
53 బంతుల్లోనే గెలిచిన పంత్ సేన



అహ్మదాబాద్: ఎట్టకేలకు బౌలర్లు చెలరేగడంతో.. ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయాన్ని నమోదు చేసింది. బుధవారం ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 6 వికెట్లతో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చేసింది. కేవలం 53 బంతుల్లోనే లక్ష్యాన్ని చేరుకొన్న క్యాపిటల్స్ నెట్ రన్‌రేట్‌ను భారీగా మెరుగుపరచుకొంది. తొలుత గుజరాత్ 17.3 ఓవర్లలో 89 పరుగులకు కుప్పకూలింది. రషీద్ ఖాన్ (31) టాప్ స్కోరర్. ముకేశ్ 3 వికెట్లు పడగొట్టగా.. ఇషాంత్, స్టబ్స్ చెరో 2 వికెట్లు దక్కించుకొన్నారు. అనంతరం స్వల్ప ఛేదనలో ఢిల్లీ 8.5 ఓవర్లలో 92/4 స్కోరు చేసి అలవోకగా నెగ్గింది. జాక్ ఫ్రేజర్ (10 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 20), హోప్ (10 బంతు ల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 19), రిషభ్ పంత్ (16 నాటౌట్) వేగంగా ఆడారు. సందీప్ వారియర్ 2 వికెట్లు పడగొట్టాడు. రెండు స్టంపింగ్‌లు, రెండు క్యాచ్‌లు పట్టడంతో పాటు బ్యాటింగ్‌లో అజేయంగా నిలిచిన ఢిల్లీ కెప్టెన్ పంత్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది. ఈ గెలుపుతో ఢిల్లీ పట్టికలో ఆరో స్థానానికి చేరుకొంది.

ఎడాపెడా బాదేశారు..: స్వల్ప లక్ష్య ఛేదనను ఢిల్లీ వీలైనంత వేగంగా ముగించింది. వార్నర్ స్థానంలో ఓపెనర్‌గా వచ్చిన ఫ్రేజర్ తొలి ఓవర్‌లోనే 4,6తో జోరు చూపాడు. ఆ తర్వాతి ఓవర్‌లో 6,4 బాదిన ఫ్రేజర్‌ను స్పెన్సర్ అవుట్ చేయడంతో.. మొదటి వికెట్‌కు 25 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఫోర్‌తో గేర్ మార్చే ప్రయత్నం చేస్తున్న మరో ఓపెనర్ పృథ్వీ షా (7)ను వారియర్ వెనక్కిపంపాడు. ఈ దశలో జతకలసిన అభిషేక్ పోరెల్ (15), షాయ్ హోప్ వేగంగా ఆడుతూ మూడో వికెట్‌కు 14 బంతుల్లో 34 పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారు. 5వ ఓవర్‌లో వారియర్ బౌలింగ్‌లో హోప్ 4,6,6తో జోరు చూపగా.. సిక్స్ బాదిన పోరెల్ ఆ తర్వాతి బంతికి బౌల్డ్ అయ్యాడు. కానీ, ఈ ఒక్క ఓవర్‌లోనే వీరిద్దరూ 23 పరుగులు రాబట్టారు. అయితే, హోప్‌ను రషీద్ క్యాచవుట్ చేయడంతో.. పవర్‌ప్లే ముగిసే సరికి ఢిల్లీ 67/4తో నిలిచింది. అనంతరం పంత్, సుమిత్ (9 నాటౌట్) ఐదో వికెట్‌కు అజేయంగా 25 పరుగులు జోడించడంతో.. క్యాపిటల్స్ మరో 67 బంతులు మిగిలుండగానే గెలిచింది. పంత్ 6,4 బాదగా.. సుమిత్ రెండు బౌండ్రీలతో మ్యాచ్‌ను ముగించాడు.

1

89 పరుగులు చేసిన గుజరాత్‌కు ఐపీఎల్‌లో ఇదే అత్యల్ప స్కోరు. గతేడాది ఢిల్లీపై టైటాన్స్ 125/6 స్కోరు చేసింది.

బంతుల పరంగా (67 బంతుల్లో) ఢిల్లీకి ఇదే భారీ గెలుపు.

పెవిలియన్‌కు క్యూ..: ఢిల్లీ బౌలర్లు ఇషాంత్, ముకేశ్ విజృంభించడంతో.. గుజరాత్ బ్యాటింగ్ పేకమేడను తలపించింది. క్రమం తప్పకుండా వికెట్లను చేజార్చుకొన్న టైటాన్స్.. లీగ్‌లో అత్యల్ప స్కోరు నమోదు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ బ్యాటింగ్‌లో రషీద్ మినహా ఒక్క బ్యాటర్ కూడా మూడు పదుల స్కోరు దాటలేక పోయారు. పవర్‌ప్లేలోనే టాపార్డర్ బ్యాటర్లు గిల్ (8), సాహా (2), సాయి సుదర్శన్ (12)తోపాటు మిల్లర్ (2) వికెట్లను కోల్పోయిన గుజరాత్ 30/4తో పీకల్లోతు కష్టాల్లో పడింది. రెండు ఫోర్లతో ధాటిగా ఆడుతున్న గిల్‌ను అవుట్ చేసిన ఇషాంత్.. టైటాన్స్ పతనానికి నాంది పలికాడు. ముకేష్ బౌలింగ్‌లో సాహా వికెట్ల మీదకు ఆడుకొన్నాడు. సుమిత్ మెరుపు ఫీల్డింగ్‌తో సుదర్శన్ రనౌట్ కాగా.. ఇషాంత్ బౌలింగ్‌లో పంత్ అద్భుత క్యాచ్‌తో మిల్లర్ వెనుదిరిగాడు. ఈ దశలో అభినవ్ మనోహర్ (8), రాహుల్ తెవాటియా (10) జట్టును ఆదుకొంటారని భావించారు. కానీ, 9వ ఓవర్‌లో మనోహర్, షారుక్ ఖాన్ (0)లను పంత్ స్టంపౌట్ చేయడంతో.. టైటాన్స్ 54/6తో కోలుకోలేక పోయింది. రషీద్ రెండు బౌండ్రీలతో దూకుడుగా ఆడాడు. కానీ, 12వ ఓవర్‌లో తెవాటియాను అక్షర్ ఎల్బీ చేయడంతో గుజరాత్ ఇన్నింగ్స్ ఎంతోసేపు సాగలేదు. మోహిత్ శర్మ (2)ను ఖలీల్ పెవిలియన్ చేర్చాడు. 18వ ఓవర్‌లో రషీద్‌తోపాటు నూర్ అహ్మద్ (1)ను అవుట్ చేసిన ముకేశ్.. వంద పరుగులలోపే గుజరాత్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

నేటి మ్యాచ్ | రాత్రి 7.30 గం.

పంజాబ్ X ముంబై

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లి (బెంగళూరు)	చాహల్ (రాజస్థాన్)
361 పరుగులు	12 వికెట్లు

స్కోరుబోర్డు

గుజరాత్: సాహా (బి) ముకేశ్ 2, గిల్ (సి) పృథ్వీషా (బి) ఇషాంత్ 8, సాయి సుదర్శన్ (రనౌట్) 12, మిల్లర్ (సి) పంత్ (బి) ఇషాంత్ 2, మనోహర్ (స్టంప్డ్) పంత్ (బి) స్టబ్స్ 8, తెవాటియా (ఎల్బీ) అక్షర్ 10, షారుక్ (స్టంప్డ్) పంత్ (బి) స్టబ్స్ 0, రషీద్ (సి) పంత్ (బి) ముకేశ్ 31, మోహిత్ (సి) సుమిత్ (బి) ఖలీల్ 2, నూర్ అహ్మద్ (బి) ముకేశ్ 1, జాన్సన్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 17.3 ఓవర్లలో 89 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-11, 2-28, 3-28, 4-30, 5-47, 6-48, 7-66, 8-78, 9-88, 10-89; **బౌలింగ్:** ఖలీల్ 4-1-18-1, ఇషాంత్ శర్మ 2-0-8-2, ముకేశ్ 2.3-0-14-3, కుల్దీప్ యాదవ్ 4-0-16-0, స్టబ్స్ 1-0-11-2, అక్షర్ 4-0-17-1.

ఢిల్లీ: పృథ్వీ షా (సి) జాన్సన్ (బి) సందీప్ 7, ఫ్రేజర్ (సి) మనోహర్ (బి) జాన్సన్ 20, అభిషేక్ (బి) సందీప్ 15, హోప్ (సి) ఇషాంత్ (బి) రషీద్ 19, పంత్ (నాటౌట్) 16, సుమిత్ (నాటౌట్) 9, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 8.5 ఓవర్లలో 92/4; వికెట్ల పతనం:** 1-25, 2-31, 3-65, 4-67; **బౌలింగ్:** సందీప్ 3-0-40-2, జాన్సన్ 2-0-22-1, రషీద్ 2-0-12-1, నూర్ అహ్మద్ 1.5-0-14-0.

కొత్త ముఖాలకు చోటు కష్టమే!

» జైస్వాల్-గిల్, రింకూ-దూబే మధ్య పోటీ

» టీ20 వరల్డ్‌కప్ జట్టు ఎంపిక నెలాఖరున ?

న్యూఢిల్లీ: డెడ్‌లైన్ దగ్గరపడుతుండంతో..టీ20 వరల్డ్‌కప్‌నకు భారత జట్టు ఎంపికపై సెలెక్టర్లు దృష్టి సారించారు. ప్రస్తుత పరిస్థితులనుబట్టి కొత్త ముఖాలకు జట్టులో చోటు కష్టమని తెలుస్తోంది. అంతేకాకుండా గతంలో పరీక్షించిన ఒకరిద్దరు ఆటగాళ్లకు కూడా నిరాశ తప్పేలా లేదు. వరల్డ్‌కప్ జట్టు ప్రకటనకు ఐసీసీ వచ్చే నెల ఒకటో తేదీని కటాఫ్‌గా నిర్ణయించింది. ఈ నేపథ్యంలో చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ ఈ నెలాఖరు కల్లా 15 మంది సభ్యుల భారత జట్టును ఎంపిక చేయనుంది. కాగా, అమెరికా-వెస్టిండీస్ సంయుక్తంగా నిర్వహిస్తున్న పొట్టి వరల్డ్‌కప్ జూన్ 2 నుంచి జరగనుంది. ఓపెనర్ స్థానం కోసం పోటీలో ఉన్న యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్‌లో ఒకరికి మాత్రమే జట్టులో చోటు లభించే అవకాశాలున్నాయి. ఇక, ఫినిషర్ స్థానం కోసం రింకూ సింగ్, శివమ్ దూబే మధ్య పోటీ నెలకొంది. రిషభ్ పంత్‌కు బ్యాకప్‌గా రెండో వికెట్ కీపర్ రేసులో సంజూ శాంసన్, రాహుల్, ఇషాన్ కిషన్ ఉన్నారు. అయితే, రాహుల్, ఇషాన్ ఐపీఎల్‌లో ఓపెనర్లుగా దిగుతుండడంతో మిడిలార్డర్‌లో వీరు ఎలా ఆడతారనేది సెలెక్టర్లకు తలనొప్పిగా మారింది. హార్దిక్ పాండ్యా బౌలింగ్ ఫిట్‌నెస్‌పై అనుమానాలున్నా.. ప్రస్తుతానికి అతడి ఎంపికలో ఎటువంటి సందేహాలు లేవు. కోహ్లీ ఎంపిక కూడా లాంఛనం కానుంది.

టీమిండియా ప్రాబబుల్స్ (15+5 స్టాండ్‌బై)

బ్యాటర్లు (6): రోహిత్, యశస్వీ జైస్వాల్, గిల్, కోహ్లీ, సూర్య కుమార్, రింకూ సింగ్; **ఆల్ రౌండర్లు (4):** హార్దిక్ పాండ్యా, జడేజా, శివమ్ దూబే, అక్షర్ పటేల్; **స్పిన్నర్లు (3):** కుల్దీప్ యాదవ్, చాహల్, రవి బిష్ణోయ్; **వికెట్ కీపర్లు (3):** రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, సంజూ శాంసన్; **పేసర్లు (4):** బుమ్రా, సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, అవేశ్ ఖాన్.

ప్రాణం పోయినా.. ముస్లిం రిజర్వేషన్లను టీడీపీ పోనివ్వదు!

» దుర్బుద్ధితోనే వైసీపీ దుష్ప్రచారం

» శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ స్పష్టీకరణ

అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రాణం పోయినా ముస్లిం రిజర్వేషన్లను టీడీపీ పోనివ్వదని, వాటికి భంగం కలగనివ్వదని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ ప్రకటించారు. రాజకీయంగా ఎదుర్కోలేకే వైసీపీ నేతలు తమ పార్టీపై ఈ విధమైన దుష్ప్రచారానికి తెగబడుతున్నారని ఆక్షేపించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ముస్లింలకు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన వైసీపీ వారిని మోసం చేసింది. వారి కోసం టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన అనేక పథకాలను నిలిపివేసింది. మైనారిటీ కార్పొరేషన్‌కు బడ్జెట్లో నిధులు పెట్టి, దానికి ఇవ్వకుండా వేరే పథకాలకు తరలించింది. దీనిపై ముస్లిం సమాజంలో ఆగ్రహం ఉండటంతో వారిని మాయచేయడానికి నాలుగు శాతం రిజర్వేషన్లు, ఇక్కడ అమల్లోనే లేని ఎన్ఆర్సీ చట్టం గురించి వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారు. నాలుగు శాతం రిజర్వేషన్లకు టీడీపీ కట్టుబడి ఉంది. 2014 నుంచి 2018 మార్చి వరకూ టీడీపీ ప్రభుత్వం ఎన్డీయే కూటమిలో ఉంది. అప్పుడు కూడా నాలుగు శాతం రిజర్వేషన్లను టీడీపీ ప్రభుత్వం అమలు చేసింది. అప్పుడు రాని సమస్య ఇప్పుడు ఎందుకు వస్తుంది?' అని ప్రశ్నించారు. 4% రిజర్వేషన్ల అంశం సుప్రీంకోర్టులో ఉందని, ఆ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడానికి టీడీపీ ప్రభుత్వం రూ.5 కోట్లు వెచ్చించి ఇద్దరు నిష్ణాతులైన న్యాయవాదులను పెట్టి వాదనలు వినిపించిందని తెలిపారు. రిజర్వేషన్లు అమలు చేయడమే కాకుండా వాటికి చట్టబద్ధత కల్పించాలన్నది తమ వైఖరని షరీఫ్ చెప్పారు. 'ముస్లిం రిజర్వేషన్ల పట్ల టీడీపీ విధానాన్ని ఎవరూ మార్చలేరు. ఎవరూ అడ్డుకోలేరు. ముస్లింల మనోభావాలు దెబ్బతినకుండా, వారికి ఏ కష్టం, నష్టం రాకుండా టీడీపీ చూసుకుంటుంది. మోసం చేసిన వైసీపీని గద్దె దించడంలో టీడీపీకి సహకరించాలని ముస్లిం సమాజానికి విజ్ఞప్తి చేస్తున్నాం' అని షరీఫ్ పేర్కొన్నారు.



మాజీ ఎమ్మెల్యే సుభానీని పార్టీలోకి ఆహ్వానిస్తున్న లోకేశ్

టీడీపీలోకి మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని

గుంటూరు, ఏప్రిల్ 17: గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని, ఆయన తనయుడు మాజీ డిప్యూటీ మేయర్ షేక్ గౌసేలు బుధవారం లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. గుంటూరు నుంచి అనుచరవర్గంతో ర్యాలీగా ఉండవల్లిలోని టీడీపీ కార్యాలయానికి చేరుకుని, పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సుభాని చేరికతో నియోజకవర్గంలో సమీకరణలు మారనున్నాయి. 2004లో గుంటూరు తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహించిన షేక్ సుభానికి నియోజకవర్గంలో మంచిపట్టుంది. గత ఎన్నికల్లో తమ గెలుపునకు కృషి చేసిన సుభాని టీడీపీలోకి వెళ్లటం వైసీపీ నాయకుల్లో గుబులు రేకెత్తిస్తోంది. సొంత ముస్లిం సామాజికవర్గంతోపాటు నియోజకవర్గంలో కాపు, యాదవ, ఎస్సీ సామాజికవర్గంలో కూడా తనదైన వర్గాన్ని కలిగిన నేతగా గుర్తింపు పొందారు. వివాద రహితుడిగా మంచి పేరుంది. ప్రస్తుతం ఆయన గుంటూరులోని ఆంధ్ర ముస్లిం కళాశాల కరస్పాండెంట్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. నంబూరు సుభాని ఆధ్వర్యంలో అధికార వైసీపీ కార్పొరేటర్లు ఖాజామొహిద్దీన్ చిష్టీబాషా, మీరావలి, వేముల జ్యోతి కూడా టీడీపీలో చేరారు.



పెడనలో బుధవారం నిర్వహించిన ప్రజాగళం సభకు హాజరైన జనం, పెడన రోడ్ షోలో గజమాలలో చంద్రబాబు, పవన్ కల్యాణ్

డ్రామాలు నమ్మరు!

ఎన్నో సర్వేల్లో రాష్ట్రంలో ఎన్డీయే 17 నుంచి 23 ఎంపీ సీట్లు గెలుస్తుందని తేలింది. అందుకే జగన్‌రెడ్డి డ్రామాలు మొదలుపెట్టాడు.

నిన్నటి వరకు జగన్ పరదాలు కట్టుకుని తిరిగి ఇప్పుడు దోచుకున్న వేల కోట్లతో ప్రజలను కొనాలని చూస్తున్నాడు. మా వద్ద డబ్బు లేదు. రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టగల శక్తి ఉంది.

నామీద, పవన్ కల్యాణ్ మీద దాడులు జరిగినప్పుడు జగన్ కనీసం ఖండించలేదు. ఆయనపై గులకరాయి దాడి జరిగినప్పుడు ఇద్దరం ఖండించాం. - చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

పరమావధి కాదు మార్పు పరమావధి అని పవన్ వ్యాఖ్యానించారు. జగన్‌కు గాయమైతే రాష్ట్రానికి గాయమన్నట్లు వైసీపీ నాయకులు మాట్లాడుతున్నారని.. రాష్ట్రంలో ఉపాధి లేక రోడ్లపై ఉన్న యువతకు గాయం కాదా.. బాపట్లలో 15 ఏళ్ల అమర్నాథ్‌ను వైసీపీ నాయకులు పెట్రోలు పోసి చంపేస్తే అది గాయం కాదా.. జగన్‌కు గులకరాయి తగిలితే రాష్ట్రానికి గాయమా.. అని నిలదీశారు.

బాధలు గుర్తుకు రాలేదా: చంద్రబాబు

జగన్ నాటకాలను ఎవరూ నమ్మరు. ఈయన సభ పెడితే కరెంటు పోయిందంట.. పవన్ కల్యాణ్ వచ్చి రాయి విసిరాడంట.. నేను రాయి వేయించానంటూ కొత్త డ్రామా మొదలుపెట్టాడు. మాపైన వేసిన రాళ్లు దొరికాయి. కానీ ఈ డ్రామారాయుడిపై వేసిన రాయి మాత్రం దొరకలేదు. గత ఐదేళ్లుగా పరదాలు కట్టుకుని తిరిగి.. ఈ రోజు ఓట్ల కోసం బయటకు వచ్చాడు. 2014లో తన తండ్రి చనిపోయాడని, 2019లో తన బాబాయిని చంపేసి ఎవరో చంపేశారని, ఇప్పుడు పింఛనుదార్లు చనిపోయారంటూ ఓట్ల కోసం శవాలతో వస్తున్నాడు. ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీని వదిలిపెట్టి పోవడం చూసి బెంబేలెత్తిపోయాడు. బాబాయిపై గొడ్డలి పోటును మాపై నెట్టాలని చూశాడు. ఈ రోజు బాబాయి కూతురే ప్రశ్నిస్తోంది. ముందు ఆమె ప్రశ్నలకు సమాధానం చెప్పండి. నీపై గులకరాయి పడితే హత్యాయత్నం అంటున్నావు.. ఇది మీ పోలీసుల చేతకాని తనం కాదా! దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన వాడిని, దళితులకు శిరోముండనం చేసిన వారిని పక్కన పెట్టుకు తిరుగుతున్నాడు. నా ఎస్సీ, నా బీసీ అంటే ఇదేనా? జడ్జీలను ఇష్టానుసారంగా తిట్టిన ఓ ఎన్ఆర్ఐని సీబీఐ వెతుకుతుంటే అతడిని తన పక్కనే పెట్టుకు తిరుగుతున్నాడు. రేపల్లెలో అమర్నాథ్‌గౌడ్ అనే బాలుడు తన అక్కను కాపాడుకునే ప్రయత్నం చేస్తుండగా అతడిని పెట్రోలు పోసి తగులబెట్టినప్పుడు ఈ సైకోకు ప్రజలు, వారి బాధలు గుర్తుకు రాలేదు. అందుకే ఈయన పేరును 'జే గన్ రెడ్డి సైకో' అని మార్చా.

బెదిరింపులకు అదరని యోధుడు పవన్

ఎన్ని బెదిరింపులు వచ్చినా అదరక బెదరక యోధుడిగా నిలబడిన వ్యక్తి పవన్. కృష్ణా జిల్లాలో ఇద్దరు నానీలు ఉన్నారు. ఒకడు బూతుల నాని, మరొకడు నీతుల నాని. బందరులో నితీశ్ అన్న వ్యక్తి మాల్ కట్టుకుంటే డబ్బులు ఇవ్వలేదని ఎన్ఓసీ ఇప్పించలేదు. భోగరాజు పట్టాభి సీతారామయ్య మెమోరియల్‌ను అడ్డుకున్న వ్యక్తి ఈ నాని కాదా? ఈయన పోయి కిట్టూ(పేర్ని నాని కొడుకు) వచ్చాడు. నియోజకవర్గంలో గంజాయి బ్యాచ్, సెటిల్‌మెంట్ల బ్యాచ్‌కు లీడర్ ఈయనే. అధికారంలోకి వస్తే చేనేతలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు విద్యుత్ ఉచితంగా ఇస్తాం. కలంకారీలకు ప్రత్యేక క్లస్టరు ఏర్పాటు చేస్తాం. మత్స్యకారుల పొట్టకొట్టే జీవో 217ని రద్దు చేస్తాం. బందరు పోర్టును కాసుల కోసం అటకెక్కించారు. పోర్టును అభివృద్ధి చేసేది టీడీపీయే. మేమందరం కలిశామని జగన్ అంటున్నాడు. మూడు వేర్వేరు జెండాలైనా మాది ఒకే ఎజెండా. తెలుగు ప్రజలు అభివృద్ధే మా ఎజెండా. జగన్ పాలనలో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లింది. దానిని ఓడించేందుకే పొత్తు పెట్టుకున్నాం. గతంలో ఎన్డీయేలో ఉన్నప్పుడూ ఏ ఒక్క ముస్లింకు అన్యాయం జరగలేదు. కూటమి అధికారంలోకి వస్తే రామరాజ్య స్థాపనకు కృషి చేస్తామని శ్రీరామనవమి పర్వదినాన హామీ ఇస్తున్నా.

జగన్‌పై దాడి చేయడానికి మాకు పనీపాటా లేదా? సొంత బాబాయిని గొడ్డలితో నరికి చంపించిన వ్యక్తిపై ఎవరైనా దాడి చేయగలరా? - పవన్ కల్యాణ్

చంద్రబాబు ఐదేళ్లలో విద్యుత్ చార్జీలు పెంచలేదు

జగన్ 10 సార్లు పెంచాడు!

» సొంత బాబాయిని గొడ్డలితో చంపించిన వ్యక్తిపై ఎవరైనా దాడి చేయగలరా?: పవన్

వారాహి రోడ్లపైకి ఎలా వస్తుందో చూస్తానన్నాడు ఇక్కడ ఉన్న ఎమ్మెల్యే(పేర్ని నాని). ఇలాంటి తాటాకు బెదిరింపులకు భయపడతామా? వారి నాయకుడు దిగజారుడుతనంతో మాట్లాడుతుంటాడు. ఆయన సతీమణిని ఎప్పుడైనా జగన్ పెళ్లామని అంటామా? సొంత చెల్లిని వేధించేవాడు.. గోడకేసి కొట్టేవాడిని ఈ ఎన్నికల్లో పక్కన పెట్టకపోతే రాష్ట్రానికే కాదు.. దేశానికే చీడపురుగులా తయారవుతాడు. వైనాట్ 175 అంటున్నాడు జగన్. ఆయన చేసిన పాలనకు వైనాట్ 15 అని అడుగుతున్నాం. యువత కులాలు దాటి రావాలి. కుల గణాంకాలతోపాటు స్కిల్ డెవలప్‌మెంట్ గణాంకాలు కూడా తీయాల్సిన అవసరం ఉంది. నియోజకవర్గం ఎందుకు మారానని జగన్ భీమవరం సభలో నన్ను ప్రశ్నించాడు. నా సంగతి సరే ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేలను ఎందుకు మార్చావో సమాధానం చెప్పు. 70 నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులను ఎందుకు మార్చాల్సి వచ్చింది? నోరుంది కదా అని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే చెల్లదు. క్లాస్‌వార్ అని చెప్పే జగన్‌రెడ్డి అధికారంలోకి రాగానే పేదల కడుపు కొట్టాడు. ఉపాధి హామీ నిధుల్లో దేశంలో అత్యంత అవినీతి మన రాష్ట్రంలో జరిగిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పార్లమెంటులో స్పష్టం చేశారు. పోలీసులకు ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి అమలు చేయకుండా దోపిడీ చేసిన ఘనత జగన్‌దే. చంద్రబాబు అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఒక్కసారి కూడా విద్యుత్ చార్జీలు పెంచలేదు. జగన్ పదిసార్లు పెంచాడు. కల్తీ మద్యం సరఫరా చేస్తూ మహిళల మంగళసూత్రాలు తెంచుతున్నారు. ఇలాంటి వైసీపీని తన్ని తగలేయాలి.

ఐదేళ్లు అప్పనంగా.. ప్రజల సొమ్ము మేత!

» ఈసీ ఆపితే తప్ప ఆగని సలహాదారుల నోళ్లు

» వారితో రాష్ట్రానికి, ప్రజలకు మేలేమీ లేదు

» టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విమర్శ

అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకొని నోళ్లకు సీళ్లు వేస్తే తప్ప వైసీపీ ప్రభుత్వంలో సలహాదారులు ఆగని పరిస్థితి నెలకొందని తెలుగుదేశం పార్టీ విమర్శించింది. ప్రజల సొమ్మును అప్పనంగా ఈ సలహాదారులు ఐదేళ్లు మేశారని, జగన్‌కు డబ్బా కొట్టుకొంటూ తిరగడం తప్ప వీరి వల్ల రాష్ట్రానికి, ప్రజలకు కలిగిన మేలేమీ లేదని టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ వ్యాఖ్యానించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన తర్వాత కూడా సలహాదారుల హంగామాకు, నోటికి అడ్డూ అదుపూ లేకుండా పోయిందని విమర్శించారు. దీంతో వారికి కూడా వలంటీర్ల మాదిరిగా కోడ్ వర్తిస్తుందని ఈసీ చెప్పాల్సి వచ్చిందన్నారు. '2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ఆ తర్వాత ఆరు నెలల్లోనే 37 మంది సలహాదారులను నియమించుకొన్నారు. ఆతర్వాత వారి సంఖ్య 55కు... తర్వాత 69కి పెరిగిపోయింది. ఇంతమందికి కేబినెట్ ర్యాంక్ కల్పించి హంగులు హంగామాలతో దోచిపెట్టారు. వీరిలో అత్యధికులు జగన్ పత్రికలో పనిచేసిన వారే. అందులో మొదటి వ్యక్తి సజ్జల రామకృష్ణారెడ్డి, ఆతర్వాత జీవీడీ కృష్ణమోహన్. మొదటి నెలలో వచ్చిన వారంతా జగన్ పత్రికలో పనిచేసిన వారే. వీళ్లుగాక మిగిలినవారు జగన్ బంధువులు లేదా ఆయనకు బాగా దగ్గరివారు. మరికొంతమంది టీడీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేసిన అధికారులు. అప్పుల కోసం కొంతమంది రిటైర్డ్ బ్యాంక్ అధికారులను సలహాదారులుగా పెట్టుకొన్నారు. సలహాదారుల్లో 23 మంది జగన్ సొంత సామాజిక వర్గానికి చెందినవారు. వీరిలో కొంతమందికి నెలకు రూ.30 లక్షల వరకూ ఖర్చు చేశారు. మంత్రులు బుట్టబొమ్మల మాదిరిగా ఏ అధికారం లేకుండా తిరుగుతుంటే ఈ సలహాదారులే ప్రభుత్వాన్ని నడిపారు' అని విజయ్ కుమార్ వివరించారు. సజ్జల రామకృష్ణారెడ్డి సకల శాఖామంత్రిగా తయారయ్యారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో సీఎస్‌గా చేసి ఈ ప్రభుత్వంలో సలహాదారు స్థాయికి దిగజారిన అజేయ కల్లం జగన్ ప్రభుత్వం చేసిన దురాగతాలకు సలహాలు ఇచ్చిన పెద్ద మనిషని ఆక్షేపించారు. టీడీపీ ప్రభుత్వం వస్తే వీరందరి మీదా విచారణ జరిపిస్తామని ప్రకటించారు.

చంద్రబాబు, లోకేశ్‌లపై

చెరో 23 కేసులు!

అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్‌లపై చెరో 23 కేసులు నమోదై ఉన్నాయి. నామినేషన్ల దాఖలు కోసం అడిగినప్పుడు పోలీస్ శాఖ ఈ వివరాలను వారికి ఇచ్చింది. వీటిని టీడీపీ న్యాయ విభాగం ప్రస్తుతం పరిశీలిస్తోంది. చంద్రబాబుపై సీఐడీ ఎనిమిది కేసులు పెట్టింది. ఇవిగాక జిల్లాల పర్యటనకు వెళ్లిన సమయంలో ఇతరత్రా పదిహేను కేసులు నమోదు చేశారు. లోకేశ్‌పై సీఐడీ కేసు ఒకటి ఉంది. మిగిలిన కేసులు యువగళం పాదయాత్ర సమయంలో నమోదయ్యాయి. ఈ కేసుల్లో అత్యధిక భాగం వైసీపీ ప్రభుత్వ హయాంలోనే పెట్టారు.

నవ్య | చిత్రజ్యోతి

రాబిన్ హుడ్ రిలీజ్ డేట్



ఇంతవరకూ తను పోషించని పాత్రలో నితిన్ నటిస్తున్న 'రాబిన్‌హుడ్' చిత్రం డిసెంబర్ 20న విడుదల కానుంది. వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నితిన్ గెటప్ నుంచి క్యారెక్టరైజేషన్ వరకూ సరికొత్తగా కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిశోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'కమర్షియల్ అంశాలే కాకుండా తగినంత వినోదం కలిగిన ఈ సినిమాను డిసెంబర్ 20న విడుదల చేస్తున్నాం. క్రిస్మస్ సెలవులు, ఆ తర్వాత న్యూ ఇయర్ సెలవులు మా సినిమాకు కలిసి వస్తాయనుకుంటున్నాం' అని నిర్మాతలు నవీన్ యర్నేని, వై.రవిశంకర్ చెప్పారు. రిలీజ్ డేట్ ప్రకటిస్తూ విడుదల చేసిన పోస్టర్‌లో నితిన్ స్పోర్ట్స్ బైక్ మీద కూర్చుని ఉన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, ఛాయాగ్రహణం: సాయి శ్రీరామ్.



యుద్ధం... సన్నద్ధం

పవన్ కల్యాణ్ కథానాయకుడిగా క్రిష్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. ఏఎం రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. శ్రీరామనవమి సందర్భంగా స్పెషల్ అప్డేట్‌ను మేకర్స్ వదిలారు. త్వరలో టీజర్‌ను విడుదల చేయనున్నట్లు బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో 'మీ ముందుకు... ధర్మంకోసం యుద్ధం త్వరలో' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. అర్జున్ రాంపాల్, బాబీ డియోల్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఎం. ఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు.



కొత్త కబుర్లు

బెల్లంకొండ హారర్ మిస్టరీ



శ్రీరామ నవమి సందర్భంగా బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా నిర్మించే కొత్త చిత్రాన్ని నిర్మాత సాహు గారపాటి ప్రకటించారు. 'భగవంత్ కేసరి' సంచలన విజయం తర్వాత ఆయన నిర్మించే ఈ హారర్, మిస్టరీ చిత్రానికి కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వం వహిస్తారు. ఈ సినిమాను ప్రకటిస్తూ విడుదల చేసిన పోస్టర్ ఆసక్తికరంగా ఉంది. శ్రీరాముడు తన చేతిలోని విల్లుతో బాణాన్ని ఆకాశంలో ఉన్న రాక్షసుడికి ఎక్కుపెట్టడం , షాడో తోలుబొమ్మలాట, నిర్జనమైన అడవి, యాంటెన్నా టవర్, హార్నెట్.. ఇవన్నీ ఆ పోస్టర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సహ రచయిత: దరహాస్ పాలకొల్లు, సంగీతం: బి.అజనీష్ లోకనాథ్, సమర్పణ: అర్చన, రచన, దర్శకత్వం: కౌశిక్ పెగళ్లపాటి.

సుందరకాండ సందడి



త్వరలోనే 'ప్రతినిధి 2' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు నారా రోహిత్. ఇప్పుడు ఆయన కథానాయకుడిగా నటిస్తున్న మరో చిత్రం నుంచి స్పెషల్ అప్‌డేట్ వచ్చింది. వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకుడిగా పరిచయం చేస్తూ, సంతోష్ చిన్నపొళ్ల, గౌతమ్ రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మిస్తున్న చిత్రానికి 'సుందరకాండ' అనే టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేశారు. అలాగే సెప్టెంబర్ 6న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. శ్రీరామనవమి సందర్భంగా 'సుందరకాండ' ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. వృతి వాఘని ఈ చిత్రంలో కథానాయిక. శ్రీదేవి విజయ్‌కుమార్, నరేశ్ విజయ కృష్ణ కీలకపాత్రలు పోషిస్తున్నారు. లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: ప్రదీప్ ఎం. వర్మ

జర్నీ టూ అయోధ్య




రామాయణం ఆధారంగా టాలీవుడ్‌లో మరో భారీ చిత్రం రూపుదిద్దుకోనుంది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో, చిత్రాలయం బేనర్‌పై భారీస్థాయిలో నిర్మించేందుకు నిర్మాత వేణు దోనెపూడి సన్నాహాలు మొదలుపెట్టారు. శ్రీరామనవమి సందర్భంగా బుధవారం ఆయన ఈ చిత్రాన్ని ప్రకటించారు. దర్శకుడు వి.ఎన్ ఆదిత్య కథను అందిస్తున్నారు. 'జర్నీ టూ అయోధ్య' అనేది వర్కింగ్ టైటిల్. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. అయోధ్యప్రాంతంలో లొకేషన్ల అన్వేషణలో చిత్రబృందం పాల్గొంటోంది. తమ్మారెడ్డి భరద్వాజ నిర్మాణ సారథ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం గోపీచంద్, దర్శకుడు శ్రీనువైట్ల కాంబినేషన్‌లో వస్తున్న 'విశ్వం' సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలసి చిత్రాలయం స్టూడియోస్ నిర్మిస్తోంది.



రెండు యుగాల కథ

వైవిధ్యమైన కథలతో హీరోగా సక్సెస్‌లు అందుకొంటున్నారు తిరువీర్. ఆయన కథానాయకుడిగా నటించే తదుపరి చిత్రం ఖరారైంది. ఘంటా సతీశ్‌బాబు దర్శకత్వంలో రాధాకృష్ణ తేలు, రామకృష్ణారెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కార్తీక మురళీధరన్ కథానాయిక. త్రేతాయుగం, కలియుగం నేపథ్యంలో సాగే కథతో తెరకెక్కుతోంది. అయ్యప్ప పి. శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీ:రామిరెడ్డి



వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించే నటుడు విక్రమ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన నటిస్తున్న 62వ చిత్రం టైటిల్ టీజర్‌ను బుధవారం విడుదల చేశారు. తమిళంలో ఈ సినిమాకు 'వీర ధీర శూరన్' అనే పేరు నిర్ణయించారు. టైటిల్ టీజర్ విడుదల చేశారు. తెలుగు టైటిల్ త్వరలో ప్రకటిస్తారు. ఈ

వీర ధీర శూరుడు

చిత్రంలో ఎస్.జె.సూర్య, దుసరా విజయన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాలో విక్రమ్ పక్కా మాస్ పాత్ర పోషిస్తున్నట్లు 225 సెకన్లు ఉన్న టైటిల్ టీజర్ చెప్పకనే చెప్పింది. ఇందులో కిరాణా షాప్ ఓనర్ కాళీ పాత్రను ఆయన పోషిస్తున్నారు. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రాన్ని ఎస్.యు. అరుణ్‌కుమార్ దర్శకత్వంలో రియా శిబు నిర్మిస్తున్నారు. అలాగే విక్రమ్ నటిస్తున్న 'తంగలాన్' చిత్రం నుంచి ఆయన పుట్టినరోజు సందర్భంగా స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.

ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్

ఇటీవల 'ఓం భీమ్ బుష్' చిత్రంతో విజయాన్ని పొందిన హీరో శ్రీవిష్ణు తన కొత్త చిత్రం వివరాలు బుధవారం ప్రకటించారు. 'సామజవరగమన' చిత్రంలో ఆయన సరసన నటించిన రెబా జాన్ ఇందులో హీరోయిన్. హసిత్ గోలి కిరణ్ దర్శకత్వంలో రూపుదిద్దుకొంటున్న ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌ను సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మిస్తున్నారు. ఇప్పటికి అరవై శాతం షూటింగ్ పూర్తయిందనీ, వీలైనంత త్వరగా మిగిలిన సినిమాను పూర్తి చేస్తామని నిర్మాతలు చెప్పారు. ఓ ఆసక్తికరమైన అంశంతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో వీర్ ఆర్యన్, అయ్యప్ప శర్మ, సుదర్శన్, రచ్చ రవి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: కాలభైరవ, సినిమాటోగ్రఫీ: విద్యాసాగర్, ఎడిటింగ్: శ్రీకరప్రసాద్.



'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/MR4yp18 లో చదవండి.

అబ్బ ఛా!



నన్ను గెలిపిస్తే... మీరు షాకవుతారు!

రాష్ట్రంలో 30 సీట్లు గెలిపిస్తే నేనే సీఎం. గాజువాక నుంచి ఎమ్మెల్యే... విశాఖ ఎంపీగా పోటీ చేస్తా. నన్ను గెలిపిస్తే మీరు షాకవుతారు. విశాఖను వాషింగ్టన్ డీసీ... ఆంధ్రాను అమెరికా చేసి చూపిస్తా. చీకటి కావాలంటే ప్రతిపక్షాలను... వెలుగు కావాలంటే నన్ను గెలిపించండి.

- కేఏ పాల్ (ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు)

విశాఖ ఉక్కుపై ఉలకడు.. పలకడు!



కర్మాగారం పరిరక్షణకు జగన్ చేసింది శూన్యం

మొక్కుబడిగా కేంద్రానికి లేఖ.. ఆపై మౌనం

తమిళనాడులోని సేలం స్టీల్ ఫ్యాక్టరీని విక్రయిస్తామని కేంద్రం ప్రకటించినప్పుడు అక్కడి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అసెంబ్లీని సమావేశపరిచి, సుదీర్ఘంగా చర్చించింది. అమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని తీర్మానించింది. సీఎం, ప్రతిపక్ష నాయకుడు కలసి ఢిల్లీ వెళ్లి ఆ తీర్మానం కాపీని అందజేసి నిరసన వ్యక్తంచేశారు. ఇదే అంశంపై ఆ రాష్ట్ర ఎంపీలు పార్లమెంటులో అనేకసార్లు గళమెత్తారు.

కర్ణాటకలో భద్రావతి ఉక్కు కర్మాగారాన్ని మూసేస్తామని కేంద్రం ప్రకటించినప్పుడు అక్కడి రాష్ట్ర ప్రభుత్వం వెనువెంటనే అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసింది. కేంద్రం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేసింది. నాటి సీఎం సిద్ధరామయ్య, యడియూరప్ప ఢిల్లీ వెళ్లి కేంద్ర పెద్దలతో మాట్లాడారు.



విశాఖ ఉక్కును 100 శాతం అమ్మేస్తామని 2021 జనవరి 27న కేంద్రం ప్రకటించింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించలేదు. తరువాత తీరుబడిగా బడ్జెట్ సమావేశాల్లో దీనిపై ఓ పది నిమిషాలు చర్చించి ఏకవాక్య తీర్మానం చేసింది. దానిని కూడా మొక్కుబడిగా కేంద్రానికి పంపి ఊరుకుంది. ఆ తరువాత తీరిగ్గా సీఎం ఇంకో లేఖ రాశారు. అది రాసి రెండేళ్లు దాటింది. ఆ తరువాత అనేకసార్లు జగన్ ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీని కలిశారు. ఒక్కసారి కూడా విశాఖ ఉక్కుపై మాట్లాడలేదు.

- పార్లమెంటులోనూ ప్రశ్నించని వైసీపీ ఎంపీలు
- ఇసుక, మాంగనీస్ ఒప్పందాల రెన్యువల్‌కూ నో
- మిగులు ఐరన్‌ఓర్ గనులు జిందాల్‌కు ధారాదత్తం
- జగనన్న ఇళ్లకు విశాఖ స్టీల్‌ను కొనాలని అభ్యర్థన
- కనీసం స్పందించని పరిశ్రమల మంత్రి అమర్‌నాథ్
- స్టీల్‌ప్లాంటు ఉద్యోగ వర్గాలతో చర్చలకూ అయిష్టత
- అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వని సీఎం జగన్
- ప్లాంటుకు ఉన్న మిగులు భూములు అమ్ముకొని నిధులు సమకూర్చుకోవడం మంచిదని సలహా
- ప్రైవేటీకరణ ప్రక్రియ ఆపుతామన్న హామీ ఏదీ?
- సీఎం జగన్ చిత్తశుద్ధి ఇదేనా అంటూ విమర్శలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'విశాఖ ఉక్కు... ఆంధ్రుల హక్కు' అంటూ 32మంది ప్రాణత్యాగంతో సాధించుకున్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం ప్రైవేటుపరం చేయడానికి సిద్ధమైంది. ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించి, ప్రతిఘటించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కేంద్రానికి మొక్కుబడిగా ఒక లేఖ రాసి ఊరుకుంది. ఆ లేఖపై కేంద్రం ఎందుకు స్పందించలేదని హైకోర్టు ఇటీవల ప్రశ్నిస్తే... ఆ లేఖ రాయడమే గొప్ప అన్నట్టుగా జగన్ రోత పత్రిక పతాక శీర్షికల్లో డప్పు కొట్టేసింది. వాస్తవానికి స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణను ఆపాలని రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా సీఎం జగన్ ఏనాడూ చిత్తశుద్ధితో ప్రయత్నం చేయలేదు. పైగా తెర వెనుక ఆ ప్రక్రియకు సహకారం అందిస్తున్నారు. ఎక్కడైనా సమస్య వస్తే... దానిపై సంబంధిత సంస్థ ప్రతినిధులతో చర్చించి, పరిష్కారాలు తెలుసుకొని ఆ దిశగా నాయకులు ప్రయత్నం చేస్తారు. స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను ఎలా ఆపాలి?, ప్రత్యామ్నాయాలు ఏమిటి? అనే విషయాలు తెలుసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఈ మూడేళ్లలో ఎలాంటి ప్రయత్నం జరగలేదు. సీఎంను కలిసి ఇబ్బందులు చెప్పుకోవాలని ప్లాంటు అధికారులు ఎంత ప్రయత్నించినా కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు. జగన్ విశాఖపట్నం వచ్చినప్పుడు ఒకసారి అన్ని కార్మిక సంఘాల నాయకులను విమానాశ్రయానికి పిలిపించుకున్నారు. వారి మనోభావాలను పూర్తిగా తెలుసుకోకుండా, తన మనసులో మాట చెప్పి పంపేశారు. మిగులు భూములు అమ్ముకొని నిధులు సమకూర్చుకోవడం మంచిదని సలహా ఇచ్చారు. అంతే తప్ప కేంద్రంతో పోరాడి ప్రైవేటీకరణ ప్రక్రియను ఆపుతామని వారికి హామీ మాత్రం ఇవ్వలేదు.

నోరెత్తని వైసీపీ ఎంపీలు

ఉత్తరాంధ్రకు చెందిన వైసీపీ ఎంపీలు ఒక్కరు కూడా స్టీల్‌ప్లాంటు సమస్యపై పార్లమెంటులో ఏనాడూ ప్రస్తావించలేదు. సాధారణంగా ఏదైనా అంశంపై కేంద్రానికి సీఎం లేఖ రాస్తే... దాని సంగతి ఏం చేశారంటూ ఆ పార్టీ ఎంపీలు పార్లమెంటులో ప్రశ్నించి సమాధానం రాబడతారు. స్టీల్‌ప్లాంటుపై జగన్ రాసిన లేఖపై ఒక్క వైసీపీ ఎంపీ కూడా ఏనాడూ సభాపతి ద్వారా సంబంధిత మంత్రిని ప్రశ్నించలేదు. అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి స్టీల్ అండ్ కోల్ పార్లమెంటరీ కమిటీలో సభ్యురాలు. ఆ హోదాలో ఆమె స్టీల్‌ప్లాంటుకు వచ్చి సమస్య తెలుసుకొని నివేదిక సమర్పించే అవకాశం ఉన్నా, ఆ ప్రయత్నం చేయలేదు. వైసీపీ ఎంపీలూ ఢిల్లీలో నోరెత్తలేదు. అక్కడి వ్యవహారాలన్నీ ఆ పార్టీ నాయకుడు విజయసాయిరెడ్డి, మిధున్‌రెడ్డి మాత్రమే చూసుకోవాలనేది అధినాయకుడి ఆదేశం. అందుకే విశాఖ ఉక్కు సమస్యపై ఢిల్లీలో ఎవరూ నోరెత్తలేదు.

కేంద్రానికి వైసీపీ సర్కారు సహకారం

విశాఖ ఉక్కుకు అన్ని వైపుల నుంచి సహాయం నిలిపివేసి, నష్టాల్లోకి నెట్టి, నిలబెట్టడం కష్టమని తేల్చేసి, తక్కువ ధరకు ప్రైవేటు సంస్థలకు ఇవ్వాలనేది కేంద్ర పెద్దల ఆలోచన. దానికి వైసీపీ ప్రభుత్వం తరఫున సీఎం జగన్ సహకారం అందిస్తున్నారు. విశాఖ ఉక్కుకు సొంత ఐరన్‌ఓర్ గనులు లేవని, వాటిని కేటాయించాలని కొన్ని దశాబ్దాలుగా కోరుతున్నా అటు కేంద్రం, ఇటు రాష్ట్రం స్పందించలేదు. తాజాగా మిగులు ఐరన్‌ఓర్ గనులను కూడా రాష్ట్రం జిందాల్ కంపెనీకి కట్టబెట్టిందే తప్ప విశాఖ ఉక్కుకు ఇవ్వలేదు. ముడిపదార్థాల కోసం ఏపీ ప్రభుత్వంతో స్టీల్‌ప్లాంటుకు కొన్ని ఒప్పందాలు ఉన్నాయి. విజయనగరం జిల్లాలో ఇసుక గనులు, మాంగనీస్ గనులు లీజుకు ఇచ్చారు. వాటిని రెన్యువల్ చేయాల్సిన సమయం వచ్చింది. అనేక లేఖలు రాసినా, ప్రత్యేకంగా వెళ్లి ఆ శాఖ అధికారులను కలిసినా పునరుద్ధరించలేదు.

కాలు కదపని జగన్

ఆర్థిక అవసరాల కోసం స్టీల్‌ప్లాంటు గత ఏడాది 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్' జారీ చేసినప్పుడు కారణం ఏదైనా సింగరేణి అధికారులను పంపించిన తెలంగాణ సీఎం కేసీఆర్ దీనిపై సమాచారం తెలుసుకున్నారు. కానీ సీఎం జగన్ మాత్రం కనీసం స్పందించలేదు. ఉత్తరాంధ్రకు చెందిన పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను స్టీల్‌ప్లాంటు అధికారులు కలసి జగనన్న ఇళ్ల నిర్మాణం కోసం విశాఖ ఉక్కును తీసుకోవాలని కోరారు. కనీసం రూ.2వేల కోట్ల సరుకు తీసుకొని నెలకు రూ.200 కోట్లు చొప్పున సాయం చేయాలని అభ్యర్థించారు. ప్రభుత్వం ఆ సాయం కూడా చేయలేకపోయింది.

తాడేపల్లికి కేంద్ర ఉక్కు మంత్రులు

విశాఖ ఉక్కు కర్మాగారం విక్రయ ప్రకటన వెలువడక ముందు కేంద్ర ఉక్కుమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తాడేపల్లి వచ్చి సీఎం జగన్‌ను కలిశారు. ఆ భేటీలో ఏ ఒప్పందం జరిగిందో తెలియదు. గతేడాది కేంద్ర ఉక్కు మంత్రి ఆర్‌సీపీ సింగ్ కూడా తాడేపల్లి వచ్చి జగన్‌ను కలిశారు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీ పెట్టబోతున్నట్టు ప్రకటించిన జిందాల్ కంపెనీకి ఐరన్‌ఓర్ గనులు కేటాయించాలని కేంద్రాన్ని కోరిన జగన్... విశాఖ ఉక్కు సమస్యలపై ఒక్కసారి కూడా నోరు విప్పలేదు. ఇదేనా ఆయన చిత్తశుద్ధి అని కార్మిక వర్గాలు విమర్శిస్తున్నాయి.

జనాగ్రహం



ఎన్నికలను బహిష్కరిస్తున్నాం

సార్వత్రిక ఎన్నికలను బహిష్కరించనున్నట్టు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు కార్మికులు ప్రకటించారు. 2020-23కు సంబంధించిన అగ్రిమెంట్ చేయకుండా మిల్లు యాజమాన్యం మొండివైఖరి అవలంబిస్తోందని, కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం లేదని, దీనిపై 16 రోజులుగా సమ్మె చేస్తుంటే అధికార పార్టీతోపాటు ఇతర పార్టీలూ స్పందించడం లేదని తెలిపారు. దీనిని నిరసిస్తూ కార్మికులు, వారి కుటుంబాలు, బంధువులు సహా అంతా ఎన్నికలను బహిష్కరించనున్నట్టు బుధవారం రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సమైక్య కార్మిక సంఘం, ఎస్‌డబ్ల్యూడబ్ల్యూఏ సంఘాల నాయకులు ప్రకటించారు.

- రాజమహేంద్రవరం సిటీ

నోట్ దిస్ పాయింట్!

175 మొత్తం అసెంబ్లీ నియోజకవర్గాలు	29 ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు	07 ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు
25 పార్లమెంటు నియోజకవర్గాలు	04 ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు	01 ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు
2,07,27,065 మహిళా ఓటర్లు	2,00,09,275 పురుష ఓటర్లు	
3,482 థర్డ్ జెండర్ ఓటర్లు	67,434 సర్వీస్ ఓటర్లు	
మొత్తం ఓటర్లు	4,08,07,256	

డామిట్..!

పులివెందులే పలకడంలా!

అవినాశ్ ప్రచారానికి దూరందూరం

పొలం పని పేరుతో కాలక్షేపం

లింగాల మండలంలోనే మారిన సీన్

'పులివెందుల' చిత్రం మారుతోంది! 'కో' అంటే కోటిమంది, 'రా' అంటే లక్ష మంది వచ్చేస్తారనుకుని బరిలోకి దిగిన జగన్ శిబిరానికి అక్కడ చిత్రమైన అనుభవం ఎదురవుతోంది. 'ప్రచారానికి రాండిబ్బా' అని పిలిస్తే... 'పొలం పని ఉందన్నా' అని స్థానిక నేతలు మెల్లగా జారుకుంటున్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడగానే కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాశ్ గ్రామాల్లో ప్రచారం మొదలుపెట్టారు. పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామాల్లో కొంతమేర పట్టున్న నేతలకు ఒకరోజు ముందే కబురు పెట్టారు. లింగాల మండలంలోని పెదకూడల, చినకూడల, గునకనపల్లె, లోపటినూతల, తాతిరెడ్డిపల్లి, కర్ణపాపాయ పల్లె గ్రామాల నేతలతో ఆయన నేరుగా మాట్లాడారు. అయినా లాభం లేకపోయింది. అందరూ పొలం బాట పడుతున్నట్లు చెప్పారు. దీంతో వాస్తవమేంటో కనుక్కురమ్మని అవినాశ్‌రెడ్డి కొందరు అనుచరులను పంపారు. దాదాపు అన్ని గ్రామాల్లోనూ వైసీపీ నేతలు చీనీ చెట్లలో కూర్చుని పేకాట ఆడుతున్న దృశ్యాలు వారికి కనిపించాయి. మరికొందరు అరటి తోటల్లో కూర్చుని కబుర్లు చెప్పుకొంటూ కనపడ్డారు. ఎందుకిలా అని ఆరా తీస్తే... 'రాష్ట్రంలో వాళ్లే(టీడీపీ) గెలుస్తున్నారంట! గవర్నమెంట్ లేనప్పుడు పులివెందుల్లో మనం చేసేది ఏముందిలే! అయినా ఇప్పుడు అధికారంలో ఉండీ ఏం చేస్తున్నాం గనుక!' అని ముఖానే చెప్పేశారట. వైఎస్ కుటుంబానికి పులివెందుల నియోజకవర్గం కోట అయితే... లింగాల మండలం కంచుకోట! 1996లో కడప లోక్‌సభ స్థానంలో బరిలో నిలిచిన వైఎస్‌ను లింగాల మండలమే గెలిపించింది. అటువంటి మండలంలోనే ఇప్పుడు సీన్ మారిపోవడం గమనార్హం. వివేకా హత్య, పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడం, ఐదేళ్లూ తమను పట్టించుకోకపోవడం వంటి కారణాలవల్లే జగన్ క్యాంప్‌కు స్థానిక నేతలు దూరంగా జరుగుతున్నారు.

- అమరావతి, ఆంధ్రజ్యోతి



వైసీపీకి 'పునరావాసం' దెబ్బ!

రంప, పోలవరం సెగ్మెంట్లలో ఎదురీత

నిర్వాసితులను గాలికి వదిలేసినందునే!

పోలవరం ఓటర్లలో 89 వేల మంది, రంపలో లక్ష మంది బాధితులు

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో పోలవరం ప్రాజెక్టు ప్రభావిత అసెంబ్లీ స్థానాల్లో వైసీపీ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. అరకు(ఎస్టీ) లోక్‌సభ స్థానం పరిధిలోని రంపచోడవరం(ఎస్టీ), ఏలూరు పార్లమెంటు పరిధిలోని పోలవరం(ఎస్టీ) సెగ్మెంట్లలో అభ్యర్థుల విజయావకాశాలను పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులే నిర్దేశించనున్నారు. గత ఎన్నికల్లో వైసీపీని గెలిపించిన ఈ రెండు నియోజకవర్గాలూ నేడు ప్రతికూలం కాబోతున్నాయని అధికారపక్షం ఆందోళన చెందుతోంది. ఈ రెండు సెగ్మెంట్లలో మొత్తంగా ఎనిమిది మండలాల్లోని 371 ఆవాసాలు ముంపునకు గురవుతున్నాయి. జాతీయ ప్రాజెక్టు హోదా దక్కిన అనంతరం 2014 నుంచి 2019 వరకూ తెలుగుదేశం ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పనులను, నిర్వాసితుల పునరావాసాన్ని సమాంతరంగా సాగించినప్పటికీ నిర్వాసితులకు పూర్తి స్థాయి పునరావాసం కలిగించే వరకూ వారిని గ్రామాల నుంచి తరలించే ప్రక్రియను చేపట్టలేదు. వారి పునరావాసాన్ని దృష్టిలో ఉంచుకునే కాఫర్ డ్యాంను కూడా కొంత అసంపూర్తిగా ఉంచింది. కానీ 2019లో వైసీపీ పాలనా పగ్గాలు చేపట్టాక పునరావాసం పూర్తి కాకుండానే 38 ఆవాసాలను ఖాళీ చేయించేశారు. 2019 ఎన్నికలకు ముందు పునరావాస ప్యాకేజీని పెంచుతామని, గతంలో తక్కువ పరిహారం పొందిన నిర్వాసితులకూ పరిహారాన్ని పెంచి ఇస్తామని హామీ ఇచ్చిన జగన్ గద్దెనెక్కి ఐదేళ్లయినా వాటిని నెరవేర్చలేదు. నిర్వాసితులు గత నాలుగేళ్లలో ఏటా ఊహించని వరదను ఎదుర్కొన్నారు. నాడు ఏయే హామీలిచ్చి ఓట్లు దండుకుందో.. నేడు అవే అంశాలు వైసీపీని చిక్కుల్లో నెట్టాయి. ముంపు గ్రామాల్లో ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉంది. రంపచోడవరం సెగ్మెంట్‌లో దేవీపట్నం, కూనవరం, వీఆర్ పురం, ఎటపాక మండలాల్లోని 234 ఆవాసాల్లో లక్ష మంది.. పోలవరం సెగ్మెంట్‌లోని పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల లోని 137 ఆవాసాల్లో 89 వేల మంది నిర్వాసితులున్నారు. రంపలో 2.75 లక్ష మంది ఓటర్లు ఉండగా.. వీరిలో నిర్వాసితులు 25-30 శాతం ఉన్నారు. పోలవరంలో 2.52 లక్షల ఓటర్లు ఉండగా.. 25-30 శాతం నిర్వాసిత ఓటర్లు. ముంపు మండలాల్లో వామపక్షాలకు పట్టుంది. కాంగ్రెస్‌తో పొత్తుతో రంపలో సీపీఎం, పోలవరంలో కాంగ్రెస్ పోటీచేస్తున్నాయి.

ప్రధాన అభ్యర్థులు వీరే..

రంపచోడవరం: నాగులపల్లి ధనలక్ష్మి-వైసీపీ, మిరియాల శిరీషాదేవి-టీడీపీ, లోతా రామారావు-సీపీఎం.

పోలవరం: తెల్లం రాజ్యలక్ష్మి-వైసీపీ, చిర్రి బాలరాజు-జనసేన, దువ్వెల సృజన-కాంగ్రెస్.

- రంపచోడవరం



గోదారి తీరం నుంచి తరలివెళ్లని తాళ్లూరు గ్రామం

సిత్రాలు సూడరో! ● పూల గుర్తులు!




ఎన్నికల్లో రాజకీయ పార్టీల రాత రాసేది ఆయా పార్టీల గుర్తులే. ఆ గుర్తును ఎంత బాగా జనంలోకి తీసుకెళ్లగలిగితే అంతగా ఓట్లు రాలతాయి. అందుకే స్వతంత్రంగా పోటీ చేసే వారు కూడా ఎన్నికల గుర్తు విషయంలో ఏ మాత్రం రాజీపడరు. ఇక, బుధవారం పెదనలో టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ పాల్గొన్న ఎన్నికల ప్రచారంలో ఆయా పార్టీల గుర్తులైన సైకిల్, గాజు గ్లాసులను ఇలా ముస్తాబు చేసి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.

జెండాలే జీవనం!



ఎవరి పార్టీ జెండా వాళ్లకు ముద్దు. అయితే ఈ కార్మికులకు మాత్రం ఆ జెండాలే ముద్ద! ఎన్నికలొచ్చాయంటే ముఖ్యమైన డిమాండ్ జెండాలదే. ఆ జెండాలు తయారు చేసేవాళ్లు నాలుగురాళ్లు సంపాదించుకునేది ఇప్పుడే. ఎన్నికల కురుక్షేత్రంలో ప్రత్యర్థి పార్టీల జెండాలు ఒకదానితో మరొకటి తలపడతాయి. కానీ ఇక్కడ మాత్రం అన్ని పార్టీల జెండాలూ ఒక దగ్గరే తయారవుతాయి. గుంటూరు జిల్లా తాడేపల్లి సమీపంలో పార్టీల జెండాలను సిద్ధం చేస్తున్న కార్మికులు.

జన కేతనం



ఆంధ్రజ్యోతి
గురువారం ◇ 18-4-2024

కౌంట్ డౌన్ 25 రోజులు

ఏ నాయకుడికైనా సొంత రాష్ట్రంపై ప్రేమ ఉంటుంది... ఉండాలి. కానీ... రాష్ట్ర ప్రతిష్ఠను దేశ విదేశాల్లో ఇనుమడింపజేయాలనే ఆసక్తి, ఇష్టం లేని ఏకైక ముఖ్యమంత్రి బహుశా జగన్మోహన్ రెడ్డి ఒక్కరే! ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు అప్పులు చేసి బటన్ నొక్కడం తప్ప... రాష్ట్రానికి మేలు చేయాలనే ఆలోచన ఏ కోశానా కనిపించదు!



ఏ ముఖ్యమంత్రయినా ఢిల్లీకి వెళితే అక్కడ జాతీయ మీడియాతో మాట్లాడతారు. రాష్ట్రంలోని సానుకూల పరిస్థితులు, అవకాశాలు, అభివృద్ధి గురించి చెబుతారు. ఇది... స్టేట్ బ్రాండ్‌ను ప్రమోట్ చేయడంలో భాగం. కానీ... జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజుల్లో ఒకేఒక్కసారి మీడియాతో మాట్లాడారు. ఆ తర్వాత... చీకట్లో ఢిల్లీ పెద్దలను కలిసి, మళ్లీ ఫ్లైటు ఎక్కేయడమే! దీంతో... జాతీయ మీడియా ప్రతినిధులకు అదేపనిగా గుర్తు చేసుకుంటే తప్ప 'ఆంధ్రప్రదేశ్' అనే రాష్ట్రముందని తెలియని పరిస్థితి.

'దావోస్ ఆర్థిక సదస్సుకు ఎందుకు వెళ్ల లేదు?
హబ్బా... అక్కడ మైనస్ డిగ్రీల చలి ఉంటుంది. స్నానం కూడా చెయ్యలేం తెలుసా!

పెట్టుబడులు ఎందుకు రావడంలేదు?
ఇప్పుడే కదా కోడి గుడ్డు పెట్టింది. అది పొదగాలి... ఎదగాలి...

అమర్‌రాజా దండం పెట్టి వెళ్లిపోయింది కదా!?
మేమే దండం పెట్టి... వెళ్లిపొమ్మన్నాం!

పెట్టుబడులపైనా... నవ్యాంధ్రను దేశ విదేశాల్లో ప్రమోట్ చేయడంపైనా జగన్ సర్కారు వైఖరి తెలుసుకునేందుకు ఈ మూడు ముక్కలు చాలు! దీని ఫలితం... ప్రపంచపటంలో ఆంధ్రప్రదేశ్ ఎవరూ పట్టించుకోని, ఎవరి స్మృతిలోనూ లేని అనామక, అనాథ ఆంధ్రగా మారిపోయింది.



ఏపీ బ్రాండ్: అప్పుడు
- అమరావతి
- సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్
- అభివృద్ధి - సంక్షేమం

ఏపీ బ్రాండ్: ఇప్పుడు
- 'జే' బ్రాండ్ మద్యం
- దాడులు, దౌర్జన్యాలు, కేసులు
- బటన్ నొక్కుడు



ఏపీకి దిక్కెవరు?

దేశ, విదేశాల్లో అనాథగా ఆంధ్రప్రదేశ్ | నవ్యాంధ్ర బ్రాండ్‌కు బ్యాడ్.. బ్యాండ్

- 'సన్‌రైజ్ స్టేట్'గా తొలి ఐదేళ్లు ప్రచారం
- అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర పరిచయం
- కొత్త రాష్ట్రంవైపు చూసేలా చేసిన ప్రమోషన్
- పారిశ్రామిక ప్రతినిధుల రాకతో రాష్ట్రంలో సందడి
- జగన్ రాగానే ఒక్కసారిగా మారిన పరిస్థితి
- ఒకే ఒక్కసారి దావోస్‌కు వెళ్లిన జగన్
- విశాఖ సదస్సూ ఒక్కసారితో సరి
- విదేశీ ప్రముఖులతో భేటీలూ లేవు
- 'ఏపీ' ఉందని మరిచిపోయే పరిస్థితి
- ఇదే కొనసాగితే కోలుకోలేనంత డ్యామేజ్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

2000 మార్చి 19 నుంచి 25 మధ్య... అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ భారత పర్యటన ఖరారైంది.

ఆయన... ఢిల్లీ, ఆగ్రా, జైపూర్, ముంబైతోపాటు హైదరాబాద్‌కు కూడా వస్తున్నారని తెలిసింది.

అమెరికా అధ్యక్షులెవరైనా ఢిల్లీలో దిగుతారు. వాణిజ్య రాజధాని ముంబైకీ వెళతారు. తాజ్‌మహల్ ముందు ఫొటో దిగకుంటే వాళ్ల టూర్ పూర్తయినట్లు కాదు. మరి... హైదరాబాద్‌కు ఎందుకు వచ్చినట్లు!? అక్కడేముంది?

ఇవే ప్రశ్నలు అమెరికాతోపాటు అనేక దేశాలకు చెందిన ప్రముఖులు, పారిశ్రామికవేత్తల్లో తలెత్తాయి. వారిలో చాలా మంది తొలిసారిగా 'వాటీజ్ హైదరాబాద్' అని ఇటువైపు చూశారు. అక్కడేముంది, అక్కడి ప్రభుత్వ విధానాలు ఏమిటి, మనకు ఉన్న అవకాశాలేమిటి... ఆరాలు మొదలయ్యాయి. దీనికి... అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ తోడైంది. ఫలితం... మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీ హైదరాబాద్‌లో అడుగుపెట్టింది. ఇది... భాగ్యనగర 'ఐటీ' ముఖచిత్రాన్ని మార్చిన పరిణామం! దీనికి కారణం... అనేక ప్రయత్నాలు, అప్పటి కేంద్ర ప్రభుత్వంతో లాబీయింగ్ ద్వారా బిల్ క్లింటన్ పర్యటనలో హైదరాబాద్‌ను చేర్చడమే!

గ్లోబలైజేషన్... ఎటు చూసినా పోటీ! రాష్ట్రాల మధ్య, దేశాల మధ్య పెట్టుబడులకు పోటీ! ఈ పోటీలో ముందుకు వెళ్లాలంటే... ఒక బ్రాండ్ కావాలి! తెలంగాణకు హైదరాబాద్ ఒక బ్రాండ్. కర్ణాటకకు బెంగళూరు ఒక బ్రాండ్. తమిళనాడుకు చెన్నై ఒక బ్రాండ్! మరి... నవ్యాంధ్రకు బ్రాండ్ ఏమిటి?

'సదస్సు'ల్లో తుస్సు

జనం భాషలో చెప్పాలంటే... దావోస్ ఆర్థిక సదస్సు అనేది ఒక 'అంతర్జాతీయ సంత'లాంటిది. ప్రపంచ దేశాలకు చెందిన పాలకులు, పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తలు ఒకచోట గుమికూడతారు. మనం ప్రతి దేశానికీ వెళ్లాల్సిన అవసరంలేకుండా... ఒక్కచోటే ఉండి అందరికీ మన గురించి చెప్పుకోగలిగే అవకాశం అక్కడే లభిస్తుంది. అందుకే... చంద్రబాబు ప్రతి ఏటా దావోస్ సదస్సుకు అధికారులతో హాజరయ్యారు. స్టేట్ బ్రాండ్‌ను ప్రమోట్ చేశారు. జగన్ వచ్చాక ఒకే ఒక్కసారి దావోస్‌కు వెళ్లారు. అది కూడా... సతీసమేతంగా లండన్‌కు వెళ్లి, అక్కడ కాస్త సొంత పనులు చేసుకుని, అక్కడి నుంచి ఇష్టంలేకుండా కష్టమ్మీద దావోస్‌లో అడుగుపెట్టారు. అక్కడికి వెళ్లి ఏమైనా సాధించారా అంటే... అదే అదానీ, అదే గ్రీన్‌కోలతో కుదిరిన పాత చింతకాయ పచ్చడి ఒప్పందాలే! 'ఏమయ్యా దావోస్‌కు వెళ్లలేదు' అని పరిశ్రమల మంత్రిని అడిగితే... 'అక్కడ మైనస్ డిగ్రీల చలి. స్నానం కూడా చెయ్యలేం' అంటూ కష్టాలు చెప్పుకొచ్చారు. ఇక... చంద్రబాబు సీఎంగా ఉండగా ఏటా విశాఖలో పెట్టుబడిదారుల సదస్సును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారు. జగన్ వచ్చాక దానికీ జెల్ల కొట్టారు. ఒకే ఒక్కసారి విశాఖ సదస్సు నిర్వహించారు. అక్కడ కూడా మళ్లీ పాత చింతకాయ పచ్చడి ఒప్పందాలే!

ఇక... బ్రాండ్ ఏపీని నిలబెట్టేదెలా?
ఏపీ ఒక అనాథలా ఉండాల్సిందేనా?

ఇదీ 'బ్రాండ్' ఏపీ...

రాజధానిలేని రాష్ట్రంగా ఏర్పడిన నవ్యాంధ్రను చంద్రబాబు 'సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్'గా ప్రమోట్ చేశారు. ఏటా విశాఖలో పెట్టుబడిదారుల సదస్సు నిర్వహించారు. క్రమం తప్పకుండా దావోస్ ఆర్థిక సదస్సుకు హాజరై ఏపీ పెవిలియన్ ద్వారా రాష్ట్రం పేరును ప్రపంచానికి పరిచయం చేశారు. ముఖ్యమంత్రిగా ఉన్న తానే మెడలో 'ఆంధ్రప్రదేశ్' ట్యాగ్ వేసుకుని, ఫైల్లు పట్టుకుని, ప్రజంటేషన్ ఇచ్చారు. అనేక దేశాల్లోని ప్రముఖ నగరాల్లో 'సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్' పేరుతో హోర్డింగ్‌లు పెట్టారు. బస్సులపై 'బ్రాండ్'ను ప్రమోట్ చేశారు. దాని ఫలితంగానే చంద్రబాబు హయాంలో దేశ విదేశాలకు చెందిన పెట్టుబడిదారులు ఏపీని సందర్శించారు. ఇక్కడి విధానాలు, అవకాశాలను పరిశీలించారు. భారీస్థాయిలో పెట్టుబడులు పెట్టారు. ఇదే వాతావరణం, ఊపు కొనసాగాల్సిన కీలక సమయంలో... ప్రభుత్వం మారిపోయింది. జగన్ ముఖ్యమంత్రి అయ్యారు. అంతే...



బ్రాండ్‌కు బ్యాండ్

వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే... ఏపీ బ్రాండ్‌కు బ్యాండ్ పడింది. వచ్చీ రాగానే 'ప్రజా వేదిక'ను కూల్చివేసి తన 'మార్కు' పాలన ఎలా ఉండబోతోందో శాంపిల్ వదిలారు. అది చంద్రబాబుపై ఉన్న రాజకీయ కక్షతో చేశారని వదిలేద్దామనుకుంటే... జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులను బెదరగొట్టేలా వరుస విధ్వంసక నిర్ణయాలు తీసుకున్నారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల రద్దుతో రాష్ట్రం అంతర్జాతీయ స్థాయిలో వివాదాస్పదంగా మారింది. 'రివర్స్' టెండరింగ్‌లతో 'ఈ స్టేటు వైపు వెళ్లొద్దురో' అనేలా చేశారు. ఇక... అమరావతిని అటకెక్కించడమనే ఒక్క నిర్ణయంతో జరిగిన నష్టం అంతా ఇంతా కాదు!

ఒకప్పుడు ఏపీ అంటే..

ఆంధ్రప్రదేశ్ అంటే ప్రగతిశీల, చైతన్యవంతమైన రాష్ట్రం. మెరుగైన విధానాలు, సుపరిపాలన, అభివృద్ధి, సంస్కరణల అమలుకు పెట్టింది పేరు. ఏ రాష్ట్రానికి ఏ అంశంలో సలహా కావాలన్నా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విధానాలు అధ్యయనం చేసేవాళ్లు. 2014లో రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా అదే ఒరవడి కొనసాగించేందుకు చంద్రబాబు ఎంతో కష్టపడ్డారు. ఆ కష్టం మొత్తం ఇప్పుడు బూడిదపాలైపోయింది.



నాడు 'బ్రాండ్ ఏపీ'ని ప్రమోట్ చేస్తూ విదేశాల్లో బస్సులపై మన యాడ్స్

కియా 'బ్రాండ్'పైనా...

కియా... ఒక బ్రాండ్. చంద్రబాబు నానా అగచాట్లు పడి కియా కార్ల పరిశ్రమను అనంతపురం జిల్లాకు తీసుకొచ్చారు. రికార్డు సమయంలో ఇక్కడ ఉత్పత్తి ప్రారంభమైంది. తొలి కారు ఆవిష్కరణ సమయంలో అందరూ ఆ వాహనంపై శుభ సందేశాలు రాశారు. కానీ... స్థానిక ఎంపీ గోరంట్ల మాధవ్ మాత్రం నిరసన నినాదం రాసి తమ సర్కారు వైఖరిని చాటుకున్నారు.

ఇంతే సంగతులు..



పర్యాటకుల స్వర్గధామం కేరళ! అయినా సరే... ఆ రాష్ట్రం ఇతర రాష్ట్రాల్లో టూరిజం ప్రమోట్ చేస్తూనే ఉంటుంది. తమ రాష్ట్రంలోని సానుకూలతలు, బలాలు చెప్పుకోవడం ఏ ముఖ్యమంత్రికైనా అవసరం. జగన్‌కు మాత్రం ఇదో అనవసరమైన కార్యక్రమం. మన రాష్ట్రానికి ఉన్న సహజ వనరుల గురించి బయటి ప్రపంచానికి వివరించే ఏ ఒక్క కార్యక్రమమూ జగన్ హయాంలో జరగలేదు. ఒకసారి దావోస్ సదస్సుకు వెళ్లినా, విశాఖలో పెట్టుబడిదారుల సదస్సు నిర్వహించినా అది... నామ్‌కే వాస్తే!

సమూహంలో ఒంటరిగా...

ఏ పార్టీకి చెందిన వారైనా ఇరుగు పొరుగు రాష్ట్రాల సీఎంల మధ్య సఖ్యత, సహకారం అవసరం. కానీ... జగన్‌కు ఇవేవీ పట్టవు. 'సొంత అజెండా'లు తప్ప రాష్ట్ర జెండా గురించి పట్టదు. ఎప్పుడైనా ఢిల్లీలో సీఎంల సదస్సుకు వెళ్లినా... ఒంటరిగా కుర్చీలో కూర్చుని, అటుఇటూ దిక్కులు చూస్తూ, అదో లోకంలో ఉన్నట్లుగా ఉంటారు. ఇక... ఏపీని పట్టించుకునేదెవరు?



చిత‌బ్రో!

చింటూ: అన్నియ్య షిక్కగా నవ్వుతాడు కదరా!
చిన్నూ: అవునవును... చావు పరామర్శలకు వెళ్లినప్పుడూ నవ్వుతాడు.
చింటూ: చక్కగా నమస్కారాలు పెడతాడు!
చిన్నూ: పెడతాడు పెడతాడు. ఖాళీ రోడ్లకు, అవతల ఎవరూ లేని మైదానాలకూ పెడతాడు... నమస్కారం.
చింటూ: అన్నియ్యది పెద్ద మనసు. ఉదార స్వభావి!
చిన్నూ: ఎవరికైనా సొంత డబ్బు పైసా తీసి ఇవ్వడం చూశావేంట్రా!
చింటూ: మరి మాట తప్పడంటారు కదా!?
చిన్నూ: మాటదేముందీ... మడమ కూడా తిప్పడంటరోయ్! మరి.. నడక ఎలా సాగుతోందో పాపం!





ఆనాటి ముచ్చట

జీడిపప్పు ఉప్మా.. జిందాబాద్

ఇది 1978 ఎన్నికల ముచ్చట! పాతతరం రాజకీయాలకు అదే ఆఖరు! నెల్లూరు జిల్లా కోవూరులో కాంగ్రెస్ తరఫున పెళ్లకూరు రామచంద్రా రెడ్డి రెండోసారి బరిలో నిలిచారు. ఆయన కాకలు తీరిన కాంగ్రెస్ నేత. పెద్ద భూస్వామి. ఆయన ప్రత్యర్థి... కమ్యూనిస్టు యోధుడు జక్కా వెంకయ్య. ప్రజల్లో తిరిగే... ప్రజల మనిషి. ఎమర్జెన్సీలో జైలుకూ వెళ్లి వచ్చారు. ఏది ఏమైనా మళ్లీ గెలవాలని పెళ్లకూరు రామచంద్రా రెడ్డి గట్టి పట్టుదలతో ఉన్నారు. 'డబ్బులిస్తే... తీసుకుని మరిచిపోతారు! పది కాలాలపాటు గుర్తుంచుకునేలా ఏదైనా చేయాలి' అనుకుంటూ ఒక వ్యూహం రచించారు. అదే... 'జీడిపప్పు ఉప్మా'! ఉప్మా అందరూ తింటారు. జీడిపప్పు ఉప్మా... అంటే సామాన్యులకు కష్టమే. పైగా అవి గ్రాముల లెక్కన జీడిపప్పు కొని, పండగపూట పాయసంలో నాలుగు పలుకులు వేసుకునే రోజులు. అందుకే... నామినేషన్ వేసినప్పటి నుంచి పోలింగ్ దాకా పెళ్లకూరు రామచంద్రారెడ్డి 'జీడిపప్పు ఉప్మా' క్యాంపెయిన్ నడిపించారు. పెద్ద టెంటు వేసి రోజూ పొద్దున్నే గంగాళాల కొద్దీ ఉప్మా చేయించి... నెయ్యిలో వేయించిన జీడిపప్పును దట్టించి... వచ్చిన వారందరికీ వడ్డించారు. జనం లొట్టలేసుకుని తిన్నారు. ఆ ఎన్నికల్లో పెళ్లకూరు రామచంద్రా రెడ్డి సుమారు 20వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు! ఈ విజయానికి ఇతర కారణాలు ఎలా ఉన్నా... జీడిపప్పు ఉప్మా పాత్ర మాత్రం తీసేయలేం!





బాప్ రే..!

రోజుకు రూ.4 కోట్లు!

రోజుకు రూ.4 కోట్లు! ఇదేదో అభివృద్ధి కోసం వెచ్చిస్తున్న సొమ్ము కాదు. కీలకమైన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్న ఏపీలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు వివిధ పార్టీల నాయకులు పలు రూపాల్లో సిద్ధం చేసుకున్న దానిలో దొరికిన సగటు సొత్తు విలువ! ఎన్నికల షెడ్యూల్ విడుదలైన మార్చి 16వ తేదీ నుంచి ఈ నెల 15వ తేదీ వరకు గడిచిన 31 రోజుల్లో రమారమి రోజుకు రూ.4 కోట్ల విలువైన నగదు, మద్యం, కానుకలు, మత్తు పదార్థాలను కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) అధికారులు వివిధ రూపాల్లో తనిఖీలు చేసి స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా ఈ 31 రోజుల్లో రూ.125.97 కోట్ల విలువైన సొత్తును ఈసీ పట్టుకుంది. వీటిలో ఓటర్లకు పంచేందుకు నిల్వ చేసిన 10.22 లక్షల లీటర్ల మద్యం కూడా ఉండడం విశేషం.

10 వేల కోట్లు కావలెను!



తిలాపాపం తలా పిడికెడు అంటారుగానీ, తలకు ఇంత అని పంచకపోతే ఓటరు దేవుడు ప్రసన్నం కాని పరిస్థితి. దీంతో రాజకీయ పార్టీలు నగదు వేటను ఇప్పటికే ప్రారంభించేశాయి. అయితే, ఈసారి ఓటు మార్క్ రూ.వెయ్యి దాటుతుందనే అంచనాలు, పోటీని బట్టి కొన్ని నియోజకవర్గాల్లో రూ.మూడు వేలు కూడా దాటే అవకాశం కనిపిస్తుండటంతో పార్టీల 'డబ్బు' కష్టాలు డబుల్ అయినట్టు కనిపిస్తోంది. అధికారం ఉంటుంది కాబట్టి, వైసీపీ ఎన్నికల నిధులు ఎటునుంచైనా రాబట్టుకోగలదు. ఇసుక, మద్యం, గనుల మాఫియా అండతో ఎన్నికల ఖర్చులను ఆ పార్టీ తేలిగ్గానే దాటేయగలదు. అసలు కష్టమంతా విపక్ష పార్టీలకే.. పైగా వాటికి నగదు అందకుండా వైసీపీ తన 'నిఘా' తెలివితేటలను ప్రదర్శిస్తోంది.

అన్ని పార్టీల ఎన్నికల ఖర్చు అంచనా ఇది
- నగదు పోగుచేయడానికి పార్టీలు, అభ్యర్థుల తిప్పలు
- వెయ్యి దాటిన ఓటు మార్క్.. పోటీని బట్టి 3 వేలదాకా
- మద్యం పంపిణీ, తాయిలాలు దీనికి అదనం
- బరిలోకి దళారులు.. కమీషన్‌పై కట్టల సరఫరా

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీలు కలిపి పెట్టే ఖర్చు రూ.పది వేల కోట్లు దాటిపోనుందని అంచనాలు వినవస్తున్నాయి. దీనిని 'ఆల్ టైమ్ హై' (ఇప్పటివరకూ ఇదే ఎక్కువ) అని రాజకీయ వర్గాలు అభివర్ణిస్తున్నాయి. ఇంత భారీ ఖర్చుకు నగదు సమకూర్చుకోవడం రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు పెద్ద సవాలుగా మారింది. నగదు పోగు చేయడానికి ఇప్పటికే రంగంలోకి దిగిన నేతలకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఎన్నికల్లో ఈసారి ఓటు వేయబోయే ఓటర్ల సంఖ్య నాలుగు కోట్లు. సరాసరిన ఒక్కో ఓటరుకు రూ.వెయ్యి అయినా ఎన్నికల సందర్భంగా పంచాల్సి వస్తుందని రాజకీయ పార్టీలు అంచనా వేస్తున్నాయి. పోటీ తీవ్రంగా ఉన్న కొన్ని నియోజకవర్గాల్లో ఈ మొత్తం రూ. రెండు, మూడు వేలకు చేరవచ్చన్న అంచనాలు కూడా ఉన్నాయి.



ఒక్కో ఏరియా ఒక్కో తీరు..

కోస్తా ప్రాంతంలో పార్టీలతో సంబంధం లేకుండా ఓటర్లలో అత్యధికులకు డబ్బులు పంచే అలవాటు ఉంది. రాయలసీమలో అవతలి పార్టీకి చెందిన బలమైన ఓటర్లను మినహాయించి మొత్తం మీద డెబ్బై శాతం ఓటర్లకే డబ్బులు పంచుతుంటారు. మొత్తంమీద ఖర్చు రూ.10 వేల కోట్లు దాటుతుందని అంచనా. ప్రచారానికి, మద్యం సరఫరాకు, ఇతరత్రా ఖర్చులకు అయ్యే వ్యయం అదనం. ఇక రిజర్వుడు నియోజకవర్గాల బాధ్యత కూడా పార్టీ నాయకత్వాలపై అదనపు భారమనే చెప్పాలి. వాటిలో చాలాచోట్ల ఖర్చును పార్టీల నాయకత్వాలే భరించాల్సి రావడమే ఇందుకు కారణం.

నగదుకు ఇబ్బందే..

డబ్బు అంతా నగదు రూపంలోనే పంచడం ఆనవాయితీ. ఇప్పుడు ఇన్ని వేల కోట్లు నగదుగా పోగు చేయడం పార్టీలకు, పోటీ చేసే అభ్యర్థులకు కత్తి మీద సామే. ఈసీ ఆదేశాలతో జనవరి నుంచి బ్యాంకుల్లో నగదు ఉపసంహరణపై ఆంక్షలు పెట్టడం వారికి మరీ సమస్యగా మారింది. ఒకరోజులో రూ.పది లక్షలకు మించి నగదు ఉపసంహరించరాదని, ఒక నెలలో ఒక ఖాతా నుంచి రూ.ఏభై లక్షలకు మించి నగదు తీసుకోరాదని బ్యాంకులు ఆంక్షలు పెట్టాయి. సీటు ఖాయం అనుకొన్న నేతలు ముందే జాగ్రత్త పడి కొంత సిద్ధంగా ఉన్నా చివర్లో తెరపైకి వచ్చిన అభ్యర్థులకు నగదు పోగుచేయడం సమస్యగా మారుతోందని అంటున్నారు.

కమీషన్ కష్టమే

పార్టీలకు, అభ్యర్థులకు నగదు సర్దుబాటు చేయడానికి మార్కెట్లో మధ్య దళారులు కూడా పుట్టుకు రావడం విశేషం. వీళ్లు ఆరు నుంచి ఎనిమిది శాతం కమీషన్ కింద తీసుకొంటున్నారు. వారు చెప్పిన కంపెనీల ఖాతాలకు ఆన్‌లైన్‌లో డబ్బు ట్రాన్స్‌ఫర్ చేస్తే దానికి సమాన విలువ కలిగిన నగదును వాళ్లు అందజేస్తున్నారు.

ధనుంజయ్.. ఫటాఫట్
సెటిల్‌మెంట్!

(మొదటి పేజీ తరువాయి)

ధనుంజయరెడ్డి లేఖరాశారు. ఈ మేరకు రెవెన్యూశాఖ వెనువెంటనే ఫైలును సీఎంవోకు పంపించింది. ఆ తర్వాత సీఎం స్థాయిలో ఆ కేసుపై సానుకూల నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. ధర్మచంద్రారెడ్డి విశాఖ భీమిలీ తహసిల్దార్‌గా ఉన్న సమయంలో విలువైన భూమిని కాపాడే విషయంలో న్యాయపరమైన చర్యలు తీసుకోలేకపోయారన్న అభియోగం నిరూపితమైంది. ఆయనది స్వస్థలం కడప.

2) విశాఖకు చెందిన ఆనంద్‌కుమార్ అనే జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌పై 2015లో ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైంది. ఏసీబీ అతన్ని ప్రాసిక్యూట్ చేయాలని కోరితే, 2018లో ప్రభుత్వం అనుమతి ఇస్తూ ఉత్తర్వులు (జీవో 574) జారీ చేసింది. ఆ ఫైలుపై ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ఎలాంటి కదలికలేదు. ఆనంద్‌కుమార్ నిజాయితీపరుడని, ఆయనపై ఉన్న ప్రాసిక్యూషన్ ఉత్తర్వులు ఉపసంహరించాలని కోరుతూ అధికారపార్టీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సీఎంకు గత ఏడాది నవంబరు 8న లేఖలు రాశారు. నాలుగు నెలల పాటు స్పందించని జగన్ కార్యాలయం, కోడ్‌కు కొద్దిరోజుల ముందు వాటిని తెరమీదకు తీసుకొచ్చింది. ఆ ఫైలును పంపించాలని ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయరెడ్డి రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి లేఖ పంపించారు. అంతే. సచివాలయంలోని రెవెన్యూ విభాగం ఆగమేఘాల మీద ఆ ఫైలును సీఎంవోకు పంపించింది. ప్రాసిక్యూషన్ ఉత్తర్వులను ఐదేళ్లపాటు అమలుచేయకుండా, తీరా ఎన్నికల సమయంలో ఈ కేసును సెటిల్‌చేయాలనుకోవడం తీవ్రమైన అంశం. ప్రాసిక్యూషన్ ఉపసంహరించాలని ఎమ్మెల్యేలు కోరగానే, సంబంధిత ఫైలు పంపాలని ధనుంజయరెడ్డి రెవెన్యూ స్పెషల్ సీఎస్‌ను కోరడం మరో తీవ్రమైన అంశం. అవినీతిపరులపై ఉక్కుపాదం మోపుతానని జగన్ చెప్పిన మాటలు ఇక్కడ పనిచేయలేదు. గత సర్కారు నిర్ణయానికి విరుద్ధంగా ఈ కేసును సెటిల్‌చేశారు. ఉత్తర్వులను గోప్యంగా ఉంచారు.

3) ధనుంజయరెడ్డి సీఎం కార్యదర్శి హోదాలో అనేక ఏసీబీ, విజిలెన్స్ కేసుల ఫైళ్లు పంపించాలంటూ రెవెన్యూశాఖకు లేఖలు రాశారు. అందులో స్టాంప్స్, రిజిస్ట్రేషన్, భూ పరిపాలన అధికారులకు సంబంధించిన కేసులే ఉన్నాయి. ఆయన రాసిన వాటిల్లో ఆరు లేఖలు వెలుగుచూశాయి. ఆ కేసుల్లో ఇప్పటికే డిప్యూటీ కలెక్టర్‌లు, సబ్‌రిజిస్ట్రార్‌లపై అభియోగాలు నిరూపితమైనవి, ఏసీబీ, విజిలెన్స్‌లు తీవ్రమైన చర్యలకు సిఫారసు చేసినవే ఉన్నాయి.

కేసుల ఎత్తివేత జాతర

సర్వేశాఖలో ఓ అధికారిపై రెండు తీవ్రమైన కేసులున్నాయి. ఒకటి అడవివరం భూముల కేసు కాగా, మరొకటి లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిన కేసు. ఈ రెండు కేసులను సీఎంవో నుంచి వచ్చిన ఆదేశాలతో రెవెన్యూశాఖ సెటిల్‌చేసింది. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు వద్ద జరిగిన కోర్టులో సర్వే అధికారి పిటిషన్ వేశారు. తను నిజాయితీపరుడినంటూ స్వీయ ధ్రువీకరణ ఇస్తూ, తనపై ఉన్న శిక్షలు ఎత్తివేయాలని కోరారు. అంతే, ధర్మప్రభువు ధర్మాన కేసులను ఎత్తివేయాలని సిఫారసు చేశారు. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ ఉత్తర్వులు ఇచ్చారు. ఇదంతా కోడ్‌కు కొద్ది రోజుల ముందే జరిగింది. జీవో 282ను మాత్రం మార్చి 5న ఇచ్చినట్లుగా చూపిస్తున్నారు. ఈ జీవో బయటి ప్రపంచానికి తెలియకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. రెవెన్యూశాఖ ఇదొక్కటే కాదు.. ఇలాంటి మేళ్లు ఓ పెద్ద జాతరలా చేపట్టింది. 74 మంది అధికారులపై ఉన్న అభియోగాలకు చిన్న చిన్న శిక్షలు వేయడం లేదా నిజాయితీపరులనే సరికొత్త ముద్రవేసి, వారిపై ఉన్న కేసులు, అంతకుముందు విధించిన శిక్షలను ఉపసంహరించుకున్నారు. ఇందులో 16 మంది డిప్యూటీ కలెక్టర్లు, 22 మంది తహసిల్దార్లు, 18 మంది డిప్యూటీ తహసిల్దార్లు (డీటీ), 12 మంది మండల సర్వేయర్‌లు, మరో ఆరుగురు ఇతర అధికారులకు మేళ్లు జరిగాయి. కోడ్‌కు ముందు అంటే, మార్చి మొదటి వారంలో ఆయా కేసులపై ఫైళ్లు పంపించాలంటూ సీఎంవో నుంచి, అజయ్‌జైన్ కార్యాలయం నుంచి సీసీఎల్‌ఏ, సర్వే కార్యాలయాలకు లేఖలు వెళ్లాయి. ఆగమేఘాల మీద ఆ కేసులను రివ్యూచేస్తూ ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల స్టేట్‌మెంట్‌లు కోరుతూ నోటీసులు ఇచ్చారు. స్టేట్‌మెంట్‌లు తీసుకొని కేసులు సెటిల్ చేశారు. డిప్యూటీ కలెక్టర్ నుంచి తహసిల్దార్‌గా, తహసిల్దార్ నుంచి డీటీగా రివర్షన్ పొందిన వారి శిక్షలను ఎత్తివేశారు. వారు చేసిన తప్పులే లేవంటూ పూర్తిగా కేసులను మూసివేస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఇవన్నీ మార్చి 15లోపే విడుదలయ్యాయి.


ఐదుగురు అధికారుల మంత్రాంగం

రెవెన్యూలో ఏసీబీ, విజిలెన్స్ కేసులను ఉపసంహరించడం, ప్రభుత్వం ఇంతకు ముందే తప్పు చేసిన అధికారులపై విధించిన శిక్షలను తగ్గించే పనిలో ఐదుగురు అధికారులు కీలకపాత్ర పోషించారు. ఇందులో సీసీఎల్‌ఏలోనే ముగ్గురు అధికారులు ఉండగా, సచివాలయంలో మరో ఇద్దరు ఉన్నారు. సీసీఎల్‌ఏలో సుదీర్ఘకాలం విజిలెన్స్ విభాగం బాధ్యతలు చూసిన ఓ అధికారే ఈ మొత్తం వ్యవహారంలో చక్రం తిప్పారని తెలిసింది. ఏ కేసును ఎలా సెటిల్ చేయాలో, కేసుల ఉపసంహరణ, శిక్ష తగ్గింపునకు ఎలాంటి కారణాలు చూపాల్నో ఆ అధికారే సూచించినట్లు తెలిసింది. గత పదేళ్ల కాలంలో ఇలాంటి విషయాల్లో ఆ అధికారి పండిపోయారు. దీంతో కోడ్‌కు ముందే, తీవ్రమైన కేసులు ఫైళ్లు సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి రెవెన్యూశాఖకు శరవేగంగా వెళ్లి, అక్కడ అంతే వేగంగా పరిష్కారమయ్యేలా చక్రం తిప్పారని సహచర అధికారవర్గాలే చెబుతున్నాయి. మరో సీనియర్ అధికారిణి పాత్రపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి.

ఇప్పుడే ఎందుకీ పని?

సాధారణ సమయంలో తీవ్ర అభియోగాలు, ఆరోపణలు, కేసులున్న అధికారులపై సర్కారు కరుణ చూపిస్తే వెంటనే తెలిసిపోతుంది. అక్రమార్కులకు మేలుచేశారని ప్రభుత్వ పరువు గంగపాలవుతుంది. అదే ఎన్నికల కోడ్‌కు ముందు ఓ జాతరలా కేసులన్నీ సెటిల్‌చేస్తే? ఎవరికీ తెలిసే అవకాశం ఉండదు. అంతా ఎన్నికల గోలలో ఉండిపోతారు. ఏ కేసులు ఎత్తివేశారో ఎవ్వరూ పట్టించుకోరు. ఇక ఆయా అంశాల్లో ఇచ్చిన ఉత్తర్వులు కూడా ఎలాగూ బయటపెట్టరు. కాబట్టి మూడో మనిషికి తెలిసే అవకాశం ఉండదనే.. ఈ సమయాన్ని మేలు..కొలువులకు వాడుకున్నారని చెబుతున్నారు.

పీసీఆర్ చట్టంతో
'తోట'కు చిక్కులే!



- 1955లో ప్రవేశపెట్టిన ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ యాక్ట్
- అంటరానితనం నేరానికి జరిమానా, కనీస శిక్ష పడినా ఎన్నికల్లో పోటీకి అనర్హులే
- ఈ చట్టం ప్రకారం త్రిమూర్తులు అనర్హుడయ్యే చాన్స్
- శిరోముండనం కేసుపై హైకోర్టుకు వెళ్లడానికి సిద్ధమవుతున్న దళిత, పౌరహక్కుల సంఘాలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు రాజకీయ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం దళితుల శిరోముండనం కేసులో ప్రత్యేక కోర్టు ఆయనకు జైలు శిక్ష విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుడని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కానీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం 18నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వచ్చిందని, రెండేళ్ల లోపు శిక్ష అయినందున తోటకు ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇబ్బందులు లేవని అనుచరులు చెబుతున్నారు. తాను ఎన్నికల బరిలోనే ఉంటానంటూ తోట కూడా ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే అట్రాసిటీ చట్టం కంటే ముందు 1955లో ప్రవేశపెట్టిన ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ యాక్ట్(పీసీఆర్) ప్రకారం అంటరానితనం నేరానికి సంబంధించిన సెక్షన్లలో జరిమానా, కనీస శిక్ష పడినా ఎన్నికల్లో పోటీకి అనర్హులే. దీని ప్రకారం తోటపై వేటు వేయాలంటూ దళిత సంఘాలు, పౌరహక్కుల సంఘాలు హైకోర్టును ఆశ్రయించడానికి సిద్ధమవుతున్నాయి.

పీసీఆర్ చట్టం అంటే...

అట్రాసిటీ చట్టం కంటే ముందు దేశంలో 1955లో ప్రవేశపెట్టిన ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్ చట్టం ఉండేది. ఇందులో సెక్షన్-8 సబ్‌క్లాజ్-1లో అంటరానితనం పేరుతో జరిగే నేరాల్లో జరిమానా, ఏ ఇతర చిన్న శిక్ష పడినా సదరు ప్రజాప్రతినిధి ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుడవుతారని స్పష్టంగా ఉంది. ఈ నేపథ్యంలో ఈ చట్టం కింద హైకోర్టును బాధితులు ఆశ్రయిస్తే న్యాయస్థానంలో తోటకు ఎదురుదెబ్బ తగలడం ఖాయమని ఏపీ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు విశ్లేషించారు. అట్రాసిటీ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత పోలీసులు ఈ చట్టం కిందే కేసులు నమోదు చేస్తున్నారు. అంతకుముందున్న పీసీఆర్ చట్టం కింద కేసులు నమోదు చేయడం లేదు. శిరోముండనం కేసులో నేరం రుజువైనందున నిందితుడికి మరింత ఎక్కువ శిక్షపడాలని అభ్యర్థిస్తూ హైకోర్టును ఆశ్రయించవచ్చని ముప్పాళ్ల అన్నారు. పాత చట్టంకింద కేసును న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంటే తోట ఎన్నికల్లో పోటీకి అనర్హులవుతారని చెప్పారు. పీసీఆర్ చట్టానికి మరింత కోరలు తొడిగి అట్రాసిటీ చట్టం తెచ్చిన నేపథ్యంలో న్యాయస్థానం పాత చట్టం కింద కేసును విచారణకు స్వీకరిస్తుందా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ తీసుకుంటే మాత్రం దేశంలో ఇదొక సంచలనం అవుతుందని న్యాయనిపుణులు విశ్లేషిస్తున్నారు.

తోట, అనంతబాబును రీకాల్ చేయాలి

- టీడీపీ నాయకుడు మహాసేన రాజేశ్ డిమాండ్

కాకినాడ సిటీ, ఏప్రిల్ 17: దళిత ద్రోహులైన తోట త్రిమూర్తులు, అనంతబాబులను ఎమ్మెల్సీ పదవుల నుంచి రీకాల్ చేసి వైసీపీ నుంచి సస్పెండ్ చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సరిపెల్ల రాజేశ్ డిమాండ్ చేశారు. కాకినాడలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వెంకటాయపాలెం శిరోముండనం కేసులో 28 ఏళ్ల పాటు పోరాడిన దళిత వీరులను అభినందిస్తున్నానని చెప్పారు. తోటకు బెయిల్ ఇవ్వడం విచారకరమన్నారు. ఈ కేసుపై నోరు మెదపని వైసీపీ దళిత మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు బతికిఉన్నా చచ్చిన శవాలేనన్నారు. దళిత యువకుడిని చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును కొనసాగించడం సిగ్గుచేటని మండిపడ్డారు.

దర్గాగా ఆలయాల దర్శనానికి...: శిరోముండనం కేసులో 18నెలల జైలు శిక్ష పడిన తోట త్రిమూర్తులు బుధవారం శ్రీరామనవమి కావడంతో అనుచరులతో కలసి మండపేటలో ఆలయాలను దర్శించుకున్నారు. ఈ కేసులో దోషిగా నిర్ధారణ అయిన నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ తోట తన పదవికి రాజీనామా చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. అటు వైసీపీ అధిష్ఠానం సైతం తోటకు మండపేట టికెట్ రద్దు చేయాలంటూ దళిత సంఘాలు పట్టుబడుతున్నాయి.

నేటి నుంచి రాష్ట్రంలో నామినేషన్ల పర్వం

అమరావతి/ఢిల్లీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల పర్వం గురువారం నుంచి ప్రారంభంకానుంది. మొత్తం 25 పార్లమెంటు, 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు నాలుగోదశలో ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం నుంచి ఆయా స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 26న పరిశీలన ఉంటుంది. ఉపసంహరణ ప్రక్రియ 29వ తేదీతో ముగియనుంది. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) ముఖేశ్ కుమార్ మీనా బుధవారం తెలిపారు. పార్లమెంటు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు ఆయా కలెక్టరేట్లలో, అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల ప్రధాన కేంద్రాల్లో నామినేషన్లు వేయాలన్నారు. ఒక్కో అభ్యర్థి 4సెట్లను దాఖలు చేయవచ్చని, ఒక అభ్యర్థి ఏవైనా రెండు స్థానాల్లో మాత్రమే పోటీ చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే ఆర్వో కార్యాలయం వరకు అనుమతిస్తామని చెప్పారు. అభ్యర్థి వెంట మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. పోటీ చేసే అభ్యర్థులు పార్లమెంటుకు రూ.25,000, అసెంబ్లీకి రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దీనిలో 50 శాతం చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియను రికార్డు చేస్తామని, దీనికిగాను నామినేషన్లను స్వీకరించే గదిలో, అభ్యర్థులు ప్రవేశించే మార్గాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

నామినేషన్లు-జాగ్రత్తలు

- అభ్యర్థులు నామినేషన్ల దాఖలకు 13 రకాల డాక్యుమెంట్లను తీసుకురావాలి.
- పార్లమెంటుకు పోటీ చేసే వారు ఫాం2-ఏ, అసెంబ్లీకి పోటీ చేసే వారు ఫాం2-బీలో దరఖాస్తు చేయాలి.
- నేటి నుంచి 25 మధ్యాహ్నం 3 వరకే స్వీకరణ ప్రక్రియ.
- పబ్లిక్ సెలవుల్లో నామినేషన్ల స్వీకరణ ఉండదు.
- నామినేషన్లను ఆర్వోకుగానీ, ఏఆర్వోకుగానీ సమర్పించాలి.
- అభ్యర్థి నామినేషన్‌తోపాటు తమ పేరిట కొత్తగా తెరిచిన బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాలి.
- ఫాం-26 స్టాంప్ పేపర్ విలువ రూ.10 లేదా అంతకంటే ఎక్కువగా ఉండాలి. భౌతికంగా స్టాంప్ పేపర్ అందుబాటులో లేకుంటే ఈ-స్టాంప్ కూడా ఉపయోగించవచ్చు.
- అభ్యర్థి నామినేషన్ వేసిన నాటి నుంచి, ఖర్చు అతని ఖాతాలో లెక్కిస్తారు.
- పత్రికల్లో ఇచ్చే ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌ను సైతం అభ్యర్థి ఖాతాలో లెక్కిస్తారు.

తెలంగాణలో కూడా..

గురువారం నుంచి ప్రారంభమయ్యే నాలుగో దశ ఎన్నికల ప్రక్రియలో తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాలు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానం(ఉప ఎన్నిక) ఉన్నాయి. అదేవిధంగా బిహార్‌లో 5, జార్ఖండ్‌లో 4, మధ్యప్రదేశ్‌లో 8, మహారాష్ట్రలో 11, ఒడిశాలో 4, ఉత్తరప్రదేశ్‌లో 13, పశ్చిమ బెంగాల్‌లో 8, జమ్మూకాశ్మీర్‌లో ఒక లోక్‌సభ స్థానానికి ఈ దశలో పోలింగ్ జరగనుంది.



రాజమహేంద్రవరంలోని సీతంపేటలో చెట్టు కొమ్మలు నరుకుతున్న దృశ్యం

జగన్ రోడ్ షో.. చెట్లకు బ్యాడ్ టైమ్..!

- నేడు రాజమహేంద్రవరంలో సీఎం రోడ్‌షో
- రోడ్ షో సమయంలో తోపుడు బండ్లు పెట్టవద్దని ఆదేశం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, సీఎం జగన్ గురువారం రాజమహేంద్రవరంలో రోడ్ షో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రూట్ క్లియర్ చేయడానికి అధికారులు నానా హైరానా పడుతున్నారు. గురువారం మధ్యాహ్నానికి అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి తూర్పుగోదావరి జిల్లా కడియం మండలంలోని పొట్టిలంక వద్ద జగన్ బస్సుయాత్ర ప్రవేశిస్తుంది. కడియపులంక గ్రామంలో హైవే ప్రక్కన ఆయనకు భోజన విరామం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడ నుంచి సాయంకాలం రాజమహేంద్రవరం సిటీలో రోడ్ షో నిర్వహించి, రాత్రికి రాజానగరం మీదుగా అనపర్తి నియోజకవర్గం పరిధిలోని రంగంపేట మండలం ఎస్‌టీ రాజాపురంలో రాత్రికి బస చేస్తారు. శుక్రవారం అక్కడ నుంచి కాకినాడ జిల్లాలోకి బస్సు యాత్ర ప్రవేశిస్తుంది. రోడ్ షో సందర్భంగా రాజమహేంద్రవరంలో మోరంపూడి సెంటర్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, తాడితోట, ఆజాద్‌చౌక్, దేవీచౌక్, సీతంపేట, పేపరుమిల్లు రోడ్డు, మల్లయ్యపేట, కాతేరు మీదగా గోదావరి పోర్టు బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు మీదగా రాజానగరం మండలంలో దివాన్‌చెరువులోకి ప్రవేశించి, రాజానగరం మీదుగా ఎస్‌టీ రాజాపురం చేరుకుని రాత్రికి బస చేస్తారు.

తేతలిలో సీఎం బస ఎందుకు..!?

- ఈతకోట నుంచి మార్చడంపై అనుమానాలు
- తోట త్రిమూర్తులుకు జైలుశిక్ష నేపథ్యంలో దళితుల నుంచి నిరసన వస్తుందనే నిర్ణయం

భీమవరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బస్సుయాత్ర సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం తేతలి గ్రామంలో బుధవారం బస చేశారు. వాస్తవానికి తూర్పుగోదావరి జిల్లా ఈతకోటలో ఆయన బస చేయాల్సి ఉంది. అక్కడే బస చేసేలా షెడ్యూల్ కూడా ఖరారు చేశారు. జగన్.. మంగళవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పర్యటనలో ఉండగానే ఆయన రాత్రి బసచేసే ప్రాంతం మారిపోయింది. ఈతకోటకు బదులుగా తణుకు రూరల్ మండలం తేతలిలో బస చేశారు. సీఎం బస మార్పు నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. దళితుల శిరోముండనం కేసులో వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులకు జైలు శిక్ష పడింది. ఈ నేపథ్యంలో సీఎం జగన్ బస మారిందంటూ ఆ పార్టీ కార్యకర్తల్లోనే చర్చ నడుస్తోంది.

'బొండా' వైపు గులకరాయి
గురి!

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటి వరకు ఐదుగురు మైనర్లు ఉన్నారు. తాజాగా టీడీపీకి చెందిన వేముల దుర్గారావుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దుర్గారావు వడ్డెర కాలనీలో ఉంటూ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నారు. కొద్ది నెలల కిందటే ఈయన టీడీపీలో చేరారు. తాజాగా దుర్గారావును కూడా అదుపులోకి తీసుకోవడంతో ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నవారి సంఖ్య ఆరుకి చేరింది. ముందుగా అదుపులోకి తీసుకున్న ఐదుగురు మైనర్లలో ఒకరు.. గులకరాయి విసిరాడని పోలీసులు లీక్‌లు ఇచ్చారు. తాజాగా మంగళవారం సాయంత్రం ఒక టీస్టాల్ వద్ద ఉన్న దుర్గారావును పేరు అడిగి మరీ జీపులో ఎక్కించుకుని తీసుకెళ్లారని స్థానికులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న ఆయన కుటుంబ సభ్యులు స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ దుర్గారావు కనిపించకపోయేసరికి ఆందోళన చెందారు. దుర్గారావుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. దుర్గారావు సోదరుడు ఎప్పటి నుంచో టీడీపీలో ఉన్నారు. దుర్గారావును పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఇప్పుడు బొండా ఉమాను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారనే వాదన వినిపిస్తోంది.

మరో అనుమానం

టీడీపీ కార్యకర్తగా, బొండా ఉమా కార్యాలయ వ్యవహారాలు చూసే వ్యక్తిగా ఉన్న దుర్గారావును పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఇప్పటి వరకు ఉన్న అనుమానాలకుతోడు కొత్త సందేహాలు రేకెత్తుతున్నాయి. దుర్గారావును పావుగా ఉపయోగించుకుని విజయవాడ సెంట్రల్ టీడీపీ అభ్యర్థి బొండా ఉమాను కేసులో ఇరికించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రచారం నడుస్తోంది. టీడీపీ నేతలూ ఇదే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. దుర్గారావును ఒక రహస్య ప్రదేశంలో విచారిస్తున్నారని తెలిసింది. సీఎం జగన్ అజిత్ సింగ్ నగర్‌లో రోడ్‌షో నిర్వహించినప్పుడు ఆ ప్రాంతంలో లేని వ్యక్తులను ఎలా అనుమానిస్తారని నిందితుల కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. కేవలం బొండా ఉమాను కేసులో ఇరికించడానికి పోలీసులు ఈ విధంగా వ్యవహరిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మైనర్లను అదుపులోకి తీసుకోగానే దర్యాప్తుపై అనుమానాలు మొదలయ్యాయి. ఇప్పుడు దుర్గారావును కూడా అదుపులోకి తీసుకోవడంతో ఈ అనుమానాలు మరింత బలపడుతున్నాయి.



విలపిస్తున్న దుర్గారావు భార్య శాంతి

విచారణ అయ్యాక పంపుతాం: ఏసీపీ

పోలీసుల అదుపులో ఉన్న నిందితుల కుటుంబ సభ్యులు విజయవాడలోని పోలీసు కమిషనర్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన తెలిపారు. వడ్డెర కాలనీ నుంచి బాధితుల కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు బైఠాయించారు. కొద్దిసేపు అక్కడ ధర్నా చేశారు. పోలీసు సిబ్బంది వారిని ఆటోల్లో ఎక్కించి అక్కడి నుంచి సత్యనారాయణపురంలో ఉన్న నార్త్ జోన్ ఏసీపీ కార్యాలయానికి పంపారు. అక్కడ కూడా బాధితులు కొంతసేపు నిరసన తెలిపారు. తర్వాత ఏసీపీ దేవరకొండ ప్రసాద్ బాధితులతో చర్చించారు. ప్రస్తుతం విచారణ జరుగుతోందని, నిజనిర్ధారణ పూర్తయిన తర్వాత తమ అదుపులో ఉన్నవారిని ఇళ్లకు పంపుతామని చెప్పారు. దీంతో బాధితులు ఆందోళనను విరమించారు.

న్యాయవాది సలీం పరామర్శ

"గులకరాయి కేసులో పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఐదుగురు బాలురే ఉన్నారు. ఇది మరో కోడికత్తి కేసులా అనిపిస్తోంది. కాబట్టి బాధితులకు అండగా ఉంటా" అని కోడికత్తి కేసులో న్యాయవాదిగా ఉన్న అబ్దుల్ సలీం చెప్పారు. బుధవారం అజిత్‌సింగ్‌నగర్ పోలీసు స్టేషన్ వద్దకు వచ్చిన అబ్దుల్ సలీం వడ్డెరకాలనీ వాసులతో మాట్లాడారు. జరిగిన విషయంపై ఆరా తీశారు. అజిత్‌సింగ్ నగర్ సీఐతో మాట్లాడారు. పీఎస్ నుంచి బయటకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'సీఎంపై రాళ్లదాడి కేసులో మొత్తం ఆరుగురు వడ్డెర కాలనీ వాసులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో మైనర్లు కూడా ఉన్నారు. ఎవరినైనా ఏ కేసులోనైనా పోలీసులు అదుపులోకి తీసుకుంటే 24 గంటల్లోపు కోర్టులో హాజరుపరచాలి. 48 గంటలు దాటుతున్నా పోలీసులు విచారణ పేరుతో అదుపులో ఉంచారు. ఇది చట్ట విరుద్ధం. ఈ విషయమై అవసరమైతే సెర్చ్‌వారెంట్ వేస్తాం.' అని అబ్దుల్ సలీం హామీ ఇచ్చారు.



రోదిస్తున్న దుర్గారావు కుమార్తె

నా భర్తతో మాట్లాడించండి

దుర్గారావుపై మోయలేని నిందను మోపారు. ఆయనకు ఏ పాపం తెలీదు. కనీసం మాట్లాడటానికి అవకాశం ఇవ్వడం లేదు. నా భర్తను ఏం చేశారో తెలీదు. పిల్లలను ఓదార్చలేకపోతున్నా. దయచేసి నా భర్తను చూపించండి.

- శాంతి, దుర్గారావు భార్య

నా బిడ్డది ప్రశ్నించే గుణం

దుర్గారావుది.. తప్పు జరిగితే ప్రశ్నించే గుణం. నలుగురికి మంచి జరుగుతుందనుకున్నప్పుడు ప్రశ్నిస్తాడు. అలా ప్రశ్నించిన మాట వాస్తవం. అలాంటి విషయాలను మనసులో పెట్టుకుని ఈ విధంగా చేయడం సరికాదు. కొద్దిరోజుల కిందట బొండా ఉమా మా వద్దకు వచ్చారు. ఎన్నికల్లో ఆయన సహకరించమని అడిగారు. దుర్గారావు మా గూడెం కోసం సరేనన్నాడు. అంతేతప్ప వేరే ఉద్దేశం లేదు. నా బిడ్డ చాలా మంచి వ్యక్తి. ఎవరో పిల్లాడు రాయి విసిరితే మా అబ్బాయిని అరెస్టు చేయడం ఏంటి? ఇంట్లో నుంచి దుర్గారావు టీస్టాల్ వద్దకు వెళ్లాడు. అక్కడికి వచ్చిన పోలీసులు జీపులోకి ఎక్కించుకుని తీసుకెళ్లారు. దుర్గారావు పేరు చెప్పిన వారెవరో చెప్పాలి కదా! పోలీసుల అదుపులో ఉన్న పిల్లల తల్లిదండ్రులు చాలా బాధపడుతున్నారు.

- గురవమ్మ, దుర్గారావు తల్లి

గులక రాయి డ్రామాపై సీబీఐ విచారణ జరగాలి

- కేసులో నన్ను ఇరికించేందుకు కుట్ర: బొండా ఉమ

విజయవాడ, ఏప్రిల్ 17: ముఖ్యమంత్రి జగన్‌పై విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో జరిగిన గులకరాయి దాడి డ్రామాపై సీబీఐతో విచారణ జరిపించాలని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బొండా ఉమ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఏబీఎన్ - ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. 'గులకరాయి ఘటనపై గవర్నర్, సీఈసీకి ఫిర్యాదు చేశాం. సీఎంపై గులకరాయి దాడి ఘటనలో నన్ను అక్రమంగా ఇరికించేందుకు కుట్ర పన్నుతున్నారు. ఈ కేసును పూర్తిగా తప్పుదారి పట్టించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా సింగ్‌నగర్ వడ్డెర కాలనీకి చెందిన కొంతమంది మైనర్లను అక్రమంగా తీసుకొచ్చారు. చిత్రహింసలు పెట్టి వారితో నా పేరు చెప్పించే ప్రయత్నం చేశారు. దీనివెనుక సజ్జల, వెలంపల్లి ఉన్నారు. జూన్ 4 తర్వాత ఏర్పడే మా ప్రభుత్వంలో గులకరాయి కేసులో అసలు నిందితులు ఎవరో బయటకు తెస్తాం. ఈ ఘటనపై సీబీఐ విచారణకు ఆదేశించాలని సీఈసీకి, గవర్నర్‌కు లేఖలు ఇచ్చాం. కోడికత్తి డ్రామా, వివేకా హత్య కేసుల్లో వైసీపీ నాయకులు అడ్డంగా దొరికిపోవడంతో ఈ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు గులకరాయి డ్రామా ఆడుతున్నారు. మైనర్లను హింసించినా ప్రయోజనం లేకపోవడంతో వడ్డెర కాలనీకి చెందిన నా పార్టీ కార్యాలయం వ్యవహారాలు చూసే టీడీపీ కార్యకర్త వేముల దుర్గారావును తీసుకెళ్లారు. హింసించి నా పేరు చెప్పించాలని చూస్తున్నారు. గులకరాయి దాడిలో నాకు కానీ, టీడీపీకి చెందిన వారికి కానీ ఎలాంటి సంబంధమూ లేదు. కావాలంటే మా ఫోన్ రికార్డులను తనిఖీ చేసుకోవచ్చు. నా ఇంటి వద్ద, కార్యాలయం వద్ద పోలీసులు నిఘా పెట్టారు. కాకినాడ, గుంటూరు నుంచి పోలీసు అధికారుల్ని పిలిపించి మరీ నన్ను ఎలా ఈ కేసులో ఇరికించాలో ఆలోచనలు చేస్తున్నారు. వైసీపీ బస్సు యాత్రకు జనసమీకరణ జరిపి, వచ్చిన వారికి డబ్బులు ఇవ్వకపోవడంతోనే రాయి విసిరామని మైనర్లు చెబుతున్నారని పోలీసులే లీకులు ఇస్తున్నారు. సీఎంపై రాయి దాడి ఘటనను ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తో సహా అందరూ ఖండించారు. నిజమైన దోషులను గుర్తించి పట్టుకొనేందుకు మేం కూడా సహకరిస్తాం' అని బొండా ఉమ స్పష్టం చేశారు.

బొండా ఉమను ఇరికించే కుట్ర

- చట్ట వ్యతిరేక పోకడలను సహించే ప్రసక్తే లేదు
- పోలీసు అధికారులకు చంద్రబాబు హెచ్చరిక

అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్‌పై రాయి దాడి టీడీపీ నేతల ప్రోద్బలంతోనే జరిగిందని నమ్మించడం కోసం ప్రభుత్వం మళ్లీ కుట్రలు పన్నుతూ నీచపు ప్రయత్నాలు చేస్తోందని టీడీపీ అధినేత చంద్రబాబు ఆరోపించారు. టీడీపీ ముఖ్య నేతలను, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ఎలాగైనా కేసుల్లో ఇరికించాలనే పన్నాగంతో పావులు కదుపుతోందని అన్నారు. సీఎంపై దాడి చేసిన నిందితులకు టీడీపీ నేతలతో సంబంధాలున్నట్లుగా చిత్రీకరించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోందని, ఇందులో భాగంగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావును కేసులో ఇరికించేందుకు వైసీపీ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు.కాగా, బొండా ఉమామహేశ్వరరావుపై అక్రమ కేసు పెట్టకుండా విజయవాడ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించాలని ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్, రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య లేఖలు రాశారు. 'గులకరాయి వ్యవహారంలో బొండా ఉమాకు ఎటువంటి సంబంధం లేదు. కానీ కావాలనే ఎన్నికల నోటిఫికేషన్‌కు ఒకరోజు ముందు అక్రమ కేసు బనాయించి అరెస్టు చేసేందుకు పోలీసులు కుట్ర పన్నుతున్నారు. డబ్బు ఇస్తామని హామీ ఇచ్చి రోడ్‌షోకు హాజరుకావాలని వైసీపీ నేతలు కోరినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడి కుటుంబసభ్యుల వాంగ్మూలాలను మీడియా స్వయంగా నివేదించింది. కానీ కొంత మంది కళంకిత పోలీసులు దాడి చేయని వ్యక్తులను ఇరికించేందుకు కుట్రపన్నారు. ఉమాను అరెస్ట్ చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. మీడియాను, ప్రతిపక్ష పార్టీలను బహిరంగంగా నిందిస్తూ సీఈవోకు లేఖ రాయడం ద్వారా అఖిలభారత అధికారుల నియమ నిబంధనలను సీపీ రాణా ధిక్కరించారు' అని వర్ల తన లేఖలో పేర్కొన్నారు.

ప్రవీణ్ ప్రకాశ్ ఓవరాక్షన్‌కు బ్రేక్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- పేరెంట్స్ మీటింగ్స్ పెట్టాలన్న ముఖ్యకార్యదర్శి
- ఈసీకి ప్రతిపక్షాల ఫిర్యాదు.. సమావేశాలొద్దని ఆదేశాలు

అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ విద్యారంగం ద్వారా అధికార పార్టీకి ప్రచారం చేసేందుకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ చేసిన ఓవర్ యాక్షన్‌కు బ్రేక్ పడింది. విద్యా సంవత్సరం చివరి రోజున తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని ఆయన చేసిన ప్లాన్ విఫలమైంది. సమావేశాలు నిర్వహించి విద్యారంగంపై ప్రభుత్వం ఎంత ఖర్చు చేసింది.. ఎలాంటి పథకాలు అమలుచేస్తోంది అనే విషయాలను ప్రచారం చేయాలనుకున్నారు. దీంతో ఈ సమావేశాలు రాజకీయ ప్రచారంగా మారబోతున్నాయనే అనుమానాలు తలెత్తాయి. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఈ సమావేశాలేంటంటూ ప్రతిపక్ష పార్టీలు ఈసీకి ఫిర్యాదు చేశాయి. ఇదే విషయంపై 'కోడ్ ఉంటే నాకేంటి?' శీర్షికతో తాజాగా 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. ఈ పరిణామాలతో అప్రమత్తమైన ముఖ్య కార్యదర్శి తల్లిదండ్రుల సమావేశాలపై వెనకడుగు వేశారు. తల్లిదండ్రుల సమావేశాలు ఇప్పుడు నిర్వహించొద్దని, ప్రస్తుతానికి విద్యార్థులకు రిపోర్టు కార్డులు ఇస్తే చాలని బుధవారం తాజా ఆదేశాలు జారీచేశారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం రోజున, జూన్ 12న తల్లిదండ్రుల సమావేశాలు పెట్టాలని స్పష్టంచేశారు. సమావేశాల తేదీ ఎందుకు మార్చాల్సివచ్చిందనే దానిపై ఆయనవివరణ ఇవ్వలేదు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



కల్యాణ కాంతులతో సీతారాములు

కల్యాణం కమనీయం..!

• వేడుకగా శ్రీరామనవమి

వన్‌టౌన్, ఏప్రిల్ 17 : దుర్గామల్లేశ్వర దేవస్థానం దత్తత ఆలయం సీతానగరంలోని వీరాంజనేయ సమేత కోదండరామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని ఘనంగా వేదోక్త విధానంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. దేవదాయశాఖ కమిషనర్ శ్రీరామ సత్యనారాయణ దంపతులు, దుర్గగుడి ఈవో, డిప్యూటీ కలెక్టర్ కేఎస్ రామరావు.. సీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అన్నవితరణ చేశారు. ఏఈవో శేఖర్, ఈఈ రమాదేవి, ఏఈవో జంగం శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ హేమ దుర్గాంబ, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఇదే సమయంలో దత్తత ఆలయంగా ఉన్న కొలనుకొండలోని రామాలయంలో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ధర్మపదం వేదికపై బుధవారం నారాయణతీర్థుల తరంగాలను ఒంగోలుకు చెందిన ఘోరకవి సంపత్‌కుమార్ ఆలాపించారు.



కొలనుకొండ ఆలయంలో పాల్గొన్న భక్తులు



సీతానగరం ఆలయంలో అన్నప్రసాదం వితరణ చేస్తున్న ఈవో రామారావు

పంచముఖ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

చిట్టినగర్, ఏప్రిల్ 17 : శ్రీరామనవమిని సందర్భంగా నెహ్రూబొమ్మ సెంటర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. తమలపాకులతో స్వామిని అలంకరించి విశేష పూజలు అందించారు. పూజ కార్యక్రమంలో హనుమాన్ దీక్షాపీఠం పీఠాధిపతి దుర్గాప్రసాద్‌స్వామిజీ, కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు పాల్గొని స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. భక్తులకు స్వామిజీ హనుమాన్ చాలీషా పఠనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. నెహ్రూబొమ్మ సెంటర్ ఎస్ఎస్ టవర్స్ వద్ద భక్తులు పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు.



భక్తులకు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, పక్కన దుర్గాప్రసాద్ స్వామిజీ

కలెక్టరేట్‌లో శ్రీరామనవమి పూజలు

వన్‌టౌన్, ఏప్రిల్ 17 : శ్రీరామనవమిని పురస్కరించుకుని విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని ఎస్ఎస్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం సీతారాములకు ప్రత్యేక అర్చనలు జరిగాయి. ప్రత్యేకంగా జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఢిల్లీరావు ఆర్డీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన అర్చకులు పూజాధికాలను నిర్వహించారు. మంత్రపుష్పం, హారతి అనంతరం అధికారులకు, సిబ్బందికి ఆశీస్సులు అందజేశారు.



సీతారాముల పూజ సందర్భంగా అర్చకుల ఆశీస్సులను అందుకుంటున్న కలెక్టర్ ఢిల్లీరావు

నేడు సుజనా చౌదరి నామినేషన్

వన్‌టౌన్, ఏప్రిల్ 17 : కూటమి బలపరచిన పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి నామినేషన్ ఘట్టం ప్రారంభమయిన తొలిరోజు గురువారమే నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 9 గంటలకు చిట్టినగర్ కొత్త అమ్మవారి గుడిలో అర్చనలు చేస్తారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి భవానీపురంలోని పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ వేయనున్నారు. కూటమి శ్రేణులతో భారీ ర్యాలీ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

వైసీపీ నేతలపై కోడ్ ఉల్లంఘన కేసు

పాయకాపురం, ఏప్రిల్ 17 : ఎన్నికల కోడ్ ఉల్లంఘించి నిరసన ప్రదర్శన నిర్వహించిన 63వ డివిజన్ వైసీపీ నేతలపై నున్న రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం సీఎం జగన్‌పై జరిగిన రాయి దాడి ఘటనను నిరసిస్తూ 63వ డివిజన్ కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ, నేతలు మోదుగుల గణేష్, సీహెచ్.రవి, పెద్దిరెడ్డి శివారెడ్డి, పసుపులేటి ఏసులతో కలిపి మొత్తం 200 మంది వైసీపీ నేతలు ఈనెల 15న సుందరయ్యనగర్ ప్రాంతంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. సదరు విషయమై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమా ఈనెల 15వ తేదీన నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల అధికారులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎన్నికల కోడ్ ఉల్లంఘించి నిరసన తెలిపిన వైసీపీ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

22, 23వ తేదీల్లో ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ సెలక్షన్స్

విజయవాడ స్పోర్ట్సు, ఏప్రిల్ 17 : ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22, 23వ తేదీల్లో ఎస్ఎఫ్‌సీ జూనియర్ (బాలురు) అండర్-15 సెలక్షన్స్‌ను నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్టు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు ఈ నెల 22వ తేదీన తమ అర్హతా పత్రాలను సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు 75690 51099, 94412 80384 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

వన్‌టౌన్ రౌడీతో సీఎంపై గులకరాయి దాడి

• డూండీ రాకేష్

వన్‌టౌన్ : వన్‌టౌన్ రౌడీతో సీఎం జగన్‌రెడ్డిపై గులకరాయి దాడి చేయించారని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డూండీ రాకేష్ ఆరోపించారు. ఈ అంశంలో వెలంపల్లి శ్రీనివాస్, కేశినేని నానిల కాల్ రికార్డులను బయటకు తీస్తే వాస్తవాలు వెల్లడవుతాయన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బలహీనవర్గాలను బలి చేసేందుకు జగన్ కుట్ర పన్నాడని విమర్శించారు. పర్యటనలో రూట్ మ్యాప్ మార్చారని, కావాలనే ఆ మార్గంలో విద్యుత్ సరఫరా నిలిపివేసి సానుభూతి పొందేందుకు రాయితో దాడి ప్లాన్ చేశారన్నారు. వన్‌టౌన్ రౌడీతో దాడి చేయించేందుకు వెలంపల్లి శ్రీనివాస్, కోవర్టు కేశినేని నానిలు స్కెచ్ వేశారన్నారు. వారిద్దరి కాల్ రికార్డులను వెలికి తీయాలన్నారు. ప్లాన్ ప్రకారం దాడి చేయించి వెంటనే ప్లకార్డులతో నిరసన చేశారన్నారు. జగన్‌కు తొత్తులుగా వ్యవహరిస్తున్న పోలీసులు బొండా ఉమామహేశ్వరరావును కేసులో ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. విజయవాడ వెస్టును దోచుకున్న వెలంపల్లికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.

శ్రీరాముడు ఆదర్శప్రాయుడు

• శ్రీరామ శోభాయాత్రలో తాళ్లాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి స్వామి



బీఆర్‌టీఎస్‌రోడ్డులో శ్రీరామ శోభాయాత్ర

సత్యనారాయణపురం : రామాయణం జీవిత విలువలను బోధించడమే కాదు, వాటిని కాపాడేందుకు మార్గాలను చూపిస్తుందని శ్రీతాళ్లాయపాలెం శైవక్షేత్రపీఠాధిపతి శివస్వామి అన్నారు. శ్రీరామ శోభాయాత్ర బైక్ ర్యాలీ బీఆర్‌టీఎస్ రోడ్డు ఆదిశంకరాచార్య సర్కిల్ రామకోటి వద్ద నుంచి బుధవారం సాయంత్రం శ్రీతాళ్లాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి ప్రారంభించారు. ఈ యాత్ర బీఆర్‌టీఎస్ రోడ్డు, సత్యనారాయణపురం, శివాజీ కేఫ్, శివాలయం వీధి, సింగ్‌నగర్ ఫ్లైఓవర్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామశోభాయాత్ర సమితి కన్వీనర్ నాగలింగం శివాజీ, సూర్య విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, హిందూ బంధు సభ్యులు పాల్గొన్నారు.

కాపులకు అండగా ఉంటాం

• శివనాథ్, సుజనా చౌదరి హామీ



కాపులతో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కేశినేని చిన్ని

భవానీపురం, ఏప్రిల్ 17 : ఎన్డీయే కూటమి అధికారంలోకి తీసుకురావడానికి కాపులంతా ఒక తాటిపై వచ్చి తమను గెలిపించాలని విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి వై.సుజనా చౌదరి కోరారు. వంగవీటి రంగా ఒక్క కాపుల మనిషి మాత్రమే కాదనీ, అన్నివర్గాల మనిషి అని అన్నారు. సితార సమీపంలోని ఎన్ కన్వెన్షన్‌లో కాపు ఆత్మీయ సమ్మేళనం, జనసేన సెంట్రల్ ఆంధ్రా జోనల్ కన్వీనర్ బాడిత శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్, పశ్చిమ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి హాజరయ్యారు. కాపులంతా ఐక్యంగా ఉండి వైసీపీ నుంచి రాష్ట్రానికి విముక్తి కలిగించాలని తీర్మానాలు ఆమోదించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కాపులకు ఏ విధమైన పథకాలూ అందలేదని, కాపు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలకు నిధులివ్వలేదని ధ్వజమెత్తారు. తూర్పు జనసేన ఇన్‌చార్జి అమ్మిశెట్టి వాసు, జాతీయ కాపునాడు అధ్యక్షుడు గాళ్ల సుబ్రమణ్యం హాజరయ్యారు.

జగన్ మోసాలు జనానికి అర్థమయ్యాయి!

జగన్ మోసాలు, డ్రామాలు, స్కాములు రాష్ట్ర ప్రజలకు బాగా అర్థమయ్యాయని, అందుకే కులమతాలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలు ఎన్డీయే కూటమిని గెలిపించడానికి సంసిద్ధంగా ఉన్నారని, జగన్‌ను ఇంటికి పంపడం తథ్యమని విజయవాడ టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) ధీమా వ్యక్తం చేశారు. 41వ డివిజన్‌లోని రంగూన్ సాహెబ్ వీధిలో డివిజన్ కూటమి పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి సుజనా చౌదరితో కలిసి బుధవారం పాల్గొన్నారు. వీరిద్దరికీ స్థానిక టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ జగన్ ఓట్ల డ్రామాల మొదలెట్టాడని, దానికి ఎవ్వరూ మోసపోవద్దని సూచించారు. సుజనా చౌదరీ మాట్లాడుతూ పశ్చిమను మోడల్‌గా తీర్చిదిద్దేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, మొవ్వ జయలక్ష్మి, మాజీ కార్పొరేటర్ పత్తి నాగేశ్వరరావు, జనసేన, బిజెపీ, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైస్తవ ఉజ్జీవ కూడికలో శివనాథ్, సుజనా

భవానీపురం కబేళా సెంటర్ ఎన్ కన్వెన్షన్‌లో బెతస్థ ఫుల్ గాస్పెల్ మినిస్ట్రీస్ అధ్యక్షుడు పాస్టర్ కాటూరి మోజెష్ ఆధ్వర్యంలో బుధవారం క్రైస్తవ ఉజ్జీవ కూడిక జరిగింది. ఈ కార్యక్రమానికి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరీలు హాజరయ్యారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

చిట్టినగర్ : శ్రీరామనవమిని పురస్కరించుకొని 48వ డివిజన్ అమ్మసేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఆంజనేయవాగు ప్రాంతంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.



రంగూన్ సాహెబ్ వీధిలో డివిజన్ కూటమి కార్యాలయం ప్రారంభోత్సవంలో శివనాథ్, సుజనా

ఇంటలెక్చువల్ ఫోరం సభ్యులతో కేశినేని శివనాథ్

విద్యాధరపురం : విజయవాడ ఎంపీగా పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)నను గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం పశ్చిమ నియోజకవర్గం ఇంటలెక్చువల్ ఫోరం కమిటీ సభ్యులు కలిశారు. అనంతరం చిన్నిని ఫోరం కమిటీ సభ్యులు సత్కరించారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి : యార్లగడ్డ

గన్నవరం, ఏప్రిల్ 17 : నియోజకవర్గంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తానని భరోసా ఇచ్చారు. గత టీడీపీ పాలనలో ఆదరణ పథకం ద్వారా రజకులకు వాషింగ్ మెషిన్‌లు అందజేసినట్లు గుర్తుచేశారు. స్థానిక రోటరీ ఆడిటోరియంలో నియోజకవర్గ రజక సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ , అధికారంలోకి వచ్చాక రజకుల సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. గ్రామాల్లో రజక చెరువుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. పోలవరం కాలువపై శాశ్వతంగా మోటార్లు ఏర్పాటు చేసి నియోజకవర్గంలోని మెట్ట గ్రామాల్లో తాగు, సాగు ఇబ్బందులను తొలగిస్తానన్నారు. నిరుద్యోగ సమస్యకు ప్రణాళిక రూపొందించారని తెలి పారు. రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించి తనతో పాటు పార్లమెంటు అభ్యర్థి వల్లభనేని బాలశౌరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు చీమలదండు రామకృష్ణ, చిక్కవరపు నాగమణి, దువ్వారపు రామారావు, గుర్రపుశాల రామకృష్ణ, చాగంటి కృష్ణ, పీవీఎస్ఆర్ కృష్ణ, సగ్గుర్తి శ్రీను, ఉమావతి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం యార్లగడ్డ వెంకట్రావును సత్కరించి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతో కలసి ఉన్న చిత్రపటాన్ని అందజేశారు.



యార్లగడ్డ వెంకట్రావుకు చిత్రపటం అందజేస్తున్న రజక సంఘం నాయకులు

వైసీపీ నుంచి టీడీపీలోకి..

నందిగామ: నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల పరంపర కొనసాగుతోంది. టీడీపీ నాయకుడు మండవ పిచ్చయ్య, మువ్వా శేషగిరి, ప్రసాద్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని 7, 9 వార్డులకు చెందిన పలు కుటుంబాలు వైసీపీను వీడి టీడీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి కండువా కప్పారు. పార్టీలో చేరని వారందరికీ ప్రాధాన్యం ఉంటుందని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి తంగిరాల సౌమ్య అన్నారు. జగన్‌తో పాటు మొండితోక సోదరుల అరాచక పాలన భరిం చలేక వైసీపీని వీడి అనేక మంది టీడీపీలో చేరు తున్నారని ఆమె అన్నారు.

రేపూడిలో 20 మంది..

ఎ.కొండూరు: మండలంలోని పాత రేపూడి గ్రామానికి చెందిన కొప్పుల భిక్షంతో పాటు మరో 20మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి తిరు వూరు అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ అలవాల రమేష్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానిం చారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడం, ఐదేళ్లుగా రాష్ట్రంలో అభి వృద్ధిలేక పాలన కుంటుపడ టంతో వైసీపీని వీడా నని భిక్షం తెలిపారు.

టీడీపీకి కంచుకోటగా నందిగామను మారుద్దాం

• కేశినేని చిన్ని, తంగిరాల సౌమ్య పిలుపు



వైసీపీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు సోదరుడు సాంబశివరావుతో పాటు భారీ సంఖ్యలో టీడీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలతో కేశినేని చిన్ని, తంగిరాల సౌమ్య

కంచికచర్ల రూరల్, ఏప్రిల్ 17: నందిగామ నియోజకవర్గాన్ని టీడీపీకి కంచుకోటగా మారుద్దామని, అందుకు తగ్గట్టుగా నాయకులు, కార్యకర్తలు పనిచే యాలని కూటమి విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని), నందిగామ అభ్యర్థిని తంగిరాల సౌమ్య పిలుపునిచ్చారు. టీడీపీ మండల కార్యాలయంలో వైసీపీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు సోదరుడు సాంబశివరావు బుధవారం వందలాది మందితో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసుగు చెందారని, కంచికచర్ల మండలంలో టీడీపీకి 5 వేలకు పైగా మెజార్టీ వస్తుందని పార్టీలో చేరిన నాయ కులు ప్రకటించారు. కంచికచర్ల మండలంలో వైసీపీ గల్లంతు కావడం ఖాయ మని వారు స్పష్టం చేశారు. టీడీపీ మండలం నాయకులు పాల్గొన్నారు.

మూడు వేల మందికి అన్నదానం

నందిగామ: శ్రీరామనవమి పండుగను పురస్కరిం చుకుని సీతారాముల కల్యాణం సందర్భంగా భద్రాద్రి ఆలయంలో నందిగామకు చెందిన విద్యావేత్త కాపా రవీంద్రనాథ్ దంపతులు మూడువేల మందికి అన్నదా నం చేశారు. నందిగామకు చెందిన రవీంద్రనాథ్ పూర్వీ కులు భద్రాచలంలో అన్నపూర్ణా సమేత రామలింగే శ్వరస్వామి ఆలయం నిర్మించారు. ఆ ఆలయానికి వంశ పారంపర్య ధర్మకర్తగా రవీంద్రనాథ్ కొనసాగుతు న్నారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని సీతారామ కల్యాణం సందర్భంగా ఆలయం తరఫున అన్నదానం చేశారు. సీనియర్ న్యాయవాది కాపా కృష్ణప్రసాద్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి : వసంత

మైలవరంరూరల్, ఏప్రిల్ 17: టీడీపీ-బీజేపీ- జనసేన కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని, ఈనెల 22న తాను నామినేషన్ వేస్తున్నానని కార్యక్ర మాన్ని శ్రేణులు విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు కూటమి మైలవరం అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు. పొందుగలలో బుధవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే చింతలపూడి పూర్తిచేసి మైలవరం నియోజకవర్గంలో గోదావరిని పారిస్తామ న్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని తెలి పారు. ఎన్నికల్లో కూటమి విజయానికి నాయకులు, కార్యక ర్తలు కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ మం డల అధ్యక్షుడు తాతా పోతురాజు, బొందలపాటి సుధాకర రావు, బూదేటి రామారావు, డోలానాయక్, దురిశాల నాగే శ్వరరావు, గోపి, భూరియానాయక్, పండు, రంగా తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల దరఖాస్తులు అందుబాటులో ఉంచాం

• నందిగామ ఆర్వో, ఆర్డీవో రవీంద్రరావు

నందిగామ, ఏప్రిల్ 17: ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఈనెల 18న ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లను స్వీకరిస్తాం. 25న నామినేషన్లకు తుది గడువు. 26న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. నామినేషన్లు వేసే అభ్యర్థులకు అన్ని రకాల దరఖా స్తులు ఆర్డీవో కార్యాలయంలో అందుబాటులో ఉంచాం" అని నందిగామ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రవీంద్రరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను పూర్తి చేసుకుని రావాలని ఆయన సూచించారు. నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థులకు సంబంధించి మూడు వాహనాలను మాత్రమే తన కార్యాలయ ఆవరణలోకి అనుమతించనున్నట్లు చెప్పారు. నామినేషన్ వేసేందుకు అభ్యర్థితో సహా ఐదుగురు మాత్రమే తన చాంబర్‌లోని అనుమతిస్తామని తెలిపారు.

నందిగామలో ఓటర్ల సంఖ్య 2,03,437

ఎస్సీ నియోజకవర్గమైన నందిగామలో మొత్తం 2,03,437 మంది ఓటర్లు ఉన్నట్లు ఆర్డీవో తెలిపారు. వీరిలో పురుషులు 98,486 కాగా, మహిళా ఓటర్లు 1,04,945 మంది ఉన్నట్లు తెలిపారు. ఇతరులు ఆరుగురు, సర్వీస్ ఓటర్లు 41 మంది ఉన్నారని పేర్కొన్నారు. 108 ప్రాంతాల్లో మొత్తం 222 బూత్‌లు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అత్యధికంగా కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామంలోని 176 బూత్‌లో 1489 మంది ఓటర్లు ఉం డగా, అత్యల్పంగా వీరులపాడు మండలం తిమ్మాపురంలోని బూత్ నెంబర్ 155లో కేవ లం 144 మంది ఓటర్లు మాత్రమే ఉన్నట్లు చెప్పారు. సెక్టార్, రూట్ అధికారులతో పాటు ఎంసీసీ వంటి పలు విభాగాలతో సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ 8.97 లక్షల రూపాయల నగదు, 174 మద్యం బాటిళ్లు సీజ్ చేసినట్లు తెలిపారు.

విద్యుత్ బిల్లు రహిత ఏపీనే లక్ష్యం

శ్రీనివాస భాస్కర్ చాగంటి

ధర్నాచౌక్, ఏప్రిల్ 17: విద్యుత్ బిల్లు లేని ఆంధ్రప్రదేశ్ తమ లక్ష్యమని యంగ్ సీనియర్ రిచ్ కామన్ పీపుల్ కింగ్స్ పార్టీ (వైఎస్సార్‌సీపీకేపీ) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస భాస్కర్ చాగంటి పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. అనేక పరిశోధనలు చేసి ఎటువంటి ఖర్చు లేకుండా విద్యుత్ ఉత్పత్తిని కనుగొన్నామన్నారు. దీనికి సంబంధించిన పేటెంట్ కూడా పొందామన్నారు. దీని ద్వారా దేశంలో, రాష్ట్రంలో ప్రతి ఇంటికీ ఉచిత హరిత విద్యుత్ అందించవచ్చన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారన్నారు.

పేదలకు అన్నదానం

ధర్నాచౌక్, ఏప్రిల్ 17 : శ్రీరామనవమి పండుగ సందర్భంగా భవిష్య ప్రాజెక్టు యండీ మహిందర్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. గాంధీనగర్‌లోని మిరాజ్ అండ్ శాంతి సినిమాస్ సెంటర్‌లో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ పండుగ సందర్భంగా సుమారు వెయ్యి మంది పేదలకు అన్నదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. వేణు, మధుసూదన్, భాషా తదితరులు పాల్గొన్నారు.

20, 21 తేదీల్లో ఉచిత పుస్తకాల పంపిణీ

విజయవాడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న సర్వోత్తమ గ్రంథాలయంలో ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం తెలిపింది. 2015వ సంవత్సరం నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొంది. ఈనెల 20, 21 తేదీల్లో ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేస్తామని వెల్లడించింది. ఈ కార్యక్రమాన్ని బెంగళూరుకు చెందిన మనసు ఫౌండేషన్ ప్రతినిధి ఎంవీ రాయుడు ప్రారంభిస్తారని తెలిపింది. పాఠకులు తమ వద్ద ఉన్న పుస్తకాలను సర్వోత్తమ గ్రంథాలయంలో అందజేయాలని విజ్ఞప్తి చేసింది.

లంకమ్మ గ్రామోత్సవం ప్రారంభం

అవనిగడ్డ : లంకమ్మ అమ్మవారి గ్రామోత్సవం బుధవారం వైభవంగా ప్రారంభమైంది. భక్తులు అమ్మవారి గ్రామోత్సవానికి వందలాదిగా తరలివచ్చారు. ఆలయ కమిటీ ఛైర్మన్ చింతలపూడి బాలభాస్కరరావు, ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు తదిరతులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. లంకమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా అవనిగడ్డలో సూరగం రామకృష్ణ ప్రసాద్ పాడిన భక్తిపాట సీడీని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ టి.వేణుబాబు ఆవిష్కరించారు. సాహితీ వేత్త గుడిసేవ విష్ణు ప్రసాద్ రచించిన నాలుగు పాటలను నరహరశెట్టి జ్యోతి, ఎస్.స్వర్ణలత, ఎస్‌బి.కామేశ్వరిలు ఆలపించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లింగవరంలో అగ్నిప్రమాదం

గుడివాడ రూరల్ : లింగవరం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కారుమంచి పండు తదితరుల వరిగడ్డివాము, రెండు పాకలు బుధవారం దగ్ధమయ్యాయి. ఫైర్ సిబ్బంది మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. మొత్తం మీద రూ.రెండు లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

ఏం చేశారని వస్తారు : సైకం

అవనిగడ్డ : ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం ఏమీ చేసిందని ఆత్మీయ సమ్మేళనానికి అగ్నికుల క్షత్రియులు వస్తారని ప్రముఖ న్యాయవాది, ఏపీ మత్స్యకారుల జేఏసీ ఛైర్మన్ సైకం రాజశేఖర్ ప్రశ్నించారు. మత్స్యకారుల ఆదాయ అభివృద్ధికి తోడ్పడే కార్యక్రమాలను ప్రభు త్వం అటకెక్కించిందన్నారు. మాయమాటలు చెప్పి ఐదేళ్ల నెట్టుకొచ్చినఎమ్మెల్యేకు అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గ రాష్ట్ర నేతలు మద్దతుగా రావటం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తూ తమ సంక్షేమానికి పాటుపడే వారికే ఓటు వేయాలని కోరారు.



మాట్లాడుతున్న పాతూరి నాగభూషణం, కోన తాతారావు, వైవీబీ రాజేంద్రప్రసాద్

రాముడి పాలన రావాలి... రావణ వైసీపీ పోవాలి

- పల్లె ప్రగతి చూడాలంటే .. డబులింజన్ సర్కార్‌తోనే
- మోదీ ఇచ్చిన 8,629 కోట్లు మళ్లించిన రావణుడు జగన్
- కూటమి నేతలు పాతూరి, వైవీబీ, తాతారావు

అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో రాముడి పాలన రావాలి. రావణ వైసీపీ పాలన పోవాలి' అని ఎన్డీఏ నేతలు పాతూరి నాగభూషణం, వైవీబీ రాజేంద్రప్రసాద్, కోన తాతారావు అన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నాయకులు ముగ్గురూ విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రంలోని 12,918 గ్రామాల అభివృద్ధికి రూ.8,629 కోట్లు ఇచ్చిన రాముడు మోదీ అయితే.. వాటిని దారి మళ్లించిన రావణుడు జగన్‌రెడ్డి. వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థలు నిర్వీర్యమయ్యాయి. జల్ జీవన్ మిషన్ పథకం నరేంద్ర మోదీ ప్రభుత్వానికి అత్యంత కీలకమైంది. ఆ నిధులు తెచ్చుకోవడంలో 2019కు ముందున్న ప్రభుత్వం ఐదో స్థానంలో ఉంటే జగన్ ప్రభుత్వం 26వ స్థానంలో ఉండటం శోచనీయం. ఏపీ ప్రభుత్వం వాడేసుకున్న నిధులు విడుదల చేయాలంటూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు నిరసన వ్యక్తం చేస్తుంటే... ఎన్నికల కోడ్ వచ్చాక రూ.988 కోట్లు వాడేసుకోవడం పల్లెలపై జగన్‌రెడ్డికి ఉన్న కక్షకు నిదర్శనం. ఈ నిధులు విడుదల చేయించే బాధ్యత ఎన్నికల కమిషన్ తీసుకోవాలి. ఉపాధి నిధులు రూ.36 వేల కోట్లు కూలీలకు నరేంద్ర మోదీ ఇస్తే ఆ సొమ్ము దారి మళ్లించి వైసీపీ పందికొక్కులకు పంచిన ఘనుడు జగన్‌రెడ్డి. చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు గౌరవ వేతనం పెంచుతుంది. కేంద్రం నుంచి వచ్చే ప్రతి పైసా పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు కేటాయిస్తుంది' అని పాతూరి, వైవీబీ, తాతారావు అన్నారు.

సివిల్స్ ర్యాంకర్లకు చంద్రబాబు అభినందనలు

అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సివిల్స్-23 తుది ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపికైన 40 మంది అభ్యర్థులకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించి, దేశంలో తెలుగు వారి సత్తా చాటిన దోనూరు అనన్యరెడ్డి, నందాల సాయికిరణ్, కేఎన్ చందన జాహ్నవి, మెరుగు కౌశిక్, మాజీ కానిస్టేబుల్ మూలగాని ఉదయ్‌కృష్ణారెడ్డి, పశ్చిమగోదావరి జిల్లా డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూషకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. 'ఎంతో పట్టుదలతో మీ ఆశయాలను నెరవేర్చుకున్న మీరంతా ప్రజలకు అండగా నిలిచి, నిస్వార్థంగా సేవలను అందిస్తూ, మీ పదవులకు వన్నె తేవాలని బుధవారం 'ఎక్స్' వేదికగా ఆకాంక్షించారు.

జగన్ డ్రామాల్లో ఎస్సీలు, బీసీలే బలిపశువులా?: అచ్చెన్న

అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కోడికత్తి డ్రామా సమయంలో అధికారంలో ఉన్న వారే బాధ్యత వహించాలన్న వైసీపీ నేతలు ఇప్పుడు అధికారంలో ఉండి.. గులకరాయి నింద ప్రతిపక్షాలపై నెట్టేయడానికి సిగ్గుండాలి అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. గులకరాయి కేసులో టీడీపీ కార్యకర్తలను ఇబ్బందిపెడతామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. బుధవారం ఆయన ఓ ప్రకటన చేస్తూ.. 'సీఎం జగన్‌రెడ్డిలో మంచి యాక్టింగ్ స్కిల్స్ ఉన్నాయి. రాజకీయాలకు బదులు సినిమా రంగంలోకి వెళ్లి ఉంటే దేశం గర్వించే నటుడు అయ్యేవాడు. కోడికత్తి డ్రామాలో దళిత బిడ్డ శ్రీనివాస్‌ను ఐదేళ్ల పాటు జైలు పాలు చేసిన జగన్‌రెడ్డి.. ఇప్పుడు బీసీ వర్గానికి చెందిన సతీశ్ అనే అమాయకపు యువకుడిని ఇరికిస్తున్నారు. జగన్ డ్రామాలకు దళితుల్ని, బీసీల్ని బలి చేస్తున్నారు' అని విమర్శించారు. కాగా, 'గులకరాయి' అంశంపై టీడీపీ ఎమ్మెల్యేలు చినరాజప్ప, నిమ్మల రామానాయుడు స్పందిస్తూ... 'జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాపులను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అణచివేస్తూ అక్రమ కేసులతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. కాపులంటే జగన్‌రెడ్డికి అంత కక్ష ఎందుకు? గులకరాయి కేసులో బొండా ఉమామహేశ్వరరావును ఇరికించేందుకు జగన్‌రెడ్డి కుట్ర పన్నారు' అని ఆరోపించారు.

హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా గిరీశ

అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి పీఎస్ గిరీశ నియమితులయ్యారు. గత కొన్ని నెలలుగా ఈ స్థానంలో ఉన్న కే వెంకటరమణారెడ్డి వైద్య కారణాలతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో.. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న గిరీశను హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సెలవు నుంచి తిరిగి వచ్చిన తర్వాత సాధారణ పరిపాలన విభాగంలో రిపోర్టు చేయాలని వెంకటరమణారెడ్డిని ఆదేశించారు.

'నిమ్సులైడ్' పెయిన్‌కిల్లర్‌తో దుష్ప్రభావాలు

- ఇండియన్ ఫార్మాకోపియా కమిషన్ హెచ్చరిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: భారత్‌లో ఔషధ ప్రమాణాలను నిర్ణయించే అత్యున్నత సంస్థ ఇండియన్ ఫార్మాకోపియా కమిషన్ (ఐపీసీ) నొప్పి నివారణకు, జ్వరానికి సాధారణంగా ఉపయోగించే పెయిన్‌కిల్లర్ నిమ్సులైడ్‌పై భద్రతా హెచ్చరికను జారీచేసింది. ఈ పెయిన్‌కిల్లర్ వాడకం వలన చర్మంపై దద్దుర్లు వంటి దుష్ప్రభావాలు తలెత్తుతాయని హెచ్చరించింది. ఆరోగ్య నిపుణులు, రోగులు, వినియోగదారులు ఈ ఔషధం వాడకం వలన ఏమైనా దుష్ప్రభావాలను గుర్తిస్తే.. వెంటనే ఇండియన్ ఫార్మాకోపియా కమిషన్‌కు నివేదించాలని తెలిపింది. నిమ్సులైడ్ భద్రతపై కొన్నేళ్లుగా ఆందోళన ఉంది. ఇది నాన్-స్టెరాయిడ్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్స్ తరగతికి చెందినది. ఇది కాలేయాన్ని కూడా దెబ్బతీస్తుందని కూడా నిరూపితమైంది. కొన్ని సందర్భాల్లో ప్రాణాంతకం కూడా కావొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ఔషధం తొలిసారిగా ఇటలీలో అందుబాటులోకి వచ్చింది. అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్ వంటి దేశాల్లో దీన్ని వాడేందుకు అనుమతి లేదు. ఫిన్‌లాండ్, స్పెయిన్, ఐర్లాండ్, సింగపూర్ వంటి అనేక దేశాల్లో 2002 నుంచి 2007 మధ్య ఈ ఔషధాన్ని ఉపసంహరించారు. భారత్ కూడా 2011లో ఈ మందుకు సంబంధించిన పీడియాట్రిక్ ఫార్ములేషన్‌ను నిషేధించాలని నిర్ణయించింది. ప్రస్తుతం భారత్‌లో ఈ మందు నిముతాబ్, నిమువిన్ వంటి అనేక బ్రాండ్ల పేరుతో లభిస్తుంది.

నిద్రలేకుండా ఆన్‌లైన్‌లో గడిపితే స్కూల్‌కి డుమ్మానే..!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: తినడం, నిద్రపోవడం, వ్యాయామం వంటి కనీస అవసరాలను సైతం వదిలేసే స్థాయిలో ఆన్‌లైన్‌లో ఎక్కువ సమయం గడిపే టీనేజర్లు పాఠశాలలకు గైర్హాజరయ్యే ప్రమాదం అధికంగా ఉందని తాజా అధ్యయనం వెల్లడించింది. ఫిన్‌లాండ్‌లోని హెల్సింకి విశ్వవిద్యాలయం పరిశోధకులు నిర్వహించిన కొత్త అధ్యయనంలో ఈ విషయాన్ని గుర్తించారు. ఈ అధ్యయనం కోసం పరిశోధకులు 14 నుంచి 16 ఏళ్ల మధ్య వయసున్న 86 వేల మంది విద్యార్థుల డేటాను విశ్లేషించారు. నిద్రాహారాలు సైతం మానేసి ఆన్‌లైన్‌లో ఎక్కువ సమయం గడిపిన, ఇంటర్నెట్‌ను మితిమీరి వినియోగించిన విద్యార్థులు.. కుటుంబాన్ని, స్నేహితులను, చదువును నిర్లక్ష్యం చేసినట్టు పరిశోధకులు గుర్తించారు. అబ్బాయిల్లో 79 శాతం మంది ఇంటర్నెట్ వాడుతుంటే.. అమ్మాయిల్లో 96 శాతం వాడుతున్నారని కనుగొన్నారు. ఆన్‌లైన్‌లో ఎక్కువ సమయం గడపడం వలన అబ్బాయిలు పాఠశాలకు గైర్హాజరయ్యే అవకాశం 38 శాతం అధికంగా ఉందని, అమ్మాయిల్లో ఇది 24 శాతంగా ఉందని పరిశోధకులు పేర్కొన్నారు. అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువగా ఇంటర్నెట్, సోషల్ మీడియాను వాడుతున్నారని తెలిపారు.

ఆ అభ్యర్థికి లండన్, దుబాయిల్లో అపార్ట్‌మెంట్లు

- లగ్జరీ కార్లు కూడా.. మొత్తం ఆస్తులు రూ.1,400 కోట్లు

మడ్‌గావ్, ఏప్రిల్ 17: దక్షిణ గోవా లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పల్లవి డెంపోకు సుమారు రూ.1,400 కోట్ల ఆస్తులు ఉన్నట్టు నామినేషన్ పత్రాలలో పేర్కొన్నారు. ఈ మేరకు 119 పేజీల అఫిడవిట్‌ను మంగళవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఆమె సమర్పించారు. ఇందులో ఆమె పేరున 255.4 కోట్ల చరాస్తులు, 28.2 కోట్ల స్థిరాస్తులు, ఆమె భర్త శ్రీనివాస్ పేరిట రూ.994.8 కోట్ల చరాస్తులు, రూ.83.2 కోట్ల స్థిరాస్తులు ఉన్నట్టు వివరించారు. తమకు లగ్జరీ కార్లు, రూ.5.7 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, దుబాయిలో రూ.2.5 కోట్ల విలువైన అపార్ట్‌మెంట్, లండన్‌లో రూ.10 కోట్ల విలువైన అపార్ట్‌మెంట్ ఉన్నాయని కూడా తెలిపారు. ఆమె భర్త శ్రీనివాస్.. డెంపో గ్రూప్ ఛైర్మన్. ఈ సంస్థ మైనింగ్, నౌకల తయారీ, రియల్ ఎస్టేట్, విద్య, ఫుట్‌బాల్ మ్యాచ్‌ల నిర్వహణ తదితర కార్యకలాపాలు నిర్వహిస్తుంది. 2022-23 సంవత్సరానికి పల్లవి రూ.10 కోట్ల వరకు, ఆమె భర్త రూ.11 కోట్ల వరకు ఆదాయ పన్ను రిటర్న్ దాఖలు చేశారు.



గుంటూరులో శోభాయాత్రను ప్రారంభిస్తున్న జస్టిస్ కృష్ణమోహన్

కన్నుల పండువగా శోభాయాత్ర

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 17: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీరామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో బుధవారం శోభాయాత్ర కన్నుల పండువగా నిర్వహించారు. జై శ్రీరామ్.. జై జై శ్రీరామ్ నినాదాలతో నగరం మారుమోగింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్రీరాముడు, ఆంజనేయస్వామి విగ్రహాల్ని హైకోర్టు న్యాయమూర్తి బొప్పూడి కృష్ణమోహన్ దంపతులు ఆవిష్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గార్డెన్స్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి శోభాయాత్రను ప్రారంభించారు. అనంతరం శోభాయాత్రను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. యాత్రలో ప్రజా ప్రతినిధులు, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



శోభాయాత్ర సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న ముస్లిం మహిళలు

పవన్‌కు భద్రత ఏదీ..!

- పోలీసులకు పట్టని జనసేనాని రక్షణ
- పిఠాపురంలో బ్లేడ్లు, సూదులతో దాడి
- జనసేన అధినేతకు రక్షణగా నిలుస్తున్న జనసైనికులు, ప్రైవేటు భద్రతా సిబ్బంది

అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ భద్రతపై ఆ పార్టీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఎన్నికల తేదీల ప్రకటన వెలువడిన నాటి నుంచి ఆయన విస్తృతంగా ప్రజాబాహుళ్యంలో తిరుగుతున్నారు. రాజకీయ పార్టీ వ్యవస్థాపకుడిగా, సినీ హీరోగా పవన్‌కు ఉన్న ఫాలోయింగ్ చెప్పనవసరం లేదు. ఆయనతో ఫొటో దిగాలనుకునే అభిమానులు లక్షల్లో ఉంటారు. ఆయన కనిపించగానే ఆ అభిమానం ఉప్పొంగుతుంది. ఆయన్ను దగ్గరగా చూడాలన్న ఉద్వేగం బారికేడ్లను దాటి ముందుకు ఉరుకుతుంది. దానికి అడ్డుకట్ట వేయడానికి, క్రమబద్ధీకరించడానికి నిలబడాల్సిన పోలీసులు కనుచూపు మేర కనిపించడం లేదు. ఉన్న కొద్దిమందీ అది తమపని కాదన్నట్లు పల్లీలు తింటూ దూరంగా కూర్చుండిపోతున్నారు. ఈ నెల 1న పిఠాపురంలో పర్యటించిన పవన్, అక్కడ సభలో మాట్లాడుతూ, 'నాకూ అభిమానులతో ఫొటోలు దిగాలని ఉంటుంది. కాని, వారితో పాటు కొన్ని అసాంఘిక శక్తులు కలిసిపోయి వస్తున్నాయి. వాళ్లు నన్ను, నా సిబ్బందిని సూదులతో గుచ్చుతున్నారు. బ్లేడ్లతో కోస్తున్నారు. భద్రతాపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి' అని అన్నారు. పవన్ స్వయంగా చేసిన ఆ ప్రకటనతో పార్టీ నాయకుల్లో అధినేత భద్రతపై ఆందోళన మొదలయింది. పవన్‌కు భద్రత కల్పించాలంటూ పోలీసులకు అనేకసార్లు చేసిన విన్నపాలు బుట్టదాఖలవడంతో ఆయనకు రక్షణగా ప్రైవేటు భద్రతా సిబ్బంది, జనసైనికులే నిలుస్తున్నారు. కాగా, తాడేపల్లిగూడెం సభలో పోలీసులు తీరు పార్టీ నాయకులకు భయం కలిగించింది. వేల మంది జనాభా ఉన్న సభ దగ్గర పట్టుమని 10 మంది పోలీసులు కూడా లేరు. దీంతో జనం ఒక్కసారి బారిగేడ్లు విరగొట్టుకుని ప్రధాన వేదిక వద్దకు వచ్చేశారు. ఆ సభలో ఎన్ఎస్‌జీ సెక్యూరిటీ ఉన్న మాజీ సీఎం చంద్రబాబు కూడా పాల్గొన్నారు. భారీ భద్రత కలిగిన వ్యక్తి ఉన్న సమయంలో కూడా పోలీసులు చేతులెత్తేశారు. జనం ఒక్కసారిగా ప్రధాన వేదిక వద్దకు రావడంతో ఇరుపార్టీల నేతలూ ఒకింత ఒత్తిడికి లోనయ్యారు. అప్పుడు చంద్రబాబు సెక్యూరిటీ సిబ్బందితో పాటు, పవన్ కల్యాణ్ ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది వారిద్దరి చుట్టూ వలయంగా ఏర్పడ్డారు. ప్రతి సందర్భంలోనూ ఇలాంటి భద్రతా లోపాలతో కూడిన అనుభవాలే జనసేనానికి ఎదురవుతున్నాయి. పవన్ పర్యటనల్లో, బహిరంగ సభల్లో ప్రధాన వేదిక వద్ద ఆయన భద్రతకు పోలీసులు ఎలాంటి ముందస్తు చర్యలూ తీసుకోవడం లేదు. ఈ నేపథ్యంలోనే సుమారు 300 మంది ప్రైవేటు భద్రతా సిబ్బంది, 100 మంది జనసైనికులు వలంటీర్లుగా ఏర్పడి సేనానికి రక్షణగా నిలిస్తున్నారు. అయితే తాజా ఘటనల నేపథ్యంలో పోలీసులు స్పందించాలని, పవన్ కల్యాణ్ రక్షణపై దృష్టి సారించాలని జనసేన పార్టీ నాయకత్వంతో పాటు, పవన్ కల్యాణ్ అభిమానులూ బలంగా కోరుకుంటున్నారు.



పవన్‌కు రక్షణగా ప్లాస్టిక్ పలకలు పెట్టిన భద్రతా సిబ్బంది (ఫైల్)

రాహుల్‌కు నల్లేరుపై నడకే?

- వయనాడ్‌లో త్రిముఖ పోరు
- ఇక్కడ రాహుల్ పోటీపై లెఫ్ట్ గుర్రు
- సీపీఐ నుంచి డి.రాజా భార్య పోటీ
- బీజేపీ అభ్యర్థిగా రాష్ట్ర నేత సురేంద్రన్
- వీరిద్దరి నుంచి గట్టి సవాల్
- అయినా కాంగ్రెస్ అగ్ర నేతకే చాన్స్



వయనాడ్.. గత లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారి దేశవ్యాప్తంగా మార్మోగిన పేరు. కేరళలోని ఈ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ నాడు నామినేషన్ వేయడంతో ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. యూపీలోని తమ కంచుకోట అమేఠీలో ఆయన పరాజయం పాలైనా ఇక్కడ 4.37 లక్షల ఓట్ల ఆధిక్యంతో ఘనవిజయం సాధించారు. మళ్లీ ఈసారి కూడా ఈ 'సురక్షిత' స్థానం నుంచే బరిలోకి దిగారు. 'ఇండియా కూటమి'లో భాగస్వాములైన లెఫ్ట్ పార్టీలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఓపక్క జాతీయస్థాయిలో బీజేపీపై తామంతా కలిసి పోరాడుతూ.. కేరళలో మాత్రం పరస్పర పోరాటానికి దిగితే తప్పుడు సంకేతాలు వెళ్తాయని స్పష్టం చేసినా.. కాంగ్రెస్ రాహుల్‌నే అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో రాష్ట్రంలో అధికారంలో ఉన్న లెఫ్ట్ డెమొక్రాటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్).. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా భార్య అన్నీ రాజాను అభ్యర్థిగా నిలిపింది. ఈమె నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ విభాగం అధ్యక్షురాలిగా ఉన్నారు. బీజేపీ కూడా తమ రాష్ట్ర అధ్యక్షుడు కె.సురేంద్రన్‌ను పోటీకి దించింది. దీంతో ఇక్కడ త్రిముఖ పోటీ నెలకొంది. తొలిసారి ఎన్నికల బరిలోకి దిగిన అన్నీ రాజా.. గత నెల 1 నుంచి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. రాహుల్ గెలిస్తే ప్రజలకు కనిపించరని.. తనను గెలిపిస్తే వారితో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇస్తున్నారు. ఇక్కడ గెలవడం అంత సులువు కాదని వామపక్షాలకూ తెలుసు. రాహుల్ ఆధిక్యాన్ని వీలైనంత తగ్గించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. సురేంద్రన్ కూడా పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. అమేఠీలో రాహుల్ పోటీచేసి గెలిస్తే వయనాడ్ వదిలేస్తారని ఈ ఇద్దరూ చెబుతున్నారు. అటు రాహుల్ తరఫున కాంగ్రెస్ కార్యకర్తలు ఇల్లిల్లూ తిరిగి ఓటు అడుగుతున్నారు. వయనాడ్‌లో ఈ నెల 26న పోలింగ్ జరుగనుంది.

- సెంట్రల్ డెస్క్.

దండకారణ్యంపై.. సడలుతున్న నక్సల్స్ పట్టు!

- రెడ్‌కారిడార్‌లో వరుస దెబ్బలు
- కొవిడ్ తర్వాత దిగజారిన పరిస్థితులు
- మావోయిస్టుల సమస్యను.. సీరియస్‌గా తీసుకున్న కేంద్ర ప్రభుత్వం
- 80 వేల బలగాలతో యాంటీ-నక్సల్స్ ఆపరేషన్
- నక్సల్స్ కంచుకోటల్లో.. ప్రతి ఐదు కిలోమీటర్లకొక పోలీసు క్యాంపు



చర్ల, ఏప్రిల్ 17: దండకారణ్యంపై మావోయిస్టులు పట్టు కోల్పోతున్నారా? ఒకప్పుడు తెలుగు రాష్ట్రాల్లోని నల్లమల నుంచి.. నేపాల్ వరకు రెడ్‌కారిడార్‌ను ఏర్పాటు చేసుకున్న నక్సల్స్ ఇప్పుడు సేఫ్‌జోన్లు లేక సతమతమవుతున్నారా? కొవిడ్ కల్లోలం తర్వాత మావోయిస్టులకు వరుసగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయా? ఈ ప్రశ్నలకు ప్రస్తుత పరిణామాలు ఔననే సమాధానం చెబుతున్నాయి. కరోనా వైరస్ బారిన పడి అప్పట్లో పలువురు అగ్రనాయకులు కన్నుమూయగా.. రెండేళ్లుగా పోలీసులు ఉధృతం చేస్తున్న ఆపరేషన్లతో నక్సల్స్‌కు భారీఎత్తున ఎదురుదెబ్బలు తగులుతున్నాయి.

అడవుల్లో 80 వేల పోలీసు బలగాలు

ఒకప్పుడు పీపుల్స్ వార్ గ్రూప్(పీడబ్ల్యూజీ)గా ఉన్న నక్సలైట్లు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వంతో చర్చల సందర్భంగా.. 2004 సెప్టెంబరు 21న తాము మావో సిద్ధాంతాలను అనుసరిస్తామని, ఇకపైన తమ గ్రూప్ పేరు మావోయిస్టు పార్టీ అని ప్రకటించుకున్నారు. అప్పట్లో చర్చలు విఫలమవ్వడం.. దండకారణ్యంలో మావోయిస్టుల ప్రాబల్యం మరింత ఉధృతమవ్వడంతో.. అప్పటి యూపీఏ సర్కారు 'ఆపరేషన్ గ్రీన్ హంట్'ను ప్రారంభించింది. హింస-ప్రతిహింసలతో దండకారణ్యం దద్దరిల్లింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ, ఛత్తీస్‌గఢ్ అగ్రనాయకులు చాలా మంది ఎన్‌కౌంటర్లలో మృతిచెందారు. 2020 మార్చిలో దేశంలోకి కొవిడ్ ప్రవేశించిన తర్వాత.. మావోయిస్టులు వైరస్‌తో అతలాకుతలం అయ్యారు. మొదటి వేవ్, ఒమిక్రాన్ ఉధృతి (మూడోవేవ్) సందర్భాల్లో పెద్ద సంఖ్యలో నాయకులు, క్యాడర్‌ను కోల్పోయారు. ఆ తర్వాత పీఎల్‌జీ నేత మాడ్వీ హిడ్మా లాంటి మావోయిస్టు నేతల వ్యూహాల్లో సీఆర్‌పీఎఫ్ జవాన్లు మృతిచెందినా.. బీజాపూర్-తెలంగాణ శివార్లలోని పోలీసు క్యాంపులపై రాకెట్ దాడులకు దిగినా.. క్రమంగా పోలీసులు పైచేయి సాధిస్తూ వస్తున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ అధికారం చేపట్టాక.. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించినట్లు తెలుస్తోంది. గడిచిన మూడు నెలల్లో యాంటీ-నక్సల్స్ ఆపరేషన్లలో పాల్గొనే సిబ్బంది సంఖ్యను ఒక్కసారిగా పెంచారు. ప్రస్తుతం ఒక్క బస్తర్ రీజియన్‌లోనే 80 వేల మంది డీఆర్జీ, కోబ్రా, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ జవాన్లు నక్సల్స్ ఆపరేషన్లలో పాల్గొంటున్నట్లు అధికారులు పలు సందర్భాల్లో చెప్పారు. అంతేకాదు.. తెలంగాణ సరిహద్దులో ఉండే మావోయిస్టుల కంచుకోట పూవర్తి, తెర్లం కాగా.. అక్కడి నుంచి సుమారు 300-400 కిలోమీటర్ల దూరంలో ఉన్న అబూజ్‌మడ్ అడవుల వరకు కూడా పోలీసులు క్రమంగా క్యాంపులను విస్తరించారు. ఎంతలా అంటే.. అడవుల్లో ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒకటి చొప్పున పోలీసు క్యాంపు ఏర్పాటైంది. ఒక్కో క్యాంపులో 2 వేల నుంచి 5 వేల వరకు బలగాలు ఉండేలా ఏర్పాట్లు చేశారు. గడిచిన మూడున్నర నెలలుగా ఎన్‌కౌంటర్లు పెరిగాయి. ఈ ఏడాది మొత్తం 79 మంది మావోయిస్టులు మృతిచెందారు. గడిచిన నెల రోజుల్లో ఈ సంఖ్య 54గా ఉంది. 125 మంది మావోయిస్టుల అరెస్టవ్వగా.. 150 మంది నక్సల్స్ లొంగిపోయారు. ఈ గణాంకాలను బట్టి.. కొవిడ్ కల్లోలం నుంచి మంగళవారం నాటి ఎన్‌కౌంటర్ వరకు మావోయిస్టు పార్టీ భారీ ఎదురు దెబ్బలను చవిచూసిందని స్పష్టమవుతోంది. బస్తర్ ఐజీ పి.సుందర్‌కుమార్ కూడా క్రమంగా తాము మావోయిస్టులపై పైచేయి సాధించామని, మంగళవారం నాటి ఎన్‌కౌంటర్‌తో మావోయిస్టులను కోలుకోలేని విధంగా దెబ్బతీశామని వివరించారు.

భద్రతాబలగాలకూ సవాలే..!

ఛత్తీస్‌గఢ్‌లో అబూజ్‌మడ్ వరకు చొచ్చుకు వెళ్లిన భద్రత బలగాలకు ఇంకా సవాళ్లు మిగిలే ఉన్నాయని దండకారణ్యంపై పట్టున్న విశ్రాంత అధికారులు, అరెస్టయిన, లొంగిపోయిన మాజీ మావోయిస్టులను విచారించిన దర్యాప్తు అధికారులు వివరిస్తున్నారు. "మంగళవారం నాటి ఎన్‌కౌంటర్ ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దులకు సమీపంలో ఉంది. అయితే.. అబూజ్‌మడ్ అడవుల విస్తీర్ణం చాలా ఎక్కువ. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు, ఇతర అగ్ర నాయకులు అక్కడే షెల్టర్ పొందుతున్నారని నిఘావర్గాలు విశ్వసిస్తున్నాయి. అక్కడి గుట్టలు, కొండ ప్రాంతాలు కూడా ప్రతికూలంగా ఉంటాయి. ఒక్కోచోట కొండ ఎక్కి దిగడానికి రెండు-మూడు రోజులు పడుతుంది. ఈ మధ్యలో వాటర్ పాయింట్లు(తాగునీరు లభించే ప్రదేశాలు) ఉండవు. మధ్యలో సొరకలు(గుహలు, బొరియల్లాంటివి) ఉంటాయి. అక్కడక్కడా 8-10 కుటుంబాలు మాత్రమే నివసించే గిరిజన గూడేలు ఉంటాయి. ఈ మార్గాల్లో మావోయిస్టులు బూబీట్రాప్‌లు, మందుపాతరలను పెట్టే ప్రమాదాలున్నాయి" అంటూ హెచ్చరించారు. అయితే.. వరుస ఎన్‌కౌంటర్లు, మావోయిస్టు కీలక నేతల మృతి వంటి ఘటనలతో ఇతర నక్సల్స్ లొంగిపోయే ప్రయత్నాలు ప్రారంభించే అవకాశాలున్నట్లు అభిప్రాయపడ్డారు.

అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌లో.. 29 మంది మృతుల్లో 15 మంది మహిళలే

అబూజ్‌మడ్‌లో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన 29 మంది నక్సల్స్ మృతదేహాలను బుధవారం కాంకేర్ పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. మృతుల్లో 15 మంది మహిళలు, 14 మంది పురుషులు ఉన్నట్లు బస్తర్ ఐజీ సుందర్‌కుమార్ చెప్పారు. శంకర్‌రావు భార్య సుమన కూడా మృతుల్లో ఉన్నట్లు అనుమానిస్తున్నామని, ఇంకా పలువురిని గుర్తించాల్సి ఉందని వివరించారు. మృతుల్లో ఎక్కువ మంది పార్థాపూర్ ఏరియా కమిటీకి చెందిన మావోయిస్టులున్నట్లు పేర్కొన్నారు. తప్పించుకున్న నక్సల్స్ గాలింపునకు కూంబింగ్ కొనసాగుతోందన్నారు. కాగా.. అబూజ్‌మడ్‌లో ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతాన్ని సందర్శించేందుకు పోలీసులు బుధవారం ఉదయం మీడియాకు అనుమతినిచ్చారు. "ఆ ప్రాంతంలో చెట్లకు కూడా తుపాకీ తూటా గుర్తులు కనిపించాయి. ఓ ప్రాంతంలో నెత్తుటి తివాచీ పరిచారా? అన్నట్లుగా రహదారిలో రాలిపోయిన వెదురు ఆకులపై మావోయిస్టుల నెత్తుటి మరకలు కనిపించాయి. ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన సుక్కూ అనే మావోయిస్టు సోదరుడు మాతో మాట్లాడారు. సుక్కూ బాలుడిగా ఉన్నప్పుడే నక్సల్స్‌లో చేరినట్లు చెప్పారు. వెనక్కి రమ్మన్నా వినలేదని, చివరకు విగతజీవి అయ్యాడని కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇక్కడి గూడేల్లోని ఆదివాసీలు బిక్కుబిక్కుమంటూ కనిపించారు. మీడియాతో మాట్లాడడానికి నిరాకరించారు" అని పీటీఐకి కాంకేర్ ప్రతినిధి తెలిపారు.

మావోయిస్టులను కూకటివేళ్లతో పెకిలిస్తాం

- ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ వచ్చాక.. యాంటీ-నక్సల్స్ ఆపరేషన్స్ వేగవంతం
- బలగాల క్యాంపులను 250కి పెంచాం
- కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

అహ్మదాబాద్, ఏప్రిల్ 17: దేశంలో మావోయిస్టులను కూకటివేళ్లతో పెకిలిస్తామని.. ఈ చర్య ఎంతో దూరంలో లేదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. నక్సలిజంతో పాటు.. టెర్రరిజాన్ని కూడా తుడిచిపెట్టేస్తామని మోదీ సర్కారు కంకణబద్ధమై ఉందన్నారు. బుధవారం ఆయన అహ్మదాబాద్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం నాటి అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌పై స్పందించారు. "కేంద్రంలో ఎన్డీయే సర్కారు ఏర్పాటైనప్పటి నుంచి నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో పోలీసు క్యాంపులను పెంచాం. 2019 నుంచి వీటి ఏర్పాటు ముమ్మరమైంది. ఛత్తీస్‌గఢ్ 250 క్యాంపులను ఏర్పాటు చేశాం. ఛత్తీస్‌గఢ్‌లో మా(బీజేపీ) ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఎన్‌కౌంటర్లలో 80 మంది దాకా నక్సల్స్ మృతిచెందారు. 125 మంది అరెస్టయ్యారు. 150 మంది లొంగిపోయారు" అని ఆయన వివరించారు. తమ ప్రభుత్వ చర్యల వల్ల ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ప్రాబల్యం తగ్గుతోందన్నారు.

భారత జనాభా 144 కోట్లు!

- అందులో 14 ఏళ్లలోపు వయసు పిల్లలు 24%
- 77 ఏళ్లలో జనాభా రెట్టింపయ్యే అవకాశం
- చైనా జనాభా 142 కోట్లు: ఐరాస

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: భారతదేశ జనాభా 144.17 కోట్లకు చేరిందని ఐక్యరాజ్యసమితి జనాభా నిధి(యూఎన్ఎఫ్‌పీఏ) సంస్థ అంచనా వేసింది. ఇందులో 14 ఏళ్లలోపు వయసు పిల్లలు 24 శాతం, 10 నుంచి 19 ఏళ్ల మధ్య వయసువారు 17 శాతం, 10 నుంచి 26 ఏళ్ల మధ్య వయసువారు 26 శాతం, 15 నుంచి 64 ఏళ్ల మధ్య వయసువారు 68 శాతం, 65 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసువారు 7 శాతం మంది ఉంటారని పేర్కొంది. పురుషుల జీవితకాలం 71 ఏళ్లు, మహిళల జీవితకాలం 74 ఏళ్లుగా వివరించింది. మరో 77 ఏళ్లలో భారత జనాభా రెట్టింపు అవుతుందని కూడా అంచనా వేసింది. ఈ మేరకు తాజా నివేదికను యూఎన్ఎఫ్‌పీఏ విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం చైనా జనాభా 142.5 కోట్లు మాత్రమే. 2011 సంవత్సరంలో చేసిన జనాభా లెక్కల ప్రకారం నాడు భారత జనాభా 121 కోట్లు. లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యం విషయంలో 30 ఏళ్లుగా భారత్ పురోగతి సాధిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. అయితే, ప్రపంచవ్యాప్తంగా అట్టడుగు వర్గాలు ఈ విషయంలో నిర్లక్ష్యంతో ఉన్నట్టు తెలిపింది. అలాగే, 2006, 2023 సంవత్సరాల మధ్య భారత్‌లో బాల్య వివాహాలు 23 శాతంగా ఉన్నట్టు పేర్కొంది. మహిళల్లో వైకల్యం ఉన్నవారు 10 రెట్లు అధికంగా లింగవివక్షా పూరిత హింసను ఎదుర్కొన్నట్టు నివేదిక తెలిపింది. భారత్‌లో ప్రసూతి మరణాలు గణనీయంగా తగ్గాయని, అయినప్పటికీ ప్రసూతి మరణాల ముప్పు నాటకీయంగా కొనసాగుతూనే ఉందని వెల్లడించింది. ఇటీవల భారత్‌లో నిర్వహించిన అధ్యయనంలో 640 జిల్లాల్లో ప్రతి లక్ష జననాలకు మరణాల రేటు 70 కంటే తక్కువే ఉన్నప్పటికీ, మరో 114 జిల్లాల్లో ఆ రేటు 210 వరకు ఉందని తెలిపింది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని తిరప్ జిల్లాలో ప్రతి లక్ష జననాలకు అత్యధికంగా 1,671 మరణాలు సంభవించినట్టు పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ప్రసూతి మరణాల రేటు 8 శాతమని తెలిపింది. 40 శాతం దేశాలలో మహిళల శారీరక స్వయం ప్రతిపత్తి తగ్గిపోతోందని యూఎన్ఎఫ్‌పీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ నటాలియా కనెం పేర్కొన్నారు. ఒక తరం వ్యవధిలో ప్రసూతి మరణాల రేటును 1/3 వంతు, అవాంఛిత గర్భధారణ రేటును 1/5 వంతు తగ్గించగలిగామని, 160 కంటే ఎక్కువ దేశాలలో గృహహింసకు వ్యతిరేకంగా సురక్షిత చట్టాలను తీసుకురాగలిగామని వివరించారు. ఇంత పురోగతి సాధించినప్పటికీ మన సమాజంలో ఇంకా అసమానతలు కొనసాగుతున్నాయని తెలిపారు.


ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థుల డ్రగ్స్ దందా

- బెంగళూరులో ఉన్నత చదువు.. అక్కడే డ్రగ్స్ అలవాటు
- సులభంగా డబ్బు సంపాదించేందుకు విక్రయాలు
- ఏపీలోని రాజమండ్రిలో విద్యార్థులకు అమ్మకాలు
- ఎన్నికల కోడ్‌తో అక్కడ నిఘా ఉంటుందని భయం
- హైదరాబాద్‌లోనే విక్రయించేందుకు ప్రయత్నాలు
- అరెస్టు చేసిన మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వాస్తవ్యులైన ఆ ఇద్దరు ఉన్నత కుటుంబాలకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు! డ్రగ్స్ అలవాటు ఇద్దరి మధ్య స్నేహం కుదిరేలా చేసింది. అదే అలవాటు.. తేలిగ్గా డబ్బు సంపాదించేందుకు డ్రగ్స్ విక్రయాలకూ పురిగొల్పింది!! బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు 'సరుకు'తో వచ్చినా తమకు కస్టమర్లు ఉన్న రాజమండ్రిలో విక్రయించేందుకు ఎన్నికల కోడ్ కారణంగా అక్కడ నిఘా ప్రతిబంధకంగా మారడంతో గ్రేటర్ పరిధిలోనే అమ్మేయాలనుకున్నారు. ఆ ప్రయత్నాల్లో ఉండగానే పోలీసులకు దొరికిపోయారు. ఆ ఇద్దరు.. ఏపీలోని రాజమండ్రికి చెందిన కాటూరి సూర్య కుమార్ (22), గుత్తుల శ్యాంబాబు (22). సూర్య తండ్రి రైల్వేలో ఇంజనీర్, ఇంజనీరింగ్ చదివేందుకు సూర్య బెంగుళూరులోని జైన్ యూనివర్సిటీలో చేరాడు. అక్కడ బెంగుళూరుకు చెందిన స్నేహితుడు అభి ద్వారా ఎండీఎంఏ డ్రగ్స్‌కు సూర్య అలవాటు పడ్డాడు. ఆ తర్వాత తేలిగ్గా డబ్బు సంపాదించేందుకు సూర్య డ్రగ్స్ అమ్మకాలు మొదలుపెట్టాడు. నిరుడు డ్రగ్స్ సరఫరా చేస్తున్న సూర్యను చందానగర్ పోలీసులు అరెస్టు చేసి, జైలుకు పంపారు. మూడు నెలలు జైల్లో ఉన్నా బుద్ధి మార్చుకోని సూర్య మళ్లీ డ్రగ్స్ దందా మొదలు పెట్టాడు. సూర్యకు నైజీరియన్ డ్రగ్ స్మగ్లర్ 'గాడ్ ఆఫ్ సోల్మో' అను అభి పరిచయం చేశాడు. ఆ నైజీరియన్ నుంచి ఎండీఎంఏ కొన్న సూర్య, తన మరో స్నేహితుడు గుత్తుల శ్యాంబాబుకు డ్రగ్స్ తీసుకోవడాన్ని అలవాటు చేశాడు. అతడి సాయంతో రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో విద్యార్థులకు ఎండీఎంఏ డ్రగ్స్‌ను విక్రయిస్తున్నాడు. సూర్య ఈనెల 14న బెంగళూరు వెళ్లి సోల్మోస్‌ను కలిసి 30 గ్రాముల ఎండీఎంఏ కొన్నాడు. 16న నగరానికి వచ్చాడు. స్నేహితుడు శ్యాంబాబును నగరానికి పిలిపించుకున్నాడు. ఇద్దరు కలిసి 2 గ్రాముల ఎండీఎంఏను సేవించారు. మిగతా 28 గ్రాముల డ్రగ్స్‌ను విక్రయించాలని పథకం వేశారు. ఎన్నికల సందర్భంగా రాజమండ్రిలో పోలీసు నిఘా ఎక్కువగా ఉంటుందని భావించి హైదరాబాద్‌లోనే విక్రయించాలని ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఈ ఇద్దరి గురించి పక్కా సమాచారమందుకున్న మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు, మాదాపూర్ పోలీసులతో కలిసి వలపన్నారు. మాదాపూర్‌లోని చందానాయక్ తండా, రాజారెసిడెన్సీ సమీపంలో ఎండీఎంఏ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న సూర్యకుమార్, శ్యాంబాబును అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 4.20 లక్షల విలువచేసే 28 గ్రాముల ఎండీఎంఏ, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
గురువారం • 18 ఏప్రిల్ 2024
cinema@andhrajyothy.com



రిలీజ్ డేట్ చెప్పేశారు

ఇంతవరకూ తను పోషించని పాత్రలో నితిన్ నటిస్తున్న 'రాబిన్‌హుడ్' చిత్రం డిసెంబర్ 20న విడుదల కానుంది. వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నితిన్ గెటప్ నుంచి క్యారెక్టరైజేషన్ వరకూ సరికొత్తగా కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిశోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'కమర్షియల్ అంశాలే కాకుండా తగినంత వినోదం కలిగిన ఈ సినిమాను డిసెంబర్ 20న విడుదల చేస్తున్నాం. క్రిస్మస్ సెలవులు, ఆ తర్వాత న్యూ ఇయర్ సెలవులు మా సినిమాకు కలసి వస్తాయనుకుంటున్నాం' అని నిర్మాతలు నవీన్ యర్నేని, వై.రవిశంకర్ చెప్పారు. రిలీజ్ డేట్ ప్రకటిస్తూ విడుదల చేసిన పోస్టర్‌లో నితిన్ స్పోర్ట్స్ బైక్ మీద కూర్చుని ఉన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, ఛాయాగ్రహణం: సాయి శ్రీరామ్.

బ్యూటిఫుల్ ఫీల్ ఇచ్చేలా...



'పొలిమేర-2' చిత్రంతో సెన్సేషనల్ సక్సెస్‌ను అందుకున్నారు సత్యం రాజేశ్. ఆయన నటించిన లేటెస్ట్ చిత్రం 'టెనెంట్'. మేఘా చౌదరి, చందన పయ్యావుల, ఎస్తర్ నోరోన్హా, భరత్‌కాంత్ కీలక పాత్రలు పోషించారు. వై.యుగంధర్ దర్శకత్వం వహించారు. చంద్రశేఖర్ రెడ్డి నిర్మించారు. ఇటీవలే విడుదలైన ఈ మూవీ ట్రైలర్ సినిమాపై అందరిలో అంచనాలను పెంచేసింది. రేపు ఈ చిత్రం విడుదలవుతున్న సందర్భంగా హీరో సత్యం రాజేశ్ మీడియాతో ముచ్చటించారు.

"ఒక అపార్ట్‌మెంట్‌లో జరిగే స్టోరీ 'టెనెంట్'. కొత్తగా పెళ్లైన ఓ జంట..ఎన్నో ఆశలతో నూతన జీవితాన్ని మొదలుపెడుతుంది. ఆనందంగా సాగిపోతున్న వారి జీవితంలోకి ప్రవేశించిన ఇద్దరు వ్యక్తుల వల్ల ఆ భార్యాభర్తల మధ్య వచ్చే ప్రాబ్లమ్స్‌ను ఇందులో చూపించాం. ఇందులోని సన్నివేశాలు వాస్తవికతకు దగ్గరగా ఉంటాయి. ప్రేక్షకులకు బ్యూటిఫుల్ ఫీల్ ఇచ్చేలా ఈ చిత్రం ఉంటుంది. ఈ సినిమాలో ట్విస్ట్‌లు ఉండవు కానీ.. సస్పెన్స్ ఉంటుంది. మర్డర్ మిస్టరీ కాబట్టి చాలా ఇంట్రస్టింగ్‌గా ఉంటుంది. నా క్యారెక్టర్ చూసి ప్రేక్షకులు సింపతీతో బయటకు వస్తారు. సినిమాలో నేను మాట్లాడేదే చాలా తక్కువ. కానీ ప్రేక్షకులు ఎక్కడా బోర్ ఫీల్ అవ్వరు. భారీ బడ్జెట్, యాక్షన్ ఓరియెంటెడ్ చిత్రాలు కాకుండా నాకు సూటయ్యే మంచి కాన్సెప్ట్ ఓరియెంటెడ్ చిత్రాలనే ఎంపిక చేసుకుంటున్నా. ప్రస్తుతం 'స్ట్రీట్ ఫైట్' సినిమాలో మెయిన్ లీడ్‌గా చేస్తున్నా, 'మిస్టర్ బచ్చన్'లో ఓ కీలక పాత్ర పోషిస్తున్నా" అని చెప్పారు.

బెల్లంకొండ హారర్ మిస్టరీ



శ్రీరామ నవమి సందర్భంగా బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా నిర్మించే కొత్త చిత్రాన్ని నిర్మాత సాహు గారపాటి ప్రకటించారు. 'భగవంత్ కేసరి' సంచలన విజయం తర్వాత ఆయన నిర్మించే ఈ హారర్, మిస్టరీ చిత్రానికి కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వం వహిస్తారు. ఈ సినిమాను ప్రకటిస్తూ విడుదల చేసిన పోస్టర్ ఆసక్తికరంగా ఉంది. శ్రీరాముడు తన చేతిలోని విల్లుతో బాణాన్ని ఆకాశంలో ఉన్న రాక్షసుడికి ఎక్కుపెట్టడం , షాడో తోలుబొమ్మలాట, నిర్జనమైన అడవి, యాంటెన్నా టవర్, హార్నెట్... ఇవన్నీ ఆ పోస్టర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సహ రచయిత: దరహాస్ పాలకొల్లు, సంగీతం: బి.అజనీష్ లోకనాథ్, సమర్పణ: అర్చన, రచన, దర్శకత్వం: కౌశిక్ పెగళ్లపాటి.

సుందరకాండ సందడి



త్వరలోనే 'ప్రతినిధి 2' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు నారా రోహిత్. ఇప్పుడు ఆయన కథానాయకుడిగా నటిస్తున్న మరో చిత్రం నుంచి స్పెషల్ అప్‌డేట్ వచ్చింది. వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకుడిగా పరిచయం చేస్తూ, సంతోష్ చిన్నపొళ్ల, గౌతమ్ రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మిస్తున్న చిత్రానికి 'సుందరకాండ' అనే టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేశారు. అలాగే సెప్టెంబర్ 6న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. శ్రీరామనవమి సందర్భంగా 'సుందరకాండ' ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. వృతి వాఘని ఈ చిత్రంలో కథానాయిక. శ్రీదేవి విజయ్‌కుమార్, నరేశ్ విజయ కృష్ణ కీలకపాత్రలు పోషిస్తున్నారు. లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: ప్రదీప్ ఎం. వర్మ

కొత్త కబుర్లు

ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్



ఇటీవల 'ఓం భీమ్ బుష్' చిత్రంతో విజయాన్ని పొందిన హీరో శ్రీవిష్ణు తన కొత్త చిత్రం వివరాలు బుధవారం ప్రకటించారు. 'సామజవరగమన' చిత్రంలో ఆయన సరసన నటించిన రెబా జాన్ ఇందులో హీరోయిన్. హసిత్ గోలి దర్శకత్వంలో రూపుదిద్దుకొంటున్న ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌ను సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మిస్తున్నారు. ఇప్పటికి అరవై శాతం షూటింగ్ పూర్తయిందనీ, వీలైనంత త్వరగా మిగిలిన సినిమాను పూర్తి చేస్తామని నిర్మాతలు చెప్పారు. ఓ ఆసక్తికరమైన అంశంతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో వీర్ ఆర్యన్, అయ్యప్ప శర్మ, సుదర్శన్, రచ్చ రవి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: కాలభైరవ, సినిమాటోగ్రఫీ: విద్యాసాగర్, ఎడిటింగ్: శ్రీకరప్రసాద్.

వీర ధీర శూరుడు




వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించే నటుడు విక్రమ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన నటిస్తున్న 62వ చిత్రం టైటిల్ టీజర్‌ను బుధవారం విడుదల చేశారు. తమిళంలో ఈ సినిమాకు 'వీర ధీర శూరన్' అనే పేరు నిర్ణయించారు. టైటిల్ టీజర్ విడుదల చేశారు. తెలుగు టైటిల్ త్వరలో ప్రకటిస్తారు. ఈ చిత్రంలో ఎస్.జె.సూర్య, దుసరా విజయన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాలో విక్రమ్ పక్కా మాస్ పాత్ర పోషిస్తున్నట్లు 225 సెకన్లు ఉన్న టైటిల్ టీజర్ చెప్పకనే చెప్పింది. ఇందులో కిరాణా షాప్ ఓనర్ కాళీ పాత్రను ఆయన పోషిస్తున్నారు. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రాన్ని ఎస్.యు. అరుణ్‌కుమార్ దర్శకత్వంలో రియా శిబు నిర్మిస్తున్నారు.

తంగలాన్ గ్లింప్స్

విక్రమ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్' స్పెషల్ గ్లింప్స్‌ను ఆయన పుట్టిన రోజు సందర్భంగా విడుదల చేశారు. సినిమా కోసం విక్రమ్ ఎంత కష్టపడ్డారో ఈ గ్లింప్స్ చూపించింది. ఈ సినిమా గురించి దర్శకుడు పా. రంజిత్ మాట్లాడుతూ 'చరిత్రలో జరిగిన కొన్ని యధార్థ సంఘటనల నేపథ్యంలో అడ్వెంచర్ మూవీగా 'తంగలాన్'ను అందిస్తున్నాం. విక్రమ్‌తో పాటు టీమ్ కూడా నాకు ఎంతో సహకరించింది. ప్రముఖ ప్రొడక్షన్ కంపెనీ జియో స్టూడియోస్ మా సినిమా కోసం స్టూడియో గ్రీన్‌తో చేతులు కలపడం ఆనందంగా ఉంది' అన్నారు. త్వరలోనే ప్రపంచ వ్యాప్తంగా 'తంగలాన్'ను విడుదల చేస్తామని నిర్మాత జ్ఞానవేల్ రాజా చెప్పారు.

జర్నీ టూ అయోధ్య



రామాయణం ఆధారంగా టాలీవుడ్‌లో మరో భారీ చిత్రం రూపుదిద్దుకోనుంది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో, చిత్రాలయం బేనర్‌పై భారీస్థాయిలో నిర్మించేందుకు నిర్మాత వేణు దోనెపూడి సన్నాహాలు మొదలుపెట్టారు. శ్రీరామనవమి సందర్భంగా బుధవారం ఆయన ఈ చిత్రాన్ని ప్రకటించారు. దర్శకుడు వి.ఎన్ ఆదిత్య కథను అందిస్తున్నారు. 'జర్నీ టూ అయోధ్య' అనేది వర్కింగ్ టైటిల్. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. అయోధ్యప్రాంతంలో లొకేషన్ల అన్వేషణలో చిత్రబృందం పాల్గొంటోంది. తమ్మారెడ్డి భరద్వాజ నిర్మాణ సారథ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం గోపీచంద్, దర్శకుడు శ్రీనువైట్ల కాంబినేషన్‌లో వస్తున్న 'విశ్వం' సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలసి చిత్రాలయం స్టూడియోస్ నిర్మిస్తోంది.

యుద్ధం... సన్నద్ధం



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా క్రిష్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. ఏఎం రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. శ్రీరామనవమి సందర్భంగా స్పెషల్ అప్డేట్‌ను మేకర్స్ వదిలారు. త్వరలో టీజర్‌ను విడుదల చేయనున్నట్లు బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో 'మీ ముందుకు... ధర్మంకోసం యుద్ధం త్వరలో' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. అర్జున్ రాంపాల్, బాబీ డియోల్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఎం. ఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

రెండు యుగాల కథ



వైవిధ్యమైన కథలతో హీరోగా సక్సెస్‌లు అందుకొంటున్నారు తిరువీర్. ఆయన కథానాయకుడిగా నటించే తదుపరి చిత్రం ఖరారైంది. ఘంటా సతీశ్‌బాబు దర్శకత్వంలో రాధాకృష్ణ తేలు, రామకృష్ణారెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కార్తీక మురళీధరన్ కథానాయిక. త్రేతాయుగం, కలియుగం నేపథ్యంలో సాగే కథతో తెరకెక్కుతోంది. అయ్యప్ప పి. శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీ:రామిరెడ్డి

మహిళలకు ఆసరా ఆదిశక్తి



హీరోయిన్ సంయుక్త మీనన్ 'ఆదిశక్తి' అనే సేవా సంస్థను శ్రీరామనవమి సందర్భంగా ప్రారంభించారు. ఈ సంస్థ ద్వారా మహిళలకు అనేక రంగాల్లో సహకారం అందించబోతున్నారు. సమాన అవకాశాలు కల్పించి వారిని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడపాలనే లక్ష్యంతో ఆమె ఈ సంస్థను స్థాపించారు. విద్య, ఉపాధి, శిక్షణ, ఆరోగ్యం వంటి విషయాలలో మహిళలకు ఆసరాగా నిలవనుందీ సంస్థ. మహిళలు ఆత్మగౌరవంతో జీవించాలని. అన్ని రంగాల్లో తమ గొంతు వినిపించాలనేది 'ఆదిశక్తి' సంస్థ ఉద్దేశమని సంయుక్త తెలిపారు.

పాటల పల్లకిలో...

'ఒసేయ్ అరుంధతి' టైటిల్ ట్రాక్



కమల్ కామరాజు, మోనికా చౌహాన్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'ఒసేయ్ అరుంధతి'. వెన్నెల కిశోర్, పృథ్వీరాజ్, చిత్రం శ్రీను, అరియానా గ్లోరి, సునీతా మనోహర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఫ్యామిలీ కామెడీ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని విక్రాంత్ కుమార్ తెరకెక్కిస్తున్నారు. గూడూరు ప్రణయ్‌రెడ్డి నిర్మిస్తున్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఈ చిత్రం నుంచి టైటిల్ ట్రాక్‌ను విడుదల చేశారు. చిత్ర దర్శకుడు విక్రాంత్‌కుమార్ ఈ పాటకు లిరిక్స్ అందించగా, సునీల్ కశ్యప్ సంగీతం అందించారు. రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. ఈ సందర్భంగా నిర్మాత గూడూరు ప్రణయ్‌రెడ్డి మాట్లాడుతూ "ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందని" చెప్పారు. చిత్ర దర్శకుడు విక్రాంత్‌కుమార్ మాట్లాడుతూ "ఇది కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం" అని అన్నారు.

ఇంటి ముందు వాలిపోతా



'ఒక్క మాట చెప్పు చాలు ఇంటి ముందు వాలిపోతా' అంటూ డ్యూయట్ పాడుకుంటున్నారు అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి. రావు రమేశ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'మారుతీనగర్ సుబ్రహ్మణ్యం'. లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో బుజ్జిరాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మిస్తున్నారు. చిత్రబృందం బుధవారం 'మేడమ్ సార్' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది. సిద్ శ్రీరామ్ ఆలపించారు. భాస్కరభట్ల సాహిత్యానికి కల్యాణ్ నాయక్ బాణీ కట్టారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు. ఇంద్రజ, అంకిత్ కొయ్య, హర్షవర్ధన్ కీలకపాత్రలు పోషించారు. సినిమాటోగ్రఫీ: ఎంఎన్ బాల్‌రెడ్డి

ఆ పాయింట్ థ్రిల్ చేస్తుంది

- అఖిలేశ్ కలారు



'స్వతంత్ర భావాలున్న అమ్మాయి, సాఫ్ట్‌వేర్ అబ్బాయి మధ్య సాగే ప్రేమాయణమే 'మార్కెట్ మహాలక్ష్మి'. ఈ సినిమాలో ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసే అంశం ఒకటుంది. ఇప్పటివరకూ ప్రచార చిత్రాల్లో దాన్ని వెల్లడించలేదు. ఆ పాయింట్ ప్రేక్షకులను థ్రిల్ చేస్తుంది' అని నిర్మాత అఖిలేశ్ కలారు అన్నారు. వి.ఎస్ ముఖేశ్ దర్శకత్వంలో ఆయన నిర్మించిన చిత్రమిది. పార్వతీశం, ప్రణీకాన్వికా జంటగా నటించారు. ఈ నెల 19న విడుదలవుతోన్న సందర్భంగా అఖిలేశ్ మీడియాతో మాట్లాడారు. 'అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాను. సినిమాలపై మక్కువతో నిర్మాతగా మారాను. ముఖేశ్ చాలాకాలంగా తెలుసు. ఆయన చెప్పిన కథ నచ్చి 'మార్కెట్ మహాలక్ష్మి' సినిమాను నిర్మించాను. ఇండస్ట్రీలో మంచి నిర్మాతగా పేరు తెచ్చుకునేవరకూ నా ప్రయాణం కొనసాగుతుంది' అన్నారు.

ఆకట్టుకునే 'సిల్క్ శారీ'



వాసుదేవరావు, రీనా చౌదరి, ప్రీతి గోస్వామి నటిస్తున్న చిత్రం 'సిల్క్ శారీ'. టి.నాగేందర్ స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. కమలేశ్ కుమార్, రీవా చౌదరి, రాహుల్ అగర్వాల్, హరీశ్ చండక్ నిర్మిస్తున్నారు. బుధవారం నిర్మాత రాజ్ కందుకూరి ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ సినిమా టైటిల్ బాగుంది. ప్రేక్షకులను ఆకట్టుకునేలా 'సిల్క్ శారీ' కథ గొప్పగా ఉంది" అని అన్నారు. హీరో వాసుదేవరావు మాట్లాడుతూ "ఓ ఆసక్తికరమైన సంఘటన నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది" అని చెప్పారు. ఈ చిత్రానికి ఛాయగ్రాహకుడు:సనక రాజశేఖర్, సంగీతం:వరికుప్పల యాదగిరి.

పోలీస్ వారి పాట



అఖిల్ సన్నీ, అజయ్ ఘోష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'పోలీస్‌వారి హెచ్చరిక'. బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్థన్ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రం టాకీ పార్ట్ పూర్తయింది. ప్రస్తుతం వైజాగ్ పరిసరాల్లో పాటల చిత్రీకరణ జరుగుతోంది. త్వరలో నల్లగొండలో క్లైమాక్స్ పార్ట్ చిత్రీకరణ చేస్తామనీ, దాంతో షూటింగ్ పూర్తవుతుందని నిర్మాత చెప్పారు. సంగీత దర్శకుడు గజ్వేల్ వేణును నటుడిగా పరిచయం చేస్తున్నట్లు దర్శకుడు చెప్పారు. శుభలేఖ సుధాకర్, కాశీ విశ్వనాథ్, సంజయ్ నాయర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నళినీ కాంత్

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● గురువారం 18 ఏప్రిల్ 2024



ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఎన్‌సీఈటీ

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)- 'నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎన్‌సీఈటీ) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా నాలుగేళ్ల 'ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(ఐటీఈపీ)'లో ప్రవేశాలు కల్పిస్తారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ఐఐటీలు, ఎన్ఐటీలు, ఆర్ఐఈలు, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు/యూనివర్సిటీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. వీటి వివరాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. దేశంలోని 178 నగరాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. మొత్తం 13 మాధ్యమాల్లో పరీక్ష నిర్వహిస్తారు.

తెలుగు రాష్ట్రాల్లోని హెచ్ఈఐలు - ప్రోగ్రామ్‌లు - సీట్లు

తెలంగాణ: హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో బీఏ బీఈడీ, బీఎస్సీ బీఈడీ, బీకాం బీఈడీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)లో బీఎస్సీ బీఈడీ ప్రోగ్రామ్ ఉంది. మంచిర్యాలలోని గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో బీఏ బీఈడీ ప్రోగ్రామ్ ఉంది.

ఆంధ్రప్రదేశ్: తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో బీఏ బీఈడీ ప్రోగ్రామ్ ఉంది. శ్రీకాకుళంలోని డా.బీ.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీలో బీఎస్సీ బీఈడీ, బీఏ బీఈడీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.

- ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐటీ రోపార్, ఐఐటీ జోధ్‌పూర్, ఐఐటీ భువనేశ్వర్, నిట్ త్రిపుర, నిట్ కాలికట్, నిట్ పుదుచ్చేరీల్లో బీఎస్సీ బీఈడీ ప్రోగ్రామ్ ఉంది. నిట్ తిరుచిరాపల్లిలో బీఏ బీఈడీ ప్రోగ్రామ్ ఉంది.
- **సీట్లు:** ప్రతి హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్(హెచ్ఈఐ)లో ప్రతి ప్రోగ్రామ్‌లో 50 సీట్లు ఉన్నాయి.
- ఢిల్లీలోని ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీలో బీఏ బీఈడీ, బీఎస్సీ బీఈడీ, బీకాం బీఈడీ ప్రోగ్రామ్‌లలో ఒక్కోదానిలో 100 సీట్లు ఉన్నాయి.
- **అర్హత:** ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన అర్హత వివరాల కోసం సంబంధిత సంస్థల వెబ్‌సైట్లను చూడవచ్చు.


ఎన్‌సీఈటీ 2024 వివరాలు

- ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో మొత్తం 181 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. వీటిలో మొత్తం 160 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఈ పరీక్షలో నాలుగు సెక్షన్లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో అభ్యర్థి ఎంచుకున్న రెండు లాంగ్వేజ్‌ల నుంచి ఒక్కోదానిలో 23 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కోదానిలో 20 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. రెండో సెక్షన్‌లో అభ్యర్థి ఎంచుకున్న కోర్సుకు సంబంధించిన మూడు సబ్జెక్టుల్లో ఒక్కోదానిలో 28 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కోదానిలో 25 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఈ ప్రశ్నలన్నీ ఇంటర్ స్థాయిలోనే ఉంటాయి. మూడో సెక్షన్‌లో జనరల్ టెస్ట్ ఉంటుంది. ఇందులో జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ అంశాల నుంచి 28 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో 25 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. నాలుగో సెక్షన్‌లో టీచింగ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో టీచింగ్ ఆఫ్ సైన్స్, ఆర్ట్స్, మేథమెటిక్స్, పర్ఫార్మింగ్ ఆర్ట్స్, లాంగ్వేజెస్ అంశాల నుంచి 23 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో 20 ప్రశ్నలకు ఆన్సర్ గుర్తించాలి.
- ఈ పరీక్షని తెలుగు, హిందీ, ఇంగ్లీష్, అస్సామీస్, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, ఉర్దూ మాధ్యమాల్లో నిర్వహిస్తారు.
- **ఎన్‌సీఈటీ లాంగ్వేజ్‌లు:** తెలుగు, ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్, హిందీ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్, అస్సామీస్, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, ఉర్దూ, ఇంగ్లీష్ ఫర్ కమ్యూనికేషన్, హిందీ ఫర్ కమ్యూనికేషన్ అరబిక్, బోడో, చైనీస్, డోగ్రీ, ఫ్రెంచ్, జర్మన్, ఇటాలియన్, జపనీస్, కశ్మీరీ, కొంకణి, మైథిలి, మణిపురి, నేపాలీ, పర్షియన్, రష్యన్, సంథాలీ, సింధీ, స్పానిష్, టిబెటన్, సంస్కృతం, గారో, ఖాశీ, పాళీ.
- **ఎన్‌సీఈటీ సబ్జెక్టులు:** అకౌంటెన్సీ/బుక్ కీపింగ్, అగ్రికల్చర్, ఆంత్రోపాలజీ, బయాలజీ/బయలాజికల్ స్టడీస్/బయోటెక్నాలజీ/బయోకెమిస్ట్రీ, బిజినెస్ స్టడీస్, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్, ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్, ఇంజనీరింగ్ గ్రాఫిక్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, ఫైన్ ఆర్ట్స్/విజువల్ ఆర్ట్స్(స్కల్ప్చర్/పెయింటింగ్)/కమర్షియల్ ఆర్ట్స్, జాగ్రఫీ/జియాలజీ, హిస్టరీ, హోమ్‌సైన్స్, నాలెడ్జ్ ట్రెడిషన్-ప్రాక్టీసెస్ ఇండియా, లీగల్ స్టడీస్, మాస్ మీడియా/మాస్ కమ్యూనికేషన్, మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్, పర్ఫార్మింగ్ ఆర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్/నేషనల్ క్యాడెట్ కోర్స్/యోగా, ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, సంస్కృతం, సోషియాలజీ.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **కరెక్షన్ విండో ఓపెన్:** మే 2 నుంచి 4 వరకు
- **అభ్యర్థులకు కేటాయించిన పరీక్ష కేంద్రాల ప్రకటన:** మే చివరి వారంలో
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** పరీక్ష తేదీకి మూడు రోజుల ముందు
- **ఎన్‌సీఈటీ 2024 తేదీ:** జూన్ 12
- **వెబ్‌సైట్:** www.nta.ac.in, ncet.samarth.ac.in/

నిట్ జలంధర్‌లో ఎంబీఏ



జలంధర్‌లోని డా.బీఆర్ అంబేద్కర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)కి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ మేనేజ్‌మెంట్ - ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 38 రెగ్యులర్ సీట్లు ఉన్నాయి. వీటిలో జనరల్ అభ్యర్థులకు 15, ఓబీసీ అభ్యర్థులకు 10, ఎస్సీ అభ్యర్థులకు 6, ఎస్టీలకు 3, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 4 సీట్లు నిర్దేశించారు. జాతీయ పరీక్ష స్కోర్ ద్వారా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు: ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. చివరి సంవత్సర పరీక్షలు రాసిన/రాసేవారు కూడా అర్హులే. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. అభ్యర్థులందరికీ క్యాట్/సీమ్యాట్/మ్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: జాతీయ పరీక్ష స్కోర్‌కు 70 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 15 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 15 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు. గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల్లో కలిపి జనరల్ అభ్యర్థులకు కనీసం 12 మార్కులు; రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు 10.5 మార్కులు రావాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20
- **గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** మే 22
- **గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 25
- **కౌన్సెలింగ్:** మే 26
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** మే 25
- **వెబ్‌సైట్:** www.nitj.ac.in

ఎన్‌ఎల్‌యూలో ఎంబీఏ ఇన్సూరెన్స్

జోధ్‌పూర్‌లోని నేషనల్ లా యూనివర్సిటీ(ఎన్‌ఎల్‌యూ)కి చెందిన స్కూల్ ఆఫ్ ఇన్సూరెన్స్ స్టడీస్- ఎంబీఏ ఇన్సూరెన్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

ప్రోగ్రామ్‌లోని అంశాలు: జనరల్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్, ఫైర్ ఇన్సూరెన్స్, మోటార్ ఇన్సూరెన్స్, ఇన్సూరెన్స్ రెగ్యులేషన్స్, లా ఆఫ్ కాంట్రాక్ట్ అండ్ ఇన్సూరెన్స్ లా, మేనేజీరియల్ ఎకనామిక్స్, బిజినెస్ కమ్యూనికేషన్, రిస్క్ మేనేజ్‌మెంట్, హెల్త్ ఇన్సూరెన్స్, ప్రిన్సిపల్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్, మెరైన్ ఇన్సూరెన్స్, ఇన్సూరెన్స్ మేథమెటిక్స్, ఇన్సూరెన్స్ మార్కెటింగ్, లయబిలిటీ అండ్ ఏవియేషన్ ఇన్సూరెన్స్, ఇంజనీరింగ్-పెట్రోకెమికల్ అండ్ ఎనర్జీ రిస్క్, గ్రూప్ ఇన్సూరెన్స్ అండ్ పెన్షన్స్, అగ్రికల్చర్ అండ్ క్రాప్ ఇన్సూరెన్స్, రీసెర్చ్ మెథడాలజీ అండ్ స్టాటిస్టిక్స్, హెచ్ఆర్ఎం అండ్ ఆర్గనైజేషనల్ బిహేవియర్, ఇన్సూరెన్స్ అకౌంటింగ్ అంశాలు బోధిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఈ/బీటెక్/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసిన/రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 ఆగస్టు 31 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. అభ్యర్థులకు పదోతరగతి, ఇంటర్, డిగ్రీ స్థాయుల్లో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి.

ఎంపిక: డిగ్రీ మార్కులకు 70 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 15 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 15 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 25
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మే 10
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** మే 19
- **వెబ్‌సైట్:** www.nlujodhpur.ac.in

జాబ్ కార్నర్

ఏఐ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్‌లో హ్యాండీమన్, యుటిలిటీ ఏజెంట్స్

మొత్తం ఖాళీలు: 422

న్యూఢిల్లీలోని ఏఐ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్... చెన్నై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. యుటిలిటీ ఏజెంట్ కమ్ ర్యాంప్ డ్రైవర్: 130 పోస్టులు
2. హ్యాండీమ్యాన్/హ్యాండీ ఉమెన్: 292 పోస్టులు

అర్హత: హ్యాండీమన్/హ్యాండీ ఉమెన్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు ఇంగ్లిష్/హిందీ భాషల్లో పరిజ్ఞానం ఉండాలి. యుటిలిటీ ఏజెంట్ కమ్ ర్యాంప్ డ్రైవర్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణతతోపాటు వ్యాలిడ్ హెచ్ఎంవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.

జీతం: నెలకు యుటిలిటీ ఏజెంట్ కమ్ ర్యాంప్ డ్రైవర్ పోస్టుకు రూ.24,960. హ్యాండీమ్యాన్/హ్యాండీ ఉమెన్ పోస్టుకు రూ.22,530

వయోపరిమితి: జనరల్ అభ్యర్థులకు 28 ఏళ్లు, ఓబీసీలకు 31 ఏళ్లు, ఎస్సీ/ఎస్టీలకు 33 సంవత్సరాలు మించకూడదు.

ఎంపిక ప్రక్రియ: పోస్టులను అనుసరించి ట్రేడ్ టెస్ట్, ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

వాక్-ఇన్ తేదీలు: 2024 మే 2, 4

స్థలం: హెచ్ఆర్‌డీ డిపార్ట్‌మెంట్ కార్యాలయం, ఏఐ యూనిటీ కాంప్లెక్స్ పల్లవరం కంటోన్మెంట్, చెన్నై.

వెబ్‌సైట్: https://www.aiasl.in/

ఎన్‌ఎల్‌సీలో ఖాళీలు

మొత్తం ఖాళీలు: 34

కడలూరు(తమిళనాడు) జిల్లాలోని నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్... ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన తలబిరా ప్రాజెక్టులో కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. ఇండస్ట్రియల్ వర్కర్(డ్రాఫ్ట్‌మన్): 1 పోస్టు
2. ఇండస్ట్రియల్ వర్కర్(ఎలక్ట్రీషియన్): 3 పోస్టులు
3. ఇండస్ట్రియల్ వర్కర్(ఫిట్టర్): 2 పోస్టులు
4. ఇండస్ట్రియల్ వర్కర్(మెకానిక్-మోటర్ వెహికిల్): 2 పోస్టులు
5. ఇండస్ట్రియల్ వర్కర్(ఫైర్‌మ్యాన్): 1 పోస్టు
6. క్లరికల్ అసిస్టెంట్: 17 పోస్టులు
7. జూనియర్ ఇంజనీర్(సివిల్): 5 పోస్టులు
8. జూనియర్ ఇంజనీర్(మెకానికల్): 2 పోస్టులు
9. జూనియర్ ఇంజనీర్(ఎలక్ట్రికల్): 1 పోస్టు

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో 12వ తరగతి, ఐటీఐ, డిప్లొమా డిగ్రీ ఉత్తీర్ణత.

గరిష్ఠ వయోపరిమితి: 35 సంవత్సరాలు

ఎంపిక విధానం: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 24

వెబ్‌సైట్: www.nlcindia.in

ఎన్ఐఎన్‌లో ఉద్యోగాలు

మొత్తం ఖాళీలు: 5

హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. జూనియర్ మెడికల్ ఆఫీసర్: 1 పోస్టు
2. సీనియర్ రీసెర్చ్ ఫెలో: 1 పోస్టు
3. సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్: 2 పోస్టులు
4. ప్రాజెక్ట్ అసిస్టెంట్: 1 పోస్టు

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, ఎంఎల్‌టీతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: జూనియర్ మెడికల్ ఆఫీసర్, సీనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టులకు 35 ఏళ్లు; సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్: suryachuka@gmail.com

దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 24

వెబ్‌సైట్: www.nin.res.in/



సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో అప్రెంటిస్‌లు

మొత్తం ఖాళీలు: 861

సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే... 2024-25 సంవత్సరానికి నాగ్‌పూర్ డివిజన్, మోతిబాగ్ వర్క్‌షాప్(నాగ్‌పూర్)లో కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ట్రేడులు: ఫిట్టర్, కార్పెంటర్, వెల్డర్, పెయింటర్, వైర్‌మన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, డీజిల్ మెకానిక్, మెషినిస్ట్, టర్నర్.

అర్హత: అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లలో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంపిక: మెట్రిక్యులేషన్, ఐటీఐ పరీక్ష మార్కుల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 9

వెబ్‌సైట్: secr.indianrailways.gov.in/

ఇండియన్ ఆర్మీ టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్స్

మొత్తం ఖాళీలు: 30

డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీలో 2025 జనవరిలో ప్రారంభమయ్యే 140వ టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సులో ప్రవేశానికి అర్హులైన అవివాహిత పురుషుల నుంచి ఇండియన్ ఆర్మీ దరఖాస్తులు కోరుతోంది.

కోర్ ఇంజనీరింగ్ స్ట్రీమ్స్: సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇతర ఇంజనీరింగ్ స్ట్రీమ్స్

అర్హత: సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులు.

వయోపరిమితి: 2025 జనవరి 1 నాటికి 20 నుంచి 27 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక విధానం: అప్లికేషన్స్ షార్ట్‌లిస్ట్, స్టేజ్-1/స్టేజ్-2 టెస్టులు, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 9

వెబ్‌సైట్: joinindianarmy.nic.in

లిటిల్స్



దేశం- జపాన్

- జపాన్ అంటే సూర్యుడు ఉదయించే భూమి. 6800 ద్వీపాల సముదాయమే జపాన్.
- ఈ దేశంలో పురుషుల ఆయుప్రమాణం 78 ఏళ్లు అయితే.. మహిళల ఆయు ప్రమాణం 84 ఏళ్లు. ఇకపోతే వందేళ్లు బతికిన వాళ్లు ఇక్కడ 90 వేల మంది ఉన్నారు.
- ప్రపంచంలోనే కచ్చితమైన సమయానికి రైళ్లు నడిపించే దేశమిది. ఆలస్యమయితే మహా 18 సెకన్లు మాత్రమే ఉంటుంది. 'షింకాన్‌సేన్' అనే బుల్లెట్ రైల్ గంటకు 320 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది.
- ఇక్కడ చతురస్రాకారంలో ఉండే పుచ్చకాయలు దొరుకుతాయి.
- పిల్లలకంటే పెట్స్ అధికంగా ఉండే దేశమిది.
- రోబోటిక్స్, ఆటోమేషన్‌లో ఈ దేశం అడ్వాన్స్‌గా ఉంటుంది. అసిమో హ్యూమనాయిడ్ రోబోను అభివృద్ధి చేసింది ఈ దేశానికి చెందిన సంస్థ హోండా.




- ట్రావెలర్స్ నిద్రపోవటానికి 'పాడ్స్' అనే చిన్న ఇళ్లలాంటివి ఉంటాయి. వీటిని క్యాప్సూల్ హోటల్స్ అని పిలుస్తారు.
- యునెస్కో గుర్తించిన వరల్డ్ హెరిటేజ్ సైట్స్ ఇక్కడ 19 ఉన్నాయి. ఇవన్నీ 17 శతాబ్దానికి చెందినవే.
- పసిఫిక్ సముద్రం దగ్గర ఉండే ఈ దేశంలో భూకంపాలు, సునామీల తాకిడి ఎక్కువ. భూకంపాలు జపాన్‌లో సర్వసాధారణం. సంవత్సరంలో 1500 భూకంపాలు వస్తాయి ఇక్కడ. వీటికి తగినట్లే ఇళ్ల నిర్మాణం ఉంటుంది.
- ఇక్కడ అధికార భాష జపనీస్. కరెన్సీ పేరు 'యన్'. రాజధాని పేరు టోక్యో. సుమో వ్రెస్లింగ్ ఇక్కడ పాపులర్ గేమ్.
- ప్రపంచంలోనే అతి తక్కువ క్రైమ్ రేట్ ఉండే దేశమిదే.
- ఇక్కడ 67 శాతం అడవులు ఉన్నాయి. మార్షల్ ఆర్ట్స్, జూడో, కరాటే.. లకు పెట్టింది పేరు.
- ప్రపంచంలోనే అతి శుభ్రంగా ఉండే దేశమిదే. వీధుల్లో చెత్త కూడా కనిపించదు. ఎందుకంటే అన్ని వయసుల వాళ్లు తమ ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుకోవటానికి వలెంటీర్లుగా పని చేస్తారు.

సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



12 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 284

3	7		8					4
		1					9	
		9				3	8	
				6	5		7	
6			2		7			8
	1		3	8				
	5	4				2		
	2					6		
1					2		4	5

సుడోకు - 283 సమాధానం

5	1	9	4	3	7	8	2	6
4	2	6	1	8	9	7	3	5
8	7	3	5	6	2	4	9	1
2	4	5	3	7	6	1	8	9
9	8	7	2	1	4	6	5	3
6	3	1	9	5	8	2	4	7
7	5	2	6	4	3	9	1	8
3	6	4	8	9	1	5	7	2
1	9	8	7	2	5	3	6	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.